అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సోమవారం 13-01-2025
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 11 | సంచిక : 14 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50


మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

పార్టీలు వేరైనా రాష్ట్ర ప్రయోజనాలే మిన్న

కేంద్రాన్ని ఒప్పించి అభివృద్ధి ప్రణాళికలకు అనుమతులు ఇప్పించండి

ఎన్నికలప్పుడే రాజకీయాలు..ఆ తర్వాత ప్రజా ప్రయోజనాలే ముఖ్యం

విద్యార్థి రాజకీయాలను ప్రోత్సహించాలి

అక్కడి నుంచే నాయకులు పుట్టుకురావాలి :

ఉనిక పుస్తకావిష్కరణ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

ఎవరు ఏపార్టీలో ఉన్నా రాష్ట్ర ప్రయోజనాల వద్దకు వచ్చేసరికి ఏకం కావాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తమిళనాడు నుంచి ఈ సంప్రదాయాన్ని మనం అందిపుచ్చుకోవాలని చెప్పారు. జల్లికట్టు విషయంలో ఇబ్బంది వస్తే, పార్టీలకు అతీతంగా అక్కడి రాజకీయనేతలు అంతా ఐక్యమై సమస్యను పరిష్కారం చేసుకున్నారని గుర్తుచేశారు. ఆ రాష్ట్రం నుంచి 39 మంది ఎంపీలు వేర్వేరు పార్టీల నుంచి పోటీచేసి, విజయం సాధించినా, వారంతా పార్లమెంటులో తమ మాతృభాష తమిళంలోనే ప్రమాణస్వీకారాలు చేశారని చెప్పారు. అలాంటి స్ఫూర్తిని తెలుగు ప్రజలు, రాజకీయనాయకులు అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగరరావు 'ఉనిక' పేరుతో రాసిన ఆత్మకథ పుస్తకాన్ని ఆదివారంనాడిక్కడి ఓ హోటల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఒడిశా గవర్నర్ కే హరిబాబు, కేంద్ర సహాయ మంత్రి ...5లో

సంక్రాంతి శుభాకాంక్షలు : సీఎం

నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

తెలుగు ప్రజలకు ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగ భాగ్యాలు, సుఖ సంతోషాలతో ప్రజలు ఈ పండుగను ఘనంగా చేసుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని దాదాపు కోటి మంది రైతులు, నిరుపేదలు, వ్యవసాయ కూలీ కుటుంబాల్లో ఈ పండుగ కొత్త వెలుగులు తేవాలని ఆశిస్తున్నామన్నారు. రైతు భరోసాను రూ.12 వేలకు పెంచటంతో పాటు వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నగదు సాయం, ఆహార భద్రతను అందించే కొత్త రేషన్ కార్డులు, గూడు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసే నాలుగు సంక్షేమ పథకాల అమలుకు ...13లో

రైతులకు తీపికబురు

రైతు భరోసా మార్గదర్శకాలు విడుదల

26 నుంచి ప్రారంభం

వివరాలు 13లో

ఒకే దేశం-ఒకే ఎన్నిక దేశానికి ప్రమాదకరం

ప్రాంతీయ పార్టీల ఉనికి ప్రశ్నార్థకం | దీనిపై బీఆర్ఎస్ వైఖరేంటో వెల్లడించాలి

లేబర్‌కోడ్‌లు కార్మికుల మెడపై కత్తులు

కాంగ్రెస్ ప్రభుత్వాలు వాటిని అమలు చేయొద్దు :

సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల్లో లబ్ది పొందేందుకే ఒకే దేశం ఒకే ఎన్నికల పేరుతో కుట్రకు తెరలేపిందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు విమర్శించారు. ఆ పార్టీ రాష్ట్ర నాలుగో మహాసభలను పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములుతో కలిసి ఆయన మాట్లాడారు. బొటాబొటి మెజార్టీ ఉన్నా, ఒకే దేశం ఒకే ఎన్నికల బిల్లును ఆమోదింపజేసేందుకు 189వ రాజ్యాంగ సవరణకు బీజేపీ శ్రీకారం చుట్టిందని ఆయన విమర్శించారు. ఉభయ సభల్లో బిల్లు ఆమోదం పొందదనే ఉద్దేశంతో సెలెక్ట్ కమిటీకి పంపిందని గుర్తు చేశారు. ఇప్పటికే దేశంలోని చిన్నాచితక పార్టీలను నయానా, భయానా బెదిరిస్తూ, బుజ్జగిస్తూ బిల్లును ఆమోదింపజేసుకునేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. దేశంలోని లౌకిక పార్టీలన్నీ ఒక్కతాటిపైకి వచ్చి పార్లమెంట్‌లో వన్‌నేషన్... వన్ ఎలక్షన్ బిల్లు ఆమోదం పొందకుండా అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ బిల్లుకు ఆమోదముద్ర పడితే దేశంలోని ప్రాంతీయ పార్టీల ఉనికికే ప్రమాదకరమని హెచ్చరించారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్ దీనిపై తన వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ఎలక్షన్ కండక్ట్ రూల్స్‌లో మార్పులు చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సాంకేతిక అంశాలైన సీసీటీవీ, వెబ్‌కాస్టింగ్ తదితర డిజిటల్ విధానాలు ఎవరూ పొందకుండా మార్పులు చేశారని గుర్తు చేశారు. ఫలితంగా ఎన్నికల నిర్వహణలో జరిగే అవినీతి, అక్రమాలపై ప్రశ్నించే అధికారాన్ని ప్రజలు కోల్పోతారని అన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమని హెచ్చరించారు. ఏప్రిల్ నుంచి నాలుగు లేబర్‌కోడ్‌ల మార్గదర్శకాలు అమల్లోకి రానున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా కార్మికులు ...3లో


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాఘవులు. చిత్రంలో తమ్మినేని వీరభద్రం, చుక్క రాములు

ఉపాధిహామీని పట్టణాలకు విస్తరించాలి

రైతుభరోసా, తదితర పథకాల్లో వాస్తవ లబ్దిదారుల్నే ఎంపిక చేయాలి

ఫార్మా సిటీ, ఫోర్త్ సిటీ పేరిట వేల ఎకరాల భూ సేకరణ సరికాదు

కానరాని కాంగ్రెస్ ఏడో గ్యారంటీ

రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వాములం కాదు.. మిత్రపక్షం అంతకన్నా కాదు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై ఉద్యమాలు

రాష్ట్ర మహాసభలో చర్చించి కార్యాచరణను రూపొందిస్తాం :

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

వివరాలు 3లో

25 నుంచి సంగారెడ్డిలో మహాసభలు



మొదటి రోజు భారీ బహిరంగ సభ

సిద్దిపేట నుంచి జహీరాబాద్ వరకు ప్రచార జాత

బైరాన్‌పల్లి, కేవల్‌కిషన్

సమాధి నుంచి అమర జ్యోతి ర్యాలీలు

మహాసభల విజయవంతానికి అన్ని ఏర్పాట్లు :

ఆహ్వాన సంఘం చైర్మెన్ చుక్క రాములు

పార్టీ మహాసభల పోస్టర్ ఆవిష్కరించిన నేతలు

వివరాలు 3లో

యోగి కమ్యూనిటీకి వీఐపీ సేవ

కుంభమేళాలో నాథ్ సమూహానికి ప్రత్యేక ఏర్పాట్లు

- పలు సౌకర్యాలతో భారీ పండల్ నిర్మాణం
- యూపీ సీఎం కనుసన్నల్లోనే అంతా

లక్నో : యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళా నేటితో ప్రారంభం కానున్నది. లక్షలాది మంది భక్తులు ఈ కార్యక్రమానికి తరలి వస్తారని అంచనా. ఇప్పటికే కావాల్సిన ఏర్పాట్లను ప్రభుత్వ యంత్రాంగం చూసుకుంటున్నది. భక్తుల కోసం లక్షకు పైగా గుడారాలు, పండల్స్‌ను నిర్మించారు. వీటికి సంబంధించిన విషయంలోనే 'ప్రత్యేక ఏర్పాట్లు' జరిగాయి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు చెందిన కమ్యూనిటీ నాథ్ సమూహానికి వీఐపీ సేవలు అందుతున్నాయి. ఇందులో భాగంగా నాథ్ శాఖ కోసం ఏర్పాటు చేసిన పెద్ద పండల్ ఈ కుంభమేళలో ప్రత్యేకంగా నిలుస్తున్నది. ఇదంతా సీఎం పర్యవేక్షణలోనే జరగటం గమనార్హం. భారీ, విశాలమైన ...13లో



26న ట్రాక్టర్స్ పరేడ్

ప్రజాస్వామ్యాన్ని ప్రధాని మోడీ గౌరవించాలి

రైతు సంఘాలతో చర్చలు జరపాలి

రైతు నేత దల్లేవాల్ ప్రాణాలను కాపాడండి

సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు

నవతెలంగాణ–న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాని మోడీ ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలనీ, రైతు సంఘాలతో చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ 76వ గణతంత్ర దినోత్సవం (జనవరి 26) రోజు దేశవ్యాప్తంగా రైతు ట్రాక్టర్, వాహన, మోటార్ సైకిల్ పరేడ్ నిర్వహించనున్నట్టు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) ప్రకటించింది. ఈ మేరకు ఎస్కేఎం ఆదివారం ప్రకటన విడుదల చేసింది. "రైతు నేత జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ప్రాణాలను కాపాడాలి. రైతు వ్యతిరేక, సమాఖ్య వ్యతిరేక ఎన్‌పీఎఫ్ఏఎంను ఉపసంహరించుకోవాలి. సి2ం50తో కూడిన ఎంఎస్పీ చట్టం అమలు చేయాలి. విద్యుత్ ప్రయివేటీకరణ ఆపాలి. రైతులు, వ్యవసాయ కార్మికులకు రుణ విముక్తికై రుణమాఫీ కోసం సమగ్ర పథకం చేయాలి. స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి. 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించాలి. భూసేకరణ పరిహారం, పునరావసం (ఎల్ఎఆర్ఆర్) చట్టం–2013ను అమలు చేయాలి" వంటి డిమాండ్లతో రైతు సంకల్ప కవాతు నిర్వహించనున్నట్టు తెలిపింది. ఎస్కేఎం అన్ని రాష్ట్ర సమన్వయ కమిటీలు వెంటనే సమావేశమై వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన ప్రతులను తగలబెట్టడంతో తీవ్రంగా నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చింది.


(ఫైల్)

మోడీ నిరంకుశ వైఖరిని ఖండించిన ఎస్కేఎం

రైతు సంఘాలతో చర్చలకు ఇష్టపడనీ, రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ ప్రాణాలను కాపాడేందుకు సిద్ధపడని ప్రధాని నిరంకుశ, సున్నితత్వం లేని వైఖరిని ఎస్కేంఎ తీవ్రంగా ఖండించింది. రైతు నేత దల్లేవాల్ ఆమరణ నిరాహార దీక్ష 46 రోజులు దాటినప్పటికీ, రైతు నాయకుల ప్రాణాలను కాపాడటానికి సుప్రీంకోర్టు, రాష్ట్రపతి జోక్యం చేసుకోలేకపోయారని పేర్కొన్నది. "రైతులకు కనీస మద్దతు ధర, కార్మికులకు కనీస వేతనం నిరాకరించడం, యువతకు ఉపాధిని నాశనం చేయడం ద్వారా వ్యవసాయం, పరిశ్రమలు, సేవలపై తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించడానికి మోడీ ప్రభుత్వం ...13లో

విలీనమా ఎన్నికలా..?

నగర శివారు మున్సిపాలిటీలపై సందిగ్ధం



ఈ నెలాఖరుతో ముగియనున్న పాలకవర్గాల గడువు

జీహెచ్ఎంసీలో విలీనం చేస్తారంటూ ప్రచారం

ప్రభుత్వ నిర్ణయం పట్ల సర్వత్రా ఉత్కంఠ

నవతెలంగాణ–సిటీబ్యూరో

హైదరాబాద్ నగరానికి శివారులో ఉన్న మున్సిపాల్టీలపై సందిగ్ధం నెలకొంది. వీటిని గ్రేటర్‌లో కలుపుతారా..? లేదంటే మున్సిపాల్టీలుగానే ఉంచుతారా..? అన్న దానిపై నగరంలో జోరుగా చర్చ జరుగుతోంది. రింగ్ రోడ్డు లోపలి భాగమంతా కోర్ కార్బన్ ఏరియా, రీజినల్ రింగు రోడ్డు వరకు సెమీ అర్బన్ అంటూ గతంలో ప్రభుత్వం ప్రకటించడంతో ఈ గందరగోళం నెలకొన్నది. సరిగ్గా ఇదే సమయంలో నగర శివారులో ఉన్న పలు మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీల గడువు సైతం ఈ నెలాఖరుతో ముగుస్తుండటంతో వాటికి ఎన్నికలు నిర్వహించడంపై సందేహాలు నెలకొన్నాయి. శివారు మున్సిపాల్టీలను గ్రేటర్‌లో కలిపితే ఇప్పుడు జీహెచ్ఎంసీలో ఉన్న 150 డివిజన్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అయితే గ్రేటర్‌ను రెండు, మూడు జోన్‌లుగా విభజించాలని గతంలో ప్రభుత్వం ఆలోచన చేసింది. గ్రేటర్‌లో మున్సిపాలిటీలను, నగర కార్పొరేషన్‌లో విలీనం చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తే రాజకీయంగా అధికారపార్టీకి ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయం ఉంది. దీంతోనే ప్రభుత్వం వెనక్కు తగ్గినట్టు వార్తలు వినిపిస్తున్నా.. భవిష్యత్తులో ఏమీ జరుగుతుందనే దానిపై ద్వితీయశ్రేణి నేతలు చర్చోపచర్చలు సాగిస్తున్నారు.

మున్సిపాల్టీల్లో జీపీలు విలీనం

ఇటీవల నగర శివారులో ఉన్న 52 గ్రామ పంచాయతీలను (251 వార్డులు) సమీప 14 మున్సిపాల్టీల్లో కలుపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మున్సిపాల్టీల విస్తీర్ణం, జనాభా పెరిగింది. ఆ గ్రామ పంచాయతీల్లో ...13లో

ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్



- ఐదుగురు మావోయిస్టులు మృతి
- రక్తంతో తడుస్తున్న దండకారణ్యం

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్లు కొనసాగుతున్నాయి. బీజాపూర్ జిల్లాలో ఆదివారం ఉదయం భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఐదుగురు మావోయిస్టులు మరణించారు.ఇంద్రావతి నేషనల్ పార్క్ ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో ఆదివారం ఉదయం భద్రతా సిబ్బంది ...13లో



అగ్నికీలల్లోనే లాస్ ఏంజిలిస్

వారం రోజులైనా ఆరని మంటలు..కాలి బూడిదైన 40 వేల ఎకరాలు..16 మంది మృతి

- లక్షల కోట్ల విలువైన ఆస్తి ధ్వంసం
- అమెరికా చరిత్రలో అత్యంత ఖరీదైన విషాదం

అమెరికాలోని ధనిక ప్రాంతం లాస్ ఏంజిలిస్ ఆరు రోజులుగా మంటల్లో కాలిపోతోంది. అడవుల నుంచి వ్యాపించిన మంటలు నివాస ప్రాంతాలలో విధ్వంసం సృష్టిస్తున్నాయి. ఈ అగ్నిప్రమాదం.. ఆ ప్రాంతంలో దాదాపు 40 వేల ఎకరాల భూమిని ఆహుతి చేసిందంటే.. దీని ప్రభావం ఎంతగా ఉందో అంచనా వేయొచ్చు. 12 వేలకు పైగా భవనాలు బూడిదయ్యాయి. ఇందులో చాలా మంది ప్రముఖుల ఇండ్లూ ఉన్నాయి. లాస్ ఏంజిలిస్ ప్రాంతం సినీ తారల నివాసంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ ఇండ్ల ధరలు ఆకాశాన్ని అంటుతాయి.



వాషింగ్టన్ : దక్షిణ కాలిఫోర్నియాలో ఉన్న లాస్ ఏంజిలిస్ నగరం.. హాలీవుడ్ చలనచిత్ర, టెలివిజన్ పరిశ్రమకు కేంద్రంగా ఉన్నది. ఇప్పటివరకు, ఈ ప్రాంతంలో వ్యాపించిన మంటల్లో 16 మంది మరణించారు. చాలా మంది తప్పిపోయారు. ఈ భయంకరమైన అగ్నిప్రమాదం కారణంగా దాదాపు రెండు లక్షల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. స్థానికులైన 1.5 లక్షల మందికి పైగా ప్రజలు ఎప్పుడైనా తమ ఇండ్లను వదిలి బయటకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు.

నష్టం..భారత్‌లోని పలు రాష్ట్రాల బడ్జెట్ కంటే ఎక్కువ

యూఎస్ ఏజెన్సీల డేటా ప్రకారం... లాస్ ఏంజిలిస్‌లో జరిగిన అగ్నిప్రమాదం యూఎస్ చరిత్రలో అత్యంత ప్రమాదకరమైన, ఖరీదైన అగ్నిప్రమాదంగా పరిగణిస్తున్నారు. నివేదిక ప్రకారం.. ఈ అగ్నిప్రమాదం సుమారు రూ. 11 నుంచి 13 లక్షల కోట్ల వరకు నష్టాన్ని కలిగించిందని ప్రాథమిక అంచనా. ధ్వంసమైన ఆస్తులతో పాటు బీమా పరిధిలోకి వచ్చే విలువైన ఆస్తి (యూఎస్ డాలర్..8 బిలియన్ యూఎస్ డాలర్) ఉంది. ఈ అగ్ని ప్రమాద నష్టాన్ని పరిశీలిస్తే.. అది యూపీ–బీహార్, మధ్యప్రదేశ్ , ఢిల్లీ బడ్జెట్‌కు సమానం. నిజానికి, యూపీ బడ్జెట్ రూ. 7 లక్షల కోట్లు, బీహార్ మొత్తం బడ్జెట్ దాదాపు రూ. 3 లక్షల కోట్లు, మధ్యప్రదేశ్ బడ్జెట్ కూడా ...13లో



అమెరికా అధ్యక్షుల నిస్సహాయత

ప్రపంచంలో ఏమూల ఏ అవసరం ఉన్నా.. లేక పోయినా బెదిరించే అమెరికా అధ్యక్షులు.. లాస్ ఏంజిలిస్‌లో అగ్నికీలల్ని అదుపు చేయలేకపోతున్నారు. గల్ఫ్ దేశాలే కాదు అమెరికాకు వ్యతిరేకమనుకున్న దేశాల్లోని ప్రభుత్వాలను పడదోసి..పబ్బం గడుపుకునే అమెరికా అధ్యక్షులు లాస్ ఏంజిలిస్ లాంటి ప్రమాదాల నియంత్రణలో వైట్‌హౌస్‌లో చేతులు ముడుచుకొని కూర్చుంటున్నారు. ఎంతో అత్యాధునిక వ్యవస్థ ఉన్న అగ్రరాజ్యమంటూ చెప్పుకునే అధ్యక్షులు విపత్తులు, విధ్వంసక చర్యలు ఎదురైనపుడు చేతులెత్తేయటం గమనార్హం. తమ దేశంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవటంలో అమెరికా ప్రెసిడెంట్లు విఫలమవుతున్నారనటానికి ఈ అగ్గిమంటలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

కంపెనీ సెక్రెటరీలకు అద్భుత అవకాశాలు

- రెండున్నరేండ్లలో ఆన్‌లైన్‌లోనే కోర్సు పూర్తి
- ప్రారంభ సగటు ప్యాకేజీ రూ.10 లక్షలు
- వేలాది సీఎస్‌లు అవసరం
- విదేశాల్లోనూ అవకాశాలు : ఐసీఎస్‌ఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మెన్ గుప్తా జీఎస్‌ఎల్‌ఎన్ వెల్లడి



పాస్ అయితే జాబ్ గ్యారంటీ

నవతెలంగాణ - బిజినెస్ బ్యూరో

"సాధారణంగా కష్టపడి ఏ వృత్తి విద్య కోర్సు పూర్తి చేసిన ఉద్యోగం వస్తోందో.. రాదో అనుమానం ఉంటుంది. ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయినప్పటికీ ఆ తర్వాత ఆశించిన స్థాయిలో వేతన ప్యాకేజీ లభిస్తోందో లేదోననే భయాలు వెంటాడుతాయి. కానీ కంపెనీ సెక్రెటరీ (సీఎస్) కోర్సును పూర్తి చేసిన విద్యార్థులకు మాత్రం తప్పకుండా ఉద్యోగాలు లభిస్తున్నాయి. కోర్సు పూర్తి అయిన వెంటనే క్యాంపస్ సెలెక్షన్‌లోనే దిగ్గజ కంపెనీలు పోటీ పడి విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తున్నాయి. లక్షలాది వేతన ప్యాకేజీలతో అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. ఈ రంగంలో నిపుణులకు భారీ కొరత ఉండటంతో అద్భుత అవకాశాలు ఎదురు చూస్తున్నాయి. వయస్సు, స్త్రీ, పురుష భేదంతో సంబంధం లేకుండా సీఎస్ కోర్సుల్లో చేరి తమ జీవిత లక్ష్యాలను చేరుతున్న వారి సంఖ్య ప్రతీ ఏడాది పెరుగుతోంది." అని ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) హైదరాబాద్ చాప్టర్ చైర్మెన్ సీఎస్ శ్రీలక్ష్మీ నారాయణ గుప్తా గమిని (గుప్తా జీఎస్‌ఎల్‌ఎన్) తెలిపారు. 2010 నుంచి ప్రాక్టీసింగ్ కంపెనీ సెక్రటరీగా ఉన్న గుప్తా జీఎస్‌ఎల్‌ఎన్ నవ తెలంగాణకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సీఎస్‌లకు ఉన్న విస్తృత డిమాండ్, అవకాశాలను పంచుకున్నారు. ఆ వివరాలు..

ఈ కోర్సుకు ఎవరు అర్హులు..?

జవాబు : ఐసీఎస్ఐ కోర్సు చేయడానికి ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ చేసిన ఎవరైనా అర్హులు. కొన్ని సబ్జెక్టులు మినహా సైన్స్, మాథ్స్, సోషల్, కామర్స్ దాదాపు ఏ గ్రూపు వారు అయినా ఈ కోర్సు చేయవచ్చు. వయస్సు పరిమితి లేదు. సుమారుగా రెండున్నరేళ్లలోనే కోర్సు పూర్తి అవుతుంది. సీసీఈఈటీ ప్రవేశ పరీక్ష రాసి ప్రవేశం పొందవచ్చు. ఈ ప్రవేశ పరీక్షకు కూడా శిక్షణ లభిస్తుంది. 120 నిమిషాల్లో 200 మార్కులకు మల్టీపుల్ చాయిస్ ప్రశ్నాపత్రం ఉంటుంది. ఏడాదికి నాలుగు సార్లు ఎంట్రన్స్ ఎగ్జాం, ఫలితాలు ఉంటాయి. డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు సీసీఈఈటీ పరీక్షా రాయకుండానే డైరెక్టుగా ఎగ్జిక్యూటివ్ లేవల్ ప్రోగ్రాంలో ప్రవేశం పొందవచ్చు. ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రాం పాస్ అయిన తర్వాత ప్రొపెషనల్ ప్రోగ్రాం చేయాల్సి ఉంటుంది.

రెగ్యూలర్‌గా ఇన్స్‌ట్యూట్‌కు రావాల్సి ఉంటుందా..?

రెగ్యూలర్‌గా రావాల్సిన అవసరం ఉండదు. ఇది ఒక విధంగా డిస్టెన్స్, ఆన్‌లైన్ కోర్సు. ఆసక్తి కలిగిన వారు ఇతర చదువులు, పనులు చేసుకుంటూ కూడా కోర్సు పూర్తి చేయవచ్చు. ఐసీఎస్ఐ ప్రత్యేకంగా ఆన్‌లైన్ క్లాస్‌లను రూపొందించింది. అయితే ప్రాక్టీకల్ నాలేడ్జ్ కోసం కొన్ని సార్లు ప్రత్యక్ష క్లాసులను నిర్వహిస్తాం. వాటికి హాజరు కావడం వల్ల ప్రయోజనాలు ఉంటాయి.

ఏడాదికి రెండు సార్లు పరీక్షలను నిర్వహించి ఫలితాలను వెల్లడిస్తాం. హైదరాబాద్‌లోనే నాలుగు సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాము. ఈ కోర్సును పోస్టు గ్రాడ్యుయేట్ (పీజీ)గా యూజీసీ గుర్తించింది. ఈ సర్టిఫికెట్‌తో పీహెచ్‌డీకి కూడా అర్హత ఉంటుంది.

సీఎస్ పని విధానం ఎలా ఉంటుంది..?

చాలా అద్భుతంగా ఉంటుంది. ఓ సంస్థను స్థాపించడం నుంచి దానికి కావాల్సిన నిధుల సమీకరణ, నిర్వహణ, కార్పొరేట్ లా, సెక్యూరిటీస్ లా, కాపిటల్ మార్కెట్, రెగ్యూలేటరీ సంస్థలతో కలిసి పని చేయడం వరకు మమేకం అవుతారు. న్యాయపరమైన చిక్కులు ఎదురు కాకుండా కంపెనీని నిర్వహించడంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తారు. కంపెనీ బోర్డుతో ప్రత్యక్ష సంబంధాలు నెరవేర్చాల్సి ఉంటుంది. అంతిమంగా ఓ కంపెనీకి ఏ సమస్య వచ్చినా సిఎస్ ఓ ట్రబుల్ షూటర్‌గా మారుతారు. ప్రతీ పని సంతోషాన్ని ఇవ్వడంతో పాటు అదే స్థాయిలో వేతనాలు, సౌకర్యాలు, గౌరవం, హోదా కూడా పొందుతారు.

ఫీజులు ఎలా ఉంటాయి..?

రెండున్నర ఎళ్లలో పూర్తి అయ్యే ఈ కోర్సుకు భారీ ఫీజులు ఏమీ ఉండవు. సీసీఈఈటీ ఎంట్రన్స్‌కు రూ.2,500 ఫీజు ఉంటుంది. ఇందులో పాస్ అయితే ఎగ్జిక్యూటివ్ లేవల్ కోర్సుకు రూ.22,000, ప్రొఫెషనల్ లేవల్ కోర్సుకు రూ.20,000 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మొత్తం మూడు దశల కోర్సునకు సుమారుగా రూ.45,000 వ్యయం అవుతుంది. సామాజిక తరగతులతో సంబంధం లేకుండా ఇంటర్, డిగ్రీ, పీజీలో 85 శాతం ఎగువన మార్కులు ఉంటే, బలహీన వర్గాలకు, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు ఫీజులో రాయితీ ఉంటుంది. ప్రవేశం, ఫీజులకు సంబంధించిన పూర్తి వివరాల కోసం ఐసీఎస్ఐ వెబ్‌సైట్ https://www.icsi.edu/hyderabad/home/ను లేదా 04027177721/24, 9491989900 ఫోన్ నెంబర్లను లేదా ఉప్పల్‌లోని ఐసిఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ భవన్‌లోనూ సంప్రదించవచ్చు.

ఐసిఎస్ఐ కార్యకలాపాలు గురించి చెప్పండి..?

ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పని చేస్తోంది. పార్లమెంట్‌లో చట్టం చేయడం ద్వారా 1980లో ఐసిఎస్ఐని స్థాపించారు. ఢిల్లీ కేంద్రంగా జాతీయ స్థాయిలో ఓ కౌన్సిల్ ఉంటుంది. నాలుగు రీజినల్ కార్యాలయాలు, 73 చాప్టర్లను కలిగి ఉంది. సెంటర్ ఫర్ కార్పొరేట్ గవర్నెన్స్ రీసెర్చ్ అండ్ ట్రయినింగ్ (సీసీజీఆర్‌టీ)లు ముంబయి, హైదరాబాద్, కోల్‌కతాలో ఉన్నాయి. కాగా.. హైదరాబాద్ చాప్టర్‌లో 2300 మంది సీఎస్‌లు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వైజాగ్, అమరావతి చాప్టర్లలో 500 మంది పైగా సభ్యులు ఉన్నారు. అమెరికా, బ్రిటన్, యూఏఈ, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్ లాంటి దేశాల్లోనూ కార్యాలయాలు కలిగి ఉండి.. అక్కడి సంస్థలతో కలిసి పని చేస్తున్నాయి. ఐసీఎస్ఐ 75వేల మంది సభ్యులతో ప్రపంచంలోనే అతిపెద్ద కంపెనీ సెక్రెటరీలను కలిగి ఉన్న సంస్థగా నిలిచింది.

ఉద్యోగ అవకాశాలు ఎలా ఉన్నాయి..?

ఈ రంగంలో నిపుణుల కొరత తీవ్రంగా ఉంది. ఉద్యోగ అవకాశాలు పుష్కలం. కోర్సు పూర్తి చేసిన సిఎస్‌లకు తక్షన ప్లేస్‌మెంట్ లభిస్తోంది. దేశంలో 2 లక్షల మంది సీఎస్‌లకు డిమాండ్, అవసరం ఉంది. కానీ ప్రస్తుతం 75వేల మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. విపరీతమైన డిమాండ్ ఉండటంతో.. ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రాం లేవల్ కోర్సు పూర్తి చూసిన వారికి కూడా మంచి అవకాశాలు ఉన్నాయి. దేశంలో 27 లక్షల రిజిస్టర్డ్ కంపెనీలు ఉండగా.. అందులో 17 లక్షల వరకు యాక్టివ్ కంపెనీలు ఉన్నాయి. తెలంగాణలో లక్షకు పైగా కంపెనీలు యాక్టివ్‌గా ఉన్నాయి. మెజారిటీ కంపెనీలు సీఎస్‌ల కొరతను ఎదుర్కొంటున్నాయి. రూ.10 కోట్ల మూలధన వ్యయం కలిగిన కంపెనీలో కంపెనీ సెక్రెటరీని నియమించుకోవాలని కంపెనీల చట్టం-2013 చెబుతోంది. దీంతో ఈ రంగంలో మరిన్ని అవకాశాలు పెరగడంతో పాటుగా.. కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగం పక్కా అనే చెప్పాలి. లేదా సొంతగా ప్రాక్టీస్ చేసుకోవడానికి అవకాశం ఉంది. సీఎస్‌ల్లో పురుషులకు ధీటుగా సమానంగా మహిళలు ఈ వృత్తిని ఎంచుకోవడం విశేషం.

వేతన ప్యాకేజీలు ఎలా ఉంటాయి..?

చాలా బాగుంటాయి. ప్రభుత్వ, ప్రయివేటు రంగ కంపెనీల్లో విస్తృత నియామక అవకాశాలు లభిస్తాయి. ఇతర ప్రొఫెషనల్ కోర్సులతో పోల్చితే మంచి వేతనం పొందవచ్చు. ప్రారంభంలోనే సగటు వార్షిక వేతనం సుమారు రూ.8-10 లక్షలుగా పొందుతున్నారు. కేవలం ఐదేండ్ల నుంచి పదేండ్ల అనుభవం సంపాదిస్తే ఏడాదికి సగటున రూ.25 లక్షల వరకు వేతనం ఆఫర్ చేస్తున్నాయి. అనుభవం, నైపుణ్యాన్ని బట్టి ఏడాదికి రూ.1 కోటి పైగా వేతనం పొందుతున్న వారు ఉన్నారు. ప్రభుత్వ రంగ కంపెనీలు సహా పబ్లిక్ సెక్టార్ కంపెనీల్లోనూ విశేష అవకాశాలు ఉన్నాయి. భారత్‌లోనే కాదు.. విదేశాల్లోనూ ఉపాధి అవకాశాలు పొందవచ్చు. ఎక్కడైతే కంపెనీలు ఉంటాయో.. అక్కడ కంపెనీ సెక్రెటరీ సర్వీసుల అవసరం తప్పకుండా ఉంటుంది.



తెలుగు సాహితీలోకం మర్చిపోలేని కవి అలిశెట్టి

- తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ఆనందాచారి
- ఆయన కవిత్వం నేటి తరానికి స్ఫూర్తి : నామోజు బాలాచారి

నవతెలంగాణ-కల్చరల్

తెలుగు సాహితీలోకం మర్చిపోలేని కవి అలిశెట్టి అని తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ఆనందాచారి అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలంగాణ సాహితీ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయంలో అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి అధ్యక్షతన యువకవి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆనందాచారి మాట్లాడుతూ తెలుగు సాహితీలోకం మర్చిపోలేని కవి... కలంతో కవాతు చేసి.. రాశి కన్నా వాసి గొప్పదని నిరూపించిన సాహితీ సూరీడు అలిశెట్టి ప్రభాకర్ అని అన్నారు. అక్షర క్షిపణులాంటి కవిత్వంతో సమాజాన్ని అలిశెట్టి మేల్కొలిపారని, ఆయన నుంచి యువ కవులు అందిపుచ్చుకోవాల్సింది అదేనని తెలిపారు. బాలాచారి మాట్లాడుతూ అలిశెట్టి ప్రభాకర్ తెలుగు కవిత్వంలో పరిచయం అక్కరలేని కవి అని అన్నారు. సమాజాన్ని చైతన్యవంతం చేసే పని సాహిత్యకారులపై ఉందన్నారు. ప్రముఖ కవి, విమర్శకులు డా. రాయవరపు సూర్యప్రకాశరావు, తెలంగాణ సాహితి రాష్ట్ర సహాయ కార్యదర్శి సలీమ, ఉపాధ్యక్షులు అనంతోజు మోహన్‌కృష్ణ మాట్లాడారు. ఈ సమ్మేళనంలో యువ కవులు సలీం కంది కొండ, మహేష్ వెల్పుల, శిరీష, సందీప్, జాహ్నవి, సాత్విక, హథిరామ్, సాయి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఉద్యోగుల సమస్యల పరిష్కారం

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కీలక నిర్ణయం

- ప్రతినెలా రెండో, నాలుగో శుక్రవారాల్లో ఆన్‌లైన్ మీటింగ్
- మంత్రి సీతక్క ఆదేశాలతో ఏర్పాట్లు పూర్తి చేసిన ఉన్నతాధికారులు
- ఈనెల 24న తొలి సమావేశం నిర్వహణకు ఏర్పాట్లు
- హాజరుకానున్న మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సర్వీసు అంశాల్లో ఉద్యోగులకు ఎదురవుతున్న సమస్యలకు సత్వర పరిష్కారం చూపేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నూతన విధానాన్ని తీసుకొచ్చింది. సమస్యల పరిష్కారం కోసం సచివాలయం చుట్టూ తిరగకుండా ఉండేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ప్రతి నెలా రెండు, నాలుగో శుక్రవారాల్లో ఆన్‌లైన్ మీటింగ్‌లు నిర్వహించనున్నది. ఆ వేదికగా వీలైనంత మేరకు ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం లభించనున్నది. మంత్రి సీతక్క ఆదేశాలతో తొలి సమావేశాన్ని ఈ నెల 24న నిర్వహించేందుకు ఆ శాఖ ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ సమావేశంలో మంత్రి సీతక్క స్వయంగా పాల్గొననున్నారు.


సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు తరచూ సచివాలయం, పంచాయతీ రాజ్ కమిషనరేట్ల చుట్టూ తిరగడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో పనులకు ఆటంకం కలగడంతో పాటు, హైదరాబాదులో ఉన్నతాధికారుల సమయం వృథా అవుతున్నది. అందుకే ఉద్యోగుల సమయం, వ్యయ ప్రయాసలకు చెక్ పెట్టేలా నూతన విధానాన్ని పంచాయతీరాజ్ శాఖ రూపొందించింది. ఉద్యోగుల సమస్యలు, సర్వీస్ అంశాల పరిష్కారానికి ఆన్‌లైన్ విధానాన్ని అవలంబిస్తారు. ఈ విధానం ప్రకారం ప్రతి నెల రెండో, నాలుగో శుక్ర వారాల్లో మధ్యాహ్నం మూడు నుంచి నాలుగు వరకు... ఓ గంట పాటు ఉద్యోగుల సమస్యలపై ఆన్‌లైన్ సమావేశం నిర్వహిస్తారు. పంచాయతీ రాజ్ శాఖ ఇచ్చే వెబ్ లింక్ ద్వారా సమస్యలున్న ఉద్యోగులు జాయిన్ అయ్యి తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావచ్చు. శాఖ హెడ్ ఆఫీస్ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొస్తే.. ఆ సమస్యకు పరిష్కార మార్గం చూపుతారు. ఆన్‌లైన్ సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, పీఆర్ఆర్‌డీ డైరెక్టర్ సృజన, మిషన్ భగీరథ, రూరల్ ఇంజినీరింగ్ ఈఎన్‌సీలు అందుబాటులో ఉంటారు. అవసరమైతే మంత్రి సీతక్క సైతం ఆన్‌లైన్ సమావేశంలో పాల్గొంటారు. ఆ సమావేశంలో ఉద్యోగుల సమస్యలు విని సత్వర పరిష్కారం చూపుతారు. పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేస్తారు. సమస్యలు ఉన్న ఉద్యోగులు, ఏవైనా పత్రాలు సమర్పించదల్చుకుంటే ప్రత్యేక మెయిల్ ఐడీని, వాట్సాప్ నెంబర్‌ను అందుబాటులోకి తెచ్చారు.

ఉద్యోగ సమస్యలకు సత్వర పరిష్కారం: మంత్రి సీతక్క

గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నూతన విధానాన్ని అమలుపరుస్తున్నాం. ఇక హైదరాబాద్ రాకుండానే ఉద్యోగులు ఆన్‌లైన్‌లో తమ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చు. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పాలన పరుగులు పెడుతుంది. గ్రామీణ ఉద్యోగులు చురుగ్గా పనిచేస్తే ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువ అవుతాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరేట్ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలకు ఆన్‌లైన్ గ్రీవెన్స్ విధానం సత్వర పరిష్కారం చూపిస్తుందన్న నమ్మకముంది. ఈ అవకాశాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి.

సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలి

- ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణ సాంస్కృతిక సారథి ఈ నెల 8న జారీ చేసిన సర్క్యులర్ ఉద్యోగులకు నష్టం కలిగించే విధంగా ఉందని, దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కృషి చేసిన ప్రజా గాయకుడు గద్దర్ కుమార్తె వెన్నెల గద్దర్ సారథికి చైర్మెన్‌గా ఉండి సర్క్యులర్ తీసుకురావడం బాధాకరమన్నారు. సారథిలో ఉన్న కళాకారులు ప్రయివేటు బహిరంగ సభలు, సమావేశాల్లో పాల్గొనకూడదని ఈ సర్క్యులర్ సారాంశమన్నారు. సీఎం ఎ.రేవంత్ రెడ్డి, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులకు తెలియకుండానే ఈ సర్క్యులర్ జారీ చేశారని తాము భావిస్తున్నామన్నారు. రిజర్వేషన్ వర్గీకరణ అమలు కోసం ఫిబ్రవరి 7వ తేదీన వేల గొంతులు, లక్ష డప్పులు కార్యక్రమాన్ని అడ్డుకోవడం కోసం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకే ఈ సర్క్యులర్ తీసుకువచ్చారని ఆయన ఆరోపించారు. వెన్నెల గద్దర్ తన వైఖరిని మార్చుకోవాలని, లేని పక్షంలో ప్రభుత్వం ఆమెను సాంస్కృతిక సారథి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.



సీపీఐ(ఎం) జార్ఖండ్ రాష్ట్ర కార్యదర్శిగా ప్రకాష్ విప్లవ్ ఎన్నిక

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సీపీఐ(ఎం) జార్ఖండ్ రాష్ట్ర కార్యదర్శిగా ప్రకాష్ విప్లవ్ ఎన్నికయ్యారు. 35 మందితో రాష్ట్ర నూతన కమిటీ, అందులో 11 మందితో రాష్ట్ర కార్యదర్శి వర్గం ఎన్నికైంది. రాంచీ నామ్‌కుమ్‌లో మూడ్రోజుల పాటు జరిగిన 8వ సీపీఐ(ఎం) జార్ఖండ్ రాష్ట్ర మహాసభ శనివారం ముగిసింది. ఈ మహాసభకు సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కరత్, రామచంద్రడోమ్ హాజరయ్యారు. రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్ విప్లవ్ రాజకీయ, నిర్మాణ నివేదికను ప్రవేశపెట్టారు. ఈ నివేదికపై ప్రతినిధులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. పార్టీ క్షేత్రస్థాయి బలోపేతం, ప్రజా సమస్యలపై పోరాటాన్ని తీవ్రతరం చేయాలని పిలుపునిస్తూ ముగిసింది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కరత్ మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ సర్కార్ అవలంభిస్తోన్న కార్పొరేట్, హిందూత్వ బంధాన్ని వివరించారు. పోరాడి సాధించుకున్న అటవీ హక్కుల చట్టాన్ని మోడీ సర్కార్ నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందనీ, ఇది గిరిజనులను తమ భూములను నుంచి దూరం చేయడమేనని స్పష్టం చేశారు. ఈ విధానాలపై పోరాటాలకు గిరిజనులను ఏకం చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. అటవీ భూములను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారనీ, సహజ వనరులను అప్పన్నంగా దోచి పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనులకు చెందాల్సిన భూములను కార్పొరేట్లకు కట్టబెట్టి ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. మరో పొలిట్ బ్యూరో సభ్యులు రామచంద్రడోమ్ మాట్లాడుతూ.. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని సూచించారు. గిరిజనులను ఐక్యం చేయాలనీ, మోడీ సర్కార్ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని తెలిపారు.



సీపీఐ(ఎం) గుజరాత్ రాష్ట్ర కార్యదర్శిగా హెచ్.ఐ భట్ ఎన్నిక

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో : సీపీఐ(ఎం) గుజరాత్ రాష్ట్ర కార్యదర్శిగా హెచ్.ఐ భట్ ఎన్నికయ్యారు. 30 మందితో రాష్ట్ర నూతన కమిటీ, అందులో 9 మందితో రాష్ట్ర కార్యదర్శి వర్గం ఎన్నికయింది. రాజ్‌కోట్ జిల్లాలోని ఉప్లేటాలో రెండ్రోజుల పాటు జరిగిన 24వ సీపీఐ(ఎం) గుజరాత్ రాష్ట్ర మహాసభ ఆదివారం ముగిసింది. ఈ మహాసభకు సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ ధావలే, కేంద్ర కమిటీ సభ్యుడు మురళీధరన్ హాజరయ్యారు. మహాసభకు పది జిల్లాల నుంచి 192 మంది ప్రతినిధులు వచ్చారు. నివేదికను రెండు భాగాలుగా ప్రవేశపెట్టారు. రాష్ట్ర కార్యదర్శి హెచ్.ఐ భట్ రాజకీయ భాగాన్ని, కేంద్ర కమిటీ సభ్యుడు అరుణ్ మెహతా సంస్థాగత భాగాన్ని ప్రవేశపెట్టారు. మొదటి భాగంపై 24 మంది ప్రతినిధులు, రెండో భాగంపై 17 మంది ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు. నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. అలాగే కీలక అంశాలపై 12 తీర్మానాలు కూడా ఆమోదించారు. మాజీ రాష్ట్ర కార్యదర్శి సుబోధ్ మెహతా "కమ్యూనిస్ట్ భావజాలం" పేరుతో గుజరాతీలో రాసిన బుక్‌లెట్ కొత్త ఎడిషన్ విడుదల చేశారు. సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ ధావలే మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా సామ్రాజ్యవాదం, జియోనిజం ప్రమాదం గురించి వివరించారు. అలాగే జాతీయ రంగంలో నయా ఫాసిస్ట్ ఆరెస్సెస్, బీజేపీ దాడి గురించి ఆయన నొక్కి చెప్పారు. అన్ని లౌకిక శక్తుల ఐక్యత అవసరాన్ని నొక్కి చెబుతూనే సీపీఐ(ఎం) స్వతంత్ర బలం, బలోపేతం చేయడం ప్రాముఖ్యతను కూడా ఆయన స్పష్టం చేశారు.

ఒకే దేశం-ఒకే ఎన్నిక దేశానికి ప్రమాదకరం

(మొదటి పేజీ తరువాయి)

సమ్మె, చర్చల హక్కులను కోల్పోతారని చెప్పారు. ఈ మార్గదర్శకాలు యాజమాన్యాలకు చుట్టాలు కాగా, కార్మికుల మెడపై కత్తుల్లాంటివని వ్యాఖ్యానించారు. ఇండియాబ్లాక్‌లో భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్ లేబర్‌కోడ్‌ల మార్గదర్శకాలను తాను అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు జరగకుండా అడ్డుకోవాలని సూచించారు. రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వం అందుకు సానుకూలంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలకు 10 శాతం సబ్‌ప్లాన్ నిధులను ఖర్చు చేస్తామని రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క చెప్పడం సరికాదన్నారు. జనాభా దామాషా ప్రకారం రెండు వర్గాలకు 25 శాతం నిధులు చెందుతాయని గుర్తు చేశారు. భట్టి వెంటనే తన ప్రకటనను విరమించుకొని పూర్తి స్థాయి నిధులను ఖర్చు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



25 నుంచి సంగారెడ్డిలో సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభలు ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరుగుతాయని ఆహ్వాన సంఘం చైర్మెన్, పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు తెలిపారు. పార్టీ రాష్ట్ర నాలుగో మహాసభలను పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాష్ట్రంలో చేపట్టిన ప్రజా ఉద్యమాలు, సాధించిన విజయాలపై మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. మహాసభకు ముఖ్య అతిథులుగా పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకారత్, బివి.రాఘవులు హాజరవుతారని వెల్లడించారు. మహాసభ మొదటి రోజైన 25న సంగారెడ్డిలోని ఇన్స్‌పెక్షన్ బంగ్లా నుంచి సంగారెడ్డి చౌరస్తా వరకు ప్రజాప్రదర్శన, భారీ బహిరంగసభ ఉంటుందని తెలిపారు. 17న ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో అరుణపతాకాలను ఆవిష్కరించడం ద్వారా మహాసభలో అందరూ పాల్గొనాలనే సందేశాన్ని అందించనున్నట్టు వివరించారు. తెలంగాణ సాయుధ పోరాట వారసత్వానికి చిహ్నంగా బైరాన్‌పల్లి, ఉమ్మడి మెదక్ జిల్లా ఉద్యమ నేత కేవల్‌కిషన్ సమాధి నుంచి అమర జ్యోతులు బహిరంగ సభాస్థలికి చేరకుంటాయని తెలిపారు. వీటిని పార్టీ నేతలు బృందాకారత్, బివి.రాఘవులు అందుకుంటారని పేర్కొన్నారు. మెదక్ జిల్లా ప్రజలకు మహాసభ సందేశాన్ని అందించేందుకు 19న సిద్దిపేటలో ప్రారంభమై 22న జహీరాబాద్‌లో ముగియనున్న ప్రచార జాతను పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు టి సాగర్ ప్రారంభిస్తారని తెలిపారు. 21న సైన్స్ ఎగ్జిబిషన్‌ను సంగారెడ్డిలో ఏర్పాటు ప్రారంభిస్తామని వివరించారు. మహాసభలకు హాజరయ్యే ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. మెదక్ ప్రజానీకంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పార్టీ శ్రేణులు, సానుభూతి పరులు, ప్రజలు పెద్దఎత్తున హాజరై మహాసభను విజయవంతం చేయాలని చుక్కరాములు ఆ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను రాఘవులు, తమ్మినేని, రాములు ఆవిష్కరించారు.

ఉపాధి హామీని పట్టణాలకు విస్తరించాలి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధి హామీ చట్టాన్ని పట్టణ ప్రాంతాలకు విస్తరించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర నాలుగో మహాసభలను పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త మున్సిపాల్టీల్లో గ్రామాలు విలీనమైన సందర్భంలో ఉపాధి హామీ హక్కు కోల్పోయి పేదలు నష్ట పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 26 నుంచి అమలు చేయనున్న రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు మొదలైన సంక్షేమ పథకాల్లో నిజమైన పేదలనే లబ్దిదారులుగా ఎంపిక చేయాలని కోరారు. జాబ్ కార్డులు, రేషన్ కార్డులను ప్రాతిపదికగా తీసుకుంటే, అవి లేని వారికి అన్యాయం జరుగుతుందని అన్నారు.


అలా కాకుండా గ్రామ సభల్లో అర్హులను గుర్తించి ఎంపిక చేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాకుండా శాశ్వత ప్రాతిపదికన ప్రజలకు మేలు జరిగేలా పథకాలను అమలు చేయాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏడో గ్యారంటీ అయిన ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ అనే అంశాలు కాంగ్రెస్ ఏడాది పాలనలో కానరావడం లేదని ఎద్దేవా చేశారు. ఫార్మా సిటీ, ఫోర్త్ సిటీ పేరిట వేల ఎకరాల భూ సేకరణ సరికాదని అన్నారు. అలాగే హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూలగొట్టడాన్ని ఆయన తప్పు పట్టారు. రాష్ట్ర ప్రభుత్వంలో తాము భాగస్వాములం కాదనీ, మిత్రపక్షం అంతకన్నా కాదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటే ఎవరినైనా ప్రశ్నిస్తామని తమ్మినేని స్పష్టం చేశారు. గత సర్కార్ బాటలోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పయనిస్తోందని విమర్శించారు. ఈనెల 25 నుంచి సంగారెడ్డిలో జరగనున్న పార్టీ రాష్ట్ర మహాసభలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. బీజేపీ మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా కలిసొచ్చే పార్టీలతో ఐక్య పోరాటాలకు శ్రీకారం చుడుతామని అన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడటం లేదని విమర్శించారు. రెండు పార్టీలు మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో కలిసి రావాలని కోరారు. సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహా సభ నిర్ణయాలు రాష్ట్ర ప్రజలకు దిశానిర్దేశం చేసే విధంగా ఉంటాయని తెలిపారు.

కోర్టు ఆదేశాలు ధిక్కరించినా..

భార్య భరణానికి అర్హురాలే

సుప్రీంకోర్టు స్పష్టీకరణ



న్యూఢిల్లీ : భార్యకు భరణం విషయంలో భారత సర్వోన్నత న్యాయస్థానం మరొక కీలక తీర్పును వెలువర్చింది. భర్తతో కాపురం చేయాలన్న కోర్టు ఆదేశాలను ధిక్కరించినా..ఆమె భరణానికి అర్హురాలేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాల ఉల్లంఘనకు మాత్రం సహేతుకమైన కారణాలు ఉండాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తెలిపింది. దాంపత్య హక్కును భర్తకు పునరుద్ధరిస్తూ న్యాయస్థానం ఉత్తర్వు జారీ చేసిన తర్వాత కూడా భార్య దానిని పాటించకపోతే, మనోవర్తిని కోరే హక్కును ఆమె కోల్పోతారని గతంలో పలు హైకోర్టులు తీర్పునిచ్చిన విషయాన్ని ధర్మాసనం ఈ సందర్భంగా ప్రస్తావించింది. అటువంటి తీర్పులు సమంజసమేనని స్పష్టం చేసింది. అలాగే, కలిసి జీవించాలన్న కోర్టు ఆదేశాలను సహేతుకమైన, ప్రత్యేకమైన పరిస్థితుల్లో భార్య తిరస్కరించినప్పటికీ ఆమె మనోవర్తి హక్కుకు నేరశిక్షా స్మృతిలోని సెక్షన్ 125 భద్రత కల్పిస్తుందని సర్వోన్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. జార్ఖండ్‌కు చెందిన దంపతులకు సంబంధించిన ఒక కేసులో న్యాయస్థానం ఈ తీర్పును వెలువర్చింది.

పశ్చిమ దేశాల ఆంక్షలకు తిరస్కృతి

మదురోకు బాసటగా నిలిచిన బొలివేరియన్ సాయుధ బలగాలు



కారకస్ : వెనిజులా ప్రభుత్వ ఉన్నతాధికారులపై అమెరికా , యూరోపియన్ యూనియన్ (ఈయూ), బ్రిటన్ తాజాగా ఆంక్షలు విధించడాన్ని బొలివేరియన్ సాయుధ బలగాలు (ఎఫ్‌ఏఎన్‌బీ) తిరస్కరించాయి. సామ్రాజ్యవాద దేశాల గూడు పుఠాణికి ఇది నిలువెత్తు నిదర్శనమని ఎఫ్‌ఏఎన్‌బీ విడుదలజేసిన ప్రకటన పేర్కొంది. అధ్యక్షుడిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన నికోలస్ మదురో పట్ల సైన్యం తన తిరుగులేని విశ్వాసాన్ని ప్రకటించింది.ఈ ఆంక్షలు అంతర్జాతీయ న్యాయ నియమాలకు పూర్తి విరుద్ధమని పేర్కొంది. ప్రజలిచ్చిన తీర్పు మేరకే 2025-2031 కాలానికి వెనిజులా అధ్యక్షుడిగా మదురో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. వెనిజులా సార్వభౌమత్వంపైన, ప్రజాస్వామ్యంపైన శత్రువులు చేస్తున్న దాడిని వెనిజులా ప్రజలు తిప్పికొడతారని సైన్యం హెచ్చరిక చేసింది. సైన్యంలో నాయకత్వాన్ని అప్రతిష్ట పాల్జేసేందుకే ఈ ఆంక్షలను విధించాయి. గత రెండు దశాబ్దాలుగా వెనిజులాకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాదులు చేస్తున్న అన్ని యత్నాలను బొలివేరియన్ సైన్యం దృఢ సంకల్పంతో తిప్పికొడుతూ వస్తోంది. ఇప్పుడీ కుట్రలను అంతకు రెట్టించిన పట్టుదలతో వెనిజులా ఎదుర్కొంటుందని ఆ ప్రకటన పేర్కొంది. యూనిఫామ్‌లో ఉన్న సైనికులను రకరకాల ప్రలోభాలు, ఒత్తిళ్లు తెచ్చారని, అయినా వాటన్నిటిని తిరస్కరించి బొలివేరియన్ సాయుధ బలగాలు తమ నిబద్ధతను మరోసారి చాటిచెప్పాయి.

చారిత్రాత్మక వేతన ఒప్పందాలు...

మెరుగైన సదుపాయాలు

ఎర్రజెండా నీడలో 40 ఏండ్లుగా కార్మిక సంక్షేమానికి కృషి

సంగారెడ్డి జిల్లాలో సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలు జరగబోతున్న క్రమంలో ఎర్రజెండా ఆధ్వర్యంలో ఆయా రంగాల్లో ముఖ్యంగా కార్మికరంగంలో చేసిన పోరాటాలు, సాధించిన విజయాలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎర్రజెండా నీడలో 40 ఏండ్లుగా కార్మికుల సంక్షేమానికి సీపీఐ(ఎం) కృషి చేస్తూ వస్తోంది. చారిత్రాత్మక వేతన ఒప్పందాలు...మెరుగైన సదుపాయాల కల్పన కోసం అనేక ఉద్యమాలు నడుపుతోంది. కాంట్రాక్టు, వలస కార్మికులకు కనీస వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత కోసం సీపీఐ(ఎం) సమరశీలంగా కొట్లాడుతోంది. ప్రభుత్వరంగ సంస్థల్ని పరిరక్షించాలని, కార్పొరేటీకరణకు స్వస్తి పలకాలని ఎర్రజెండా కార్మికులు, ఉద్యోగుల్ని సంఘటితం చేసింది. అనేక భారీ, మధ్య తరహా పరిశ్రమల్లో అప్రతిహతంగా గుర్తింపు సంఘంగా విజయాల్ని సాధిస్తూ వస్తోంది. వర్గ పోరాటాలతో పాటు సామాజిక ఉద్యమాలను బలపర్చే కర్తవ్యంతో అనేక సామాజిక, సంఘీబావ కార్యక్రమాలు నిర్వహించింది.



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

అప్రతిహత విజయాలు...ఎర్రజెండా రెపరెపలు

మహీంద్రా, మహీంద్రా ట్రాక్టర్ ప్లాంట్, సాండ్విక్, పిరామల్ ఫార్మా, తోషిబా, కిర్బీ, టీఐడీసీ, రాక్‌వుల్, పెబ్‌పెన్నార్, బీరు పరిశ్రమలు, పెప్సీ, న్యూలాండ్ వంటి ఎన్నో భారీ, మధ్య తరహా పరిశ్రమల్లో ఎర్రజెండా వరుసగా గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలుస్తూ వస్తోంది. కంపెనీల్లోని కార్మికవర్గమంతా ఎర్రజెండా నీడన సంఘంగా ఏర్పడి సంఘటితమై విజయాలు సాధిస్తున్నారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో మంత్రులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేల్ని సైతం మట్టికరిపించిన చరిత్ర ఎర్రజెండాకు ఉంది. చుక్క రాములు, జె.మల్లిఖార్జున్, బి.మల్లేశం వంటి నాయకులు కార్మికుల ప్రతినిధులుగా గెలుస్తూ వస్తున్నారు.

చారిత్రాత్మక ఒప్పందాలు... సదుపాయాలు

ఎర్రజెండా నాయకత్వంలో కార్మికవర్గం ఐక్యంగా ఉండి పోరాడుతున్న ఫలితంగా చారిత్రాత్మకమైన వేతన ఒప్పందాలు జరుగుతున్నాయి. కంపెనీల ఉత్పత్తిలో కీలక భూమిక పోషిస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు పర్మినెంట్ చేసేలా చేస్తోంది. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా సంగారెడ్డి జిల్లాలో సీపీఐ(ఎం) నేతృత్వంలో అనేక వేతన ఒప్పందాలు జరిగాయి. మెరుగైన సదుపాయాల్ని కూడా సాధించుకున్నారు. ఎర్రజెండా నాయకత్వంలో జరుగుతున్న ఒప్పందాలతో వేతనాలు పెరగడం వల్ల ఆర్థిక పరిస్థితుల్లోనూ మెరుగుదల కనిపిస్తోందని పలువురు కార్మికులు తెలిపారు.

కాంట్రాక్టు, వలస కార్మికుల సమస్యలపై...


జిల్లాలో 1710 భారీ, మధ్య తరహా పరిశ్రమలు, 3 వేలకు పైగా చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమలున్నాయి. వీటిల్లో 1.80 లక్షల మంది కార్మికులు పనిచేస్తుండగా వీరిలో 1.20 లక్షల మంది వరకు వలస కార్మికులే ఉన్నారు. కాంట్రాక్టు పద్ధతి వల్ల పర్మినెంట్ కార్మికుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని సీపీఐ(ఎం) సమ్మె చేసింది. యూనియన్లకు అతీతంగా వేలాది మంది సమ్మెలో ఎర్రజెండా నాయకత్వంలో పాల్గొన్నారు. పాశమైలారం, ఖాజీపల్లి, బొంతపల్లి, గడ్డపోతారం వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో లక్షలాది మంది వలస కార్మికులున్నారు. సరైన వేతనాలివ్వక, చనిపోయినా గాయాలపాలైనా పట్టించుకోని పరిస్థితుల్లో సీపీఐ(ఎం) వారి పక్షాన ఉద్యమించడం వల్ల యాజమాన్యాలు కొంత మేరకు వేతనాలు పెంచారు. అనేక పరిశ్రమల్లో జరిగే ప్రమాదాల్లో వలస కార్మికులు చనిపోతే కనీసం శవాన్ని కూడా ఇవ్వకుండా మాయం చేస్తున్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేకూరే వరకు సీపీఐ(ఎం) ఆందోళన చేసి అనేక మందికి నష్టపరిహారం ఇప్పించేలా కృషి చేసిందని కార్మికులు తెలిపారు. బీడీఎల్, బీహెచ్‌ఈఎల్, ఆర్డినెన్స్ వంటి పరిశ్రమల ప్రయివేటీకరణకు పూనుకున్న ప్రతి సారీ సీపీఐ(ఎం) పోరాడి అడ్డుకుంది. కార్మిక హక్కుల్ని హరిస్తూ తెచ్చిన 4 లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) కార్మికుల పక్షపాతిగా మిగిలింది.

సామాజిక, సంఘీబావ కార్యక్రమాలు

వర్గ పోరాటాలతో పాటు సామాజికాంశాలు, వివక్షకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) కొట్లాడుతోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టింది. కరోనాకాలంలో వలస కార్మికులు చిక్కిపోయి ఆకలితో అలమటిస్తే ఎర్రజెండా తోటి కార్మికుల నుంచి ఒక కోటీ వరకు సంఘీబావ నిధి వసూలు చేసి ఆశ్రయం కల్పించింది. పాలకపార్టీలు ఆదుకోకపోయినా సీపీఐ(ఎం) తరపున రాష్ట్రవ్యాప్తంగా కార్మికులను ఆదుకుంది. కరువొచ్చి రైతులు అత్యధికంగా కేసీఆర్ నియోజకవర్గంలో ఆత్మహత్య చేసుకున్న సందర్భంగా సీపీఐ(ఎం) ఒక్కొక్కరికి రూ.5 వేల సాయం అందించింది. పారిశ్రామిక వాడల్లో సహపక్తి భోజనాలు, రక్తదానం, మెడికల్ క్యాంపులు నిర్వహించారు. దళితులు, గిరిజనుల పోరాటాలకు బాసటగా నిలిచింది.

కాంట్రాక్టు, వలస కార్మికుల వేతనాలు, సౌకర్యాల సాధన
లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సమ్మె పోరాటాలు
ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణకు ఉద్యమాలు
గుర్తింపు ఎన్నికల్లో అప్రతిహతంగా విజయాలు
సామాజిక వారోత్సవాలు...సహపంక్తి భోజనాలు

ఎర్రజెండా పట్ల ఆకర్షితులవుతున్న కార్మికులు



సీపీఐ(ఎం) చేస్తున్న పోరాటాలు, సేవా, సామాజిక కార్యక్రమాల ద్వారా కార్మికులు పెద్ద ఎత్తున ఎర్రజెండా పట్ల ఆకర్షితులవుతున్నారు. అనేక పరిశ్రమల్లో గెలుస్తూ రావడం, రాష్ట్రంలోనే ఎక్కడా జరగని మెరుగైన వేతన ఒప్పందాలు చూసి కార్మికులు ఎర్రజెండా వైపు వస్తున్నారు. వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, సామాజిక సమస్యల పరిష్కారం కోసం కొట్లాడుతున్నాం. ప్రభుత్వ రంగ సంస్థల్ని కాపాడుకోవాలి. వలస కార్మికుల చట్టాల్ని అమలు చేయడంలేదు. లేబర్ కోడ్‌ల వల్ల కార్మిక హక్కులు హరించబడతాయి. సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలు జయప్రదం కావాలి.

-బి.మల్లేశం, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు

ఉస్మానియా ఆస్పత్రి పునర్నిర్మాణం హర్షణీయం

తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఉస్మానియా ఆస్పత్రి పునర్నిర్మాణం హర్షణీయమని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నరహరి, రాష్ట్ర సెక్రెటరీ జనరల్, డాక్టర్ లాలు ప్రసాద్ రాథోడ్, రాష్ట్ర కోశాధికారి డాక్టర్ రాయూఫ్ తెలిపారు. కొత్త ఆస్పత్రికి శంకుస్థాపనకు చర్యలు తీసుకుంటున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యఆరోగ్య శాఖా మంత్రి దామోదర రాజనరసింహ ప్రకటించడాన్ని స్వాగతించారు. ఆదివారం హైదరాబాద్‌లోని మంత్రి దామోదర రాజనర్సింహ నివాసంలో ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన భవనం కోసం గత ప్రభుత్వానికి అనేక సార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత ప్రజాప్రభుత్వంలో ఉస్మానియా ఆస్పత్రి పునర్ వైభవం కోసం చర్యలు చేపట్టడం హర్షణీయమని తెలిపారు. ఇన్నేండ్ల తర్వాత వైద్యుల, ప్రజాసంఘాల చిరకాల కోరిక నెరవేరుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ వైద్యుల చిరకాల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. డీఎంఈ, వీవీపీడీహెచ్, ఈఎస్ఐ పరిధిలో ఉన్న సమస్యలను ప్రభుత్వం పరిశీలించి వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఆ దిశగా వైద్యులతో సమావేశం ఏర్పాటు చేస్తే మంచిదని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ సిద్దిపేట రమేష్, డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ దీన్ దయాల్, డాక్టర్ కళ్యాణ్, సెక్రెటరీలు డాక్టర్ రాంసింగ్, డాక్టర్ రాజు, డాక్టర్ మురళీధర్, డాక్టర్ కవి రమేష్ తదితరులు ఉన్నారు.

భలే ..భలే ... మామిడి పూత



శీతాకాలం.. మామిడి చెట్టుకు పూత విరగబూసింది. ఆ పూతకు దాని కింద ఆకులు కనిపించడం లేదు. పూర్తిగా పసుపురంగును పులుముకొని చూపరులను ఆకట్టుకుంటోంది.. నిండైన పూతతో మామిడి చెట్టు సూర్యోదయం అస్తమిస్తున్న సమయంలో అందంగా ఉంది. వాహనదారులకు సువాసనతో కనువిందు చేస్తోంది. ఈ చిత్రం ఆదివారం భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మర్యాల శివారులో నవ తెలంగాణ కెమెరాకు చిక్కిన దృశ్యం...

ఆకిట్ల ముగ్గులతో మురిసిపోయేది

సంక్రాంతి అచ్చిందంటే సాలు మా ఊరంత గిర్ని కాడనే ఉండేది...
ఏ వాడకు వోయిన సకినాల వాసనే అచ్చేది...
కట్టెల పొయ్యే బోగి మంటలేశినట్లుంటది...
సలిల లేశి అనుక్కుంట
చీపిరందుకొని ఆకిలూడుస్తాంటే...
పెద్ద తాత కొట్టంల పేడ తెచ్చి
గుంజ పొంటి పెట్టేది...
నానమ్మ కొంగు శెక్కి అల్కు సల్లుకచ్చి...
తెల్లటి బియ్యప్ పిండితో
సందుపోకుండ ముగ్గులేత్తంటే...



నెత్తి మీదకి సూరీడు రానే అచ్చే...
పొద్దంతా ఆకిట్లనే ఉంటవా ఏందని?
తాత మొత్తుకుంటే...
అప్పుడు నాన్నమ్మ నడుం లేపి
ముగ్గులని చూసి మురిసిపోతూ.. సంకురాత్రి లచ్చిమి
మా దర్వాజలనే ఉన్నదని సంబురపడేది...
పీటేసి ఆవు పేడతో గొబ్బెమ్మలు
చేసి పసుపు కుంకుమ పుదిస్తే...
ఇంటెనుక బాయి పొంట పూసిన బంతిపూలు వంగి వంగి చూస్తుంటే...
గర్కపోసలు గర్వంగ లేచి నిలబడ్డవ్...
నవధాన్యాలు సోలలేసి ఎర్రటి రేగుపండ్లు పోస్కుంట
కడపలన్నిటి మీద గౌరమ్మలు పెట్టేది...
ఎంతటి పేదవాడికైనా పండగంటే
సేసిన కట్టాన్ని మర్శిపోయి ఆ పొద్దంత నవ్వుకునుడే...
తెల్లారితే తారీఖు మారుతుండేమో కానీ తలరాతలు చెరిగిపోవు...
పండగ ఒక కనిపించని సుట్టం తీరు అచ్చిపోతది...
ఆ తరువాత రోజుల్ల కనిపించేది మాత్రం మన రెక్కల కట్టమే...

- తుమ్మల కల్పన రెడ్డి, 9640462142

సాహితీ వార్తలు

17న 'అంబపలుకు' ఆవిష్కరణ

ఈ నెల 17న పి.శ్రీనివాస్‌గౌడ్ రచించిన 'అంబపలుకు' రవీంద్ర భారతిలో సాయంత్రం 6 గంటలకు కె.శివారెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నారు. మామిడి హరికృష్ణ పుస్తకావిష్కరణ చేయనున్న ఈ కార్యక్రమంలో ఎన్. వేణుగోపాల్, ఏ.కె.ప్రభాకర్ పుస్తక సమీక్ష చేస్తారు. ముఖ్య అతిథులుగా నిజం శ్రీరామమూర్తి, డా.జీ.వి. రత్నాకర్, కటుకోఝ్వల ఆనందాచారి, మెర్సీ మార్గరెట్, నస్రీన్ ఖాన్, సలీమ, పద్మకళ హాజరు కానున్నారు.

పాలమూరు సాహితి అవార్డు-2024కు కవితా సంపుటాల ఆహ్వానం

పాలమూరు సాహితి అవార్డుకు కవితా సంపుటాలు ఆహ్వానిస్తున్నారు. ఇందుకు 2024లో ముద్రితమైన వచన కవితా సంపుటాలను మాత్రమే మూడేసి ప్రతులను పంపించాల్సి ఉంటుంది. ఎంపికైన సంపుటికి రూ.5,116/- అందజేయనున్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 31 లోగా డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, ఇం.నం. 8-5-38, టీచర్స్ కాలని, మహబూబ్ నగర్ - 509001, తెలంగాణ రాష్ట్రం చిరునామాకు పంపించాల్సి ఉంటుంది. వివరాలకు 9032844017 నంబరు నందు సంప్రదించవచ్చు.

తెలంగాణ తల్లికి కవితార్చన కవితలకు ఆహ్వానం

'తెలంగాణ తల్లికి కవితార్చన' పేరుతో రావిరాల బసవయ్య, తాడిచర్ల రవి త్వరలో కవితా సంపుటి తీసుకురానున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, దేశ విదేశాల్లోని ఆసక్తి కలిగిన కవులందరూ కవితలు పంపవచ్చు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 31లోగా 9949758054, 8919800447 వాట్సాప్ నంబర్లకు లేదా ravithadicherla@gmail.com, basavaiah.ravirala14@gmail.com మెయిల్‌కు పంపవచ్చు.

పెంకుటిల్లు : తాత్పర్యానికి పరిమితం కాని కవిత్వం

కవిత్వమంటే వచన కవిత్వమే అనే భావన ఈ కాలంలో స్థిరపడిపోయింది. నా దృష్టిలో వర్తమాన తెలుగు వచన కవులు రెండు రకాలు. ఒకరు- వచన కవిత్వంలో పుట్టి, వచన కవిత్వంలోనే పెరిగి, వచన కవిగా కొనసాగుతూ దశాబ్దాలు గడిచినా అది తప్ప ఇంకేదీ ముట్టనివారు. రెండు : తెలుగు సాహిత్య చరిత్ర తెలిసి, దాని గమనం పట్ల ఒక అవగాహన ఉండి, పద్యమూ గేయమూ చదివి ఉండి, రాయగలిగి ఉండి కూడా జాగరూకతతో, కోరుకొని వచన కవిత్వం రాస్తున్నవారు. వీరి సంఖ్య మొదటి సంఖ్యలో పదవ వంతు కూడా ఉండదు. రెండవ కోవలోకి వచ్చే కవి డా.కాంచనపల్లి గోవర్ధన్ రాజు.



ఏనుగు నరసింహారెడ్డి
8978869183

చేదబావి, కల ఇంకా మిగిలే ఉంది, పెంకుటిల్లు కాంచనపల్లి వచన కవితా సంపుటాలు. విద్యార్థి దశలో ప్రచురించిన భావమంజరి అటు కొన్ని పద్యాలు, ఇటు కొన్ని గేయాలుగా రాసుకున్న గ్రంథం. ఇక తండ్లాట గేయం వచనం కలిసినట్లున్న దీర్ఘకవిత. ఇది తెలంగాణ ఉద్యమ అవసరంగా వచ్చింది. చేదబావి, కల ఇంకా మిగిలే ఉంది ద్వారా వచనకవిగా కాంచనపల్లి పాఠకులకు చాలా చేరువయ్యాడు. 2024లో వచ్చిన పెంకుటిల్లు సంపుటి ఆయన అభివ్యక్తికి అద్దం పడుతుంది.

ఖచ్చితంగా పట్టుబట్టి కూర్చుంటే ఏ ప్రక్రియలోనైనా సృజన చేయవచ్చునేమో కానీ కవిత్వంలో కష్టం. వచన కవిత్వంలో మరీనూ. వచన కవిత్వం వస్తే రాసేదే కానీ, రాస్తే వచ్చేది కాదు. ఫీల్ లేకుండా రాస్తే వచన కవిత్వం తేలిపోతుంది. ఆ ఫీల్ వచన కవిత్వానికి ఒక ఆటోమేటిక్ Diction ను సంతరిస్తుంది. ఆ Diction వల్ల ఒక వస్తువును ఏ రూపంలోకి తేవాలో ఆ రూపంలో తెస్తుంది. అప్పుడే అది మంచి కవిత అవుతుంది. అందుకే 'ఆ విధంగా తప్ప ఇంకే విధంగానూ రాయలేనిది ఉత్తమ కవిత' అన్నాడు ఎమర్సన్. పెంకుటిల్లులో అలాంటి ఒక కవితను చూద్దాం.

సాయంత్రం పార్కులు అనే కవితను కవి తొమ్మిది భాగాలుగా విభజించాడు. మొదటి భాగంలో విశ్రాంత జీవుల గమనాన్ని, రెండవ భాగంలో శునకాన్ని ఆడించే బలహీనమైన వ్యక్తి, మూడవ భాగంలో బైకుపై వచ్చే ప్రియుడి కోసం వేచి చూస్తున్న ప్రియురాలు, మరో భాగంలో సమయం అయిపోయినందుకు బయటికి వెళ్ళమని సూచనలు ఇస్తున్న పార్క్ కీపర్, ఇంకొక విభాగంలో పిల్లలు హోంవర్క్ భయంతో ఇంటి దారి పట్టడం, మరొక విభాగంలో ఉద్యోగులు స్వేచ్ఛగా రాజకీయాలను విమర్శించడం, ఇంకొక విభాగంలో ఉద్యోగినులు తమవైన ప్రత్యేక బాధలను ఏకరు పెట్టుకోవడం, మరొక విభాగంలో గృహిణులు తమ బాధలు తమలో తాము చెప్పుకుంటూ నిష్క్రమించడం ఉంటుంది. చివరి విభాగంగా


'పార్క్ అంటే భిన్న జనాల ఆకుపచ్చని ఒడి కదా
బతుకు ప్రయాణంలోని
గాయాల రాళ్ళకు లేపనం
పూసుకునే విశ్రాంతి తీరం కదా'

అని పార్క్‌కి తనదైన నిర్వచనం ఇచ్చి కవితను ముగించడం ఈ కవి ప్లాన్. ఈ ప్రణాళిక కవి కాన్షియస్‌గా వేసుకుని ఉండవచ్చు లేదా అన్కాన్షియస్‌గా ఈ శైలి కవికి అలవడి ఉండవచ్చు. వర్తమానపు వచన కవిత్వానికి కవి తనకు తాను నిర్మించుకున్న బయటికి కనిపించని సొంత ఛంబస్సు ఒకటి ఉంటుందని చెప్పవచ్చు. ఆ ఛంబస్సులో ఒక శక్తివంతమైన కవిత ఇలా బయటికి వస్తుంది. ఈ కవితలో 'చైతన్య ముఖ నీరసుడు' అంటూ ఒక వింత బహువ్రీహిని ఉపయోగిస్తాడు కవి. అలాగే ప్రియుడి రాక కోసం ఎదురుచూస్తున్న ఒక ప్రేయసి గురించి చెబుతూ ఒక మనోహరమైన భావ చిత్రాన్ని సృష్టిస్తాడు.

'ముఖానికి నల్లని మబ్బులని
కప్పుకున్న ఓ చంద్రబింబం
ఓ మూల మునివేళ్ళను
ఆలోచనలను చేసి
కొరుకుతున్న పెదాలతో
రెండు కాళ్ల పెట్రోలు గుర్రం మూసుకొచ్చే
కలల రాకుమారునికై ఎదురు చూస్తుంటుంది'

అంటాడు. నిర్మాణ బిగి రీత్యా ఈ కవితను ఒక ఉదాహరణగా మనం ఈ సంపుటిలో నుంచి తీసుకోవచ్చు. పెంకుటిల్లులోని చాలా కవితలు దేనికదే తమదైన స్వంత శైలిని వస్తువును బట్టి ఏర్పరచుకోవడం కూడా గమనించవచ్చు. ఈ కవితలన్నింటిలో కూడా ఒక మనిషి మరొక మనిషితో చేసే ఆత్మీయమైన సంభాషణ లాంటి వాక్యాలు ఉండడం వచన కవిత్వ లక్షణం అని మనం భావిస్తూ ఉంటాం. కానీ కాంచనపల్లి ప్రాచీన కవిత్వ అధ్యయన ముద్ర అక్కడక్కడ కనిపిస్తూ ఉంటుంది. కొన్ని చోట్ల సమాసాలు చాలా సంస్కృతమయంగా అలవోకగా పడిపోతూ ఉండడం కూడా గమనించవచ్చు. 'చిరిగిపోతున్న కాగితం' అనే కవితలో 'అదృశ్య రక్తరేఖలు ద్రవీకరించిన అంతర్జాల విన్యాసాలలో" అంటాడు. 'వెలుగు మొక్క విరుస్తుంటే' అనే కవితలో 'మెదడుకు కమ్మిన నీలిమబ్బు వర్షాలు సముద్రిస్తుంది' అంటాడు. ఇక్కడ కమ్మడంను ఎక్కువ మంది వచన కవులు కమ్ముడంగా రాస్తారు. అలాగే సముద్రించడం అనే క్రియ కూడా భిన్నమైన ప్రయోగమే. ఇలాంటివి కాంచనపల్లి కవిత్వంలో చాలా చోట్ల కనిపిస్తూ ఉంటాయి.

ఈ కవితలన్నీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రాయబడ్డవే. అయినా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాసిన ఒకటి రెండు కవితలలో తెలంగాణ ఆవశ్యకత నొక్కి చెప్పబడ్డది. 2020 నుంచి విజృంభించిన కరోనా మీద సహజంగానే పెద్ద సంఖ్యలో కవితలు ఉన్నాయి. నాన్నపై రాసినది, వట్టికోటపై, సినారెపై, సైనికుడిపై, సెవెన్ సీటర్ ఆటో డ్రైవర్ పై, కలర్ టీవీ మీద, కుందెన మీద, ప్రయివేటైజేషన్ కాలంలో వెలవెలబోతున్న పెద్దబడి మీద, వాలు కుర్చీ మీద రాసినవి వేటికవే చర్చించదగ్గంత మంచి అభివ్యక్తులున్న కవితలు. కొన్నింటిలో అంతర్గత సంఘర్షణ ఏదో బలంగా ఉండి కొందరు వ్యక్తులని లక్ష్యంగా పెట్టుకొని రాసినట్టుగా కూడా కనిపిస్తాయి.



కాంచనపల్లి ప్రాచీన కవిత్వ అధ్యయన ముద్ర అక్కడక్కడ కనిపిస్తూ ఉంటుంది. కొన్ని చోట్ల సమాసాలు చాలా సంస్కృతమయంగా అలవోకగా పడిపోతూ ఉండడం కూడా గమనించవచ్చు. 'చిరిగిపోతున్న కాగితం' అనే కవితలో 'అదృశ్య రక్తరేఖలు ద్రవీకరించిన అంతర్జాల విన్యాసాలలో" అంటాడు. 'వెలుగు మొక్క విరుస్తుంటే' అనే కవితలో 'మెదడుకు కమ్మిన నీలిమబ్బు వర్షాలు సముద్రిస్తుంది' అంటాడు. ఇక్కడ కమ్మడంను ఎక్కువ మంది వచన కవులు కమ్ముడంగా రాస్తారు. అలాగే సముద్రించడం అనే క్రియ కూడా భిన్నమైన ప్రయోగమే. ఇలాంటివి కాంచనపల్లి కవిత్వంలో చాలా చోట్ల కనిపిస్తూ ఉంటాయి.

మొదలే చెప్పుకున్నట్టు కాంచనపల్లి ఇష్టపడి వచనం రాస్తున్న వ్యక్తి. వచనం మాత్రమే రాయగలిగిన కవి కాదు. అందువల్ల ఆయన అభివ్యక్తిలో చర్చించదగ్గ సొబగులు చాలా ఉన్నాయి. కవి చనిపోయాక బతుకుతాడు అనే అర్థంతో రాసిన కవితలో

'భూమితో రమించి మబ్బులు
ఆకుపచ్చగా మొలకెత్తడం లేదు'

అనడం కొత్త ఊహ. అలాగే కవితను ముగిస్తూ 'బతుకుతూ చనిపోయేవాడు చనిపోయిన బతుకుతాడు' అనడం సమాజం కోసం వేదనామయ జీవితాన్ని అనుభవిస్తున్న కవి జీవిత కాలంలో supress చేయబడ్డా, తర్వాతనైనా అతని చరిత్ర నిలబడే ఉంటుంది అనే అర్థంలో పాఠకుడు చాలా సులభంగా స్వీకరించగలిగేటట్టు చెప్పాడు కవి.

'దూడలను ఇంగ్లీషు
మీడియం ప్రయివేట్ కబేలాలకు
బలవంతంగా తరలిస్తున్నప్పుడు
ఆవు తల్లి లాంటి
ఆ పెద్ద బడి
ఎంత దుఃఖాగ్ని ప్రవేశం చేస్తుందో'

అన్నప్పుడు

'దేశం తెల్లకాగితమై
దోర్ ముందు వాలుతుంది'

అని దినపత్రికకు ప్రతీకలను వాడినప్పుడు, నగరంలోని ఇరుకు గదిలో జీవితం గురించి చెబుతూ

'జీవితం నది
ఆ నాలుగు గోడల మధ్య
చిత్రంగా ప్రవహించేది'

ఊహాశక్తి ప్రకటనయే కవిత్వం అంటాడు హాజ్ లిట్. కాంచనపల్లి కవిత్వంలో చాలా కొత్త ఊహలు ఉంటాయి. సెవెన్ సీటర్ ఆటోను రూపాంతరం చెందిన ఎడ్లబండి అంటాడు. తన ఇద్దరు కూతుర్లు పెద్దవాళ్ళై విదేశాలకు వెళ్ళిపోయినప్పుడు వాళ్లను 'రెక్కలు మొలిచిన రెండు పావురాలు'అని సంకేతిస్తాడు. చిన్న కూతురు వేకువకు కూతురు పుట్టినప్పుడు 'వేకువ...మరో వేకువ' అనడంలో మంచి ధ్వని కూడా ఉంది.

'నేనెందుకు కవిత్వం రాస్తున్నాను?' అనే ప్రశ్న వేసుకుని 'సామాజికతే లక్ష్యం. ప్రజలే ఇస్తటిక్స్. బాధలో నన్ను, నాలో బాధను అక్షరించడమే మార్గం' అని కాంచనపల్లి చెప్పుకున్న జవాబు సగటు కవులకు వర్తించి తీరేది కూడా.

ఆశ్రమ కుంజ్

సరిగ్గా నలభై ఏళ్ళు వెనక్కి వెళ్ళి
కలకత్తా చేరితే ఇరవై మూడేళ్ళ వయసును
హుషారుగా ధరించి దరిదాపు బెంగాలీ ఛాయతో
ఆ తెలుగు కుర్రాడగుపడ్డాడు యాత్రానేత్రాలతో-

ఇంటర్ లో పరిచయమైన 'గోరా' తలపో
Where the mind is without fear పిలుపో
బెంగాల్ సహవాసంలో దర్శన కుతూహలమో
'ఎక్ల చాలో ఎక్ల చాలో ఎక్ల చాలే రే' గీతమో
ఏది కదిపిందో గానీ
అతనొక ఆదివారం ఉదయాన ఇద్దరు మిత్రులతో
కాంచనగంగా రైలూ
గుర్రపు బగ్గీ సాయంతో
గీతాంజలి స్వప్నవాటికను
చేరుకున్నాడు



నాలుగడుగులు నడిచాడో లేదో
అతనికి
ఒక డెబ్బయేళ్ళతను
తెలుపు అనుభవపు వెలుగుతో కనిపించాడు
చేతుల ప్రేమతో ఓ తోట కంచెను సరిచేస్తూ-

రవీంద్రుని సన్నిధిలో చిన్న నాట మెదిలిన
ధన్యత తనదని మెత్తని జ్ఞాపకం నవ్వుతో
పరిచయం చేసుకున్నాడు.
పేరు- షుకుమాయ్ మిత్రా-
ఆ కుర్రాడినీ అతడి మిత్రులనీ
ఆప్యాయంగా తోడ్కొని
పరిపక్వమైన చూపుతో
కొంచెం నెమ్మది నడకతో
శాంతినికేతన్ ప్రాచీన ఛాయలలో
కలియతిప్పుతూ
రవీంద్రుని పాదజాడల దారులనూ రాగాలనూ
కళాస్థలాలనూ చిత్ర రేఖలనూ
తన్మయానందంతో
చూపాడు నిదానంగా.

మాటల కాంతిని జోడిస్తూ-

ఓ వైపు స్మృతివనంలా వున్న చెట్ల విడిదికి
తీసుకెళ్ళాడు- అది 'ఆశ్రమ కుంజ్' !
దాని నీడల్లో చదువులు పాదుకున్నాయని
అక్కడే టాగూర్ కవితలనూ పూయించాడని
తెలుసుకున్న కుర్రాడు ఉత్తేజ చిత్తుడై
అక్కడే ఒక చెట్టు నీడలో
విధేయ విద్యార్థిలా ధ్యానిలా కూర్చుని
అప్పటికప్పుడు ఒక కవితనల్లి మురిపెంగా
దానికి 'మామిడి తోపు' అనే మకుటాన్నిచ్చాడు

లేకా వున్నట్లున్న రవీంద్రుడు తనకొసగిన కానుకే
ఆ కవిత అని కుర్రాడనుకున్నాడు
ఆ అమృతవేళలో!
ఆ తర్వాత కూడా అనేక వేళల్లో!

సజలకాంతుల షుకుమాయ్ మిత్రాకు
వందన పుష్పాలనందజేసి
అతని కరస్పర్శనూ పొంది
మరి కాసేపు ఆ శాంతిగీతాల నెలవులో తిరిగి
ఆ కుర్రాడు మిత్రులతో వెనుదిరిగాడు
పాదాలకందిన ప్రాచీన గ్రంథాల స్పర్శానుభూతితో
రవీంద్రుడినే కలిసినంత లలితానందంతో!

ఆ పిదప పెద్దవాడవుతూ అవుతూ ఎక్కడెక్కడో
కూర్చుని కవితలను కూర్చుకున్న ప్రతి వేళలోనూ
అతనికి
మామిడి తోపు నీడలో కూర్చుని
రాసుకున్న కుర్రాడు
గురుతుకొస్తూనే వున్నాడు అప్రయత్నంగా!

(నాడు శాంతినికేతన్‌లో నాతో పాటు పర్యటించిన మిత్రులు మహదేవశాస్త్రికీ, మల్లికార్జున రెడ్డికీ)

- దర్భశయనం శ్రీనివాసాచార్య,
94404 19039

పాటల పవనం

పల్లవి పల్లకిని ఎక్కి
చరణాల చేతులు పట్టుకొని
చామనపెల్లి నుండి
ఒక సుగంధం బయలుదేరేది

తెల్లని లాల్చి, పైజామా
మల్లె పువ్వులను మూటగట్టుకు వచ్చేది

నల్లని కోటు మేఘాల్లో దాగిన
మృదంగ ధ్వానాలను కిందికి దించేది

కంజెర ఆయన కలువ పిల్లలు
ఒకరిని విడిచి ఒకరుండరు

ప్రశాంతంగానే పెదవులు విప్పి
పరాకాష్టకు చేరేవాడు

ఎన్నీల ఏరువాకను
కన్నుల కొలనుల్లో పూయించిన
కలువల రేడు

అవకాశం ఇస్తేనే
వేదికకు వేడుక చేసేవాడు
గొంతు తంత్రులకు
గోరుముద్దలు పెట్టేవాడు

ఆలాపనలు ఎద ఎదలో దాగిన
ఎత్తు పల్లాల గుట్టు విప్పేవి

కంచు కంఠం కమనీయ రూపం
కాలి బూడిదయినవేళ కన్నీటి వీడ్కోలు

(యువకవి, గాయకుడు
రావుల పవన్ స్మృతిలో)

- కందుకూరి అంజయ్య

గుండెగనిలో బొగ్గుపెళ్లల రాపిడి.. నల్లబంగారం కథలు

సన్నివేశాల, సందర్భాల సీన్ రీకనస్ట్రక్షన్ ఇది.. జీవగర్రను దొరకబట్టి కూలిపోయిన కాల, ప్రాంతాల పునర్ నిర్మాణ క్రతువు. గుండెబావిలో ఊరుతున్న ఊరినీటి తోడివేత.. తుర్రుమన్న బాల్యం పిట్ట రెక్కలకై వెదకులాట ఇది. వీధి, బడి, గుడి ఎక్కడ ఏముండేవో అమ్మ, నాన్న, స్నేహితులు, బంధువులు, ఇరుగు పొరుగు ఎక్కడ ఎవరుండేవారో ఆ డాక్యుమెంటరీ కోసం సెట్ చేసుకున్న మినియేచర్ సెట్, నిర్మాణ బ్లూ ప్రింట్.. స్వర్ణ కిలారి కథల తాజా సంపుటి 'నల్ల బంగారం' లోని కథలు ఇవి.

స్వర్ణానిది ధగధగ వర్ణం. ఈ కథలు మాత్రం నల్లబంగారం. నలుపు నిరసనో, విషాదమో కాదు చిక్కదనపు నాణ్యతా దర్పణం. పదమూడు కథల గుచ్ఛం నల్ల బంగారం కథలు. గతన్ని పాదముద్రగా బహుకరించే నల్లనేల యాదులివి, గుండె తెల్ల కాయితమ్మీద యాదుల్ని అచ్చొత్తే కాలరీ కార్బన్ ఇది. బజిలీ కూతల సింగరేణి కోయిలలు కదా ఈకథలు..

బొగ్గు గనులు, తదితర సింగరేణి కి సంబంధించి తవ్వి తీసిన బొగ్గు రాశులంతటి సాహిత్యాన్ని గతంలో మనం అనేకం చదువుకున్నాం, సింగరేణి నేపథ్యంగా ఎర్రజెండాల ఉద్యమాలు చీకటి సూర్యుల పోరాటాలు, నినాదాలు, బృందగానాలు చూశాం. కానీ ఈ కథలు అందుకు భిన్నమైనవి. 'నా బాల్యం నా తియ్యని మిఠాయి పొట్లం' అనే రచయిత్రి స్మృతుల కోణంలోనివి ఈ రాతలు. సింగరేణికి చెందినవే అయినప్పటికీ.. మానవ సంబంధాలు పెనవేసిన ఈ కథలు కాలరీస్‌కు ఆత్మీయ హారాలు.

కమ్మనైన అనుబంధాలు, పూ లతల్లా అల్లుకున్న ఆప్యాయతలు, కోపాలు, అలకలు, బుజ్జగింపులు.. స్నేహాలు.. ఈ కథలు.. సైకిల్ ఎక్కి వచ్చే నాన్న కోసం గుండె కిటికీ నుంచి ఎదురుచూసే కూతుర్లు.. ఆడపిల్లల్ని మనసు గూటిలో పొదుముకునే మమకారపు తండ్రి. ప్రేమను పంచుతూనే క్రమశిక్షణకు ప్రాధాన్యమిచ్చే తల్లి.. యంత్ర భూతాల కోరలు తోమే కార్మికులు, దినదిన గండం లాంటి బొగ్గుబాయి బతుకులు.. ఇళ్ళముందు అగ్గి బకెట్లు.. గాలికీ గని వాసన.. బట్వాడాలనాడు, బత్యాల నాడు బోనస్‌ల నాడు ఉగ్రూతలూగే ఊరు.. సమస్త వ్యాపారాలనూ బతికించే శ్రామిక త్యాగాలు.. ఉత్సవాలు.. పండుగలు, పబ్బాలు.. మొక్కులు.. కొత్తగూడెం కథ కొత్తదేం కాదు.. పక్కా తెలంగాణ పద మాధుర్యం.. బతుకమ్మ, బోనాల సంస్కృతి సౌందర్యం.. పాత కొత్తగూడెం ఓ విరోధ బాస..

గతం ఎన్నటికీ చావదు.. కానీ గతం చంపేసిన అవ్వాటి మాటేమిటి.. చావు కాలానికీ రావొచ్చు. చంపబడటం ప్రాంతానికీ కావొచ్చు. ఇది అబివృద్ధి చంపేసిన ఊరి యాదుల పరితాపాం. కాలం మింగేసిన బాల్యాన్ని తలచుకొనే మనాదుల విలాపం. చచ్చాక సమాధి చేస్తారు కానీ ఇక్కడ సమాధి తీసి చంపేశారు. సమాధులను వెలికి తీస్తే అస్తిపంజరాలు బయల్పడతాయి. ఇక్కడ మట్టిగుట్టల అడుగుల్లో కాలం కంకాలాలు. గతం అస్థి పంజరాలు. ప్రత్యేక చరిత్ర సంస్కృతి, రంగు, రూపు, యాసల అవశేషాలు.



కంచర్ల శ్రీనివాస్
9640311380

బొందలో పూడ్చితే సమాధి చేసినట్టు కానీ ఇక్కడ బొందతోడితే సమాధి అయ్యింది. ఊరికి ఊరంత సమాధి. నల్లమట్టి మీద అడుగు.. నేల నెమలిపించమై వెలుగు..

సింగరేణి పుట్టిల్లు ఇల్లెందు నల్ల మట్టిమీద నడిచిన లేత పాదం నాది.. బొగ్గు బావి జీతాలు, జీవితాలు. నాకు తెలుసు.. మరో వంక కథా ప్రాంతాలు పాత కొత్తగూడెం, పెనగడప, రామవరం, నైన్ ఇంక్లైన ప్రాంతాల్లో బంధుత్వాల వల్ల స్థానిక జీవనంతో పరిచయాలున్నాయి.

ద పాస్ట్ ఈజ్ ఎ ప్లేస్ ఆఫ్ లెర్నింగ్. నాట్ ఎ ప్లేస్ ఆఫ్ లివింగ్... గతం నుంచి నేర్చుకోవాలి, గతంలోనే జీవించొద్దు అని ఈ కొటేషన్ హితోక్తి. గతంలో నివసించటం కాదు కానీ గతంలో నివసించిన నేల వియోగ పరితాపం ఈ కథలు. గతం మింగేసిన బంగారు బాల్యపు నోస్టాల్జియా. జీవగర్రకై వెదకులాట.

ఈకథలు వేటికవే అయినా వీటిలోని ఆత్మకథనాత్మకథ దృష్ట్యా, చాలా కథల్లో పాత్రలు పునరావృతం అయ్యాయి. కొన్ని కథల్లో మాత్రం పాత్రలు కొత్తపేర్లు తొడుక్కోవటం.. ఎత్తుగడో, లేక ఇతరుల కథలనో..

జరిగిపోయిన సందర్భాలను కథ కట్టి తన పని పూర్తయ్యిందనిపించటం కాక కొన్ని కథల ద్వారా సమస్యలపై చర్చపెట్టటం ఫలితాలు సాధించటం ఈ కథల ప్రయోజనం.


ముగ్గురు ఆడపిల్లలు గల మధ్యతరగతి కార్మికుడైన తండ్రి, ఆ కుటుంబంలో సంతోషాలు, సంతృప్తులు, పండుగలు, ఆనందాలు.. ఇబ్బందులు, సమస్యలు, వాటిని అధిగమించడాలు.

'జీవగర్ర పుల్ల' కథ రచయిత్రి గుండె గాయానికి సంకేతం.. కులం మతం దేవుడు ఏదీ నిజం కాదు చావొక్కటే సత్యం అన్న ఫిలాసఫీ.. కని పెంచి పెద్ద చేసిన అమ్మను దక్కించుకోవాలనుకునే ఆరాటం. ఆ కన్నీళ్ళకు కారణం ఏమిటో కథ చదివితే తెలుస్తుంది.

'ఓపెన్ కాస్ట్ సర్జరీ'లో ఊరు మాయమైన ఉమ్మడి దుఖం. ఆనవాళ్లు దక్కని అపురూప జ్ఞాపకాలకై వెదకులాట. ఓపెన్ కాస్టు కోసం ఊరిని కబళించిన కష్టానికి కన్నీళ్ళు కార్చటం.

'మాఫ్ కరో దోస్త్' కథలో స్నేహితురాలి ఆతిథ్యాన్ని ఆస్వాదించలేని తనం.. పేద స్థితిని ఇంటి పరిసరాలతో పోలిక పెట్టి పశ్చాత్తాప ప్రకటన.. నిజాయితీ ఒప్పుకోలు..

'నల్ల బంగారం' టైటిల్ కథలో తండ్రీ కూతుర్ల అనురాగం ఆప్యాయత.. ఆడపిల్ల పట్ల తల్లి బాధ్యత.. కనిపిస్తుంది.. బొగ్గు బావుల్లో జరిగే ప్రమాదాలు కుటుంబాలు తల్లడిల్లి పోవటం... కనిపిస్తుంది.. మొత్తంగా సింగరేణి బతుకును కళ్ళకు కట్టే కథ ఇది..



'దో పెహ్ లే ప్రేం పత్ర్' కథలో స్కూల్ రోజుల్లో తెలిసీ తెలియని విరిసీ విరియని కాలం నాటి ప్రేమ భావనలు.. వాటి తాలూకు భయాలు, అనుభవాలు అలుముకున్నాయి..

కథల నిండా రాపిడి భావాల సంఘర్షణ.. అంతర్మథనం.. తండ్రికి ప్రమాదం జరగకుండా ఉంటే బాగుండు అని, తల్లిని కాపాడుకిఉంటే బావుండు అని.. పొరుగింటి కబంధ హస్తాలకు చిక్కకుండా ఉండాలని, స్నేహితురాలి మనసు నొప్పించకుండా ఉండాల్సిందని. జరిగిన సంఘటనలకు సందర్భాలకు అందంగా వాక్యాలు కట్టటమే.. ఫిక్షన్ జోడిస్తే నిజాయితీ ఉండదు.. కనుక శిల్ప పరిధిని దాటి అందమైన కథలివి. కథలకు వాడిన తెలంగాణ మాండలిక జీవభాష ప్రధాన ఆయువు పట్టు..

ఐదేండ్లలో పాలమూరు సమగ్రాభివృద్ధి

- భూసేకరణ చట్టాన్ని తుంగలో తొక్కిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం
- విద్యుత్ శాఖలో అత్యవసర సమస్యల పరిష్కారం కోసం 1912 నెంబర్ : నాగర్‌కర్నూల్ జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

రూ. లక్ష కోట్లు ఖర్చు చేస్తాం **12 లక్షల ఎకరాలకు నీళ్లు పారిస్తాం**



నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి /తిమ్మాజిపేట/ బిజినపల్లి

పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఐదేండ్లలో పాలమూరును సమగ్రాభివృద్ధి చేస్తామని, ఇందుకోసం రూ. లక్ష కోట్లు ఖర్చు చేస్తామన్నారు. ఆదివారం మల్లు భట్టి విక్రమార్క నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటించి సుమారు రూ. 89.41 కోట్ల నిధులతో మార్కండేయ ఎత్తిపోతల పథకం ప్రారంభం, ఐదు విద్యుత్ ఉపకేంద్రాల శంకుస్థాపనలు చేశారు.

డిప్యూటీ సీఎంకు జిల్లా ముఖద్వారం వద్ద నాగర్‌కర్నూలు ఎమ్మెల్యే కూచికుల్ల రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. తిమ్మాజిపేట, మరికల్ గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. పొదిరెడ్డిపల్లిలో విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లాకు తాగు, సాగు నీరు అందించటం కోసం కృష్ణా నదిలో ఉన్న ప్రతి నీటి చుక్కనూ వినియోగించుకోవడానికి ఎంత ఖర్చు చేయడానికైనా ప్రజా ప్రభుత్వం వెనుకాడదన్నారు. రూ. 38వేల కోట్లతో మొదలుపెట్టిన పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. భూసేకరణ చట్టాన్ని తుంగలో తొక్కి నిర్వాసితులకు అన్యాయం చేసిందన్నారు. భూసేకరణ నిధులను ప్రాధాన్యత క్రమంలో నిర్వాసితులకు తమ ప్రభుత్వం విడుదల చేస్తుందని తెలిపారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీని అమలు చేస్తామన్నారు. తమ ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి 12 లక్షల ఎకరాలకు నీళ్లు పారిస్తుందని చెప్పారు.

మహిళలకు ఐదేండ్లలో లక్షకోట్లు వడ్డీ లేని రుణాలను అందిస్తామన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలోని ఉమామహేశ్వర, చేన్న కేశవ ఎత్తిపోతల ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పారు. రైతు భరోసా పెట్టుబడి పదివేల నుంచి 12 వేలకు పెంచుతూ రైతులకు అందించబోతున్నట్టు తెలిపారు. భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఏడాదికి 12 వేల రూపాయలు ఇచ్చే కార్యక్రమం ఈనెల 26 నుంచి మొదలు కాబోతుందని చెప్పారు.

విద్యుత్ శాఖలో అత్యవసర సమస్యల పరిష్కారం కోసం 1912 నెంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. సంక్రాంతి పండుగ తర్వాత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి పేదలకు 5 లక్షల రూపాయలు ఇవ్వబోతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు కూచుకుల రాజేష్ రెడ్డి, వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ వైభవ్, విద్యుత్ సీఎండీ ముషారఫ్ అలీ, మండల అధ్యక్షులు వెంకటరామిరెడ్డి నాయకులు శ్రీనివాస్ బహదూర్, రవీందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ముబారక్, వివేక్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

తిమ్మాజీపేట మండలం పోతిరెడ్డిపల్లిలో రూ.3.45 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కె.వి విద్యుత్ ఉపకేంద్రానికి ఉప ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. బిజినపల్లి మండలం పాలెం గ్రామంలో 2.32 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కె.వి విద్యుత్ సబ్ స్టేషన్, ఉప విద్యుత్ కేంద్రం పనులకు శంకుస్థాపన నిర్వహించారు. బిజినపల్లి మండలంలోని శాయంపల్లి గ్రామం వద్ద 18 గిరిజన తండాలు, 5 గ్రామాల్లోని 7,310 ఎకరాల ఆయకట్టుకు సాగునీటితో పాటు ఆయా గ్రామాలకు తాగునీరు అందించేందుకు రూ.76.26 కోట్లతో నూతనంగా నిర్మించిన మార్కండేయ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు.

పార్టీలువేరైనా రాష్ట్ర ప్రయోజనాలే మిన్న



(మొదటిపేజీ తరువాయి)

బండి సంజయ్‌కుమార్, రాష్ట్రమంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, సీనియర్ జర్నలిస్ట్ కే రామచంద్రమూర్తి, ఎమ్మెస్కో ప్రచురణ సంస్థ అధినేత విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర ఎంపీలు, ఎమ్మెల్యేలు సహా రాజకీయపార్టీల పాతతరం నాయకులు పలువురు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ అధికార, ప్రతిపక్ష నేతల మధ్య ఈ తరహా కార్యక్రమాలు విరివిగా జరగాలని ఆకాంక్షిస్తూ పుస్తక రచయిత చెన్నమనేని విద్యాసాగరరావును ప్రత్యేకంగా అభినందించారు. తన 35 ఏండ్ల రాజకీయ జీవితంలో ఆదర్శంగా తీసుకున్న నాయకులందర్నీ ఒకే వేదిక మీద కలిసే అవకాశం కలిగిందని సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుత రాజకీయాల్లో కార్పొరేటర్‌గా గెలిస్తేనే వివిధ ఆరోపణలు ఎదుర్కోవడం సర్వసాధారణంగా మారిందనీ, కానీ ఐదు దశాబ్దాలు రాజకీయ జీవితం గడిపిన విద్యాసాగరరావు ఎలాంటి మరక లేకుండా ఆదర్శవంతంగా ప్రజలకు చేరువ అయ్యారని ప్రశంసించారు. ఉస్మానియా యూనివర్సిటీ రాజకీయాల్లో జార్జిరెడ్డి, విద్యాసాగర్‌రావు నమ్మిన సిద్ధాంతం కోసం గట్టిగా నిలబడ్డారనీ, కానీ ప్రస్తుతం ఆ యూనివర్సిటీలు ఉనికి కోల్పోయేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. యూనివర్సిటీల్లో విద్యార్థులు రాజకీయాల్లో ఉండటం అవసరమని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో యూనివర్సిటీ విద్యార్థులు ముందుండి పోరాటాలు చేశారనీ, వారు రాజకీయాల్లో క్రియాశీలంగా ఉండాలని తాను కోరుకుంటానని చెప్పారు. అక్కడి నుంచే రాష్ట్ర నేతలు ఎన్నిక కావాలనీ, అప్పుడే సమర్థవంతమైన నాయకత్వం వస్తుందని అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లో సిద్ధాంతపరమైన భావజాలం లేకపోవడం వల్లే నేడు పార్టీ ఫిరాయింపులు జరుగుతున్నాయని అన్నారు. కేవలం ఏదో ఒక పదవి కోసం పార్టీలు మారుతున్నారనీ, దీనిపై తానింతకు మించి మాట్లాడటం సముచితం కాదని తెలిపారు. విద్యార్థి దశలో సిద్ధాంతపరమైన రాజకీయాలు చేస్తేనే పార్టీలకు కట్టుబడి ఉంటారనీ, రాష్ట్రంలో ఆ తరహా రాజకీయాలను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం అంటే ప్రతిపక్షం, పాలక పక్షం కాదనీ, 119 మంది ఎమ్మెల్యేలు కలిస్తేనే ప్రభుత్వమని వివరణ ఇచ్చారు. ప్రభుత్వంలోని లోపాలను ఎత్తి చూపించడం ప్రతిపక్షం ప్రధాన పాత్ర అనీ, కానీ కాల క్రమంలో ప్రజాస్వామ్య స్ఫూర్తిని కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ, పార్లమెంటులో పాలక పక్షానికి, ప్రతిపక్షానికి మధ్య ప్రతిష్టంభన ఏర్పడినప్పుడు కమ్యూనిస్టులు, బీజేపీ, ఇతర పార్టీల నాయకులు జోక్యం చేసుకొని సలహాలు, సూచనలు ఇస్తూ, సభా సాంప్రదాయాలను కొనసాగించేవారని గుర్తుచేసుకున్నారు. తమ ప్రభుత్వం ఇప్పుడు ఆ స్ఫూర్తితోనే పనిచేస్తుందనీ, 13 నెలల్లో ఇప్పటి వరకు అసెంబ్లీ నుంచి ప్రతిపక్ష సభ్యుల్లో ఏ ఒక్కరినీ బహిష్కరించలేదని చెప్పారు. గోదావరి జలాల కోసం అప్పట్లో సీహెచ్ విద్యాసాగరరావు పాదయాత్ర చేశారనీ, దానికి కొనసాగింపుగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్టును తీసుకువచ్చారని ఉదహరించారు. అయితే గోదావరి జలాల వినియోగం ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదనీ, వాటిని సాధించేందుకు మహారాష్ట్ర గవర్నర్‌గా పనిచేసిన విద్యాసాగరరావు సలహాలు, సూచనలు తమకు ఎంతో అవసరమని అన్నారు. మహారాష్ట్రలో ముంపుకు గురయ్యే భూములకు సంబంధించి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడమని తానే గతంలో కోరానని గుర్తుచేశారు. తుమ్మిడి హెట్టి దగ్గర భూసేకరణ కోసం ఆయన సహకారాన్ని తీసుకుంటామని చెప్పారు. భేషజాలు లేకుండా, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ఎవరినైనా కలిసి, సహకారం తీసుకుంటానని స్పష్టంచేశారు. రాష్ట్రాన్ని ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తయారు చేయడం కోసం సహకరించాలని తాను ప్రధాని మోడీని కోరానని తెలిపారు. రాష్ట్రంలో 60 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తుందనీ, ఆ నగరం విశ్వనగరంగా మారాలంటే రీజినల్ రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రైల్ కావాలన్నారు. తెలంగాణకు తీర ప్రాంతం లేదు కాబట్టి డ్రైపోర్టు కావాలనీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీని త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉందనీ, తాము అమరావతితో పోటీ పడట్లేదనీ, న్యూయార్క్, టోక్యో వంటి ప్రపంచ నగరాలతో పోటీ పడతామని వివరించారు. దానికోసం మెట్రో రైల్‌కు అనుమతులు తెచ్చుకోవాల్సి ఉందన్నారు. తమిళనాడులో డీఎంకే ప్రభుత్వం ఉన్నా కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా ప్రధాని మోడీ మెట్రోరైళ్లకు సహకారాన్ని అందించారని గుర్తుచేశారు. ఈ విషయాల్లో ప్రధాని మోడీ, కేంద్ర ప్రభుత్వాన్ని ప్రభావితం చేయగలిగిన నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కేంద్ర మంత్రులు బండి సంజయ్, జీ కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత వినోద్‌కుమార్ వంటి నాయకులు పార్టీలకు అతీతంగా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. వచ్చే కేంద్ర మంత్రివర్గ సమావేశంలో హైదరాబాద్ మెట్రోకు అనుమతి ఇస్తే బాగుంటుందని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచడం కోసం 75 ఐటీఐలను ఐటీసీలు మారుస్తున్నామన్నారు. రూ.2,100 కోట్లతో టాటా సంస్థ యువతకు శిక్షణ, ఉపాధి కల్పించేందుకు ముందుకు వచ్చిందన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ కోసం వివిధ మార్గాల్లో రూ.600 కోట్ల కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేశామనీ, ఈ ఏడాది జూన్ రెండవ తేదీలోపు యూనివర్సిటీ భవన నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. 140 కోట్ల జనాభా ఉన్న భారతదేశం ఒలంపిక్స్‌లో పతకాలు తేలేకపోయిందనీ. 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ నుంచే బంగారు పతకాలు తేవడం ప్రారంభంకావాలని కోరుకుంటూ స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

కొండపోచమ్మ మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుంది

- మాజీ ఎంపీ వి.హనుమంతరావు



నవతెలంగాణ-మర్కుక్

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని కొండపోచమ్మ సాగర్‌లో శనివారం ముషీరాబాద్‌కు చెందిన ఐదుగురు యువకులు మృతి చెందిన సంఘటన విదితమే. ఆదివారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ హనుమంతరావు పోచమ్మ సాగర్ చేరుకొని యువకులు మృతి చెందిన సంఘటన స్థలాన్ని మార్కెట్ కమిటీ చైర్మెన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. కొండపోచమ్మ సాగర్‌పై గజ ఈతగాళ్లను, పోలీస్ సిబ్బందిని పర్మినెంట్‌గా నియమించాలని కోరారు. మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తుందని, ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు ర్యాకం యాదగిరి, దామరకుంట గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు పత్తి నర్సింలు యాదవ్, నాయకులు వనం అంజనేయులు, ఏఎంసీ డైరెక్టర్ యాదగిరి, నాయకులు అంజి,శంకర్ యాదవ్, తదితరులున్నారు.

గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

- పీఆర్టీయూటీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ, తెలంగాణ సాధారణ గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లో పీఆర్జీటీఏ అధ్యక్షులు వేంరెడ్డి దిలీప్‌రెడ్డి అధ్యక్షతన గురుకుల ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి గురుకులాల్లోని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చిస్తామని అన్నారు. ప్రధాన సమస్య అయిన పాఠశాలల పనివేళల మార్పుతోపాటు ఉపాధ్యాయులకు బోధనేతర పనులు లేకుండా అన్ని కాలేజీల్లో కేర్‌టేకర్లను నియమించే విధంగా ఉత్తర్వులను ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. తాను రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తూ 30 శాతం పీఆర్సీ, ఉద్యోగ విరమణ వయస్సును 61 ఏండ్లకు పెంపు జీవోతోపాటు ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలను జరిపించేందుకు కృషి చేశామని గుర్తు చేశారు. ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తే గురుకుల ఉపాధ్యాయులకు ఆరోగ్య కార్డులను అందించడంతోపాటు సీపీఎస్ విధానం రద్దు చేయిస్తానని చెప్పారు.

పీఆర్టీయూటీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు పీఆర్జీటీఏ మద్దతు

రాబోయే ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల్లో పీఆర్టీయూటీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, వంగ మహేందర్‌రెడ్డికి పీఆర్జీటీఏ మద్దతు ప్రకటించింది. మద్దతు లేఖను పీఆర్టీయూటీఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డికి పీఆర్జీటీఏ అధ్యక్షులు దిలీప్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్జీటీఏ ప్రధాన కార్యదర్శి నరేష్, ఉపాధ్యక్షులు వేణుప్రసాద్, కార్యదర్శి స్వప్న, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటికి తప్పిన ప్రమాదం

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఆదివారం ప్రమాదం తప్పింది. మంత్రి పొంగులేటి ప్రయాణిస్తున్న కారు రెండు టైర్లు పేలడంతో కారు ఒక్కసారిగా అదుపు తప్పింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. ఆదివారం సాయంత్రం వరంగల్ నుంచి ఖమ్మం వస్తుండగా తిరుమలాయపాలెం వద్ద ప్రమాదం జరిగింది. కారులో మంత్రి పొంగులేటితోపాటు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, డీసీసీబీ డైరెక్టర్లు బొర్రా రాజశేఖర్, తుళ్లూరి బ్రహ్మయ్య ఉన్నారు. అనంతరం ఆయన ఎస్కార్టు వాహనంలో ఖమ్మానికి చేరుకున్నారు. ప్రమాదం నుంచి బయటపడడంతో అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి, మంత్రులు క్షేమ సమాచారం తెలుసుకున్నారు.

భూమి లేకుండా పాస్ బుక్‌లున్న రైతుల్ని గుర్తించాలి

- సేద్యానికి యోగ్యమైన ప్రతి ఎకరానికి రైతు భరోసా : రాష్ట్ర శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి
- ఇందిరమ్మ రాజ్యంలో పేదవాని ఇంటి కల నెరవేరుతుంది : మంత్రి కోమటిరెడ్డి
- 26 నుంచి ప్రారంభం : ఇన్‌చార్జి మంత్రి తుమ్మల



నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి


సేద్యానికి యోగ్యమైన ప్రతి ఎకరానికి రైతు భరోసా కింద రూ.12000 ప్రభుత్వం అందజేస్తుందని రాష్ట్ర శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లోని ఉదయ్ ఆదిత్యభవన్‌లో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు మంజూరుపై ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అధికారులు, శాసన సభ్యులతో సమీక్షా సమావేశం జరిగింది. దీనికి శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు , భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ భూమి లేకుండా చాలా మందికి పాస్‌బుక్‌లు మంజూరు చేశారని, వాటిని అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి వారిని రైతుభరోసా నుండి తొలగించాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా భూమిలేని కూలీలకు సంవత్సరానికి 12000 రూపాయలు ప్రభుత్వం ఇస్తుందని, లబ్దిదారులను అధికారులు జాగ్రత్తగా గుర్తించాలని సూచించారు. అర్హులకు మాత్రమే నూతన కార్డులు జారీ చేయాలలన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రభుత్వంలో ప్రజలవద్దకే పాలన తీసుకొచ్చామన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదల సంక్షేమం, అభివద్ధి చేయడమే మొదటి ధ్యేయమన్నారు. ప్రతి సంవత్సరం నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు చేసి పేద వారి ఇంటికల నెరవేరుస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ముగ్గురు కలెక్టర్లు బాగా పనిచేస్తున్నారని, వారికి అధికారులు సహకరించి పేదల సంక్షేమం కోసం ఏ ఒక్క అర్హున్ని వదలకుండా అన్ని పథకాలు అందేలా చూడాలన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ఒక్క సంవత్సరం కాలంలోనే 40 వేల కోట్ల రూపాయలతో రైతు సంక్షేమం చేపట్టామన్నారు. జనవరి 26 నుండి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డులు మంజూరు లాంటి పథకాలను ప్రారంభించబోతున్నట్టు తెలిపారు. భూమి లేని వారిని, భూ సేకరణ చేసిన భూములను, గుట్టలను, లేఔట్లను, నాలా కన్వర్షన్ చేసిన భూములను గుర్తించి వారి పేర్లను రైతు భరోసా పథకం నుండి తొలగించాలన్నారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాలున్న రైతులకూ రైతు భరోసా ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, శాసన సభ్యులు బాలూనాయక్, పద్మావతిరెడ్డి, వేముల వీరేశం, మందులసామేలు, జయవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి, యాదాద్రి భువనగిరి కలెక్టర్ హన్మంతరావు, సూర్యాపేట కలెక్టర్ తేజస్ నంద్ లాల్‌పవార్, సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్, ఉమ్మడి జిల్లా అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీలార్లు, వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమాఖ్యవాదానికి దెబ్బే

ఇదంతా మోడీ నియంతృత్వ పోకడల్లో భాగం

'ఒకే దేశం-ఒకే ఎన్నిక'పై రాజకీయ విశ్లేషకులు, మేధావులు

డబ్బును ఆదా చేయదు.. జీడీపీని మెరుగుపర్చదు



బీజేపీ వాదనలన్నీ వట్టి మాటలే

న్యూఢిల్లీ : దేశంలో వివాదాస్పద జమిలీ ఎన్నికలపై మోడీ సర్కారు ప్రత్యేక దృష్టిని సారించింది. తామనుకున్న 'ఒకే దేశం, ఒకే ఎన్నిక'ను ఎలాగైనా అమలు చేయాలని చూస్తున్నది. ఇందులో భాగంగా గత పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో దీనికి సంబంధించిన బిల్లును అనూహ్యంగా సభలోకి తీసుకొచ్చింది. దీనిపై కాంగ్రెస్, సీపీఐ(ఎం) సహా పలు ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. చివరకు, జమిలీ ఎన్నికలకు సంబంధించిన బిల్లులు జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి వెళ్లాయి. ఇటీవలే జేపీసీ తొలి సమావేశం కూడా వాడీవేడిగా జరిగింది. ప్రతిపక్ష సభ్యులు 'ఒకేదేశం, ఒకే ఎన్నిక'ను వ్యతిరేకిస్తూ తమ అభిప్రాయాలు చెప్పారు. ఇది సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందన్నారు. అధికారిక ఎన్డీఏ పక్షం ఎంపీలు మాత్రం బిల్లులను సమర్థించారు.

జమిలీపై కేంద్రం ప్రధానంగా వినిపిస్తున్న మాట.. నిరంతర ఎన్నికలతో అభివృద్ధికి ఆటంకం, ఎన్నికల ఖర్చు. ఈ ఎన్నికల చక్రాన్ని నిరంతరం కాకుండా.. దేశమంతటా ఒకేసారి నిర్వహిస్తే భారత జీడీపీ కూడా మెరుగుపడే అవకాశమున్నదని బీజేపీ, దాని అనుబంధ సంఘాల నాయకులు, ఎన్డీఏలోని పార్టీలు వాదిస్తున్న మాట. అయితే, ఈ మాటలను మాత్రం రాజకీయ విశ్లేషకులు, నిపుణులు, మేధావులు కొట్టి పారేస్తున్నారు. జమిలీ ఎన్నికలతో అద్భుతాలేవీ జరగవని అంటున్నారు. బీజేపీ చెప్తున్నట్టుగా డబ్బును ఆదా చేయటం, జీడీపీని మెరుగుపర్చటం వంటిది జరగదని చెప్తున్నారు. పైగా దేశ సమాఖ్య విధానానికి ఇది విఘాతం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పలు దేశాల్లో చోటు చేసుకున్న నియంతృత్వ పోకడలను అనుసరించటానికి మోడీ ప్రయత్నిస్తున్నారని అంటున్నారు. ఇందులో భాగంగానే, లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు అనే ఒక వ్యూహాన్ని ఎంచుకున్నారని చెప్తున్నారు. ఈ ప్రతిపాదనను అమలుకు అవసరమైన రాజ్యాంగ సవరణలను సిఫారసు చేయడానికి భారత మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ చైర్మెన్‌గా ఒక కమిటీని నియమించారు. లోక్‌సభ ఎన్నికలకు చాలా ముందుగానే గత మార్చిలో ఇది నివేదికను సమర్పించిన విషయం విదితమే.

గత 18వ సార్వత్రిక ఎన్నికల్లో 'చార్‌సౌ పార్' నినాదంతో మోడీ ముందుకెళ్లారు. లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు గెలుచుకోవాలని మోడీ ప్రభుత్వం కలలు కంటున్న సమయంలో ఇది జరిగింది. ఏకకాల ఎన్నికలను ప్రవేశపెట్టడానికి కావాల్సిన రాజ్యాంగ సవరణలకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీ కంటే 400 సీట్లు అనేది ఎక్కువ. దాదాపు నాలుగింటా మూడో వంతు అన్నమాట. ఒకవేళ అదేగనక జరిగి ఉంటే, మోడీని దేశంలో తిరుగులేని ప్రధానిగా మార్చి ఉండేదనీ, జమిలీకి మార్గం సుమగమమయ్యేదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఇంతటి అఖండమైన మెజారిటీ లభించి ఉంటే, మోడీ-షా ద్వయానికి సంపూర్ణ అధికారాలు పొందేవారని అంటున్నారు. అయితే, మోడీకి చార్ సౌ పార్ నినాదం బెడిసి కొట్టటంతో జమిలీ అనే ప్రయత్నానికి స్పీడ్ బ్రేకులు పడ్డాయని చెప్తున్నారు.

2019లో లోక్‌సభ ఎన్నికల విజయం తర్వాత, బీజేపీ నాయకులు జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర విభజన, ఆర్టికల్ 370 రద్దు బిల్లు వంటి విషయాల్లో మోడీ సర్కారు ఏకపక్షంగా వ్యవహరించిన విధానాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ఆగస్టు 5, 2019న పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి 90 నిమిషాల ముందు కేంద్ర మంత్రివర్గానికి బిల్లుల గురించి సమాచారం అందింది. బిల్లుల గురించి నలుగురికి మాత్రమే తెలుసు. సీనియర్ మంత్రి అయిన రాజ్‌నాథ్ సింగ్‌కు కూడా అది తెలియకపోవటం గమనార్హం. ఎన్డీఏ మిత్రపక్షాలలో ఎవరికీ బిల్లుల గురించి తెలియదని జేడీ(యూ) నాయకుడు కె.సి. త్యాగి తెలిపారు. లోక్‌సభలోని 303 మంది ఎంపీల మద్దతుతో మోడీ-షా అత్యంత రహస్యంగా 'ఆపరేషన్ కాశ్మీర్' వంటి రాజకీయ సాహసాలను చేపట్టగలిగితే, '400 పార్'తో ఎన్డీఏ నియంతృత్వాన్ని అమలు చేసి ఉండేదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఎన్నికలలో ఎదురుదెబ్బ తగిలినప్పటికీ, మోడీ-షా ద్వయం కోవింద్ ప్యానెల్ నివేదికను ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నించటానికి కారణం.. అధికార దాహమేననీ, అధ్యక్ష తరహా విధానాన్ని తీసుకొచ్చే చర్యలో భాగమేనని అంటున్నారు. జమిలీ ఎన్నికలపై ఇప్పటికే పలు అనుమానాలు ఉన్నాయి. కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి సైతం ఇవే అనుమానాలను వ్యక్తం చేశారు. లోక్‌సభ, అసెంబ్లీలు రద్దయితే.. వాటి కాలాన్ని ఎలా సర్దుబాటు చేస్తారన్నదాని పైనా సందేహాలున్నాయి. ఇది ఒక అసాధారణ పరిస్థితిని సృష్టిస్తుందనీ, ప్రతిపక్ష ముఖ్యమంత్రులు, వారి ఎమ్మెల్యేలపై కేంద్రంలో ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆపరేషన్.. భవిష్యత్తులో కొనసాగే ప్రమాదమున్నదని హెచ్చరిస్తున్నారు. "ఏకకాల ఎన్నికల వల్ల మరొక తీవ్ర హానికరమైన పరిణామం ఉన్నది. రెండు సంవత్సరాల తర్వాత ఒక రాష్ట్ర ప్రభుత్వం పడిపోయినప్పుడు, ఎమ్మెల్యేలు మిగిలిన మూడు సంవత్సరాలు రద్దు, పదవిని కోల్పోకుండా ఉండటానికి తీవ్రంగా ప్రయత్నిస్తారు. ఫలితంగా, ఇది సామూహిక ఫిరాయింపులు, ఎమ్మెల్యేల కొనుగోళ్లకు దారి తీస్తుంది" అని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. "లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలు, 250,000 కంటే ఎక్కువ గ్రామ పంచాయతీలను ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి కలిపి ప్రచారం చేయడం వల్ల ప్రజాస్వామ్యం ప్రధానమంత్రిపై ప్రజాభిప్రాయ సేకరణగా మారుతుంది. ఇది సమాఖ్యవాదాన్ని బలహీనపరుస్తుంది. వ్యక్తిగత రాష్ట్రాల ప్రయోజనాలను ప్రధానమంత్రి ప్రయోజనాలతో సమానం చేస్తుంది" అని అంటున్నారు. ప్రతిపాదిత వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనేది ఎన్నికల హామీల నుంచి దృష్టిని మరల్చే చర్యగా అభివర్ణిస్తున్నారు.నిరంతర ఎన్నికల ప్రక్రియ అనేది అభివృద్ధికి ఆటంకం కలిగిస్తుందన్న వాదన తప్పని అంటున్నారు. కొన్ని రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు జరిగినప్పుడు, ఎన్నికల సంఘం విధించే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) ఆ రాష్ట్రాలకే పరిమితం అవుతుంది. దేశంలోని మిగిలిన ప్రాంతాలు ప్రభుత్వ కార్యక్రమాలతో ముందుకు సాగవచ్చని విశ్లేషకులు చెప్తున్నారు.ఏకకాల ఎన్నికలను సమర్థించడంలో ఉన్న మరొక వాదన.. ఇది 'ఆర్థికంగా సమర్థవంతమైనది'. 2019 నుంచి ఐదేండ్లలో కేంద్రం చేసిన మొత్తం ఖర్చు రూ. 37.35 లక్షల కోట్లు. ఇందులో 0.09శాతం మాత్రమే ఎన్నికలకు వెచ్చించింది. ఇది 80 కేంద్ర పథకాలపై ఖర్చు చేసే దానికంటే చాలా తక్కువని గణాంకాలు చెప్తున్నాయి. ప్రజాస్వామ్య, సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తూ తీసుకొచ్చే ప్రక్రియే 'ఒకేదేశం-ఒకే ఎన్నిక' అని రాజకీయ విశ్లేషకులు, మేధావులు, నిపుణులు అంటున్నారు.

ప్రజలకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

భోగి మంటలు అందరి జీవితాల్లో భోగభాగ్యాలు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ తెలంగాణ ప్రజలకు, కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు భోగి, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంక్రాంతి ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు, ఆనందం నింపాలని ఆయన ఆకాంక్షించారు.

బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలి

- డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలో ఎంపీ ఆర్ కృష్ణయ్యకు బీసీటీఏ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీసీ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని బీసీటీఏ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం హైదరాబాద్‌లో బీసీటీఏ నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను ఎంపీ ఆర్ కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షులు కె కృష్ణుడు నేతృత్వంలో వినతిపత్రం సమర్పించారు. ఉన్నత చదువుల కోసం బీసీ ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవును మంజూరు చేయాలని కోరారు. క్రీమిలేయర్ విధానాన్ని ఎత్తేయాలని డిమాండ్ చేశారు. 317 జీవోలో స్థానికతకు అవకాశం లేకుండా గత ప్రభుత్వం ఉద్యోగులకు అన్యాయం చేసిందని తెలిపారు. స్థానికతను పరిగణనలోకి తీసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సూచించారు. 317 జీవోలో బీసీలకు ఉన్న రిజర్వేషన్‌ను అమలు చేయకుండా ఉద్యోగులు, ఉపాధ్యాయులను జిల్లాలకు కేటాయించడం వల్ల తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. స్థానికత, బీసీల రిజర్వేషన్ అమలయ్యే విధంగా పార్లమెంటులో చర్చించి న్యాయం చేయాలని ఆర్ కృష్ణయ్యకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌గౌడ్, ఉపాధ్యక్షులు నారాయణయాదవ్, కార్యదర్శి రాందాస్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాందాస్, ధనంజయ, రవికుమార్, శ్రీనివాస్, సుభాష్, వేణు, శివకుమార్, వినోద్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో.. నకిలీ సర్టిఫికెట్ల కుంభకోణం



మాజీ ఏఈఓపై ఆలయ ఈవో ఫిర్యాదు.. ఎఫ్ఐఆర్ నమోదు


SRI RAJA RAJESHWARA SWAMY DEVASTHANAM
VEMULAWADA

పరీక్ష రాయకుండానే డిగ్రీ పట్టా

- సైలం యూనివర్సిటీలో అడ్మిషన్.. బీహార్ లీలావతి యూనివర్సిటీలో పట్టా..
- బదిలీపై వెళ్లిన హరికిషన్
- అరెస్ట్‌కు రంగం సిద్ధం..
- ఆయన దారిలో మరి కొంత మంది ఉద్యోగులు..
- ఇంకొంతమంది నకిలీ సర్టిఫికెట్లతో పదోన్నతులు..?
- లోతుగా విచారణ చేపట్టాలి : బాధిత ఉద్యోగులు

నవతెలంగాణ - వేములవాడ

రాజన్న దేవాలయంలో మరో కుంభకోణం వెలుగు చూసింది. నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లతో పదోన్నతి పొంది, టెండర్ల నిర్వహణలో అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ సహాయ కార్యనిర్వహణాధికారి (ఏఈఓ) హరికిషన్‌పై క్రిమినల్ కేసు నమోదైంది. ఇంటర్మీడియట్ అర్హత మాత్రమే కలిగిన హరికిషన్, దొడ్డిదారిన పదోన్నతి పొందేందుకు నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లను సృష్టించి, ఉన్నతాధికారులకు మామూళ్లు చెల్లించి 2013లో ఏఈఓగా పదోన్నతి సాధించినట్లు దర్యాప్తులో తేలింది.

విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం, హరికిషన్ తమిళనాడులోని సేలం విశ్వవిద్యాలయం, బీహార్‌లోని లలిత్ నారాయణ్ మిథిలా విశ్వవిద్యాలయం పేర్లతో నకిలీ సర్టిఫికెట్లను సృష్టించాడు. 2001లో రోల్ నెంబర్ 14210తో లలిత్ నారాయణ్ మిథిలా విశ్వవిద్యాలయంలో బీఏ పరీక్షలు రాసినట్లు చూపించాడు. అయితే ఆ సమయంలో అతను ఎలాంటి సెలవు పెట్టకుండానే దర్బంగాలో పరీక్షలు రాసినట్లు నమోదు చేశాడు. నిజానికి ఆ విశ్వవిద్యాలయంలో అతనికి ప్రవేశమే లేదని, పరీక్షలు రాయకుండానే డిగ్రీ సర్టిఫికెట్ సృష్టించుకున్నట్లు తేలింది.

వరుస కథనాలతో చర్యలు

రాజన్న దేవాలయంలో టెండర్ల నిర్వహణలో హరికిషన్ భారీ అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు రిటైర్డ్ ఉద్యోగి నామాల రాజేందర్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా, ఆలయ సూపరింటెండెంట్ బి.తిరుపతిరావు ఎండోమెంట్ విజిలెన్స్ దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేశారు. 2023లో నవతెలంగాణ పత్రికలో "రాజన్న ఆలయంలో నకిలీ లీలలు", "మరోసారి", "బీరువాలో దాచిన రహస్యం" అనే శీర్షికలతో వరుస కథనాలు ప్రచురించడంతో అధికారులు చర్యలకు ఉపక్రమించారు.

అరెస్టుకు రంగం సిద్ధం

ప్రస్తుతం యాదగిరిగుట్టకు బదిలీపై వెళ్లిన హరికిషన్‌పై దేవాలయ ఈఓ వినోద్ రెడ్డి ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ వీరప్రసాద్ 318(4), 336(3), 340(2) బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. త్వరలోనే అరెస్టు జరగనున్నట్టు దేవాలయ వర్గాలు చెబుతున్నాయి.

హరికిషన్ తరహాలోనే మరికొంత మంది ఉద్యోగులు కూడా నకిలీ సర్టిఫికెట్లతో పదోన్నతులు పొందినట్లు వెలుగుచూస్తున్నాయి. గతంలో పదవీ విరమణ పొందిన ఈ.శంకరయ్య, తనకంటే తక్కువ అర్హత కలిగిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారి రఘునందన్ అక్రమంగా పదోన్నతి పొందినట్లు 2012లోనే హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. 2013 నుండి 2015 వరకు సమాచార హక్కు చట్టం కింద రఘునందన్ సర్టిఫికెట్లపై ఆరా తీసిన శంకరయ్య, ఇతర అధికారుల నకిలీ సర్టిఫికెట్లపై కూడా ఆధారాలు సేకరించారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించాలి..

దేవాదాయశాఖ, రాష్ట్ర ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకుని, నకిలీ సర్టిఫికెట్లతో పదోన్నతులు పొందిన వారందరిపై లోతైన విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, అవినీతి నిర్మూలనకు చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు, రాజన్న భక్తులు డిమాండ్ చేస్తున్నారు. దేవాలయంలో జరుగుతున్న ఈ అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపి, దోషులందరినీ కఠినంగా శిక్షించాలని, అన్యాయానికి గురైన ఉద్యోగులు, పట్టణ ప్రజలు, భక్తులు కోరుతున్నారు.

రైతుల్ని ఈ ప్రభుత్వం నట్టేట ముంచింది

- రాష్ట్రాన్ని రావణకాష్టం చేస్తున్నారు : మాజీ మంత్రి ,ఎమ్మెల్యే హరీశ్‌రావు
- రాష్ట్రపతి పాలన పెట్టాలని కేంద్రానికి సూచన

నవతెలంగాణ-సిద్ధిపేట



రైతుల్ని ఈ ప్రభుత్వం నట్టేట ముంచిందని, సిగ్గులేకుండా సంబరాలు చేయమంటున్నారని, రేవంత్ రెడ్డి నుంచి రాహుల్ వరకు కాంగ్రెస్ ఇచ్చిన ఒక్క హామీ నిలబెట్టుకోలేదని, బహిరంగ చర్చకు తాను సిద్ధమని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సిద్ధిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వానాకాలం గుండు సున్న అని, కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లోకి వస్తే ఎకరానికి రూ.15 వేలు ఇవ్వలేదని నిలదీయాలని రైతులకు సూచించారు. కనపడ్డ దేవుళ్లందరి మీద ఒట్టు పెట్టి రైతు రుణమాఫీ అన్నాడు.. ఏడాది గడిచినా ఇంతవరకు రైతు రుణమాఫీ కాలేదన్నారు. పది పంటలకు బీమా అని చెప్పి ఒక్క పంటకే ఇచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిట్టిన తిట్టు తిట్టకుండా రైతులు తిడుతున్నారన్నారు. ప్రజల దృష్టి మళ్లించడానికి సీఎం హింస రాజకీయాలు చేస్తున్నారన్నారు. యాదాద్రిలో దాడులు చేస్తున్నవారిని, పోలీసులే ప్రోత్సహిస్తున్నట్టు కనిపిస్తుందన్నారు. కౌశిక్ రెడ్డి, అల్లు అర్జున్ ఇండ్లమీద దాడులు, బీఆర్ఎస్, బీజేపీ కార్యాలయాలపైనా కాంగ్రెస్ గుండాలు దాడులు చేశారన్నారు. ముఖ్యమంత్రి మౌనం ఈ దాడులను ప్రోత్సహిస్తున్నట్టుగా ఉందన్నారు. రాష్ట్రాన్ని రావణకాష్టంగా మారుస్తున్నారని, తమ ఓపికను బలహీనంగా తీసుకోవద్దని, ప్రశ్నిస్తే దాడులు చేయడం మంచిది కాదన్నారు. రాష్ట్రంలో క్రైం రేట్ పెరిగిందని, రాష్ట్రపతి పాలన పెట్టయినా రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాలని కేంద్రాన్ని కోరారు. మతకలహాలు కూడా పెరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫారుకు హుస్సేన్, గుండు భూపేష్, కొండం సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ చిన్నారిపై లైంగికదాడి యత్నం

- పోలీసుల అదుపులో నిందితుడు

నవతెలంగాణ - కొనరావుపేట

రాజన్న సిరిసిల్ల జిల్లా కొనరావుపేట మండల కేంద్రంలోని చెందిన కొలనూర్ గ్రామంలో దారుణ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానిక అంగన్వాడీ కేంద్రంలో చదువుకుంటున్న చిన్నారిపై లైంగికదాడికి యత్నం జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసు వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నారి అంగన్‌వాడీ నుంచి ఇంటికి వచ్చిన అనంతరం తనపై జరిగిన దాడి గురించి తల్లిదండ్రులకు వెల్లడించింది. వెంటనే స్పందించిన తల్లిదండ్రులు చిన్నారిని స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన కొనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్టు సమాచారం. ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

మాజీ ఎంపీ మందా జగన్నాథం మృతి


(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నాగర్ కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథం (72) అనారోగ్యంతో కన్నుమూశారు. డయాబెటిస్, హైపర్‌టెన్షన్, క్రానిక్ కిడ్నీ డిసీజ్ తదితర మల్టీపుల్ వ్యాధులతో బాధపడుతున్న ఆయన గత నెల 22న నిమ్స్‌లో చేరారు. మొదట్లో ఆయన శరీరం వైద్యానికి సహకరించినా ఆ తర్వాత వెంటిలేషన్‌పై ఆయనకు వైద్యులు చికిత్స అందించారు. క్రమంగా ఆయన ఆరోగ్యం క్షీణించడంతో ఆదివారం రాత్రి 7.40 గంటలకు మరణించినట్టు నిమ్స్ వైద్యులు ధృవీకరించారు. 1996,1999,2004లో టీడీపీ నుంచి 2009లో కాంగ్రెస్ నుంచి విజయం సాధించారు. 2014లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆయన ప్రస్తుతం రాజీయాలకు దూరంగా ఉంటున్నారు. ఆయన మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, భట్టి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నాయకులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి తదితరులు సంతాపం ప్రకటించారు.

తెలివైన పిల్లలు కావాలా..? పౌర్ణమి రోజుల్లో గర్భధారణ వద్దు..!

- మధ్యప్రదేశ్‌లో విద్యార్థినులకు మహిళా డీఐజీ వింత సలహా
- మానసిక చికిత్సకు పంపాలి : సీపీఐ(ఎం)



భోపాల్ : మధ్యప్రదేశ్‌లో ఒక మహిళా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ) టీనేజ్‌లోని విద్యార్థినులకు వింత సలహా ఇచ్చారు. తెలివైన పిల్లలు కావాలనుకుంటే పౌర్ణమి రోజుల్లో గర్భాధారణ కూడదని సెలవిచ్చారు. షాహోల్ జిల్లా మహిళా డీఐజీ సవితా సోహన్ బాలికలను ఉద్దేశించి మాట్లాడుతూ 'మీరు భూమిపైకి కొత్త తరాన్ని తీసుకువస్తారు. ఈ విషయంపై మీరు ఎలా ముందుకు వెళ్లనున్నారు' అని ప్రశ్నించారు. మళ్లీ ఆమె మాట్లాడుతూ 'దాని కోసం మీరు ప్లాన్ చేసుకోవాలి. మొదటి విషయం గుర్తుపెట్టుకోండి. పౌర్ణమి రోజుల్లో గర్భధారణ వద్దు. అలాగే తెలివైన పిల్లల కోసం సూర్యుని ముందు విల్లులా వంగుతూ నమస్కారం చేస్తూ నీళ్లను సమర్పించండి' అని తెలిపారు. బాలికల రక్షణ కోసం మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన ఒక అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ మహిళా డిఐజి ఈ వ్యాఖ్యలు చేశారు. అక్టోబర్ 4న 10 నుంచి 12 తరగతుల విద్యార్థినులకు ఒక ప్రయివేట్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె ఈ విధమైన సలహా ఇచ్చారు. దీనికి సంబంధించిన వీడియో గత కొన్ని రోజుల నుంచి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే ఇన్ని సలహాలు ఇచ్చిన మహిళా డీఐజీ అవివాహిత కావడం గమనార్హం. తన వ్యాఖ్యలపై సవితా సోహన్ స్పందిస్తూ హిందూ మతంలో పౌర్ణమి రోజులను పవిత్రంగా భావిస్తారని, అందుకే ఆ రోజుల్లో గర్భధారణ వద్దని చెప్పానని తెలిపారు. అలాగే, తాను గత 31 ఏండ్ల నుంచి, అంటే పోలీస్ శాఖలో ప్రవేశించినప్పటి నుంచి కూడా ప్రతీ నెలా ఒక పాఠశాలలో ప్రసంగం ఇస్తానని చెప్పారు. సాగర్ జిల్లాలోని ఒక ప్రభుత్వ ఇంటర్ కాలేజ్‌లో నాలుగేండ్ల నుంచి ప్రసంగం ఇస్తానని తెలిపారు. ఈ ప్రసంగాల కోసం సమాచారాన్ని మత గ్రంధాలు చదవడం, హిందూ మత నాయకుల ప్రసంగాలు వినడం ద్వారా సేకరిస్తానని చెప్పారు.

మహిళా డీఐజీ సవితా సోహన్ వ్యాఖ్యలను సీపీఐ(ఎం) మధ్యప్రదేశ్ తీవ్రంగా ఖండించింది. సవితాను వెంటనే పదవి నుంచి తొలగించి, మానసిక చికిత్సకు పంపాలని సీపీఐ(ఎం) మధ్యప్రదేశ్ రాష్ట్ర సెక్రెటరీ బోర్డు డిమాండ్ చేసింది. లైంగిక ఆరోగ్యంపై ఈ మహిళా అధికారి చేసిన వ్యాఖ్యలు విశ్వాసం లేనివి, మూఢ నమ్మకాలు, తప్పుడు సమాచారం కలిగినవి అని విమర్శించింది. ఇలాంటి అసంబద్ధమైన సలహాకు పోలీస్ అధికారిని శిక్షించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జస్విందర్ సింగ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రసుత్త బీజేపీ ప్రభుత్వాన్ని సంతోషపెట్టడానికి మధ్యప్రదేశ్ అధికార యంత్రాంగం ఇప్పుడు అన్ని సరిహద్దులను దాటుతోందని విమర్శించారు. ఈ వరుసలోనే ఐపీఎస్ సవితా సోహనే వ్యాఖ్యలు ఉన్నాయని పేర్కొన్నారు.

ప్రధానోపాధ్యాయుడిపై దాడిని ఖండించాలి

- నిందితులను కఠినంగా శిక్షించాలి
- మతోన్మాదశక్తుల నిరోధానికి ఆఫీసర్లు, టీచర్స్,పౌరసమాజం తో కమిటీలు : రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



నవతెలంగాణ-ముషీరాబాద్

తుక్కుగూడ ప్రధానోపాధ్యాయుడిపై దాడిచేసిన నిందితులపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ తుక్కుగూడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములుపై మతోన్మాద శక్తులు చేసిన దాడిని ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలన్నారు. పాఠశాలల్లో అధ్యాపకులు విద్యార్థుల మధ్య ఎటువంటి తారతమ్యాలు, కుల వివక్షకు చోటు లేదన్నారు. విద్యాలయాలలో నియమ నిబంధనలు పాటిస్తూ ఉండే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు రాములుకు న్యాయం జరిగే విధంగా కలిసి పోరాడాలన్నారు. ప్రొ. హరగోపాల్ మాట్లాడుతూ విద్యార్థి తల్లిదండ్రులతో ఏమాత్రం సంబంధం లేకుండా సుమారు 50 మంది అయ్యప్ప మాలతో ఉన్నవారు రాములుపై భౌతిక దాడి జరపడం అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో, కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో జనవరి 20న సమావేశాలు జరిపి మతోన్మాద శక్తుల జోక్యాన్ని వ్యతిరేకిస్తూ, ఖండిస్తూ బ్లాకు బాడ్జెస్ ధరించి నిరసన తెలపాలన్నారు. ప్రొ.నాగేశ్వరరావు, ప్రొ.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మతోన్మాద శక్తుల జోక్యం ఆపడానికి ఆఫీసర్లు, టీచర్స్ పౌర సమాజ వ్యక్తులతో ప్రభుత్వమే కమిటీలు వేయాలన్నారు. మతాలకు సంబంధించిన విగ్రహాలు, గుర్తులు, డ్రెస్సులు విద్యాసంస్థలలో నిషేధించాలన్నారు. మత సంబంధమైన ఏ కార్యక్రమాలు ఏర్పాటు చేయకూడదన్నారు. న్యాయవాది విష్ణు, కిష్టప్ప మాట్లాడుతూ ఈ విషయంపై ముఖ్యమంత్రి, డీజీపీని షెడ్యూల్డ్ క్యాస్ట్ కమిషన్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వాలని, అప్పటికీ నిందితులపై కఠిన చర్యలు తీసుకోకపోతే, మతసామరస్య కమిటీలు వేయకపోతే చలో తుక్కుగూడ, జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు, రాష్ట్రవ్యాప్త ధర్నా జరపాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు రాములు, అనిల్ కుమార్, సోమయ్య, శ్రీపాల్ రెడ్డి, వెంకన్న,నన్నెబోయిన తిరుపతి ,లింగారెడ్డి,యాదగిరి, వెంకట్ , శంకర్, అశోక్ కుమార్, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘం నాయకులు, బాలల హక్కుల సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచే అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

- మూడు రోజుల పాటు ఉత్సవాలు
- ప్రారంభించనున్న పర్యాటక శాఖ మంత్రి జూపల్లి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ సంస్కృతికి ప్రతీకగా నిలిచే అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ నేటి నుంచి సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో కొలువు దీరనుంది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం 4 గంటలకు ప్రారంభించనున్నారు. 16 దేశాల నుంచి 47 మంది అంతర్జాతీయ కైట్ క్రీడాకారులు, 14 రాష్ట్రాల నుంచి 60 దేశవాళీ కైట్ క్లబ్ సభ్యులు పాల్గొని పలు డిజైన్లలో రూపొందించిన పతంగులను ఎగరవేయనున్నారు. వీటితో పాటు తెలంగాణ సంప్రదాయ వంటలు, పంజాబ్, గుజరాత్, కేరళ, మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన మహిళలు ఇంట్లోనే తయారు చేసిన రకరకాల స్వీట్లను ఫుడ్ కోర్టుల్లో ప్రదర్శించి, విక్రయించనున్నారు. తెలంగాణ పర్యాటక శాఖ నిర్వహించే ఈ వేడుకలకు దాదాపు 15 లక్షల మందికి పైగా సందర్శకులు వస్తారని అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

హీరో వెంకటేశ్ కుటుంబంపై కేసు నమోదు



నవతెలంగాణ - బంజారాహిల్స్

నటుడు వెంకటేశ్ కుటుంబానికి భారీ షాక్ తగిలింది. దక్కన్ కిచెన్ హోటల్ కూల్చివేత వ్యవహారంలో వారిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకెళ్తే.. గతంలో ఎమ్మెల్యేల కొనుగోలు అంశంలో బాధితుడైన నందకుమార్‌కు చెందిన దక్కన్ కిచెన్ హోటల్ అంశంలో దగ్గుబాటి కుటుంబంతో స్థలం వివాదం చెలరేగింది. దీంతో నందకుమార్ సిటీ సివిల్ కోర్టులో కేసు వేశారు. 2022 నవంబరులో జీహెచ్ఎంసీ సిబ్బంది బౌన్సర్లతో కలిసి హోటల్‌ను పాక్షికంగా కూల్చివేసింది. అయితే ఈ స్థలంలో ఎలాంటి చర్యలూ చేపట్టొద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే ఆ ఆదేశాలను సైతం లెక్క చేయకుండా 2024 జనవరిలో హోటల్‌ను దగ్గుబాటి ఫ్యామిలీ పూర్తిగా కూల్చి వేసింది. దీంతో మళ్లీ నందకుమార్ వీరిపై కేసు నమోదు చేయాలని కోరుతూ నాంపల్లి కోర్టుకు వెళ్లాడు. ఈ మేరకు దగ్గుబాటి కుటుంబంపై కేసు నమోదు చేసి విచారణ చేయాలంటూ ఫిలిం నగర్ పోలీసులకు కోర్టు శనివారం ఆదేశాలు జారీ చేసింది.హైకోర్టు ఆదేశాలు కూడా బేఖాతరు చేస్తూ దౌర్జన్యంగా వ్యవహరించడం ఏంటని దగ్గుబాటి ఫ్యామిలీపై నాంపల్లి కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాల ఉల్లంఘనపై తగిన చర్యలు తీసుకోవా లని ఆదేశాలు జారీ చేసింది.ఈ మేరకు నిర్మాత సురేశ్ బాబు, నటులు వెంకటేశ్, రానా, అభిరామ్ లపై ఫిల్మ్ నగర్ పోలీసులు 448, 452, 458, 120 బిఎస్ఎన్,సెక్షన్లపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ చేపట్టారు.

కార్పొరేట్ల కోసమే మార్కెట్ల రద్దు

- వారికి కాసుల పంట...రైతులకు మరణశాసనం
- మరో రైతాంగ ఉద్యమానికి సన్నద్ధం : తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ పిలుపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రూపొందించిన జాతీయ మార్కెట్ల ముసాయిదా చట్టం రైతులకు మరణ శాసనమేని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ చెప్పారు. కార్పొరేట్లకు కాసుల వర్షం కురిపించేందుకే కేంద్రం మార్కెట్లను రద్దు చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకున్న కేంద్రం...మరో రూపంలో ఈ చట్టాన్ని తీసుకొచ్చిందని విమర్శించారు. ఢిల్లీ ఉద్యమ తరహాలో మరో రైతాంగ ఉద్యమానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్. వినయకుమార్ అధ్యక్షతన 'మద్దతు ధరలపై ప్రధాని మోండి వైఖరి ఎవరికి కోసం' అనే అంశంపై వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ బడా కార్పొరేట్లకు ఆటంకంగా ఉన్న చట్టాలను మార్చి వారి ప్రయోజనాలను రక్షించబోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాల హక్కులను తమ గుప్పిట్లో పెట్టుకునేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. కొనుగోలు, అమ్మకాల్లో రైతుల ప్రమేయం లేకుండా చేస్తున్నదన్నారు. ఈ ప్రమాదం నుంచి రైతులను రక్షించేందుకు రైతు నేత జగ్జీత్‌సింగ్ దలేవాలా నిరవధిక దీక్ష చేస్తున్నారని చెప్పారు. అయినా కేంద్ర ప్రభుత్వంలో చలనం లేదన్నారు. గతంలో రైతుసంఘాలకు మోడీ, అమిత్‌షా ఇచ్చిన రాత పూర్వక హామీలను కూడా నెరవేర్చడం లేదని విమర్శించారు. స్వామినాథన్ సిఫారసుల ప్రకారం మద్దతు ధరలను రూపొందించడంతోపాటు దానికి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. దీని వల్ల ఏ మార్కెట్‌కు రైతు వెళ్లినా ఆ ధర ప్రకారం కొనాల్సిందేనన్నారు. ఆ చట్టం లేకపోవడంతో వ్యాపారులు ఇష్టానుసారం రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఫలితంగా రైతులు పెట్టిన పెట్టుబడి కూడా దక్కడం లేదని చెప్పారు. రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో కౌలు రైతులు అత్యధికంగా ఉన్నారని తెలిపారు. రైతు రుణమాఫీ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కేంద్రం...కార్పొరేట్ కంపెనీలకు మాత్రం రూ.18వేల కోట్ల రుణాన్ని మాఫీ చేసిందని గుర్తు చేశారు. దేశ జనాభాలో 52 శాతం మందికి ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయాన్ని ఆదుకోవడంలో కేంద్రం విఫలమైందని విమర్శించారు. కేరళ తరహాలో రుణవిమోచన చట్టాన్ని తీసుకరావాలని డిమాండ్ చేశారు. ప్రధాని మంత్రి ఫసల్ బీమా యోచన కూడా రైతుల కంటే కార్పొరేట్లకు ఎక్కువగా ఉపయోగపడుతున్నదని చెప్పారు. దీంతో ఫలితం లేదనుకున్న గుజరాత్ రాష్ట్రంతోసహా ఎనిమిది రాష్ట్రాలు ఫసల్ బీమా నుంచి బయటకు వచ్చాయని గుర్తు చేశారు. విద్యుత్ మోటార్లకు స్మార్టు బిగించి రైతులపై భారం మోపేందుకు కేంద్రం విద్యుత్ సవరణ బిల్లును తెచ్చిందని విమర్శించారు. ఆ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నక్క దాడిలో ముగ్గురికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ - ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని మద్దికుంట గ్రామంలో నలుగురు వ్యక్తులపై ఆదివారం తెల్లవారుజామున నక్క దాడి చేసినది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం తెల్లవారుజామున వాకిలి ఊడుస్తున్న సూత్రం రాధా(34), పొలం పనులకు వెళ్తున్న డిటి సత్తయ్య(40), తెర్లుమద్ది కిషన్(32)లపై నక్క దాడి చేయడంతో గాయాలయ్యాయి. రాధకు తీవ్ర గాయం అవ్వడంతో కుటుంబ సభ్యులు సిరిసిల్లలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడినవారిని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కెకె మహేందర్ రెడ్డి పరామర్శించారు.

తగువులాట...

అధికారిక కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, సంజయ్‌ల మధ్య వాగ్వాదం

- దుర్భాషలాడుకుంటూ ఒకరినొకరు తోసుకున్న వైనం
- అడ్డుకున్న మంత్రులు, సహచర ఎమ్మెల్యేలు..
- కౌశిక్‌రెడ్డిని బలవంతంగా బయటకు పంపిన పోలీసులు..
- రసాభాసగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా రివ్యూ మీటింగ్



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

సంక్షేమ పథకాల అమలుపై కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమీక్షాసమావేశం రసాభాసగా మారింది. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ప్రసంగిస్తుండగా.. 'నువ్వు ఏ పార్టీయో ముందు చెప్పు' అంటూ హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అడ్డుకున్నారు. అందుకు 'నేను కాంగ్రెస్ పార్టీయే' అంటూ బదులివ్వగా కౌశిక్‌రెడ్డి అభ్యంతరం తెలపడంతో ఇరువురి మధ్య మాటలతూటాలు పేలాయి. ఒక దశలో ఇద్దరూ ఒకరినొకరు తోసుకుంటూ దుర్భాలాడుకున్నారు. పరిస్థితి చేయిదాటిపోకుండా వెంటనే ముగ్గురు మంత్రులు, ఇతర సహచర ఎమ్మెల్యేలు అడ్డుకుని పోలీసుల చేత కౌశిక్‌రెడ్డిని బయటకు పంపించడంతో పరిస్థితి సద్దుమణిగింది. రైతుభరోసా, కొత్త రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు పథకాలపై ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఎమ్మెల్యేలు, మంత్రులు, కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి కరీంనగర్ కలెక్టరేట్‌లో కార్యాచరణ ప్రణాళిక- సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు సహా అధికార, విపక్షపార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.

సమావేశ ప్రారంభంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ప్రసంగం ప్రారంభించగానే.. పక్కనే ఉన్న బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి...'ముందు నువ్వు ఏ పార్టీయే చెప్పాలి' అని ప్రశ్నించారు. ఇందుకు బదులిస్తూ 'నేను కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేను' అని సంజయ్ సమాధానం ఇవ్వగా కౌశిక్‌రెడ్డి అభ్యంతరం తెలిపుతూ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. ఒక దశలో పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్ ఒకరినొకరుతోసుకుంటూ 'నువ్వెంతరా..! అంటే నువ్వెంతరా!' అనుకుంటూ బూతుపురాణం అందుకున్నారు. కరీంనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సైతం కౌశిక్‌రెడ్డిని వారించే ప్రయత్నం చేశారు. చివరికి ఆయనను బయటకు తీసుకెళ్లారు.

అధికారులు, పోలీసులకు కౌశిక్‌రెడ్డి వార్నింగ్

'బీఆర్ఎస్ బీఫామ్‌తో గెలిచి సిగ్గులేకుండా కాంగ్రెస్ ఎమ్మెల్యేనని చెప్పుకుంటున్నారు. మా పార్టీ తరుపున గెలిచి కాంగ్రెస్ తరుపున మాట్లాడితే మేం చూస్తూ ఊరుకోవాలా?' అంటూ హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. రివ్యూ సమావేశం నుంచి బయటకొచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. రైతు భరోసా రూ.15వేలకు బదులు రూ.12వేలు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయాలు ప్రశ్నించేందుకు వచ్చిన తనను అడ్డుకుంటారా? అంటూ అధికారులకు, పోలీసులకు వార్నింగ్ ఇచ్చారు. 'మీకు జీతాలు పెంచింది. వాహనాలు సమకూర్చింది. స్టేషన్లను ఫైవ్‌స్టార్‌లా తీర్చిదిద్దింది కేసీఆర్ అన్న సంగతి మరిచిపోయారా?. మరో మూడేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది. అప్పుడు ప్రతికారం తీసుకోవాల్సి వస్తుంది'అంటూ హెచ్చరించిన తీరు, రివ్యూ మీటింగ్‌లో సంజయ్‌పై తూలిన మాటల వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది.

కౌశిక్ వ్యవహారంపై తీవ్ర అసహనం....

హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి స్వయంగా బంధువు, సోదరుడైన రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలోనే దూకుడు ప్రదర్శించారు. అధికారికంగా జరుగుతున్న సమీక్షా సమావేశంలో పార్టీల ఫిరాయింపుల విషయాలను ప్రస్తావనకు తీసుకురావడంతో మీటింగ్ కాస్త పొలిటికల్ వార్‌గా మారింది. కౌశిక్‌ను బయటకు పంపిన తరువాత మీటింగ్ రసాభాసపై మంత్రులు, ఇతర ఎమ్మెల్యేలు స్పందించారు. ప్రభుత్వ పాలనకు ఆటంకాలు కలిగించడం, దాడులు చేయడమే బీఆర్ఎస్ సంస్కృతీనా? అని, దీనిపై ఆ పార్టీ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు స్పందించాలని డిమాండ్ చేశారు. విపక్షాలతో కలిసి ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు చేపడితే అడ్డుకునే వారిపై ప్రభుత్వం సీరియస్ యాక్షన్ తీసుకుంటుందని మంత్రి ఉత్తమ్‌కుమార్ తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
సోమవారం | జనవరి 13, 2025 | www.navatelangana.com

ఆర్టీసీ బస్సు కిందపడి యాచకుడు మృతి

• అడ్మిన్ ఎస్ఐ బి. శైలజ

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ఆర్టీసీ బస్సు కిందపడి ఓ యాచకుడు మృతి చెందిన సంఘటన అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆదివారం అడ్మిన్ ఎస్ఐ బి శైలజ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ గుర్తు తెలియని యాచకుడు బిక్షటన చేస్తూ జీవిస్తున్నాడు. అబిడ్స్ జీపీఓ బస్టాండ్ వద్ద గురువారం ఆర్టీసీ బస్సు వెనకల చక్రాల కింద యాచకుడు బస్సు వెనకాల చక్రాల కింద పడి మృతి చెందినట్లు సమాచారం అందినట్లు తెలిపారు. వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఉస్మానియా ఆస్పత్రి మార్చురికి తరలించామన్నారు. సీసీ కెమెరాలు పరిశీలించామన్నారు. యాచకుడే ఉద్దేశపూర్వకంగానే బస్సు కిందపడి మృతి చెందినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయింది అన్నారు. యాచకుని వయసు 30- 35 ఉన్నట్లు తెలిపారు. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అభినవ పూలే భాగ్యలక్ష్మీ

నవతెలంగాణ -సుల్తాన్ బజార్



అభినవ పూలే భాగ్యలక్ష్మి అని రాష్ట్ర ఓబీసీ సెంట్రల్ కమిటీ అధ్యక్షులు కాదురి అచ్చయ్య కురుమ అన్నారు. ఆదివారం ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్పర్సన్ భాగ్యలక్ష్మి నివాసంలో కలిసి మిఠాయి తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లు కోసం రెండు దశబ్దాలుగా పోరాటం చేసి సాధించారన్నారు. తెలంగాణ కోసం తెలంగాణ మాలిదశ ఉద్యమంలో జేఏసీ కోదండరామ్‌తో కలిసి పోరాటంలో బీసీ అనే నినాదంను వినిపించారని అన్నారు. సామజిక న్యాయం మహిళల మంత్రి పదవుల కోసం పోరాటం చేస్తున్నారన్నారు. భాగ్యలక్ష్మి పోరాటం మరువలేనిది అన్నారు. ఆమె కృషి ఫలితంగా సావిత్రిబాయి పూలే జయంతి ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. మర్చిలో ఓబీసీ ల జాతీయ మహాసభ నిర్వహిస్తామన్నారు. ఆ మహాసభలో భాగ్యలక్ష్మిని అభినవ పూలేగా ప్రకటిస్తామని తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం

- ఎవరూ ఆందోళన చెందొద్దు.. ప్రలోభాలకు గురికావొద్దు..!
- 16 నుంచి 25లోపు ఫీల్డ్, డేటా ఎంట్రీ ప్రక్రియ పూర్తిచేస్తాం
- 26 నుంచి అర్హులైన ప్రతి లబ్దిదారునికి రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇల్లు
- రేషన్ కార్డుల్లో మార్పులు,చేర్పులు నిరంతర ప్రక్రియ
- మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో హైదరాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి మంత్రి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 4 పథకాల ప్రారంభోత్సవానికి సంబంధించి సమీక్షా సమావేశం సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల నిర్వహించారన్నారు. హైదరాబాద్‌కు సంబంధించి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ కానుక పథకాలు జీహెచ్‌ఎంసీ పరిధిలో లేనందున మిగతా రెండు పథకాలైన రేషన్ కార్డులు పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు లబ్దిదారుల ఎంపిక చేయనున్నామన్నారు. ప్రతి లబ్దిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రధాన లక్ష్యంగా సర్వే ఎంపిక జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ది జరిగేలా ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. హైదరాబాద్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా.. సర్వే అనంతరమూ అధికారులకు సమాచారం ఇవ్వచ్చన్నారు. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదు..!

ప్రభుత్వం అర్హులందరికీ న్యాయం చేస్తుందనీ.. ప్రజలు రాజకీయ ప్రలోభాలకు గురికావద్దన్నారు. గత ప్రభుత్వం పదేండ్లుగా రేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. తమ ప్రభుత్వం రేషన్ కార్డులు నిరుపేదలకు అందించేందుకు స్పష్టమైన నిర్ణయం తీసుకుందన్నారు. రేషన్ కార్డులు ఇవ్వడానికి కలెక్టర్ల సమావేశంలో ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుందని చెప్పారు. అన్ని ఉమ్మడి జిల్లాలో ఇన్‌చార్జి మంత్రులు సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారనీ, హైదరాబాద్ జిల్లాలోనూ సమావేశం జరుగుతుందన్నారు.

పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక

ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అధికారులతో సమావేశం జరిగింది. వారి సూచనలు పరిగణలోకి తీసుకొని అవసరమైతే ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటున్నామన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. 16-20వ తేది మధ్య ఫీల్డ్ వెరిఫికేషన్ జరుగుతుందనీ, ఫీల్డ్ వెరిఫికేషన్ తర్వాత వచ్చిన జాబితా జనవరి 20-24 మధ్య వార్డుల వారీగా గ్రామసభలు ఏర్పాటు చేసి లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా చేస్తారన్నారు. 21-25 మధ్య డేటా ఎంట్రీ పూర్తిచేసి ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు.

గ్రేటర్‌లో ప్రజాపాలన దరఖాస్తులు 10లక్షలకుపైనే..

26 నుంచి కొత్త రేషన్ కార్డులు వస్తాయనీ, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ప్రకటన ఉంటుందన్నారు. హైదరాబాద్‌లో స్వంత స్థలం ఉండి ఇండ్లు లేని వారికి 50 శాతం అప్లికేషన్‌లు వచ్చాయనీ, ఇంకా సర్వే పూర్తి చేసిన తర్వాత అర్హత గల లబ్దిదారుల జాబితా తెలుస్తుందన్నారు. గ్రేటర్ వ్యాప్తంగా 10 లక్షల 70 వేల 463 దరఖాస్తులు ప్రజాపాలనలో రాగా... అందులో 50 శాతం సర్వే చేయగా దాంట్లో ఇంటి స్థలం ఉన్నవారు 9,913 మంది ఉన్నారని మంత్రి తెలిపారు. అయినప్పటికీ హైదరాబాద్‌లో స్థలం అంశం ప్రత్యేకమైనదని అందుకు నిరుపేదలకు మంచి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని, ప్రజాప్రతినిధులు సూచన మేరకు మల్టీ స్టోర్ కట్టడానికి లేదా స్లమ్స్ డెవలప్ చేసి ఇల్లు నిర్మించేలా యాక్షన్ ప్లాన్ తీసుకున్నామన్నారు.

నగరంలో ఇండ్ల సమస్య పరిష్కరిస్తాం..

ముఖ్యమంత్రి, ప్రభుత్వం ఇండ్లపై ఒక నిర్ణయం తీసుకుంటుందనీ, నగర ప్రజలకు ఎక్కడ అన్యాయం జరగనివ్వబోమన్నారు. మైగ్రేషన్ అయిన వారికి ఇండ్లు రేషన్ ఇవ్వాలన్నారు. ఈ విషయంలో ప్రజలు సహకరించాలన్నారు. జీరో టూ క్రైటీరియ ఉంటుందన్నారు. వార్డుల వారీగా ఈ ప్రక్రియ జరుగుతుందని... ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక, రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా సజావుగా జరుగుతుందన్నారు. రాజకీయాలకు అతీతంగా పేదలకు న్యాయం జరగాలని వారి సొంతింటి కల నిజం చేయాలన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

ప్రజల సహకారంతో అమలవుతున్న పథకాలు..

ప్రభుత్వం ఏ కార్యక్రమం చేసిన ప్రజల సహకారం కావాలన్నారు. రేషన్ కార్డులలో చేర్పులు మార్పులు నిరంతర ప్రక్రియ అని అన్నారు. అసంపూర్తి నిర్మాణంలోని డబుల్ బెడ్ రూమ్‌లు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఇలంబర్తి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ బాల్మూరి వెంకట్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీతో పాటు ఆ పార్టీ ఎమ్మెల్యేలు, పాల్గొన్నారు.

జవీఆర్ కరాటే అకాడమీలో పతంగుల పంపిణీ



నవతెలంగాణ-అంబర్‌పేట

జీవీఆర్ కరాటే అకాడమీలో సంక్రాంతి సందర్భంగా విద్యార్థులకు అకాడమీలో మహాలక్ష్మి రామన్న గౌడ్ చేతుల మీదుగా పతంగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ" సంక్రాంతి పండుగ అంటేనే భోగి మంటలు, రంగు రంగుల ముగ్గులు.. వాటి మధ్యలో గొబ్బెమ్మలు, పతంగులను గాల్లోకి ఎగురవేయడం సంక్రాంతి పండుగలో జరిగేవి. ఈ సమయంలో గాలిపటాలు రెక్కలు విప్పిన విమానంలా నింగిలోకి దూసుకెళుంది. అందులోనూ అందరి కంటే మన పతంగే ఎక్కువ ఎత్తుకు వెళ్తే ఎంతో హాయిగా అనిపిస్తుంది. ప్రతి ఒక్కరూ తమ బిల్డింగుల పైకి వచ్చి గాలిపటాలను గాల్లో ఎగరేస్తూ ఎంతగానో ఆస్వాదిస్తారు. ఉత్తరాయణంలో సూర్యుడి నుండి వచ్చే వేడి వల్ల చల్లి వ్యాప్తి మరియు దాని కారణంగా వచ్చే వ్యాధులన్నీ తొలగిపోయే అవకాశం ఉంది. ప్రజలంతా ఇంటిపైకి చేరి పతంగులను ఎగరేసినప్పుడు, సూర్యుని కిరణాలు ఔషధంగా పని చేస్తాయి.మీరు గాలిపటాలు కొనుక్కునేటప్పుడు చైనీస్ మాంజాకు బదులుగా స్వదేశీలో తయారైన సాధారణ మంజాను కొనండి. దీని వల్ల మీరు చాలా సురక్షితంగా ఉంటారు. జంతు పక్షులు కూడా సురక్షితంగా ఉంటాయి. కాబట్టి మీతో పాటు, పర్యావరణాన్ని కూడా జాగ్రత్తగా చూసుకోండి"అని అన్నారు. ఈ కార్యక్రమంలో జి.వి.ఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి ఎస్ గోపాల్ రెడ్డి, బ్లాక్ బెల్ట్ లు అమృత రెడ్డి, ఘన సంతోషిణి, వెంకటరెడ్డి విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీజేపీ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షులుగా నరేష్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

బీజేపీ పార్టీ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడిగా నరేష్ గౌడ్ నియమితులయ్యారు. గతంలో నరేష్ గౌడ్ స్థానిక కార్యకర్తగా రాజకీయంలోకి వచ్చి బీజేవైఎం, ఓబీసీ మోర్చా, నగర బీజేపీ సిటీ ఎగ్జిక్యూటివ్ నెంబర్ పార్టీ అనుబంధ కార్యక్రమంలో వివిధ రంగాలలో పనిచేశారు. నేను డివిజన్ అధ్యక్షుడు స్థాయికి ఎదిగాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా నీయామకానికి సహరించిన రాష్ట్ర అధ్యక్షులు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్ గౌతమ్ రావు, నగరా నాయకులు నాగభూషణం చారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

కరాటే మాస్టర్ బస్వరాజుకు నివాళి



నవతెలంగాణ - ముషీరాబాద్

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కరాటే మాస్టర్ బస్వరాజు సంస్మరణ సభ అశోక్ నగర్ జవహర్ నగర్ టీఆర్టీ గ్రౌండ్‌లో జరిగింది. బస్వరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు కరాటే మాస్టర్‌లు నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి రుద్రమదేవి అకాడమీ తరపున ఒక లక్ష పదివేల రూపాయలు అకాడమీ చైర్మెన్ డాక్టర్ సాయి రెడ్డి, చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ రవి లక్ష్మీ , కన్నన్ గౌడ్ ,సాయి యాదవ్ శ్రీధర్ , బాల ప్రసాద్ , నారాయణ పాల్గొన్నారు.

రజక వృత్తిదారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరించిన కార్పొరేటర్ దూసరి లావణ్య



నవతెలంగాణ-అంబర్‌పేట

తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ జిల్లా ఉపాధ్యక్షులు లంక సోమయ్య రాపర్తి ప్రభాకర్ గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదగా 2025 వ నూతన సంవత్సర క్యాలెండర్ నీ కార్పొరేటర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లావణ్య శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గోల్నాక డివిజన్లో ఉన్నటువంటి రజక కుటుంబాలందరినీ ఒకసారి సమావేశ పరిచి గోల్నాక డివిజన్లో వారి సభ్యులకు కావలసిన సదుపాయాలపై దృష్టి సారిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి పి భాస్కరరావు జిల్లా కమిటీ సభ్యులు, పారేపల్లి రాజు , జ్యోతి దర్గయ్య, బి.నాగరాజు, సిహెచ్ కుమార్, కే మంగయ్య తదిరులు పాల్గొన్నారు

నేటి నుంచి భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర : నల్లవెల్లి అంజిరెడ్డి

నవతెలంగాణ - ముషీరాబాద్



భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర నేటి నుంచి నిర్వహిస్తామని దేవాలయ మేనేజింగ్ ట్రస్ట్ సభ్యులు నల్లవెల్లి అంజిరెడ్డి తెలిపారు. ఆదివారం బాకారం ముషీరాబాద్ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో స్వామి వారి జాతర కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం నల్లవెల్లి అంజిరెడ్డి మాట్లాడుతూ..స్వామి వారి జాతర మహోత్సవం మూడు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. నేటి నుంచి ప్రారంభమవు జాతరలో మొదటి రోజు దృష్టి కుంభం, అనంతరం స్వామి వారి అలంకరణ సేవ 14న స్వామివారికి పంచామృత అభిషేకం మంత్రపుష్పం గంగా తెప్ప ఊరేగింపు ఉత్సవం ఘనంగా నిర్వహిస్తామన్నారు. 15వ తేదీన మల్లికార్జున స్వామి బలిజ మేడలమ్మ గొల్ల కేతమ్మ అమ్మవార్లతో కల్యాణం అగ్నిగుండాలు వెలిగించుట, తదుపరి అగ్నిగుండాల ప్రవేశం, ఆ తరువాత ఇందిరానగర్ లో గల ఈదమ్మ పోచమ్మ దేవాలయంనకు బోనాలు సమర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లవెల్లి ఊర్మిళ, నల్లవెల్లి మల్లికార్జున్ రెడ్డి, హారిక రెడ్డి, సురేష్ కుమార్, యాదగిరి, రామానంద రెడ్డి, రవీందర్ గౌడ్, రాజు, సురేందర్, సతీష్, రఘు ఉన్నారు.

రంగవల్లులవలె అన్ని మతాల కలిసి మెలిసి ఉండాలి

- ఆమ్ ఆద్మీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్
- ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు



నవతెలంగాణ - ముషీరాబాద్

ముగ్గులలో ఉండే రంగవల్లుల వలె అన్ని కులమతాలు కలిసిమెలిసి ఉండాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం చిక్కడపల్లి సూర్య నగర్‌లో సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడ్వకేట్ యమునా గౌడ్, మంజుశ్రీ, రతనా రావు, డాక్టర్ లక్షానాయుడు లు జడ్జీలుగా వ్యవహరించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ ముగ్గులలో అన్ని రంగులు ఉంటేనే బాగుంటాయని, ముగ్గుల లో వున్న రంగుల లాగానే మన దేశం లో వున్న అన్ని కుల మతాల వారు కలిసి మెలిసి ఉంటేనే అందం అని అన్నారు. పండుగలు మనలో అందరిలో ఆత్మీయ భావం ఒకరి నొకరు అర్థం చేసుకోవడానికి ఉపయోగ పడాలే కాని మతాలను విడదీయడానికి కాదని, సంక్రాంతి పండుగను అందరు ఆనందంగా జరుపుకోవాలని కోరారు . గాలిపటాలను ఎగురవేసే వారు జాగ్రత్తగా ఉండాలని, అలాగే చైనా మాంజా ను వాడవద్దని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సురేందర్ ,జావిద్, షరీఫ్ , ఎస్ యెన్ రెడ్డి, ఆహాసాన్ అబ్బాస్, అజీం , లాక్షా నాయుడు, విశాలి, అర్షిత, భార్గవి, తదితరులు పాల్గొన్నారు

యువత చదువు, ఉద్యోగాల వైపు మొగ్గు చూపాలి

- ఫలకనూమా ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి



నవతెలంగాణ - ధూల్ పేట్

యువత పెడుదారుల పడకుండా చదువు, ఉద్యోగాల వైపు మొగ్గు చూపాలని ఫలకనుమా ఇనిస్పెక్టర్ ఆదిరెడ్డి అన్నారు. డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ బంజారా వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి క్రీడోత్సవాల క్రికెట్ టోర్నమెంట్ లో విజేతలకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ.. యువకులు ఉద్యోగ, ఉపాధి వైపు ప్రయత్నాలు చేయాలన్నారు. ఈ క్రికెట్ టోర్నమెంటు యువకులు పెద్ద ఎత్తున పాల్గొనడంహ పై సంతోషం వ్యక్తం చేశారు. యువకులు మద్యం డ్రగ్స్ నుండి దూరంగా ఉండాలని సూచించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. డీవైఎఫ్ఐ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్ మాట్లాడుతూ... సంక్రాంతి పండుగ సందర్భంగా 11,12 తేదీల్లో రెండురోజుల క్రీడోత్సవాలు క్రికెట్ వందల మంది భాగస్వాములు అయిన్నారన్నారు. రవీందర్ నాయక్ నగర్ కాలనీ లో బంజారా కమ్యూనిటీ గ్రౌండ్లో నిర్వహించిన ఈ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్లో మల్లేష్ టీం అండ్ రమేష్ టీం తలపడడం జరిగిందని, వీరిలో మొదటి విజేతగా రమేష్ టీం గెలుపు పొందారన్నారు. రెండో విజేతగా గా మల్లేష్ టీం విజయం సాడించారన్నారు. బంజారా వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రత్యేక క్రీడల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొనడం పై హర్షం చేశారు. యూవత ప్రోత్సాహనికి మా కమిటీ ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర నాయక్ నగర్ కాలనీ యువకులు రాజేష్, శ్రీను, ఆంజనేయులు, భరత్, నాగేష్, నవీన్, మహేష్, మురారి, రమేష్, రాజకుమార్, హరీష్, చిన్న, గోపి, మొత ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

'మనస్తత్వ శాస్త్ర ప్రాధాన్యాన్ని గుర్తించేలా చేయాల్సిన బాధ్యత సైకాలజిస్టులదే'

- తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డా.మోతుకూరి రాంచందర్

నవతెలంగాణ-హిమాయత్ నగర్



సమాజానికి మనస్తత్వ శాస్త్ర ప్రాధాన్యాన్ని గుర్తించేలా చేయాల్సిన బాధ్యత సైకాలజిస్టులపై ఉందని తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డా.మోతుకూరి రాంచందర్ అన్నారు. సైకాలజిస్ట్ అసోసియేషన్ రూపొందించిన హైదరాబాద్ జిల్లా నూతన సంవత్సం -2025 డైరీ, క్యాలెండర్ లను డా.మోతుకూరి రాంచందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకాలజిస్టుల సేవలు సమాజానికి అత్యంత అవసరమన్నారు. ఈ రోజుల్లో పెరుగుతున్న ఒత్తిళ్ళ మధ్యన జీవితాలు అర్ధాంతరంగా ముగుస్తున్నాయని, మానసిక ఒత్తిడితో సరైన నిర్ణయాలు తీసుకోలేక పోతున్నారని, సైకాలజిస్టుల వద్దకు వెళ్లినట్లయితే వారు సరైన మార్గదర్శనం చేస్తారని సూచించారు. సైకాలజిస్టులు తమ వృత్తి పట్ల అంకితభావంతో పని చేస్తూ వారిని సమాజం గుర్తించేలా సరైన ప్రణాళికలతో ముందుకెళ్లాలన్నారు. మానసిక ఆరోగ్యానికి ప్రతిఒక్కరు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందుకు ప్రతి ఒక్కరు శారీరక వ్యాయమాలు,యోగను జీవితంలో భాగం చేసుకోవాలని ఆయన సూచించారు. కరోనా బాధితులకు ఉచిత ఫోన్ కౌన్సెలింగ్ ఇవ్వడం వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపి పలువురికి భరోసా కల్పించడం నిజంగా ఒక గొప్ప సామాజిక సేవా కార్యక్రమమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎ.సుధాకర్, లయన్ ఉమర్ ఖాన్, కోశాధికారి డా.శ్రీపూజ, సంయుక్త కార్యదర్శులు రాజు ఆచార్య వనజ, శ్రీకాంత్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కృష్ణ సాహితి, కార్యదర్శి సునక్యన, దేదీప్య, నాయకులు ఎం.ఆర్.రవీందర్, మునీశ్వర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు పెంచాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య



నవ తెలంగాణ - ముషీరాబాద్

బీసీలకు స్థానిక సంస్థల రిజర్వేషన్లలో 20 శాతం నుంచి 42 శాతం కు పెంచాలి అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం విద్యానగర్ బీసీ భవన్‌లో ఆదివారం విద్యానగర్ బీసీ భవన్ లో బిసి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లా పెల్లి అంజి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్ కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ స్థానిక సంస్థల రిజర్వేషన్లు 20 నుంచి 42శాతం పెంచాల ని లేనిపక్షంలో రాష్ట్రంలో అగ్గి పుట్టిస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న ప్రభుత్వం ఇంతవరకు రిజర్వేషన్ పెంచకపోవడం ప్రభుత్వం బీసీల పట్ల చిత్తశుద్ధి లేదని అర్థమవుతున్నాయని అన్నారు. ఈ ప్రభుత్వ వైఖరి మార్చుకొని 42 శాతం రిజర్వేషన్ పెంచాలని లేనిపక్షంలో ఎక్కడికక్కడ ఆమరణ నిరాహార దీక్షలు చేపడుతామని ప్రభుత్వం డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని బీసీ హక్కులను కాల రాస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమం బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లా పెల్లి అంజి ఆధ్వర్యంలో నిర్వహించగా బీసీ యువజన విభాగం క్యాలెండర్ డైరీ ఆవిష్కరించరు. బిసి సంఘం నాయకులు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్ బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అలంపల్లి రామకోటి బీసీ ఫ్రంట్ చైర్మన్ మల్లేష్ యాదవ, నర్సింగోజు శ్రీనివాస్,గుంటి స్వరూప శ్యామ్,చిగుళ్ల శ్రీనివాస్, లింగంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం

నవతెలంగాణ-అంబర్‌పేట



స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న మాజీ మంత్రి సి. కృష్ణ యాదవ్, కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్ యాదవ్, వై. అమృత, నాయకులు రమేష్ యాదవ్, అజయ్ కుమార్, కేసరి నర్సింగ్ యాదవ్ , మూల రవీందర్ గౌడ్, శ్రావణ్, రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

యువత వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి



- శ్రీనివాస రంగాచార్యులు

నవతెలంగాణ - ముషీరాబాద్

నేటి యువత స్వామి వివేకానందున్ని స్ఫూర్తిగా తీసుకోని ముందుకు సాగాలని ప్రముఖ విద్యావేత్త వివేకనంద కేంద్రం ప్రతినిధి శ్రీనివాస రంగాచార్యులు అన్నారు. ఆదివారం సుందరయ్యపార్కులో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వివేకనందుని ఆశయాలను కొనసాగించేందుకు యువత కృషిచేయాలని కోరారు. తమ లక్ష్య సాధనకోసం యువత వివేకానందున్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పి.వి నిరంజన్ రెడ్డి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వి నాగభూషణం, మాజీ అధ్యక్షులు మురళీకృష్ణ, ఎస్ఈమేష్రెడ్డి, అంబటి శ్రీనివాస్ రెడ్డి, శైలజమోహన్, నిమ్మరాజశేఖర్, ఎం. దశరత్, స్త్రైలాబ్బాబు, రఫీ అహ్మద్, పద్మగౌడ్, జాలివాకర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్ వద్ద నివాళి



స్వామి వివేకానంద 163 వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని ట్యాంక్ బాండ్ వద్ద గల స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ జాతి నిర్మాణం లో యువత పాత్ర ఎంతో శక్తివంతమైనది అన్న వివేకనందుడి మాటలు యువత స్ఫూర్తి గా తీసుకోవాలని కోరారు. యువత దేశభక్తి, ధర్మభక్తి పెంపొందించుకో వడమె వివేకానందుడికి అసలైన నివాళి అని అన్నారు.

అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి నివాళి



స్వామి వివేకానంద 163 వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని ట్యాంక్ బాండ్ వద్ద గల స్వామి వివేకానంద విగ్రహానికి అడ్వకేట్ జేఏసీ కన్వినర్ పులి గారి గోవర్ధన్ రెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

అంబర్‌పేటలో..



యువకులు స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. ఎన్. గౌతమ్ రావు పిలుపునిచ్చారు. అనంతరం బీజేపీ నగర కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్, ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్, నేతలు, శ్యామ్ రాజ్, నాగభూషణం చారి, కంచె చంద్రశేఖర్, కేసరి నర్సింగ్ యాదవ్ , రవీందర్ గౌడ్, యశ్వంత్, ఈశ్వర్, మనోజ్ యాదవ్ పాల్గొన్నారు.

ఆర్టీవో కార్యాలయంలో ముగ్గుల పోటీలు



నవతెలంగాణ-ఉప్పల్

రోడ్డు భద్రత మాసోత్సవాలు, సంక్రాంతి సందర్భంగా ఆదివారం ఉప్పల్ ఆర్టీవో ఆఫీస్ ఆవరణలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ట్రాఫిక్‌పై అవగాహన కల్పించాలని నిర్వహించిన ఈ పోటీలలో విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి డీటీఓ ఎం. రఘునందన్ గౌడ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జీ. లక్ష్మీ మాధవి, ఎంవీఐలు ఉమా, శ్రీనివాస్, కిరణ్ సిబ్బంది పాల్గొన్నారు.

కురుమ సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ కురుమ సంఘం క్యాలెండర్‌ను ఆదివారం హర్యాన గవర్నర్ బండారి దత్తాత్రేయ ఆవిష్కరించారు. ఉప్పల్ కురుమ సంఘం నాయకులు దత్తాత్రేయను కురుమల సాంప్రదాయం ప్రకారం రుమాలు, గొంగడితో సన్మానించి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గొరిగె కృష్ణ కురుమ, ఉప్పల్ కురుమ సంఘం నాయకులతో పాటు రాష్ట్ర కురుమ సంఘం కార్యదర్శి గొరిగె మల్లేష్ కురుమ, ఉప్పల్ జోన్ అధ్యక్షులు రేవు కృష్ణయ్య కురుమ, నాయకులు కొల్లు బాలరాజ్ కురుమ, తదితరులున్నారు.

డ్రయినేజీ, సీసీ రోడ్డు సమస్యలను పరిష్కరిస్తా



- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ - చర్లపల్లి

కుషాయిగూడలో డ్రయినేజీ, సీసీ రోడ్ల సమస్యను పరిష్కరిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం భజన్ మందిర్‌లో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసోసియేషన్ సభ్యులకు గ్రామస్తులకు నూతన సంవత్సర సంక్రాంత్రి శుభాకాంక్షలు తెలిపారు. కుషాయిగూడలో డ్రయినేజీ, సీసీ రోడ్డును వేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ముఖ్య సలహాదారులు, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్ పాల్ రెడ్డి, పండాల శివకుమార్ గౌడ్, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, పనగట్ల చక్రపాణి గౌడ్, చిత్తుల కిషోర్ గౌడ్, వాసుదేవ ముదిరాజ్, చల్ల ప్రభాకర్, పంజాల బాబు గౌడ్, చల్ల వెంకటేష్, బి.అనిల్ గుప్తా, సారా అనిల్, కొడకండ్ల యాదయ్య, చిదం బాలనర్సింహా, తదితరులున్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ సాధ్యం



- టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్

నవతెలంగాణ-బోడుప్పల్

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఆదివారం బోడుప్పల్ కార్పొరేషన్ 23వ డివిజన్ పరిధిలోని మల్లయ్య నగర్, వాసవీ నగర్‌లో స్థానిక కార్పొరేటర్ రాసాల వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 200 సీసీ టీవీ కెమెరాలను ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేయర్ తోటకూర అజయ్ యాదవ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ మారిన కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో నేరాలను పూర్తి స్థాయిలో నియంత్రించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, మేడిపల్లి సీఐ ఆర్.గోవింద్ రెడ్డి, డిఐ బాలస్వామి, కాంగ్రెస్ అధ్యక్షుడు పోగుల నరసింహ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, కాలనీల వాసులు పాల్గొన్నారు.

సంక్రాంతిని సంతోషంగా జరుపుకోవాలి



- ఉప్పల్ ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత
- ఉప్పల్‌లో పతంగుల పంపిణీ

నవతెలంగాణ ఉప్పల్

సంక్రాంతిని ఉప్పల్ నియోజకవర్గ ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అన్నారు. ఆదివారం సంక్రాంతి పండగను పురస్కరించుకుని పతంగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలందరికీ అడ్వాన్స్‌గా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు ఎవరూ చైనా ప్లాస్టిక్ మాంజా వాడకూడదని, వాటితో ప్రజల ప్రాణాలకు హాని జరుగుతుందని తెలిపారు. చైనా ప్లాస్టిక్ మాంజాని వాడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునే విధంగా చట్టాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో చిల్కానగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు ముష్యం శ్రీనివాస్, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కొండల్ రెడ్డి, నిరంజన్ చారి, అన్య బాలకృష్ణ, సుక్క కిరణ్, సాయిరాజ్, అల్లిబిల్లి మహేందర్, పంగ మహేందర్ రెడ్డి, కడిగే శేఖర్, ప్రభాకర్, ఓంకార్ సింగ్, నవీన్ చారి, చందు, ఉన్నారు.

స్ఫూర్తి గ్రూప్‌లో స్వామి వివేకానంద, ఎల్లాప్రగడ సుబ్బారావు, అనిశెట్టి ప్రభాకర్ జయంతి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీసులో స్వామి వివేకానంద, ప్రముఖ సైంటిస్ట్ ఎల్లాప్రగడ సుబ్బారావు, ప్రముఖ కవి రచయిత అనిశెట్టి ప్రభాకర్ జయంతుల సందర్భంగా సంస్మరణ సభ స్ఫూర్తి గ్రూపు బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షతన నిర్వహించారు. సభ ప్రారంభ సూచికగా స్వామి వివేకానంద చిత్రపటానికి తెలంగాణ సిటిజన్స్ రైట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గిరీష్, ఎల్లాప్రగడ సుబ్బారావు చిత్రపటానికి శ్రీమన్నారాయణ, అనిశెట్టి ప్రభాకర్ చిత్రపటానికి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గిరీష్ మాట్లాడుతూ స్వామి వివేకానంద చిన్నతనం నుండి ఎంతో సామాజిక దృక్పథంతో ఉన్నారని అన్నారు. ఆధ్యాత్మిక వాదిగా ఉన్నప్పటికీ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా నిలిచారని చెప్పారు. సామాజిక అంశాలలో అంతరాలు కూడదని, మహిళల పట్ల గౌరవంగా ఉండాలని, అందరూ సమానంగా ఉండాలని భావించారని చెప్పారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి జాతీయ భావాలను రగల్చడంలోనూ వారి పాత్ర అధికమన్నారు. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ స్వామి వివేకానంద ఆనాటి పరిస్థితులకనుగుణంగా అర్థం చేసుకొని సామాజిక దృక్పథంతో జీవించారన్నారు. ఎల్లాప్రగడ సుబ్బారావు టెట్రాసైక్లిన్ మందు కనుక్కొని ప్రజలకు ఎంతో మేలు చేశారని చెప్పారు. అనేక ప్రాణాంతక వ్యాధులకు మందులు కనుక్కొని, భారతీయ సైంటిస్ట్‌గా అందరి మన్ననలను పొందారు అని చెప్పారు. గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ అనిశెట్టి ప్రభాకర్ ఎంతో గొప్ప సాహిత్యాన్ని రూపొందించారని, ఆయన చేసిన రచనలు ప్రజల్ని ఎంతో చైతన్య పరిచయాని చెప్పారు. ఆయన చేసిన రచనలు కొన్నింటిని పాఠ్యాంశాలలో చేర్చారని చెప్పారు. యాదృచ్ఛికంగా ఆయన పుట్టినరోజు, వర్ధంతి ఒకేరోజు వచ్చిందన్నారు. సభ్యులందరూ చిత్రపటాలకు పూలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గొడుగు యాదగిరిరావు, ఉన్నికృష్ణన్, వెంకటేశ్వరరావు, గిరీష్, శ్రీనివాసరావు, ఎన్ శ్రీనివాస్, వెంకటాద్రి, శివన్నారాయణ, సూర్య ప్రకాష్, శ్రీమన్నారాయణ, బాలు, రుక్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చాకలోల్లపై సర్కార్‌ది సవతి తల్లి ప్రేమేనా..?

- రజక ఆత్మగౌరవ భవనానికి మోక్షం ఎప్పుడో
- స్థలం కేటాయించి ఏండ్లు గడిచినా ముందుకు సాగని పనులు
- రేవంత్ సర్కారుపై రజకుల ఆశలు అడిఆసలేనా!

నవతెలంగాణ-బోడుప్పల్

రాష్ట్రంలోని చాకలి(రజక) కులంపై సర్కారుది సవతి తల్లి ప్రేమే అనేది తెలిపోయింది. కేసీఆర్ సీఎం ఉండగా అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాల పేరిటా స్థలాలు కేటాయించిన సంగతి అందరికీ విధితమే. కానీ అందులోనూ రజకులకు పూర్తిగా అన్యాయమే జరిగింది.

వివరాల్లోకి వెళితే.. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మించాలనే ఉద్దేశంతో తేది: 05/09/2018న జీవో ఎంఎస్ నెంబరు 189 ద్వారా కొన్ని కులాలకు ఉప్పల్ భగాయత్, కొందరికి వేరు వేరు చోట్ల స్థలాలు కేటాయించి నిధులు మంజూరు చేసి నిర్మాణాలు కూడా చేపట్టారు. రజకులకు మేడిపల్లి మండల పరిధిలో 2 ఎకరాలు కేటాయిస్తూ జీవో జారీ చేశారు. కానీ నిర్మాణానికి ఎలాంటి నిధులు కేటాయించలేదు సరికదా హద్దులు చూపించకపోవడంతో ఆ ప్రభుత్వ భూమిపై భూ రాబందులు కన్నుపడింది. అప్పటికే ప్రభుత్వ భూమిని అమ్మి సొమ్ము చేసుకుంటున్న నాయకులు ఇదే ఆదనుగా భావించి అధికార పార్టీ నాయకుల అండదండలతో గత అనుభవంతో దొంగ పట్టాలను సృష్టించి అమాయక ప్రజల నుండి లక్షల సొమ్ము కాజేసేందుకు రంగం సిద్ధం చేసి బయనా కూడా జేబులో వేసుకున్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో సదరు ప్రజాప్రతినిధి భర్తపై బాధితుల ఒత్తిడి పెరిగింది. తాను ఇంతవరకు ప్రజలను మభ్యపెట్టి నమ్మించి పోగుచేసుకున్న సొమ్ము తిరిగి అడుగుతుండడంతో



రజక ఆత్మగౌరవ భవనానికి కేటాయించిన స్థలంలో చేపడుతున్న నిర్మాణం

అధికార పార్టీలోకి మారి ఇప్పుడు కొత్త రాగం అందుకున్నారు. రజక సంఘానికి కేటాయించిన భూమికి సంబంధించిన జీవో రద్దు అయ్యిందని మీకు మీ స్థలం ఇప్పించేందుకు కృషి చేస్తున్నట్లు అప్పుడపుడు మంత్రులు, నాయకులను కలుస్తున్నట్లు ఫొటోలు చూపిస్తూ ప్రజలను మభ్యపెడుతూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే రజకుల ఆత్మగౌరవ భవనానికి కేటాయించిన భూమిని రక్షించి భవన నిర్మానానికి అవసరమైన నిధులు కేటాయించాలని సంఘం నాయకులతో పాటు మాజీ మంత్రి, శాసనమండలి సభ్యులు బసవరాజు సారయ్య నేతృత్వంలో గత శాసన సభ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా కలిశారు. రజక సంఘం నాయకుల విజ్ఞప్తికి స్పందించిన సీఎం సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన నిధులు మంజూరు చేయాలని సూచించారు. సీఎం స్వయంగా హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా స్థానిక అధికారుల నుండి స్పందన లేకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం రజకులపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని విమర్శిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ భూమిపై అక్రమార్కులు చదును చేయించి నివాసయోగ్యంగా మార్చుకోనేందుకు ప్రయత్నిస్తుండడం మరికొందరు శాశ్వత భవనాలు నిర్మించుకోవడం చర్చనీయాంశమైంది.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణలు జరుగుతున్నాయని ఫిర్యాదు మేరకు మేడిపల్లి మండల రెవెన్యూ అధికారులు గతంలో కూల్చిన నిర్మాణలను పండగ సెలవులు రావడంతో తిరిగి నిర్మిస్తుండడంతో అక్రమార్కులకు మేడిపల్లి మండల రెవెన్యూ అధికారుల అండదండలు మెండుగా ఉన్నట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయమై రజక సంఘ నాయకులు ఫిర్యాదు చేసినా క్షేత్రస్థాయిలో విచారణ జరపకపోవడం పట్ల ఆగ్రహిస్తున్నారు. జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి తప్పుడు ఇంటి పట్టాలు సృష్టించి ప్రభుత్వ భూమిని అమాయకులకు అమ్మి సొమ్ము చేసుకుంటున్న వారిపై, అక్రమార్కులకు అండగా నిలుస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అవసరమైతే రాష్ట్రం వ్యాప్తంగా ఉద్యమం చేపట్టెందుకు సిద్ధంగా ఉన్నామని రజక సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

హెల్త్ క్యాంపు సేవలు వినియోగించుకోవాలి

- మేయర్ శాంతి కోటేష్ గౌడ్
- బాలాజీ హాస్పిటల్ సౌజన్యంతో మెగా హెల్త్ క్యాంపు



నవతెలంగాణ - జవహర్ నగర్

ప్రజలందరూ ఉచిత హెల్త్ క్యాంపు సేవలను వినియోగించుకోవాలని జవహర్ నగర్ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ కోరారు. ఆదివారం జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని గబ్బిలాలపేటలో శ్రీ బాలాజీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంపును ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని ఆస్పత్రి సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మల్లేష్ , కొమురయ్య, శీను, రాజు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ రామన్నగారి రాజేశ్వర్ గౌడ్ జయంతి



- నివాళులర్పించిన డీసీసీ అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి
- అన్నదానం చేసిన రామన్నగారి మణికంఠ గౌడ్
- మేడ్చల్ మున్సిపాలిటీకి ఫ్రీజర్ బాక్స్ అందజేత

నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ పట్టణ మాజీ సర్పంచ్ రామన్నగారి రాజేశ్వర్ గౌడ్(చిలక రాజు) 64వ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిలకరాజు విగ్రహానికి డీసీసీ అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి,పలువురు కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం డీసీసీ అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ వివేకానంద జయంతి రోజున్నే మాజీ సర్పంచ్ చిలకరాజు జయంతి రావడం గొప్ప విషయం అన్నారు. చిలకరాజు మేడ్చల్‌లో ఒక శక్తిగా ఎదిగారని కొనియాడారు. మేడ్చల్ మాజీ సర్పంచ్‌గా చిలకరాజు పట్టణాన్ని ఎన్నో రంగాల్లో అభివృద్ధి చేసి బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి నిరంతరం కృషి చేశారని తెలిపారు. తండ్రి ఆశయ సాధన కోసం వారి కుమారుడు 6వ వార్డు కౌన్సిలర్ రామన్నగారి మణికంఠ గౌడ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం పట్టణవాసులకు అన్నదానం చేశారు. తండ్రి జ్ఞాపకార్థం మేడ్చల్ మున్సిపాలిటీకి రూ.80వేల విలువ గల ఫ్రీజర్ బాక్స్‌ను విరాళంగా అందజేశారు. ఈకార్యక్రమంలో మోనార్క్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు రమణారెడ్డి, కౌన్సిలర్ కొడే మహేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేగు రాజు, పానుగంటి మహేష్ కుమార్,సుదర్శన్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు, చిలకరాజు అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయాలపై దాడి హేయం

- బీఆర్ఎస్ పార్టీ బోడుప్పల్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

రాజకీయ పార్టీల నాయకులు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకోవడం రాజకీయాల్లో సహజంగానే జరుగుతుంటాయని కానీ భౌతిక దాడులకు దిగడం మంచి సంప్రదాయం కాదని బోడుప్పల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు పోరాటం చేస్తూ ప్రభుత్వ అసమర్థతను వ్యతిరేకిస్తే దానిని జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలోకి చొరబడి దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. ప్రభుత్వ అసమర్థతను, ఇచ్చిన హామీలను అమలు చేయమని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా.. అలా ప్రజల తరుపున ప్రశ్నిస్తే దాడులు చేస్తామంటే ఇంకా ఎన్ని దాడులకైనా భయపడబోమన్నారు. యాదాద్రి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ పార్టీ నేతలపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

137వ వారం జ్ఞానమాల..

నవతెలంగాణ-కాప్రా

కాప్రా మండల పరిధిలోని జమ్మిగడ్డ ప్రాంత, బీజేఆర్ కాలనీలో జ్ఞానమాల టీం ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం చేపట్టే జ్ఞానమాల కార్యక్రమం 137వ వారానికి చేరింది. ఆదివారం మహాత్మ జ్యోతిరావు పూలే, డా.బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాదూరి గగన్ కుమార్, సభ్యులు ఎస్.ఎ.రహీమ్, నర్సింహ్మా చారి, రవి నాయక్, దయానంద్, వెంకటయ్య, నగేష్ జ్ఞానమాల సమర్పించారు.



భారతీయ సంప్రదాయానికి 'రంగవల్లులు'ప్రతీక



- బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్
- బోడుప్పల్ దేవేందర్ నగర్‌లో రాజన్న యువసేన ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు
- భారీ సంఖ్యలో పాల్గొన్న మహిళలు

నవతెలంగాణ-బోడుప్పల్

భారతీయ సంప్రదాయానికి నిలువెత్తు నిదర్శనం "రంగవల్లుల" పోటీలు అని బోడుప్పల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. ఆదివారం బోడుప్పల్ కార్పొరేషన్ పరిధి 13వ డివిజన్ దేవేందర్ నగర్‌లో కాంగ్రెస్ డివిజన్ ఇన్‌చార్జి జెన్న రాజు అధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ముఖ్యఅతిధిగా మేయర్ తోటకూర అజయ్ యాదవ్ హాజరై మాట్లాడుతూ ముగ్గులు వేయడం అనేది అతివలకు అనాదిగా వస్తున్న సంప్రదాయం అన్నారు. ఇంటిలోపల అందాన్ని పెంచేందుకు ఇంటిముందు గుమ్మం వద్ద రంగురంగుల ముగ్గులు వేస్తే ఇంటి అందం ఇంకా రెట్టింపు అవుతుందని, అందుకే ముగ్గులు మహిళలకు ప్రత్యేకమైనవి అన్నారు . అదే విధంగా బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని 13 వ డివిజన్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ మాట్లాడుతూ మహిళలకు మాత్రమే ప్రత్యేకమైన ముగ్గుల పోటీలు ఇంతా అట్టహాసంగా నిర్వహించిన నిర్వహకులు జెన్న రాజుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దానగళ్ల యాదగిరి,జోగు సుధాకర్, సానిక శశి,గోపు రాములు, అలివేలు తదితరులు పాల్గొన్నారు.



పద్మశాలి సంఘం నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-ఉప్పల్

భక్త మార్కండేయ పద్మశాలి సంఘం బీరప్పగడ్డ అధ్యక్షుడిగా సామల కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా యెన్నం రాజేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం బీరప్పగడ్డ కమ్యూనిటీ హాల్లో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఫిబ్రవరి 1న జరిగే మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో సత్యనారాయణ, నాగరాజు, శివకుమార్, తలకొక్కుల లక్ష్మీ నారాయణ, రవీందర్, నాగరాజు, చంద్రం, వెంకటేష్, సామల యాదగిరి, మామిడాల మల్లేష్, బొడ్డు బాలకృష్ణ, అనుగుల శ్రీనివాస్, తలకొక్కుల మారుతీ, క్యాతం శ్రీనివాస్, అడేపు బాలరాజు, ఎస్తారి లోకనాథం, కడవెరుగు మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పతంగులు పంపిణీ



నవతెలంగాణ-కాప్రా

హౌసింగ్ బోర్డు కాలనీలో ఉప్పల్ ఎన్ఎస్‌యూఐ ప్రెసిడెంట్ కిషోర్ బండిరాల ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా హోలీ మదర్ స్కూల్ విద్యార్థులకు ఆదివారం పతంగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ కాంగ్రెస్ నాయకులు సీతారాం రెడ్డి, చర్లపల్లి డివిజన్ ప్రెసిడెంట్ సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్ యాదవ్, చర్లపల్లి డివిజన్ ఎన్ఎస్‌యూఐ ప్రెసిడెంట్ క్రాంతి కుమార్ ,హీరాలాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్‌ను కలిసిన ఈసీ నగర్ సొసైటీ సభ్యులు



నవతెలంగాణ - చర్లపల్లి

ఈసీ నగర్ సొసైటీ ఎన్నికల్లో గెలుపొందిన సభ్యులు కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఈసీనగర్ అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ గౌడ్, ఉపాధ్యక్షులు పద్మిని, కార్యదర్శి జగ్గారాజు, కోశాధికారి ఇందిరా, బిక్షపతి, కాసుల ఆనంద్ రాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ జన్మదినోత్సవం సందర్భంగా ఆనంద్‌బాగ్‌లోని మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మల్కాజిగిరి కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో కాంగ్రెస్ పాత్ర మరువలేనిదని, కాంగ్రెస్ హయాంలోనే అనేక సంస్కరణలు జరిగాయని, సమాజంలో జరిగే అన్యాయానికి వ్యతిరేకంగా ఎల్లప్పుడు అంకితభావంతో పోరాడే నాయకురాలు ప్రియాంక గాంధీ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ యాదవ్, జీఎస్‌పీ సతీష్ కుమార్, నంద్యాల కృష్ణ, ఆశ, సుధారాణి నాయుడు, రోజరమణి, శివమణి, లక్ష్మి, మీనా, తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ కిషన్ రావు జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం మాజీ కౌన్సిలర్ కిషన్ రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ కిషన్ రావు ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్‌ని కలిశారు. ఎమ్మెల్యే కిషన్ రావుకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం శాలువాతో సత్కరించి కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్రీ విరాట్ విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సంఘం, చింతల్ ఆధ్వర్యంలో.. రూపొందించిన నూతన సంవత్సర కాలమానిని ఆదివారం కుత్బుల్లాపూర్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... గత మూడు పర్యాయాలు నా వెంట ఉండి నా గెలుపులో భాగస్వామ్యులైన విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సభ్యులకు నేనెప్పుడూ రుణపడి ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కుల బాంధవులు కిషోర్ చారి, కమలాకర్, విశ్వకర్మ విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు బాలరాజు చారి, సభ్యులు ఉపేంద్ర చారి, ఉమామహేశ్వర్ చారి తదితరులు పాల్గొన్నారు.

'జర్నలిస్టులు ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలి'

- జర్నలిస్టుల ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన



నవతెలంగాణ- కూకట్‌పల్లి

సమాజ శ్రేయస్సు కోసం, నిరంతరం పరితపించే జర్నలిస్టుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, ఆదివారం రోజు వివేకానందనగర్ కాలనీలోని బండారు ఆస్పత్రి యాజమాన్యం, జర్నలిస్టుల కోసం ఉచిత గుండె వైద్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా శాఖ, కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో.. ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరానికి పీఏసీ చైర్మెన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివేకానందనగర్ కాలనీ అధ్యక్షులు వడ్డేపల్లి రాజేశ్వర రావు, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంజీవరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజంయ్యారు. అనంతరంఉచిత గుండె వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ నిత్యం ఎంతో మానసిక ఒత్తిడికి లోనయ్యే జర్నలిస్టులు, తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచే జర్నలిస్టుల పాత్ర, సమాజానికి అత్యంత అవసరం అని అన్నారు. అనంతరం ఆస్పత్రి నిర్వాహకులు, డాక్టర్ సుశృత్ కుమార్ మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పరితపించే, జర్నలిస్టుల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ఈకో, టుడిఇకో, ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలతో పాటు, గుండె సంబంధిత అన్ని పరీక్షలను నిర్వహించామన్నారు. ఈ గుండె వైద్య శిబిరంలో 60 మంది జర్నలిస్టులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారన్నారు. తప్పనిసరిగా సంవత్సరానికి ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా శాఖ అధ్యక్షుడు, గడ్డమీది బాలరాజు మాట్లాడుతూ నేటి యాంత్రిక యుగంలో జర్నలిస్టులు తప్పని సరిగా తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. ఆసుపత్రి నిర్వాహకులకు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా శాఖ తరపున, కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జర్నలిస్టు నాయకులు మామిడాల రవీందర్ రెడ్డి, పరమేష్, దయాసాగర్, నిమ్మల శ్రీనివాస్, రాహుల్, నాగరాజు యాదవ్, మాణిక్యరెడ్డి, శేషారెడ్డి, కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కరీం,స్థానిక జర్నలిస్టులు పాల్గొన్నారు.

సంక్రాంతి సెలవులకు ఊరు వెళ్తున్నారా.. జాగ్రత్త..!

- జగద్గిరిగుట్ట సీఐ కేతూరి నరసింహ
- దొంగతనాల నివారణకు సైబరాబాద్ పోలీసుల సూచనలు





నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తెలుగు ప్రాంతాల ప్రజలు మూడు రోజులపాటు జరిగే సంక్రాంతి పండుగ సెలవులకు ఊరు వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు పాటించాలని జగద్గిరిగుట్ట సి.ఐ.కేతూరి నరసింహ తెలిపారు. ఈ మేరకు నవతెలంగాణ ప్రతినిధితో ఆదివారం ఆయన మాట్లాడారు. నేరాల నియంత్రణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని అందుకు తమకు ప్రతి ఒక్కరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జగద్గిరిగుట్ట సీఐ.నంబరు 9490617157 సంప్రదించాలని కోరారు.సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో సూచనలతో కూడిన ప్రకటన విడుదల చేశారు.

మీ విలువైన బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోండి. లేదంటే మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోండి. సెలవులలో బయటకు వెళుతున్నప్పుడు సెక్యూరిటి అలారంతో పాటు మోషన్ సెన్సర్‌ను ఏర్పాటు చేసుకోవడం మంచింది. మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉన్న తాళము అమర్చుకునడం మరి మంచిది. తాళము వేసి ఊరికి వెళ్లాల్సి వస్తే మీ యొక్క పరిధి స్థానిక పోలీసు స్టేషన్‌లో సమాచారం తప్పక ఇవ్వండి.మీ బస్తీ, కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వండి. లేదా డయల్ 100 కు ఫోన్ చేయండం మరువకండి. మీ వాహనా లను మీ ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకోండి. మీ ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా తాళాలు వేయండి, మీకు వీలైతే చక్రాలకు చైన్స్‌తో కూడా లాక్ వేయడం ఉత్తమం.

నమ్మకమైన వాచ్ మెన్‌లను మాత్రమే సెక్యూరిటి గార్డులుగా నియమించుకోండి. మీ ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాలను ఆన్లైన్ లో ఎప్పటికప్పుడు చూసుకుంటూ ఉండాలి. మీరు ఇంట్లో లేనప్పుడు ఇంటి ముందు చెత్త చెదారం, న్యూస్ పేపర్లు, పాల ప్యాకెట్లు జమ కానివ్వకుండా చూడాలి. వాటిని కూడా గమనించి చోరులు దొంగతనాలకు పాల్పడుతారన్న విషయాన్ని గమనించాలి. ప్రధాన ద్వారానికి తాళం కప్ప వేసినప్పటికి అవి కనిపించకుండా కర్టెన్స్‌తో కవర్ చేయడం చాలా ఉత్తమం. బయటకు వెళ్లేటపుడు ఇంటి లోపల, బయట కొన్ని లైట్లు వేసివుంటే చాలా మంచిది. మీ ఇంటి దగ్గర మీకు నమ్మకమైన ఇరుగు, పొరుగు వాళ్లకు మీరు ఇంట్లో లేని సమయంలో మీ ఇంటిని గమనిస్తు ఉండమని చెప్పడం మర్చిపోవద్దు. మీ ఇంటికి వచ్చే,వెళ్ళే దారులు, ఇంటిలోపల సీసీ కెమెరాలు అమర్చుకొని డివిఆర్ కనపడకుండా ఇంటి లోపల రహస్య ప్రదేశంలో పొందుపరచాలి. బీరువాలు, కబోర్డ్స్‌కు సంబంధించిన తాళాలు కామన్ ఏరియా అయిన చెప్పుల స్టాండ్, పరుపులు దిండ్ల క్రింద, అల్మారా పైన, డ్రెస్సింగ్ టేబుల్‌లో కబోర్డ్స్‌లో ఉంచకుండా మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో పెట్టాలి. బంగారు ఆభరణాలు వేసుకొని ఫంక్షన్‌లకు వెళ్ళేటప్పుడు తగు జాగ్రతలు తీసుకోవాలి. సోషల్ మిడియాలో మీరు బయటికి వెళ్లే విషయాన్ని ఇతరులకు షేర్ చేయడం ఎట్టి పరిస్థితుల్లో మంచిది కాదు.ఇది ప్రత్యేకంగా గుర్తుంచుకోవాలి. బస్తీల్లో,కాలనీల్లో దొంగతనాల నివారణకు స్వచ్ఛందంగా కమిటీలను నిర్వహించుకోవాలి. మీకు ఎవరిమీదైనా అనుమానం వస్తే 100 టోల్ ఫ్రీ నెంబర్‌కు గాని,సైబరాబాద్ పోలీస్ కంట్రోల్ రూమ్ కానీ సమీప పోలీస్ స్టేషన్‌కు గాని 9490617100, కు లేదా మా వాట్సాప్ నెంబర్ 9490617444,కు డయల్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఐద్వా, డీవైఎఫ్ఐ, సీఐటీయూ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సంక్రాంతి పండుగ సందర్భంగా ఐద్వా, డివైఎఫ్ఐ, సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కమిటీల ఆధ్వర్యంలో .. షాపూర్ నగర్‌లో ఎన్ వి.భాస్కరరావు కార్మిక కేంద్రం సీఐటీయూ కార్యాలయం దగ్గర ఉదయం 10 గంటలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డివైఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షులు కీలుకాని లక్ష్మణ్, ఐద్వా కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షురాలు రావుల స్వాతి, మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి సంవత్సరం ఐద్వా డివైఎఫ్ఐ, సీఐటీయూ సంఘాల ఆధ్వర్యంలో మహిళలకు ప్రతి సంవత్సరం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళల మానసిక ఉల్లాసానికి వాళ్లలో ఉన్న ప్రతిభను వెలికి తీయడం కోసం ఒక ప్రయత్నం జరుగుతుందన్నారు. మహిళలపై జరుగుతున్న హింస హత్యలు హత్యాచారాలకు వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడాలని జనాభాలో సగభాగమైన మహిళలకు పురుషులతో సమానంగా అన్ని హక్కులు కల్పించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తెలిపారు. ఈ ముగ్గుల పోటీలలో సంజయ్ గాంధీ నగర్ షాపూర్ నగర్, న్యూ షాపూర్ నగర్, కళావతి నగర్‌లకు సంబంధించిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయడం జరిగింది. అనంతరం గెలుపొందిన వాళ్లకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల నాయకులు పసుల అంజయ్య, మండల కోశాధికారి కుమ్మరి శీను, కరుణాకర్, మహిళా సంఘం మండలం నాయకులు జమున సిమ్రానీ, డివైఎఫ్ఐ కుత్బులాపూర్ మండల అధ్యక్షులు ఆది నాగరాజు, నాయకులు బి శ్రీనివాస్, కే.సైదులు, మైసయ్య ఉమా తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ పనులు ప్రారంభించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

వాకింగ్ ట్రాక్ పనులను కార్పొరేట్ మందడి శ్రీనివాస్ రావు ప్రారంభించారు. కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్ రమ్యా గ్రౌండ్‌లో ప్రజలు ఎదుర్కోంటున్న సమస్యలపై కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా మూడో ఫేసు రమ్య గ్రౌండ్ లో వాకింగ్ ట్రాక్ వేసి సుమారుగా 15 సంవత్సరములు దాటిపోయింది. ఆ వాకింగ్ ట్రాకు పాడైపోయి వాకింగ్ చేయటానికి వీలు లేకుండా మట్టి పెరుగుపోయి ఉంది. ఆ వాకింగ్ ట్రాక్‌ను పునర్ నిర్మించి ఉపయోగకరంగా చేయాలని కాలనీ వాసులు ఆయన దృష్టికి తీసుకవచ్చారు. దీంతో స్పందించిన కార్పొరేటర్ వాకింగ్ ట్రాక్‌ని పరిశీలించి వారు తమ సొంత ఖర్చులతో నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీ శివశక్తి కల్చరల్ అసోసియేషన్ కమిటీ సభ్యులు కట్టా నరసింగరావు, కాముని నర్సింహారెడ్డి, వాసిరెడ్డి లక్ష్మీనారాయణ, జాలారి శివ, నారాయణ రావు, రవీందర్ రెడ్డి, కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లోని నైపుణ్యాన్ని వెలికితీయాలి

- బాపూజీ పాఠశాల చైర్మెన్ కరస్పాండెంట్ నవ్వా ప్రభాకర్ రావు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మహిళలు, యువతుల్లోని నైపుణ్యాన్ని వెలికి తీసేదే ముగ్గుల పోటీలని బాపూజీ హై స్కూల్ చైర్మెన్, కరస్పాండెంట్ నవ్వా ప్రభాకర్ రావు అన్నారు. సంక్రాంతి పర్వదిన పురస్కరించుకొని జగద్గిరిగుట్ట పరిగి వెంకటేశ్వరనగర్‌లో గల బాపూజీ ఉన్నత పాఠశాలలో ఆదివారం సంక్రాంతి ముగ్గుల పోటీలు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళా శాంతికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుందన్నారు.ముగ్గుల్లో కలసి ఉన్న రంగులవలె మనమందరము కలిసి మెలసి ఉండాలని సూచించారు.నేడు మహిళలపై జరుగుతున్నా అఘాయిత్యాలను కలసి కట్టుగా ఎదుర్కోవాలని సూచించారు. రాజకీయ రంగంలోనూ ఆరుట్ల కమలాదేవి,మల్లు స్వరాజ్యం, సరోజినీ నాయుడు, లాంటి వాళ్ళను స్పూర్తిగా తీసుకొని చురుగా పాల్గొని రాణించాలన్నారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగిరెడ్డి, రేణుక, జగదీష్, సదానందం సత్యనారాయణ, కరుణాకర్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాకాటి మనోహర్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రముఖ లక్ష్మి గృహనిర్మాణ, సిగ్మా టెక్ అధినేత, సంఘసేవకులు, అధ్యాత్మిక వేత్త, లయన్ వాకాటి మనోహర్ జన్మదిన వేడుకలు రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి, పంచశీల కాలనీలో గల రాజ్యలక్ష్మి పరిశ్రమ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ జన్మదిన వేడుకలలో ప్రముఖ పారిశ్రామిక వేత్త, సమాజసేవకులు లయన్ డాక్టర్. చిల్లా రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయనతో కేక్ కట్ చేయించారు. అనంతరం శాలువతో సన్మానించి నూతన వస్త్రాలు కనుకగా అందించి.. పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వాకాటి మనోహర్ మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలు రాజశేఖర్ రెడ్డి గురుస్వామి సన్నిదిలో జరుపుకోవడం హరిహర పుత్రుడు అయ్యప్ప కల్పించిన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. నా శక్తిమేరకు సంఘసేవలో ఇతరులకు సహాయపడుతూ మానవసేవే మాధవసేవగా తన జీవిత ఆశయముగా ముందుకెళ్తానని అన్నారు. నా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన మిత్రులు రాజశేఖర్ రెడ్డికి కుటుంబ సభ్యులకు ఇతర స్నేహితులకు కృత్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి,మానస టూల్ టెక్ అదినేత,పుడమిరత్న అవార్డు గ్రహిత వాకిటి రామ్ రెడ్డి,వెంకలాస్ క్యాటరర్స్ అదినేత లయన్ ఎల్లా సుబ్బారెడ్డి, పారిశ్రామికవేత్త హేమాద్రి నాయిడు పరిశ్రమ కార్మికులు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు పరిశీలన



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని, పిజెఆర్‌నగర్‌లో రెండు కోట్ల రూపాయల అంచనావ్యయంతో, నూతనంగా చేపట్టబోయే ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను, అలాగే కోటి రూపాయల అంచనావ్యయంతో చేపట్టబోయే, చిల్డ్రన్ పార్క్ నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పీజేఆర్ నగర్ కాలనీలో జరుగుతున్న, చిల్డ్రన్ పార్క్ సుందరికారణ,ఫంక్షన్ హల్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. పీజేఆర్ నగర్ కాలనీ వాసుల చిరకాల కోరిక త్వరలోనే నెరవేరుతుందని, అందరికి ఆమోదయోగ్యమైన ఫంక్షన్ హాల్‌ను అన్ని హంగులతో సకల సౌకర్యాలతో నిర్మిస్తామని తెలియ చేసారు. ఫంక్షన్ హాల్ పేద మధ్య తరగతి ప్రజలకు ఇక్కడి పరిసర ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగప డుతుందని అన్నారు. ఫంక్షన్ హాల్‌లో వివాహాది శుభకా ర్యాలు, సమావేశాలు, సభలు, చిన్న చిన్న ఫంక్షన్‌లు జన్మదిన వేడుకలు నిర్వహించుకునేందుకు వీలుగా, ఫంక్షన్ హాల్ ఉపయోగాపడుతుందన్నారు. ఫంక్షన్ హాల్ మరియు చిల్డ్రన్ పార్క్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. నాణ్యత ప్రమాణాలతో చేపట్టి ప్రజలకు త్వరలోనే అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, కాశినాథ్ యాదవ్, సి హెచ్ భాస్కర్, మహేష్, సంతోష్ బిరాదర్, శ్రీను పాల్గొన్నారు.

ప్రజలకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడమే లక్ష్యం



నవతెలంగాణ-దుండిగల్

ప్రజలకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడమే లక్ష్యం అని పురపాలక సంఘం చైర్ పర్సన్ శంభీపూర్ క్రిష్ణవేణి క్రిష్ణ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపెట్ 26వ వార్డు కేవీఆర్ వ్యాలీలో ఆదివారం రూ.70 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సి.సి.రోడ్డు నిర్మాణ పనులు, రూ.35 లక్షల వ్యయంతో నూతన సెంట్రల్ లైటింగ్ పనులకు పురపాలక సంఘం చైర్ పర్సన్, కుత్బులాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ శంకుస్థపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధికి ఎల్లవేలలా కృషి చేస్తానన్నారు. మంజూరైన అభివృధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకువస్తానని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా పనిచేస్తామన్నారు. అనంతరం వార్డులో పర్యటించి ప్రజా సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ అర్కల జీతయ్య, దూలపల్లి కౌన్సిలర్ కిరణ్, నాయకులు సంగొల్ల తిరుమలేష్, అక్కమొల్ల భిక్షపతి, శ్రీశైలం, మల్లేష్, వివిధ కాలనీ ప్రెసిడెంట్లు, కాలనీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వదంతులు సృష్టించే వారిపై చర్యలు తీసుకోవాలి

- మేడ్చల్ జిల్లా కెమిస్ట్స్‌డ్రగ్గిస్ట్ మాజీ అధ్యక్షులు ఎరమాద హరినారాయణ



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మేడ్చల్ జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయని ఇటీవల (సామాజిక మాధ్యమాల్లో) వాట్సాప్ గ్రూప్‌లో కొందరు వ్యక్తులు వదంతులు పోస్ట్ చేశారని వారిపై చర్యలు తీసుకోవాలని ఆ సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు ఎరమాద హరినారాయణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల అయ్యాయని భావిస్తూ జిల్లాలోని కెమిస్ట్ లందరు అయోమయానికి గురవడం జరిగిందని ఆయన విచారం వ్యక్తం చేశారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో మూడువేల పైచిలుకు కెమిస్టులు ఉంటే కేవలం ముప్పై మంది కూడా లేకుండా నామినేషన్స్, ఎన్నికలు జరుపుకున్నారని అనటం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. జిల్లాలోని కెమిస్టులకు తెలియకుండా గోప్యంగా, తేది, స్థలం, సమయం ఇలా ఏదీ తెలియకుండా కొందరు అనుచరులను వెంటేసుకొని ఎన్నికలు జరుపుకున్నారని.. అది కూడా వాట్సాప్ ద్వారా కెమిస్టులకు తెలిసిందన్నారు. జిల్లా సంఘం బైలాస్ నిబంధనలు ఏమాత్రం పాటించకుండా జరిపిన ఈ ఎన్నికలను వెంటనే రద్దు చేసి తిరిగి మళ్ళీ నిబంధనల ప్రకారం ఎన్నికలు జరుపాలని జిలాలోని కెమిస్టులందరు కోరుతున్నారన్నారన్నారు.ఈ విషయమై రాష్ట్ర సంఘమైన ది తెలంగాణ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శి,కోశాధికారులకు, అల్ ఇండియా సంఘమైన ఏఐఓసిడి అధ్యక్ష కార్యదర్శులకు వినతి పత్రాలను సభ్యులతో కలిసి అందజేశారు.

సత్ జ్ఞాన్ హైస్కూల్‌లో ముగ్గుల పోటీలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

131డివిజన్ వెంకటేశ్వర్ నగర్ సత్ జ్ఞాన్ హైస్కూల్‌లో మహిళలకు సంక్రాంతి పండగ సందర్భంగా చాలా ఘనంగా రంగోలి కాంపిటీషన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. ఉత్తమమైన మొదటి తొమ్మిది స్థానాలు కైవసం చేసుకున్న మహిళలకు చీరలు బహుమతిగా ప్రధానం చేశారు. అలాగే పాల్గొన్న ప్రతి మహిళకు మెమొంటోతో పాటు సర్టిఫికెట్ ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల కరస్పాండెంట్ లయన్ చింతల మల్లేశం మాట్లాడుతూ.. తెలుగువారి సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండగని సంక్రాంతి పండగ అనగానే ముగ్గులు గుర్తొస్తాయని పండగ రోజున మహిళల సృజనాత్మకత కూడిన రంగవల్లులు తీర్చిదిద్దుతారని ఇది వారి స్పూర్తికి ప్రతిభకు తార్కానమని సంక్రాంతి పండుగ ప్రతి ఒక్కరిలో ఐకమత్యం ఒకరికి మరొకరు ఉన్నామని భావన పెంపొందించుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సంక్రాంతి నృత్య రూపకం పండగ విశిష్టత విశేషాలను ప్రతి ఒక్కరికి తెలియజేసే విధంగా ప్రదర్శించడం విచ్చేసిన ప్రతి ఒక్కరిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను తీర్చిన మహానుభావుడు కేసీఆర్



నవతెలంగాణ-దుండిగల్

పేదల సొంతింటి కలను తీర్చిన మహానుభావుడు అధినేత కేసీఆర్ అని ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ దుండిగల్ మున్సిపాలిటీ పరిధి దుండిగల్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయం నందు జరిగిన "డబల్ బెడ్ రూమ్ గృహ ప్రారంభోత్సవ" కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై డబల్ బెడ్ రూమ్ ఇండ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇరుకిరుకు గదులు కాకుండా విశాలవంతమైన రెండు పడక గదులతో ఇండ్లను నిర్మించి పేదల ఆత్మగౌరవాన్ని పెంచరన్నారు.ఈ విధంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో మౌలిక వసతుల కల్పనతో పాటు బస్సు సౌకర్యం కల్పిస్తామని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ శంభీపూర్ కృష్ణవేణి కృష్ణ , కౌన్సిలర్లు జక్కుల కృష్ణ యాదవ్, గోపాల్ రెడ్డి, శంభీపూర్ కృష్ణ, జక్కుల విజయ శ్రీనివాస్ యాదవ్, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద జయంతి వేడుకలు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సి పాలిటీ దుండిగల్ విలేజ్‌లో స్వామి వివేకానంద జయంతి వేడుకలు నరేందర్ ఆధ్వర్యంలో.. ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లద్దిపేర్ల నర్సింగ్ గౌడ్, అమరం గోపాల్ రెడ్డి, చిన్నంగి వెంకటేష్ హాజరయ్యారు. వివేకానంద జయంతి సంద ర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ స్వామి వివేకానంద సేవలు స్ఫూర్తిదాయక మని, ముఖ్యంగా ఆయన జయంతిని యూత్ డే గా జరుపుకుంటారని తెలిపారు ఈ కార్యక్రమంలో వంతు యశ్వంత్ కుమార్, టి.రాజు, సిహెచ్. మహేష్ టి.పాండు, శ్యామ్ గౌడ్, ఏ.శివుడు, విజయ్ సాయి, ఈ. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గురు గోవింద్ సింగ్ మహారాజ్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

గురు గోవింద్ సింగ్ మహారాజ్ 358వ జయంతి వేడుకలను ఆదివారం సికింద్రాబాద్ గురుద్వారా సాహెబ్ ఆధ్వర్యంలో క్లాసిక్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఉచితంగా దంత, కంటి, హృదయ వైద్య శిబిరాలను నిర్వహించినట్టు గురుద్వారా సాహెబ్ అధ్యక్షుడు బల్దేవ్ సింగ్ బగ్గా తెలిపారు. వేలాదిమంది సిక్కులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని, దాని ద్వారా అన్నదాన నిర్వహించినట్టు తెలిపారు. బలహీనులను, సౌమ్యులను గురువు రక్షించాడని వారు గుర్తు చేసుకున్నారు. జాతీయ సమైక్యత, శాంతి, సౌభ్రాతృత్వం, మత సామరస్యం కోసం నిలబడిన సిక్కు గురువుల చరిత్రను బోధనలుగా చేశారు.

పీజేఆర్ 77వ జయంతి వేడుకలు



నవతెలంగాణ-బంజారహిల్స్

మాజీ సీఎల్పీ నాయకులు పి. జనార్దన్ రెడ్డి 77వ జయంతిని పురస్కరించుకున్న టీపీసీసీ అధికార ప్రతినిధి మహేష్ కుమార్ గౌడ్. అనంతరం స్థానిక కార్పొరేటర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయరెడ్డితో కలిసి ఖైరతాబాద్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో పీజేఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తూ, కేక్ కట్ చేశారు. తదుపరి విద్యార్థులకు పీజేఆర్ ఫౌండేషన్ తరఫున పుస్తకాలను పంపిణీ చేశారు. అంతకుముందు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఆయన అభిమానులు ఖైరతాబాద్ నియోజకవర్గంలో పాటు నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు ఈ రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు.

విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేత



నవతెలంగాణ-కంటోన్మెంట్

ముగ్గుల పోటీ ద్వారా భవిష్యత్ తరాలవారికి సంస్కృతి సాంప్రదాయాలు తెలుస్తాయని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. సంక్రాంతి సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామి టెంపుల్ మాజీ చైర్మెన్ సంతోష్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన ముగ్గుల పోటీలో విజేతలకు ఎమ్మెల్యే శ్రీగణేష్ బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ముగ్గుల పోటీలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని తమలోని సృజనాత్మకతను, కళాత్మకతను సామాజిక స్పృహను రూపంలో చూపించాలని కోరారు. ప్రస్తుత బిజీ లైఫ్‌లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా మన సంస్కృతి సాంప్రదాయాలు తరువాతి తరాలకు తెలుస్తాయని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలందరినీ ఎమ్మెల్యే అభినందించారు. అలాగే ఈ సందర్భంగా కంటోన్మెంట్ ప్రజలందరికీ ఎమ్మెల్యే సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు చెప్పారు. పిల్లలు పతంగులు ఎగరేసేటప్పుడు చైనా మాంజా వాడవద్దని విజ్ఞప్తి చేశారు. పండుగ సందర్భంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి మన సంస్కృతి సాంప్రదాయాలను ప్రోత్సహిస్తున్నందుకు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సంతోష్ యాదవ్‌ను అభినందించారు.

ఓపెన్ జిమ్‌ను ప్రారంభించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ఆదివారం పీవీ ఎంక్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో ఓపన్ జిమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..కూకట్‌పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో ఓల్డ్ బోయిన్‌పల్లి 119 డివిజన్ అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. డివిజన్‌లో దాదాపు సమస్యలు పరిష్కరించామని తెలిపారు. ముఖ్యంగా కాలనీలో పార్కులు అభివృద్ధి చేయటము, కమిటీ హాల్ నిర్మాణాలు కూడా చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంక్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్ అడ్వైజర్స్ వేణుగోపాల్ నారాయణరావు, అధ్యక్షులు జగదీష్ వైస్ ప్రెసిడెంట్, రమేష్ యాదవ్ సెక్రెటరీ కెవి కృష్ణ, జాయింట్ సెక్రెటరీ ప్రసాద్, ట్రెజరర్ నైసిల్ కమిటీ మెంబర్స్ కృష్ణవేణి, మినీ పాండే శైలిత ఆమని కాలనీ వాసులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లిలో వివేకానంద జన్మదిన వేడుకలు



- హాజరైన బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్

నవతెలంగాణ-కంటోన్మెంట్

స్వామి వివేకానంద జయంతిని పరిష్కరించుకుని ఆదివారం స్వామి వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ న్యూబోయినపల్లి పంప్ హౌస్ సమీపంలో వివేకానంద విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హ్యూమన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రకాష్ భాటియా వృద్దులకు బ్లాంకెట్లు వితరణ చేయగా వీఆర్ హాస్పిటల్ ఎండి. నందకిషోర్ యువతకు టీషర్ట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మర్రి లక్ష్మణ్ రెడ్డి, సంక్షేమ సంఘం నాయకులూ మద్ది భాస్కర్ రెడ్డి, శశి రాజ్ యాదవ్, దయానంద్ యాదవ్, ముత్యాలు, దాదారావ్, జీతూ యాదవ్, మల్లేష్ యాదవ్, మధుసూదకర్, కృష్ణ, కుమార్ వర్మ, రంగా రెడ్డి, వినోద్ కుమార్, జ్యాంప్రకాష్, రాజు పాల్గొన్నారు.

రహమత్‌నగర్‌లో ముగ్గుల పోటీలు



- బహుమతులు అందజేసిన కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

సంక్రాంతి పండుగ సందర్భంగా రహమత్‌నగర్ క్రికెట్ గ్రౌండ్‌లో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రహమత్ నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులతో కలిసి పర్యటించి ముగ్గులను పరిశీలించి, గెలుపొందిన వారికి ఆకర్షణీయమైన బహు మతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా రహమత్ నగర్ డివిజన్ మహి ళలు కార్పొరేటర్ సీఎన్ రెడ్డిని అభినందించారు. కార్పొరేటర్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు మన్సూర్, ఇక్బాల్, అహ్మద్, శ్రీను, జ్ఞానేశ్వర్, మహిళలు పాల్గొన్నారు.

స్వామి వివేకానందునికి నివాళులు



- కంటెస్టెడ్ కార్పొరేటర్ మేకల కీర్తి హర్ష కిరణ్

నవతెలంగాణ-ఓయూ

స్వామి వివేకానంద జయంతి, నేషనల్ యూత్ డే సందర్భంగా మధురనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో మేకల కీర్తి హర్షకిరణ్ ఆధ్వర్యంలో వివేకానందునికు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేకల కీర్తి మాట్లాడుతూ... వివేకానందుడి ఆశయాలకనుగునంగా యువత ముందుకు వెళ్లి వారి ఆదర్శాలను మన దేశ భవిష్యత్తు తరాలకు తెలియజేయాలన్నారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఈరోజు యువజన దినోత్సవం జరుపుకుంటున్నారంటే అది మన అందరి అదృష్టమని ధైర్య సాహసాలు దేశం కోసం ధర్మం కోసం మన సమాజం కోసం వివేకానందుడు ఎన్నో మార్గదర్శకాలు చేశారని వారికి ఘనంగా నివాళులర్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, జిల్లా ఉపాధ్యక్షులు రాచమల్ల కృష్ణామూర్తి, డివిజన్ అధ్యక్షులు ఈ.వి. నరేష్, హన్మంతు ముదిరాజ్, ఆనంద్, సాయియాదవ్, వనమాల శ్రీనివాస్, రాజకుమార్, సతీష్, నాగరాజు పాల్గొన్నారు.

అమీర్‌పేట్‌లో అక్రమ నిర్మాణాలు

- బయట సున్నం వేసి లోపల పనులు
- పట్టించుకోని జీహెచ్‌ఎంసీ అధికారులు
- అన్ని సర్కిల్‌లలో సిబ్బంది కొరత, చైన్‌మాన్ల కొరత
- కొన్ని నెలల క్రితమే ఈ సర్కిల్ లకు బదిలీపై వచ్చాము: ఆఫీసర్లు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

అమీర్‌పేట్ డివిజన్ ధరం-కరం రోడ్డు పరిసరాలలో అనుమతి లేకుండా 200 గజాల స్థలంలో ఆరు అంతస్తులు, పెంట్ హౌస్ నిర్మిస్తున్నారు. ఇటీవల సర్కిల్ 17లోని జీహెచ్‌ఎంసీ అధికారులు బదిలీ కావటం, వచ్చిన అధికారులకు అవగాహన లేకపోవడం, ప్రతిరోజు ఏరియాలలో తిరగకపోవడం, కనీసం చైన్ మ్యాన్‌లు కూడా ప్రతిరోజు తిరిగి, ఎక్కడెక్కడ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని తెలుసుకొని టౌన్ ప్లానింగ్ అధికారులకు రిపోర్టు ఇవ్వాకపోవ్వడం. ఇలాంటి అక్రమ నిర్మాణాలు ఎక్కువతున్నాయి. అయితే అన్ని సర్కిల్‌లలో సిబ్బంది కొరత, చైన్ మాన్ల కొరత ఉన్నందున, అధికారులు డైరెక్ట్‌గా వెళ్లి తనిఖీ చేయలేకపోతున్నారు. దీనిని ఆసరాగా తీసుకున్న బిల్డింగ్ యజమానులు, జి ప్లస్ టు, జి ప్లస్ త్రీకి అనుమతి తీసుకొని, జి ప్లస్ ఫైవ్,సిక్స్ వరకు నిర్మాణాలు చేపడుతున్నారు. హైదరాబాదు నగరంలో ఒకపక్క హైడ్రా దూకుడు పెంచి, అనేక నిర్మాణాలు కూల్చివేస్తున్నప్పటికీ బిల్డింగ్ యజమానులు అనుమతి లేని నిర్మాణాలు చేపడుతున్నారు. సెలవు రోజులు వస్తే స్లాబులు వేయటం, ఆ తరువాత చుట్టు పట్టలు కట్టి లోపల పనులు కంప్లీట్ చేస్తున్నారు. అధికారులు కనీసం బిల్డింగ్ నిర్మాణం వద్దకు వచ్చి చూసి వెళ్లే దాఖలాలు కూడా లేవని, ఇరుగుపొరుగు నివాసులు ఫిర్యాదు చేసిన కూడా అధికారులు పట్టించుకోవటం లేదని స్థానికులు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. వెంటనే జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతి లేకుండా నిర్మిస్తున్న భవనాలను అడ్డుకోవాలి. సెట్ బ్యాక్ కూడా వదలకుండా, ఫైర్ యాక్సిడెంట్ జరిగితే కనీసం రక్షించే అవకాశం కూడా లేకుండా ఇండ్లు నిర్మించి కిరాయిలకు ఇస్తున్నారని, బిల్డింగ్ నిర్మాణం చేసే యజమానులు కేవలం కిరాయిలు వస్తే చాలు అనే ఉద్దేశంతోనే అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారుని కాలనీ ప్రజలు చెప్పుకుంటున్నారు.

ప్రస్తుతం ఉన్న ఆఫీసర్ల వివరాణ...

అక్రమ నిర్మాణాలపై జీహెచ్‌ఎంసీ సర్కిల్ 19, సర్కిల్ 17 టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్లను వివరణ కోరగా, కొన్ని నెలల క్రితమే ఈ సర్కిల్ లకు బదిలీపై వచ్చామని, ఇక్కడ మాకు సరైన సిబ్బంది లేరని, చైన్ మ్యాన్లు లేరని నాక్ ఇంజినీర్ల కొరత ఉందని తెలియజేస్తున్నారు. మేము వచ్చినప్పటినుండి ప్రభుత్వ పథకాలు సర్వే చేయడం, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు సర్వే చేయడం, కుల గణన సర్వే చేయటం సరిపోతుందని అంటున్నారు. మా పరిధిలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకుంటున్నామని, నోటీసులు జారీ చేస్తున్నామని, అయినా కూడా సెలవు దినాలలో రాత్రి పగలు పనిచేయిస్తూ బయట సున్నం వేసి లోపల పనులు చేస్తున్నారని తెలిపారు. చైన్ మాన్‌లు ఉంటే ప్రతిరోజు ఉదయం సర్కిల్ పరిధిలోని అన్ని బస్తీలు తిరిగి, ఎక్కడెక్కడ అక్రమ నిర్మాణం నిర్మిస్తున్నారు. తెలుసుకొని, ఫోటోలు తీసుకుని ఇంటి యజమానుల ఫోన్ నెంబర్లు తీసుకొని వచ్చి ఇచ్చేవారని, వెంటనే ఇంటి యజమానులను పిలిపించి అనుమతులు ఇవ్వటం లేదా? నోటీసులు ఇవ్వడం చేస్తున్నామన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని మేమే స్వయంగా వెళ్లి తెలుసుకొని కొన్ని అక్రమ నిర్మాణాలను నిలిపివేస్తున్నా మనీ, నోటీసులు జారీ చేస్తున్నామని అంటున్నారు. త్వరలో జీహెచ్‌ఎంసీ సర్కిల్ 19,17కు సిబ్బంది కొరత లేకుండా చూడాలని జీహెచ్‌ఎంసీ రెండు సర్కిల్ ల టౌన్ ప్లానింగ్ అధికారులపై అధికారులను కోరుతున్నారు.

మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలను
ప్రభుత్వం ఆదుకోవాలి

- సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

కొండ పోచమ్మ రిజర్వాయర్‌లో ఈతకు వెళ్లి మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండి ఆదుకోవాలని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. ఈ ఘటనలో బన్సీలాల్ పేట డివిజన్‌లోని సీసీనగర్‌కు చెందిన కిషన్, సుమలత కొడుకు దినేష్ (17) కూడా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం వారి నివాసానికి వెళ్లి దినేష్ భౌతిక కాయాన్ని పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం తల్లిదండ్రులను పరామర్శించి తన ప్రగాడ సంతాపం, సానుభూతిని తెలిపారు. ఒక్క గానొక్క కుమారుడు దినేష్ మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు అక్కడ ఉన్న వారిని ఎంతో కలచి వేసింది. ఎమ్మెల్యే దినేష్ తండ్రికి వ్యక్తిగతంగా ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో భవిష్యత్ ఉన్న చిన్నారుల జీవితం అర్థాంతరంగా ముగిసిపోవడం విచారకరం. గుడికి వెళ్తొస్తానని చెప్పి ఇంట్లో నుండి బయటకు వెళ్ళిన కొడుకు విగతజీవిగా రావడం ఆ తల్లిదండ్రులకు తీరని శోకం అన్నారు. తమ పిల్లల భవిష్యత్‌పై ఎన్నో ఆశలతో ఉన్న తల్లిదండ్రులకు విధి విషాదం మిగిలించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో సంతోషంగా సంక్రాంతి పండుగ జరుపుకోవాల్సిన వారి ఇండ్లలో ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపిందని పేర్కొన్నారు. ఈ ఘటనలో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు కూడా తన ప్రగాడ సంతాపం తెలిపారు. అంతా నిరుపేద కుటుంబాల వారని, వారికి ఒక్కో కుటుంబానికి రూ.20లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు కార్పొరేటర్ కుర్మ హేమలత, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, ఏసూరి మహేష్, లక్ష్మీపతి, రమణ, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగవల్లి కార్యక్రమాల్లో కార్పొరేటర్



నవతెలంగాణ-బేగంపేట

మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకునేందుకు ఇలాంటి రంగవల్లి కార్యక్రమాలను చేపట్టిన విశ్వకర్మ సంఘం వారికి అభినందనలని రామ్ గోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ సోమసందరం వీధిలోని విశ్వకర్మ సంఘ భవనంలో నిర్వహించిన రంగవల్లి సంక్రాంతి ముగ్గుల పోటీలకు అమె ముఖ్యఅతిథిగా హాజరై బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మహిళలలోని సృజనాత్మక శక్తిని వెలిగితీయడానికి ఇలాంటి పోటీలు దోహదపడతాయన్నారు. అంతకుముందు సంఘ అధ్యక్షులు గోపాలపురం ప్రకాష్ మాట్లాడుతూ.. మహిళలను సంఘ కార్యక్రమాలలో భాగస్వాములను చేయాలని ఉద్దేశంతో ఈ రంగవల్లి ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించిన వారికి కార్పొరేటర్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గిర్మాపురం భాస్కరాచారి, కోశాధికారి బోనాల శ్రీనివాస్ చారి, ఉపాధ్యక్షులు కటకం చక్రపాణి, సంగం సాంఘిక శాఖ చైర్మన్ బౌరంపేట వీరాచారి ఇతర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి దుబ్బాక కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

మన్నే సుబ్రహ్మణ్యం సంస్మరణ సభ



నవతెలంగాణ-ఓయూ

ప్రముఖ పారిశ్రామిక వేత్త మన్నే ఎం పవర్ చైర్మన్ మన్నే సుబ్రమణ్యం డిసెంబర్ 24 మృతి చెందిన విషయం తెలిసిందే. అమరులైన ప్రముఖ పారిశ్రామికవేత్త మన్నె సుబ్రహ్మణ్యం సంస్మరణ సభను ఆదివారం రాత్రి తార్నాకలోని మర్రికృష్ణహాల్‌లో మన్నే సుబ్రమణ్యం మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి అయిన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పలువురు మాట్లాడుతూ.. స్వ శక్తితో గొప్ప పారిశ్రామిక వేత్త ఎదిగిన వ్యక్తి అని, వేలాది మందికి ఉపాధి కల్పించి, ప్రత్యక్షంగా పరోక్షంగా ఎంతోమంది సహాయ సహకారాలు అందజేసిన వ్యక్తి అని అన్నారు. చిరు ఉద్యోగి స్థాయి నుండి భారీ పారిశ్రామిక వేత్తగా అనుకున్న రంగంలో ఎదిగి ఇలా ఆకస్మికంగా మృతి చెందడం దురదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో మన్నే సుబ్రమణ్యం మిత్ర మండలి కుమారుడు మన్నే నాగ పనింద్ర, టీజీకే మూర్తి, పద్మారావు, మన్నే.మల్లేశ్వరి, చిట్టి వీరయ్య, నరేంద్ర బాబు, శివ రాం ప్రసాద్, కె. రాంబాబు, చంద్ర మౌళి, రమేష్, కొత్త రామారావుతో పాటుగా మిత్ర మండలి, కుటుంబ సభ్యులు, మిత్రులు పాల్గొన్నారు.

మాదిగ విద్యార్థి యువ గర్జన కరపత్రం ఆవిష్కరణ



నవతెలంగాణ-ఓయూ

ఫిబ్రవరి 2న మాదిగ విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగ విద్యార్థి యువ గర్జన కరపత్రాన్ని సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ళ అజయ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్ట్స్ కాలేజ్ ఆవరణలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ పిడమర్తి రవి, విద్యా కమిషన్ మెంబర్ డాక్టర్ చారకొండ వెంకటేష్, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ చరణ్ కౌశిక్ యాదవ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ వరంగల్ రవి, డా.నంద్రు నరసింహ మాదిగ కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ.. ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో మాదిగలకు మద్దతుగా వచ్చిన మేధావులకు ధన్యవాదాలు తెలిపారు. 30 ఏండ్ల నుంచి మాదిగలకు మద్దతు తెలుపుతూన్నందుకు కృతజ్ఞతలన్నారు. కానీ తెలంగాణ విడిపోయిన తర్వాత మాదిగలకు ఎంత రిజర్వేషన్ కావాలి, రాష్ట్రంలో మాదిగ జనాభా ఎంత ఆ జనాభా దామాషా ప్రకారం మాదిగలకు రావలసిన వాటా ఎంత అనే క్లారిటీ మేధావులకు లేకపోవడం బాధాకరమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1994లో పెట్టిన డిమాండ్‌కు మీరు సపోర్టుగా మాట్లాడటం తెలంగాణ మాదిగ సమాజాన్ని తప్పుదోవ పట్టించడమే అవుతుంది. ఇప్పుడు తెలంగాణలో కొత్తగా జరుగుతున్నటువంటి కులగణన ప్రకారం మాకు వర్గీకరణ జరగాలనీ ఒక్క మేధావి కూడా చెప్పకపోవడం బాధాకరం. వర్గీకరణ వ్యతిరేకిస్తున్నటువంటి మాల సోదరులను ఒప్పించే ప్రయత్నాలు చేస్తారా చేయరా వాళ్ళని ఒప్పించాలి. మాదిగలకు మద్దతు చెప్పాల్సిన అవసరం లేదు మీరు తక్షణమే మాలలు ఒప్పించి మాల మాదిగ కులాల మధ్య మీటింగ్ పెట్టించి ఈ కులాలను తీసుకొని సీఎంని కలిసి వచ్చే బడ్జెట్ సమావేశాల్లో తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ వచ్చే విధంగా సీఎంని ఒప్పిస్తారని భావిస్తున్నాము అని పేర్కొన్నారు. బొమ్మర సమ్మయ్య, నల్లగట్ల సుమంత్, వలిగొండ నరసింహ, మొలగరం బాబురావు, జోగు గణేష్, నక్క మహేష్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు నేను క్లీన్ చిట్ ఇవ్వలేదు

- ఎమ్మెల్యే దానం నాగేందర్

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఫార్ములా ఈ-రేసు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు తానేమి క్లీన్ చిట్ ఇవ్వలేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. తాను ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడానంటూ సోషల్ మీడియాలో జరుగుతోన్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఆదివారం హైదరాబాద్ లో ఎమ్మెల్యే దానం నాగేందర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ అభివద్ధికి, పెట్టుబడులను ఆకర్షించేందుకు ఫార్ములా ఈ- రేసు నిర్వహించడం మంచిదేనని, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరిగిందని మాత్రమే తాను అన్నానని చెప్పారు. ఫార్ములా ఈ-రేసుపై కేటీఆర్ తన సలహా తీసుకున్నారని.. అప్పుడే తన అభిప్రాయం చెప్పానన్నారు. అయితే, తన వ్యాఖ్యలను కొందరు వక్రీకరించి.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడానంటూ పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలోనే ఫార్ములా ఈ-రేసు నిర్వహణలో నిధుల మళ్లింపులో క్విడ్‌ప్రోకో జరిగినట్టుగా అనుమానాలు ఉన్నాయని చెప్పారు. కేసు విచారణ తరువాత అన్ని వాస్తవాలు అవంతట అవే బయటకు వస్తాయన్నారు. తాను ఒక ఫైటర్‌నని.. ఉపఎన్నిక వచ్చినా భయపడేది లేదన్నారు. 'హైడ్రా'పై తన వ్యాక్యల్లో ఏమాత్రం మార్పు లేదని.. ఆ విషయంలో ప్రభుత్వం మరోసారి ఆలోచన చేయాలన్నారు.మూసీపై పరివాహక ప్రాంతంలో బీజేపీ నేతలు ఒక్క రోజు నిద్ర చేశారని.. వాళ్లకు నిద్రకు ముందే అక్కడికి ఏసీలు వెళ్లాయని ఎద్దేవా చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ



నవతెలంగాణ-ఓయూ

రజక వృత్తిదారుల సంక్షేమానికి అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడుతుందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం సికింద్రాబాద్ జోన్ అధ్యక్ష కార్యదర్శులు రాపర్తి ప్రభాకర్, పారపల్లి రాజు ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ రజక వృత్తిదారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి సంక్షేమ పథకాల ద్వారా ఉపాధి కల్పించేందుకు ఎల్లలేని కృషి చేస్తానన్నారు. అదేవిధంగా రజక సంక్షేమానికి నిధులు కేటాయించి వారి అభివృద్ధికి పాటుపడతామని, ఆ దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.సాలయ్య, ఏ హనుమంతు, జి.రమేష్, వి.మైసయ్య, ఆర్.తిరుపతి, బి.మల్లికార్జున్, జి.రాజు, ఎం.సాగర్, జి.రాము, ఏ.యాకయ్య, డి.శ్రీధర్, జే.అశోక్, ఎస్.కుమారస్వామి, ఎల్.శ్రీధర్ పాల్గొన్నారు.

చిత్రలేఖనం విద్యార్థులో సృజనాత్మకతను పెంపొందిస్తాయి

- వాల్‌హార్ట్స్ పెయింటింగ్, డ్రాయింగ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ బొబ్బిలి శశిధర్‌రెడ్డి



నవతెలంగాణ-బేగంపేట్

చిత్రలేఖనం విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తాయని వాల్హార్ట్స్ పెయింటింగ్, డ్రాయింగ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ బొబ్బిలి శశిధర్రెడ్డి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో సంస్థ ఆధ్వర్యంలో డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్కేజీ నుంచి ఇంటర్ మీడియేట్ వరకు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని ల్యాండ్ స్కేప్, కైట్ ఫెస్టివల్ థీమ్లపై డ్రాయింగ్, పెయింటింగ్ల చిత్రాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా శశిధర్రెడ్డి మాట్లాడుతూ.. పెయింటింగ్‌తో విద్యార్థుల్లో సరికొత్త ఆలోచనలు, ప్రయోగాలు చేయడానికి ఉపయోగపడతాయని అన్నారు. అలాగే వారిలో ఆత్మ విశ్వాసం, పరిశీలన నైపుణ్యాలను పెంచుతాయని తెలిపారు. ఎప్పటికప్పుడు పెయింటింగ్స్ సరికొత్త పద్ధతులు, శైలులు ఉపయోగిస్తూ ముందుకు వెళ్లాలన్నారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా ఒక్కో విభాగం నుంచి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు పాల్గొన్న వారందరికి సర్టిఫికేట్లు అందించారు.

కొత్త ఎల్లయ్య హైస్కూల్‌లో బొమ్మల కొలువు



నవతెలంగాణ-బేగంపేట్

సికింద్రాబాద్ సోమ సుందరం వీధిలోని కొత్త ఎల్లయ్య హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు విశేషంగా ఆకట్టుకుంటోంది. భారతీయ సంస్కృతీ, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా తీర్చిదిద్దిన బొమ్మలు కొలువుదీరి అందరినీ ఆకర్షిస్తున్నాయి. ఉత్తమ పురుషునికి పర్యాయ పదంగా నిలిచే శ్రీరామ చంద్రుని జననము, పట్టాభిషేకం, దశావతారాలు, రంగవల్లులు, గొబ్బెమ్మలు, హరిదాసుల ప్రాధాన్యతను కళ్ళకు కట్టినట్టు ఆవిష్కరించారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ బొమ్మల కొలువును వీక్షించేందుకు విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. పిల్లలకు చదువుతో పాటు మన ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సాంప్రదాయాలను పట్ల ఆసక్తిని కలిగించదానికి తాము ఎప్పటికప్పుడు వైవిధ్య భరిత కార్యక్రమాలు నిర్వహిస్తుంటామని పాఠశాల కరస్పాండెంట్ కొత్త శంతన్ కుమార్, ప్రిన్సిపాల్ కొత్త ఝాన్సీరాణిలు తెలిపారు. అధ్యాపకుల, తల్లిదండ్రుల సహకారంతో తాము మున్ముందు ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని నిర్వహిస్తామని వారు వెల్లడించారు.

ఓయూలో వివేకానంద జయంతి వేడుకలు




నవతెలంగాణ-ఓయూ

ఏబీవీపీ ఓయూ శాఖ ఆధ్వర్యంలో 162వ స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఆదివారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏబీవీపీ ప్రాంత సహసంఘటన మంత్రి విష్ణువర్ధన్ పాల్గొని మాట్లాడారు. వివేకానందుడు కలకత్తాలోని విశ్వనాథ్ దత్తా, భువనేశ్వరి దంపతులకు జన్మించి కేవలం 40 సంవత్సరాలు జీవించినప్పటికీ ఆయన పేరు చరిత్రపుటల్లో ఎల్లకాలం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిటీ సెక్రెటరీ పృథ్వీ తేజ, జాతీయ కార్యవర్గ సభ్యులు జీవన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అలివెలి రాజు, రాష్ట్ర కర్యాసమితి సభ్యులు కమల్ సురేష్, జిల్లా కన్వీనర్ హరిప్రసాద్, యూనివర్సిటీ అధ్యక్షులు ధృహాస్, యూనివర్సిటీ కార్యదర్శి శివశంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శేఖర్, కళ్యాణ్, విద్యార్థి నాయకులు కోటి విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు హైడ్రా ప్రజావాణికి సెలవు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రతి సోమవారం హైడ్రా నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సంక్రాంతి పండగ సెలవులు కారణంగా ఈ నెల 13న(నేడు) నిర్వహించట్లేదని హైడ్రా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రభుత్వ సెలవులులో ప్రజావాణి ఉండదని గతంలో ప్రకటించిన విషయం విధితమే. వచ్చే సోమవారం (20.1.2025) ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి కొనసాగిస్తామని హైడ్రా ప్రకటించింది.





స్వామి వివేకానంద 162వ జయంతి సందర్భంగా మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ ప్రధాన కూడలిలో ఉన్న స్వామి వివేకానంద విగ్రహం దగ్గర బ్రహ్మచారి పూసల, రామ్ ప్రదీప్ మునుగంటి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి , కార్పొరేటర్ ప్రభుదాస్ , బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ శాసనసభ్యులు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, సుభాష్ రెడ్డి , మాజీ ఎంబీసీ చైర్మెన్ తాడూరి శ్రీనివాస్ , స్థానిక నాయకులు హాజరై వివేకానంద విగ్రహానికి ఘన నివాళ్లర్పించారు.

నవతెలంగాణ-కాప్రా

గాన రస భరితంగా యేసు దాసు జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కల్చరల్

విఖ్యాత గాయకుడు డాక్టర్ కె జె యేసు దాసు జన్మ దిన వేడుకలు గాన రస భరితంగా జరిగాయి. శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై రిషి మ్యూజికల్ ఈవెంట్స్ నిర్వహించారు. ఎందరో వర్ధమాన ప్రవర్ధమాన గాయనీ గాయకులు జేసు దాసు పాడిన సినీ ప్రయివేటు భక్తి గీతాలు ఆలపించారు ప్రత్యేకంగా యోగిత అక్కిరాజు సహా గాయకులు రిషి, శ్రీనివాస్ రెడ్డి రవి ఫణి కిషోర్ లతో కలసి సుమధురం గా ఆలపించి శ్రోతలను ముగ్దులను చేశారు. సూర్య వికాస్ కామేష్ అపర్ణ ఇందు నయన కూడా పాటల గానం లో పాలు పంచుకున్నారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో అభినందనలు తెలిపిన వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు మాట్లాడుతూ యోగిత స్వయం గా గాయకురాలు అయినప్పటికీ సహా గాయకులను ప్రోత్సహించాలన్న సదుద్దేశ్యంతో ఋషి సంస్థ ను స్థాపించి తరచు కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదరణ పొందుతున్నారన్నారు. ప్రముఖ గాయకుడు త్రినాథ రావు మాట్లాడుతూ జేసు దాసు మాతృ భాష మలయాళం అయినా తెలుగు హిందీ పాటలను అమోఘం గా పాడి ప్రజల అభిమానం చూరగొన్నారని చెప్పారు. అక్కిరాజు ప్రభంజన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు

జింఖానా గ్రౌండ్స్‌లో ఘనంగా జాతీయ యువజన దినోత్సవం



నవతెలంగాణ-సిటీబ్యూరో

స్వామి వివేకానంద జన్మ దినోత్సవం సందర్భంగా ఆదివారం జాతీయ యువజన దినోత్సవం వేడుకలను జింఖానా గ్రౌండ్స్ లోని జిల్లా యువజన, క్రీడా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ జాతీయ యువజన దినోత్సవం వేడుకలకు జిల్లా యువజన, క్రీడాధికారి ఎస్.సుధాకర్ రావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా అర్జున అవార్డు గ్రహీత అనూప్ కుమార్ యమా విచ్చేశారు. సుధాకర్ రావు మాట్లాడుతూ స్వామి వివేకానందను నేటి యువత స్ఫూర్తిగా తీసు కోవాలనీ, తమ లక్ష్య సాధనలో స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు. నూప్ కుమార్ యమా మాట్లాడుతూ నేటి తరం యువత ఉజ్వల భవిష్యత్తుకు స్వామి వివేకానంద బోధనలను ఆచారంలో తీసుకొని వారి లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడా కార్యాలయ సిబ్బంది, కొచేస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

'ముషీరాబాద్'లో విషాద ఛాయలు..





- కొండపోచమ్మ రిజర్వాయర్ ఘటనలో ఒకే కుటుంబంలో అన్నదమ్ముల మృతి

నవతెలంగాణ - ముషీరాబాద్

సిద్దిపేట కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ లో ఈత కొట్టడానికి వెళ్లిన ఏడుగురులో ఐదుగురు మృతి చెందిన విధితమే. ఈ ఘటనలో ముషీరాబాద్‌కు చెందిన ఒకే కుటుంబంలో అన్నదమ్ములు మృతి చెందడంతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. ముషీరాబాద్ నియోజకవర్గం భోలక్‌పూర్ డివిజన్ ఇందిరానగర్ కు చెందిన నర్సింగరావు, జయశ్రీ లకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు. కూతురుకు వివాహమైంది. ధనుష్ తండ్రి ఫోటో స్టూడియో చూసుకుంటుండగా, లోహిత్ టీకేఆర్ కాలేజీలో డిప్లొమా రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇదిలా ఉండగా ఈనెల 11న స్నేహితులతో కలిసి సిద్దిపేట కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ ను చూసేందుకు వెళ్లి సెల్ఫీలు దిగుతూ ధనుష్, లోహిత్ మృత్యువాత పడ్డారు. శనివారం రాత్రి ధనుష్, లోహిత్ మృతదేహాలను భోలక్‌పూర్ డివిజన్ ఇందిరానగర్ కు తీసుకొచ్చారు. దీంతో వారి తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, స్థానికులు పెద్ద పెట్టున రోదించారు. తల్లిదండ్రుల రోదనను చూసి అక్కడ ఉన్న ప్రతి ఒక్కరూ కంటతడి పెట్టారు. ఇందిరానగర్ లో పూర్తిగా విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానికంగా ఏ మనిషిని తట్టినా అన్నదమ్ముల మృతి గురించి చర్చించడం, కంటతడి పెట్టడం కనిపించింది. ధనుష్, లోహిత్ లకు గోల్నాక లోని అరాస్ పెంట స్మశాన వాటికలో అంత్యక్రియలు జరిగాయి. అంతకు ముందు ఇందిరానగర్ నుండి కన్నీటితో అంతిమయాత్ర జరిగింది.

చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జై సింహ తదితరులున్నారు.

కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ వద్ద రక్షణ చర్యలను ఏర్పాటు చేస్తాం : మాజీ పీసీసీ అధ్యక్షుడు వి.హనుమంతరావు

కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ వద్ద భవిష్యత్తులో ఇలాంటి ఘట నలు జరగకుండా ఉండేం దుకు ప్రభుత్వంతో చర్చించి రక్షణ చర్యలను ఏర్పాటు చేస్తామని మాజీ పీసీసీ అధ్యక్షుడు వి.హనుమంతరావు అన్నారు. కొండపోచమ్మ మృతి చెందిన ధనుష్, లోహిత్‌ల తల్లిదండ్రులను భోలక్‌పూర్ ఇందిరానగర్ లోని వారి నివాసం వద్ద వి.హనుమంతరావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో మాట్లాడి కొండపోచమ్మ సాగర్ వద్ద 5 గజ ఈతగాళ్లలను ఏర్పాటు చేయాలని, ఇలాంటి సంఘటనలు జరగకుండా భద్రత చర్యలు తీసుకోవాలని కోరారు. చనిపోయిన యువకులు యుక్త వయస్సు వారు.. బి.టెక్, పాలిటెక్నిక్ విద్యార్థులు కావడం బాధాకరమని, వారి కుటుంబాలకు సంతాపాన్ని తెలియజేస్తున్నట్లు తెలిపారు. అలాగే ముఖ్య మంత్రితో మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వం తరపున వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేయడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. అంతకుముందు సిద్దిపేట జిల్లా మార్కుక్ మండలంలోని కొండపోచమ్మ సాగర్ లో ఈతకు వెళ్లి ఐదుగురు దుర్మరణం చెందిన ఆదివారం నాడు సంఘటన స్థలాన్ని మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ వి.హనుమంత రావు స్థానిక మార్కెట్ కమిటీ చైర్మెన్ నరేందర్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులతో కలసి పర్యటించి అక్కడి పోలీసులను, స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.



మృతుల కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

కొండపోచమ్మ సాగర్‌లో పడి మృతి చెందిన భోలక్‌పూర్ ఇందిరానగర్ కు చెందిన ధనుష్, లోహిత్ మృతదేహాలకు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదివారం నివాళులర్పించారు. వారి తల్లిదండ్రులు నర్సింగరావు జయశ్రీలకు ధైర్యం చెప్పారు. పదివేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కొండ పోచమ్మ సాగర్ వద్ద ఎలాంటి రక్షణ చర్య లేకపోవడం వల్లే ఐదుగురు యువకులు మృతి చెందారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 50 లక్షలు



ప్రమాదవశాత్తు కొండపోచమ్మ రిజర్వాయర్ లో చనిపోయిన ముషీరాబాద్ నియోజకవర్గనికి చెందిన ధనుష్, లోహిత్ ల మృతదేహాలకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నాగేష్ ముదిరాజ్ నివాళ్లర్పించారు. మృతుల తల్లిదండ్రులను పరామర్శించారు.

విశ్వకర్మ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ - బోడుప్పల్

బోడుప్పల్ లోని టెలిఫోన్ కాలనీ లో విశ్వ విరాట్ సంఘం అధ్యక్షులు చలకుర్తి కనకచారి ఆధ్వర్యంలో నూతన సంవత్సరం 2025 క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విశ్వకర్మలు రాజకీయ చైతన్యం కలిగి ఉండాలని అన్నారు. ఏ రాజకీయ పార్టీలు మనకి తగిన గుర్తింపు ఇచ్చి తగు ప్రాతినిధ్యం కల్పించడం లేదని తెలిపారు నేటి రాజకీయాలన్నీ ఓట్ల చుట్టు తిరుగుతన్నవి ఏకులంలో ఎక్కువ ఓట్లు ఉంటే ఆ కులం భజన చేస్తున్న రోజులు ఇవి అన్నారు. మనం మారుదాం మన బలాన్ని బలగాన్ని... పెంచుకుందామని అయన అన్నారు. మనం కలిసికట్టుగా ఉండటం తో పాటు రాజకీయా చైతన్యం కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. కార్యదర్శి పడకంటి నర్సింహాచారి కోశాధికారి మద్దోజు శ్రీనివాస్ మిగిలిన సంఘ సభ్యులు పాల్గొన్నారు

కొండపోచమ్మ సాగర్ బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

- సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి వెంకటేష్



నవతెలంగాణ-సిటీబ్యూరో

సిద్దిపేట జిల్లాలోని కొండపోచమ్మ సాగర్‌లో నీట మునిగి దుర్మరణం పాలైన అయిదుగురు బాధిత కుటుంబాలకు సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ప్రగాఢ సానూభూతి వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆదివారం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం. వెంకటేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. కొండపోచమ్మ సాగర్‌కు విహారయాత్రకు వెళ్లిన పిల్లలు చాలా నిరుపేద కుటుంబాలకు చెందిన వారనీ, ఈ కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని సీపీఐ(ఎం) తరఫున ఆయన విజ్ఞప్తి చేశారు. కొండపోచమ్మ సాగర్‌లో ఇలాంటి ఘటనలు అనేకం జరిగాయని వార్తలు వస్తున్నాయనీ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అక్కడ రక్షణ చర్యలు తీసుకోవాలని వెంకటేష్ కోరారు.



రెడ్డి సంఘం అభివృద్ధికి కృషి చేస్తా

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ - చర్లపల్లి

రెడ్డి సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం నాచారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెడ్డి సంఘం అభివృద్ధికి తన వంతుగా సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాస్ రెడ్డి, మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రమణరెడ్డి, భూపాల్ రెడ్డి, రెడ్డి సంఘం నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరిష్కార దిక్సూచి నవతెలంగాణ

- స్వాగత్ కన్వెన్షన్ బిజినెస్ హెడ్ షేక్ రఫీక్



నవతెలంగాణ - చర్లపల్లి

ప్రజా సమస్యలను వెలికి తీస్తూ, పేద ప్రజలకు నవతెలంగాణ దినపత్రిక అండగా నిలుస్తుందని స్వాగత్ కన్వెన్షన్ బిజినెస్ హెడ్ షేక్ రఫీక్ అన్నారు. మల్లాపూర్ లోని స్వాగత్ కన్వెన్షన్ హాల్ బిజినెస్ హెడ్ షేక్ రఫీక్ ఆదివారం నవతెలంగాణ క్యాలెండర్ ను ఆవిష్కరించారు. సందర్భం గా ఆయన మాట్లాడుతూ.. అనుదినం జన స్వరమై ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా సమగ్ర సమాచారం అందిస్తున్న నవతెలంగాణ భవిష్యత్తులో మరింత ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ రిపోర్టర్ పటేల్ నరసింహులు, స్వాగత్ కన్వెన్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

వివేకానంద స్ఫూర్తి యువతకు ఆదర్శం



- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ - చర్లపల్లి

స్వామి వివేకానంద 162వ జయంతిని పురస్కరించుకొని కుషాయిగూడ వివేకానంద పార్క్ లోని వివేకానంద విగ్రహం వద్ద ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇనుప కండరాలు.. ఉక్కు నరాలు.. వజ్రశంకల్పం.. ఉన్న యువత ఈ దేశానికి ఎంతో అవసరం అని స్వామి వివేకానంద చెప్పిన మాటలను గుర్తు చేశారు. అలాగే యువత అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడైనా స్వామి వివేకానంద స్ఫూర్తి ని తీసుకొని ముందుకు సాగాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, పండాల శివకుమార్ గౌడ్, పనగట్ల చక్రపాణి గౌడ్, నేమూరి మహేష్ గౌడ్, అనిల్ గుప్తా, సారా అనిల్, చిత్తుల కిషోర్, వాసుదేవ ముదిరాజ్, పంజాల బాబు గౌడ్, చల్ల వెంకటేష్,యావపురం రవి, పండాల గణేష్ గౌడ్, దయానంద్, కొడకండ్ల యాదయ్య, చిదం బాలనర్సింహా, కొమ్ము సురేష్, క్యాత దినేష్, జర్దన్, భాస్కర్, రాజు, మణి కిరణ్, బుడంపల్లి వెంకటేష్, బన్నపురం నాగరాజు, లావణం శ్రీను, సంతోష్, అనిల్ యాదవ్, శ్రీరాములు, కళ్యాణ్, సత్తి, రాంచందర్ గౌడ్,లడ్డు, వి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కాప్రా : మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ లో హెచ్ బి కాలనీ ఫేస్-1 ప్రధాన కూడలిలో గల స్వామి వివేకానంద విగ్రహానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డిలు పూలమాల వేసి నివాళులు అర్పించిన . నర్సింహ రావు, ఎనుముల మహేష్, రాంప్రదీప్, పి.బ్రహ్మచారి, పసునూరి బ్రహ్మచారి, ఉల్లెం బాలరాజు, జంపాల్ రెడ్డి, గడియారం రామకృష్ణ, కృష్ణమూర్తి, అశోక్, నవీన్ గౌడ్, కుమార్, లింగం, చారి, బాలయ్య గౌడ్ మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనాగరిక వర్గాల ఆపద్బాంధవుడు అంబేద్కర్

- 9వ నిజాం రౌనక్ యార్ ఖాన్



నవతెలంగాణ - బంజారాహిల్స్

అనాగరిక వర్గాలకు సమన్యాయం జరిగేలా రాజ్యాంగాన్ని రూపొందించిన మహనీయుడు అంబేద్కర్ అందరికీ ఆదర్శప్రయుడని 9వ నిజాం రౌనక్ యార్ ఖాన్ అన్నారు. డి.లిట్ డే సెలబ్రేషన్స్‌లో అంబేద్కర్ కు నివాళులు అర్పించారు. అంతకుముందు దళిత, ముస్లిం,క్రైస్తవ సంస్థలు,దక్షిణాది జాయింట్ యాక్షన్ కమిటీ,ఆదివాసీల సహకారంతో ఏర్పాటు చేసిన డి.లిట్ డే, నేషనల్ స్కాలర్స్ డే కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన అసఫ్ జాహీ రాజవంశం 9వ నిజాం మొదటి ప్రజాస్వామ్య నిజాం రౌనక్ యార్ ఖాన్‌కు ఘనంగా స్వాగతం పలికారు.

వివేకానంద జయంతికి నృత్య నీరాజనం



నవతెలంగాణ-కల్చరల్

జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్వామి వివేకానందను స్మరిస్తూ నృసింహ కూచిపూడి నాట్య భారతి నిర్వహణలో శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా దీక్షితులు కళా వేదిక పై నృత్య నీరాజనం అర్పించారు. నాట్య గురువు ఆక్కుల శ్రీనివాస్ కుమార్ శిష్య బృందం అలేఖ్య, ఆభిగ్య, దదీప్య, తన్విక, నితిక, హరిప్రియ తదితరులు గణేష్ స్తుతి పుష్పాంజలి రామ శబ్దం తదితర అంశాలు చూడ ముచ్చటగా లయ బద్దంగా నర్తించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వ్యక్తిత్వ వికాస నిపుణులు పీవీ మూర్తి పాల్గొని మాటాడుతూ వివేకానంద సందేశం నేటి యువతరంలో ప్రచారం జరుగాలని అన్నారు. శ్రీనివాస్ కుమార్ శిష్య బృందం దీక్ష నిబద్ధత తో నాట్య ప్రదర్శన చేశారని అభినందించారు. నటుడు ధన రాజు, వ్యాఖ్యాత మోహన్ గాంధీ తదితరులు పాల్గొన్నారు. నాట్య ప్రదర్శన కు గాత్రం అల్లి శంకర్ వేణువు పై సురేంద్ర తబలా పై ప్రభాకర్ సహకరించి రక్తి కట్టించారు.

ఎల్ అండ్ టీ చైర్మెన్ వ్యాఖ్యలు కార్మిక హక్కులను అవమానించడమే

- ఐద్వా గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు ఏ పద్మ,వై.వరలక్ష్మి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎల్ అండ్ టీ చైర్మెన్ ఎస్ ఎన్ సుబ్రహ్మణీయన్ కార్మికులు వారానికి 90 గంటలు పనిచేయాలనీ భార్యల ముఖాలు ఎంతసేపు చూస్తారు ఆదివారాలు కూడా ఆఫీసులకు వచ్చి పనిచేయాలని చేసిన వ్యాఖ్యలు కార్మికులనే కాకుండా వారి కుటుంబ సంబంధాలను కూడా అవమానించడమేనని ఐద్వా గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు ఏ పద్మ,వై.వరలక్ష్మి, సహాయ కార్యదర్శి కె.నాగలక్ష్మి ఒక ప్రకటనలో అన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు కార్పొరేట్లు తరచుగా చేయడం పరిపాటిగా మారిందని ఈ వ్యాఖ్యలతో వారి ధన దాహం వారి సంకుచిత మనస్తత్వాలు బయట పడుతున్నాయన్నారు. ఈ వ్యాఖ్యలను వారు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రోజుకు 13 గంటల పని విధానం తేవాలనీ, తమ లాభాలను ఇంకా ఇబ్బడి ముబ్బడి గా పెంచుకోవాలనే తపనతో కార్పొరేట్లు ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, వీరికి వంత పాడుతున్న బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్చి బీజేపీ పాలిత రాష్ట్రాలలో 12 గంటల పని విధానాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అనేక మంది ఆరోగ్య నిపుణులు కూడా మనిషికి 8 గంటల పని, 8 గంటల నిద్ర 8 గంటలు తమ పనులకు వెసులుబాటు తో ఉండాలని చెప్తున్నారని కానీ కార్పొరేట్లు మాత్రం కార్మికులు నిద్రాహారాలు మాని బానిసల వలె వారి సేవలో తరించాలని కోరుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికే అధిక పని భారంతో కుటుంబ సంబంధాలు దెబ్బతింటున్నాయని, కార్మికులు కుటుంబాలతో గడిపే సమయం తగ్గిపోతుండగా భార్యలతో ఎంత సమయం గడపాలో వీరు నిర్ణయించాలనుకోవడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. ఇటువంటి ఆలోచనలు మానుకొని గంటల తరబడి చాలీ చాలని వేతనాలతో, అధిక ధరలతో సతమతమవుతున్న కార్మికుల సంక్షేమం గురించీ వారి కుటుంబాల గురించి ఆలోచించాలని కోరారు. కార్మికుల జీతభత్యాలు, వారి జీవన ప్రమాణాలు ఒకవైపు పడిపోతుండగా కార్పొరేట్ల లాభాలు 15 ఏండ్ల గరిష్టానికి పెరిగాయనీ సుబ్రహ్మణీయన్ వేతనం, సగటు కార్మికుల వేతనానికి 537 రెట్లు ఎక్కువగా ఉందని, ఇంతటి ఆర్థిక అసమానతలను ఎలా తగ్గించాలో ఆలోచించలేని ప్రభుత్వాలు, కార్పొరేట్లు కార్మికుల రక్త మాంసాలను ఇంకా పిండుకొని లాభాల వేటకై పరుగులు తీస్తున్నారని.. ఇటువంటి వ్యాఖ్యలు మానుకోవాలని అన్నారు.

ముగ్గుల పోటీలు తెలుగు సంప్రదాయానికి నిదర్శనం

- టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్త



నవతెలంగాణ- నాగోల్

ముగ్గుల పోటీలు తెలుగు సంప్రదాయానికి నిదర్శనమని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. ఆదివారం నాగోల్ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నాగోల్ గ్రామంలో జరిగిన ముగ్గుల పోటీల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీమన్నారు. సంక్రాంతి పండుగ అంటేనే మనకి గుర్తుకు వచ్చేది హరిదాసులు,గొబ్బెమ్మలు సంక్రాంతి ముగ్గులు,భోగి మంటలు అని, ప్రతి తెలుగువాడు చేసుకునే అతిపెద్ద పండుగ సంక్రాంతి అని అన్నారు. ప్రతి ఇల్లు సంతోషాలతో జరుపుకోని అష్టఐశ్వర్యాలతో తులతూగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నామని తెలిపారు. అత్యంత వైభవంగా ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగిందని,ఈ పోటీలలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని వారి సంతోషాన్ని, ఆనందాన్ని వ్యక్తం చేస్తూ రకరకాల ముగ్గులు వేసి ప్రతిభను కనబరిచారని, గెలుపొందిన మహిళలను అభినందించారు. విజేతలకు ప్రథమ ద్వితీయ తృతీయ, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగోల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సూర్య నాయక్ , నాగోల్ మాజీ సర్పంచ్ గోల్కొండ మైసయ్య, వెంకటేష్ డప్పు రాజు అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు డప్పు వినోద్ నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్స్ బస్సులపై కొనసాగుతున్న ఆర్టీఏ దాడులు

మొత్తం 253 బస్సులపై కేసులు నమోదు.. రూ.76 వేల జరిమానా వసూలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రయివేటు ట్రావెల్స్ బస్సులపై ఆర్టీఏ అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. గడిచిన వారం రోజులుగా గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా రవాణాశాఖకు చెందిన ప్రత్యేక అధికార బృందాలు ప్రధాన హైవేల్లో నిఘా వేసి వాహనాల తనిఖీ చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో వందలాది బస్సులను చెక్ చేసిన ఆర్టీఏ అధికారులు రూల్స్‌కు విరుద్ధంగా నడుస్తున్న బస్సులపై పలు కేసులు నమోదు చేశారు. ఇందులో భాగంగా ఆదివారం చేపట్టిన తనిఖీల్లో మరో 102 బస్సులపై కేసులు నమోదు చేయగా.. ఇందులో సెంట్రల్ జోన్-11, ఈస్ట్‌జోన్-13, వెస్ట్ జోన్-7, నార్త్ జోన్-20, సౌత్ జోన్-29, డీటీటీ నాగోల్ -22 బస్సులపై కేసులు నమోదయ్యాయి. అలాగే రూ. 24 వేల జరిమానా వసూలు చేశారు. కాగా ఇప్పటివరకు మొత్తం 253 బస్సులపై కేసులు నమోదు చేసి.. జరిమానా రూపంలో రూపంలో రూ.76వేలు వసూ లు చేశారు. ప్రజలకు ప్రయాణం భారం కాకుండా సౌకర్య వంతమైన రవాణాను అందించాలన్న ప్రభుత్వ సూచనల మేరకు ఆర్టీఏ అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలు పక్కాగా దాడులు కొనసాగిస్తున్నాయి. ప్రయివేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు నిబంధనలు ప్రకారం నడుచుకుని రవాణాశాఖకు సహకరించాలని సంబంధిత అధికారులు కోరుతున్నారు.

చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు

- సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్



నవతెలంగాణ - చంపాపేట్

చైనా మాంజాను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామనిసౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ సుభాష్ పాటిల్ అన్నారు. సైదాబాద్ పరిధిలోని తన కార్యాలయంలో ఆదివారం వారు మీడియాతో మాట్లాడారు. నిషేధిత మాంజాను విక్రయించిన వారిపై, కొనుగోలు చేసిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పతంగులు ఎగురవేసే సమయంలో పక్షులతో పాటు మనుషులకు కూడా మాంజాతో ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. హరిత ట్రిబ్యునల్ అదేశాల మేరకు చైనా మాంజా విక్రయాలపై నిఘా పెట్టామని, ఎక్కడైనా చైనా మాంజాను ఉపయోగిస్తే వారి సమాచారం తమకు అందించాలని సూచించారు. పండుగకు వెళ్లే వారు వారి ఇంటి ఇరుగు పొరుగువారికి చెప్పి వెళ్లాలని, అదే విధంగా విలువైన ఆభరణాలు, నగదును ఇంట్లో పెట్టి వెళ్లరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో సౌత్‌అస్ట్ జోన్ అదనపు డీసీపీ స్వామి, సైదాబాద్, మలక్‌పేట్, సంతోష నగర్ ఏసీపీలు శ్యాంసుందర్, మహమ్మద్ గౌస్, వెంకన్న నాయక్, డీఐలు, సీఐలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలలో ముందుంటున్న వాసవి క్లబ్



- అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్త

నవతెలంగాణ -నాగోల్

నిరుపేదలు, మధ్యతరగతి వారికి వైద్య శిబిరాలను రక్తదాన శిబిరాలను తదితర సామాజిక సేవలను అందించడంలో వాసవి క్లబ్ ముందుంటుందని అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస గుప్త అన్నారు. ఆదివారం నాగోల్ బండ్లగూడలోని పప్పుయి గూడ చౌరస్తాలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్ గుప్తతో కలిసి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భగా శ్రీనివాస గుప్తా మాట్లాడుతూ 63 సంవత్సరాల క్రితం స్థాపితమైన ఈ వాసవీ క్లబ్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నదని నిర్వాహకులను అభినందిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు, మెగా హెల్త్ క్యాంపులు, పుస్తకాల పంపిణీ కార్యక్రమాలు, పేద మధ్య తరగతి కుటుంబాలకు సహాయ సహకారాలు అందిస్తున్న వాసవీ క్లబ్ వారికి దయాకర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వీసీహెచ్ ప్రెసిడెంట్ పొద్దటూరి రాజేశ్వర్ రావు , సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రా చారి, యాధి రెడ్డి అధ్యక్షుడు దయాకర్ , ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ప్రభ , కోశాధికారి ప్రదీప్ కుమార్ , కన్వీనర్ మధు ప్రాజెక్ట్ చైర్మెన్ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి



- కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ నాథ్ యాదవ్

నవతెలంగాణ- నాగోల్

స్వామి వివేకానంద జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ నాథ్ యాదవ్ సూచించారు.ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని బీజేపీ నాగోల్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి బిజెపి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి తో కలిసి వారు పాల్గొని స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ యువ మిత్రుల ందరికీ "జాతీయ యువజన దినోత్సవ', సంక్రాంతి శుభాకాంక్షలు, తెలియజేశా రు. అనంతరం నూతన నాగోల్ డివిజన్ అధ్యక్షులుగా పంగా శ్రీకాంత్, రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులుగా పాల్వాయి సంజీవ రెడ్డి ఎన్నికైన సందర్భంగా వారిని సన్మానించారు. నాగోల్ డివిజన్ అధ్యక్షులు పంగా శ్రీకాంత్,రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్వాయి సంజీవ రెడ్డి, సిద్ధల ఐలయ్య,వస్పారి మల్లేష్ ,కేసిరెడ్డి పద్మ రెడ్డి,లయ కాలం శెట్టి,చంద్ర శేఖర్ గుప్త,పంగా శ్యామ్ కుమార్, యాదగిరి,వినోద్ యాదవ్,నర్సింగ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలనలో దాడిని ప్రశ్నిస్తే అరెస్టులా..?



- బీఆర్ఎస్ మీర్‌పేట్ అధ్యక్షులు కామేష్ రెడ్డి

నవతెలంగాణ - మీర్ పేట్

ప్రజాపాలనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీ నాయకులపై దాడి చేయడాన్ని ప్రశ్నిస్తే పోలీసులచే అరెస్టు చేయించడం అన్యాయమని బీఆర్ఎస్ మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి అన్నారు. భువనగిరిలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడి చేయడాన్ని నిరసిస్తూ చలో భువనగిరి కార్యక్రమాన్ని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఆదివారం మీర్ పేట్ పోలిసులు బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నిరంకుశ, నియంత పాలనా సాగుతున్నదన్నారు. బీఆర్ఎస్ నాయకులపై దాడి చేయడమే కాకుండా అధికారం చేతిలో ఉందని కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులచే అధికార దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. అరెస్ట్ అయినా వారిలో బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, బిమిడి జంగారెడ్డి, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రామన్, అవినాష్ తదితరులు ఉన్నారు.



బీఆర్ ఎస్ పార్టీ జల్ పల్లి మున్సిపాలిటీ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ యంజాల అర్జున్‌ను ఆదివారం పహాడీ షరీఫ్ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

నవతెలంగాణ-బడంగ్‌పేట్

భూ భారతితో సమస్యలు తీరేనా..!

- ధరణి పోర్టల్ స్థానంలో భూ భారతి
- మాడ్యూళ్ల సంఖ్య 6కు కుదింపు

నవతెలంగాణ-హాయత్ నగర్

వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు-మ్యుటేషన్ల ప్రక్రియ కోసం తెలంగాణ ప్రభుత్వం కొత్తగా భూ భారతి పోర్టల్ తీసుకొచ్చింది. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ స్థానంలో భూ భారతి రూపొందించారు.దాని గురుంచి పూర్తి వివరాలు ఓ సారి తెలుసుకుందాం.

భూ సమస్యలకోసం ధరఖాస్తు కోసం గత పోర్టల్ లో 33 మాడ్యూళ్లు ఉండేవి. ఒక్కో సమస్య కు ఒక్కో దాన్ని ఏర్పాటు చేశారు. సాంకేతికతపై అవగాహన లేకపోవడం,సమస్యల దరఖాస్తులపై స్పష్టత లేక రైతులు ఒక దానికి బదులు మరో మాడ్యూల్లో దరఖాస్తు చేస్తే తిరస్కరణ అయ్యేవి.దీంతో ప్రతి సారి రూ. 1200 వెచ్చించి పదే పదే దరఖాస్తు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రభుత్వం ఈ విధానాన్ని సులభతరం చేసి మాడ్యూళ్ల సంఖ్య ను 6కు కుదించింది. పోర్టల్ దరఖాస్తు చేస్తే ఇకపై భూ యజమాని ఫొన్ నెంబర్‌కు ఎస్ఎంఎస్ వస్తుంది.దరఖాస్తు పురోగతి ని చూసుకునేలా ట్రాకింగ్ వ్యవస్థ ఉంటుంది. అలాగే ఎవరివైనా, ఎక్కడి నుంచైనా భూముల వివరాలు చూసేలా అవకాశం ఉంది.వ్యవసాయ భూముల పూర్తి సమాచారాన్ని తిరిగి నమోదు చేసేందుకు పహనీ కాలంలను పునరుద్ధరణ చేసింది. 2020కి ముందు 32కాలం లతో పహణి ఉండేది.భూ యజమాని పేరు, భూ ఖాతా,సర్వే నెంబర్,అనుభవదారా/పట్టాదారా,ప్రభుత్వ భూమినా లేక పట్టానా ఇలా 32కాలం ఉండేవి.గత ప్రభుత్వం వాటన్నింటినీ తొలగించి పట్టాదారు పేరు మాత్రమే ఉండేలా పహణి అమలు చేసింది. ఈ క్రమంలో భూముల వివరాల లభ్యత లేక అనేక సమస్యలు ఉత్పన్నమైనట్టు ధరణి కమిటీ గుర్తించి ప్రభుత్వానికి నివేదించింది.దీంతో ప్రస్తుత అవసరాలకు తగినట్టు 11 కాలంలతో కొత్త పహణిని ఏర్పాటు చేస్తు నిర్ణయం తీసుకుంది.ధరణి లో ఉన్న తప్పులను సవరించడానికి, భూమి ఉండి కూడా కొత్త పాసు పుస్తకాలు రాని వాళ్లకు(పార్టు-బీ కేసులకు 18లక్షల ఎకరాలు)రికార్డ్ లకు ఎక్కించి పాసు పుస్తకాలు ఇచ్చేటట్లు కొత్త చట్టం రూపొందించారు.ప్రస్తుతం ఉన్న ధరణి రికార్డ్‌ను పూర్తి గా ప్రక్షాళన చేసిన తర్వాతనే కొత్త చట్టం కింద రికార్డ్‌ను నమోదు చేస్తారు. అప్పటివరకు ఇప్పుడున్న ధరణి రికార్డ్ తాత్కాలికంగా కొనసాగుతుంది.ప్రక్షాళన చేసి కొత్త రికార్డ్ ను రూపొందిస్తారు.భవిష్యత్ లో భూ సర్వేను కూడా చేసి రికార్డ్ ను రూపొందించేందుకు అవకాశం కల్పించనున్నారు.



భూ భారతి తో రైతులకు కలిగే లాభాలు

రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత వెను వెంటనే మ్యూటేషన్ జరిగి పాస్ పుస్తకం వస్తుంది. ఒకవేళ తప్పు జరిగితే అప్పీల్ చేసుకునే అవకాశాన్ని కొత్త చట్టం కల్పిస్తుంది. మ్యూటేషన్ కు మ్యాప్ తప్పనిసరిగా ఉంటుంది. పాసు పుస్తకం లో కూడా మ్యాప్ ఉంటుంది.దీంతో సరిహద్దు వివాదాలు,డబుల్ రిజిస్ట్రేషన్ కు అవకాశం ఉండదు. భవిష్యత్ లో భూ వివాదాలకు తావులేకుండా ఎంజాయ్ మెంట్ సర్వే చేయించి శాశ్వతంగా పరిష్కరించే విధానం అందుబాటులో వస్తుంది. వారసత్వ భూములకు కూడా నిర్ధీత కాలంలో విచారణ చేసిన తర్వాత నే పాసు పుస్తకాలు జారీ అవుతాయి.13బీ,38ఈ, ఓ ఆర్ సీ,లావుని పట్టా వంటి మార్గాల్లో భూమి వచ్చినప్పుడు పాస్ పుస్తకాలు పొందే అవకాశం పాత చట్టం లో లేదు.వీరందరికి కూడా పాసు పుస్తకాలు ఆర్డీఓ ద్వారా ఇచ్చే అవకాశాన్ని కొత్త చట్టం కల్పిస్తుంది. ప్రభుత్వ ఆస్తులను ఉద్దేశ్య పూర్వకంగా తారుమారు చేసే అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకుని శిక్షించేలా కొత్త చట్టం లో ఉంది.రెవిన్యూ రికార్డ్ లు ట్యాంపరింగ్ జరగకుండా కంప్యూటర్ రికార్డులతో పాటు నిర్ధిత కాల వ్యవధిలో మ్యానువల్ కాపీని కూడా రెవిన్యూ ఆఫీసుల్లో భద్ర పరుస్తారు.

భూ సమస్యలు లేకుండా చూడాలి



భూ చట్టాలు ఎన్నోచ్చిన పేదలకు ఇబ్బందులు లేకుండా, త్వరితగతిన సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలి. ఎన్ని చట్టాలు వచ్చిన కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉంటున్నాయి. వారికే ప్రభుత్వ భూములు ధారాదత్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసైన్డ్ పట్టాలు ఇస్తామని చెప్పిన మాటలను నిలుపుకోవాలి ఏది ఏమైనా గతంలో ఉన్న భూ సమస్యలు ఈ సారి లేకుండా చూడాలి.

– సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు

భూ సమస్యలుంటే అప్పీల్ కు అవకాశం



గతంలో రైతులకు భూ సమస్యలు ఉంటే అప్పీల్ కు అవకాశం లేకుండా ఉండేది. నూతనంగా వచ్చిన భూ భారతి తో ప్రతి రైతుకు అప్పీల్‌కు అవకాశం ఉంది. రిజిస్ట్రేషన్ చేసే సమయంలో ఏదైనా మార్పు చేసేందుకు నోటీస్ ఇచ్చి అభ్యంతరం ఉంటే తెలిపే చాన్స్ ఉంది. ఒక్కో ఖాతాకు భూదాన్ నెంబర్ అసైన్డ్ చేసి స్కెచ్ మ్యాప్ ద్వారా తెలియపరుస్తాం.ఎలాంటి భూ సమస్యలున్నా అడిషనల్ కలెక్టర్ స్థాయిలో పరిష్కరిస్తాం.

– హాయత్ నగర్ తహసీల్దార్ జానకీ



మన్సూరాబాద్ పెద్ద చెరువు వద్ద ఓపెన్ జిమ్ ప్రారంభం

నవతెలంగాణ-హాయత్ నగర్

మన్సూరాబాద్ పెద్ద చెరువు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆదివారం స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ రెడ్డి పెద్ద చెరువు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు,చుట్టు పక్కన కాలనీ అధ్యక్షులు సభ్యులతో కలిసి ప్రారంభించారు.కార్పొరేటర్ పెద్ద చెరువు వద్ద రోజు రోజుకి పెరుగుతున్న వాకర్స్ దృష్ట్యా మరొక ఓపెన్ జిమ్‌ను కూడా అతి త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజలందరూ వీటిని సద్వినియోగించుకుని ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వేమన్ రెడ్డి, సభ్యులు మధురానగర్ అధ్యక్షులు భూపాల్ రెడ్డి, శ్రీ సరస్వతి నగర్ అధ్యక్షులు శేఖర్ రెడ్డి, శ్రీరామ హిల్స్ అధ్యక్షులు జైపాల్ రెడ్డి వివిధ కాలనీల సభ్యులు పాల్గొన్నారు.



ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు

నవతెలంగాణ-చంపాపేట్

ఐఎస్ సదన్ డివిజన్ గవర్నమెంట్ ప్రెస్ కాలనీ వద్ద స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్ రెడ్డి పాల్గొని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ యువత వివేకానంద అడుగుజాడలో నడవాలన్నారు.కాలనీ కమిటీ సభ్యులు శంకరాచారి, దేవేందర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, విజయ్ కుమార్ , నరసింహారెడ్డి, బాలకష్ణ, డివిజన్ ప్రెసిడెంట్ గిరిధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్,రమాదేవి, సుష్మ ,బస్సు శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతకు మార్గదర్శకాన్ని వివేకానంద ప్రపంచ దేశాలకు చాటి చెప్పారు

నవతెలంగాణ-హాయత్ నగర్



స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్,స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి నేతృత్వంలో మాన్సూ రాబాద్ సహార రోడ్డు మార్గంలో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి ఆయనను స్మరించుకుంటూ ఘనంగా నివాళులు అర్పించారు. యువతకు జాతీయ యువజన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి ఆకట్టుకొని స్వామి వివేకానంద నామస్మరణలతో నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి,కళ్లెం నవజీవన్ రెడ్డి,కొప్పుల విటల్ రెడ్డి, బీజేపీ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు హరీష్ రెడ్డి,విష్ణువర్ధన్ రాజు,భరత్ భూషణ్, పశుపతి,రామ్ రెడ్డి,శ్రీరామ్ రెడ్డి,ముత్యం రెడ్డి, యంజాల జగన్, రఘు,నవీన్,సిద్ధు మహిళలు పద్మా రెడ్డి,మాధవి, గీతారెడ్డి,అనిత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు వెలికితీయడంలో దిట్ట నవతెలంగాణ

నవతెలంగాణ-హాయత్ నగర్



ప్రజా సమస్యలు వెలికితీయడంలో దిట్ట నవతెలంగాణ దినపత్రిక అని సీపీఐ(ఎం) ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య అన్నారు. ఆదివారం భూపేష్ గుప్తా నగర్ లో పార్టీ నందనవనం శాఖ కార్యదర్శి మంతని యాదయ్య ఇంటిదగ్గర నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆయన అధ్యక్షతన ఆవిష్కరించారు. ముఖ్య అతిథులు హాజరైన పార్టీ ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి మాట్లాడుతూ పత్రికా ప్రపంచంలో నిజాలు నిర్భయంగా రాయడంలో నవ తెలంగాణ దిట్ట అని అన్నారు మిగతా పత్రికలకు దీటుగా వార్తా సేకరణలో నవతెలంగాణ శైలి వర్ణించలేదని, ఎన్నో ఏండ్లుగా ప్రజా ప్రతినిధులకు అధికారులకు వారధులుగా ఉంటూ ప్రజా సమస్యలు తీర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నదని కొనియాడారు. 2025 నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ప్రజల కార్మికుల పక్షపాతి గా ఉంటూ వార్త ప్రచురించడంలో ఎక్కడా రాజీ పడకుండా అద్భుతమైన వార్త కథనాలతో ప్రజల మన్ననలు పొందుతున్న నవతెలంగాణ దినపత్రిక యజమాన్యానికి, పాత్రికేయులకు, సిబ్బందికి ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ కార్మికుల, పక్షాన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ శాఖ సభ్యులు కస్తూరి శ్రీనివాస్ పం దుల లక్ష్మయ్య, పుల్జాల రాములు,యాదమ్మ సీతమ్మ, సుగు ఐమ్మ, రాజేశ్వరి, అరుణ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి



- లార్డ్స్ విద్యా సంస్థల చైర్మెన్ సిద్ధాల బీరప్ప
- లార్డ్స్ ఒలింపియాడ్ స్కూల్‌లో ఘనంగా సంక్రాంతి వేడుకలు

నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అల్మాస్ గుడలోని వినాయక హిల్స్‌లో లార్డ్స్ ఒలింపియాడ్ పాఠశాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా వేడుకలు



ఘనంగా నిర్వహించినట్టు విద్యా సంస్థల చైర్మెన్ సిద్దాల బీరప్ప తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల తల్లులకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాఠశాల ప్రాంగణమంతా గాలిపటాలతో, రంగవల్లులతో రంగులమయమైంది.ఈ సందర్భంగా లార్డ్స్ విద్యా సంస్థల చైర్మెన్ మాట్లాడుతూ " ఈ పోటీ ప్రపంచంలో విద్యార్థులు అన్ని రంగాల్లో రంగులమయంగా రాణించాల్సిన ఆవశ్యకత గురించి విద్యార్థులందరికీ చక్కగా వివరించారు. లార్డ్స్ వైస్ చైర్మెన్ బెర్లు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే విద్యార్థుల మదిలో భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల విలువలు కలిగిన పౌరులుగా తీర్చిదిద్దే విధంగా శిక్షణ ఇవ్వడంలో విద్యార్థుల తల్లిదండ్రుల సహకారాన్ని లార్డ్స్ విద్యాసంస్థలు ఎప్పుడూ ప్రోత్సహిస్తాయన్నారు.ఈ కార్యక్రమంలో ఒలింపియాడ్ స్కూల్ డైరెక్టర్ సిద్దాల శ్రీలత,డీన్ సతీష్, ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి,ఇంచార్జి ఉదయ్ కుమార్, విద్యార్థిని, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

వికలాంగులకు ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-సిటీబ్యూరో



సంక్రాంతి పండుగ సందర్భంగా సెవెన్ రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వికలాంగులకు ముగ్గుల పోటీలు నిర్వహిం చారు. ఈ పోటీల్లో దాదాపు 20 మంది వరకు పాల్గొనగా.. అందరికీ నగదు బహుమతులు అందజేశారు. స్పెషల్‌గా మొదటి, రెండు, మూడో బహుమతులను అందజేసినట్టు సెవెన్ రేస్ ఫౌండర్ డాక్టర్ సారా తెలిపారు. వికలాంగులకు ఎంత సహాయం చేసినా తక్కువే అనీ, భవిష్యత్‌లోనూ వారికి అండగా ఉంటానని తెలిపారు. అందరూ సంక్రాంతి పండుగను ఆనందోత్సాహల మధ్య జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.

అనుకున్నది జరగకపోయినా.. కోరుకుంది దక్కకపోయినా.. ఇలా కారణం ఏదైనా సరే.. ఎవరికైనా సరే.. వెంటనే మూడ్ మారిపోతుంది.. డల్‌గా మారిపోయి మనసు కుమిలిపోయేలా చేస్తుంది. అయితే ఇలాంటి స్థితిలో ఎక్కువ సేపు ఉండటం మానసికంగా అంత మంచిది కాదు అంటున్నారు నిపుణులు. అందుకే వెంటనే మన మానసిక స్థితి తిరిగి మామూలుగా మారేలా చేసుకోవాలని సూచిస్తున్నారు. కొన్ని చిన్న చిన్న పనుల ద్వారా అది చాలా సులభమంటున్నారు. ఇంతకీ మన మూడ్‌ని ప్రభావితం చేసే ఆ పనులేంటో మనమూ ఓసారి తెలుసుకుందాం...



మూడ్ బాలేదా..?

సాధారణంగా మూడ్ మారాలంటే యోగా, కిక్‌బాక్సింగ్.. వంటి వ్యాయామాలు చేయడం, గార్డెనింగ్... మొదలైన వాటి ద్వారా మనసును సంతోషం వైపు మళ్లించవచ్చని చెబుతుంటారు. అయితే ఒక్కోసారి మన వద్ద అంత సమయం ఉండకపోవచ్చు. అటువంటప్పుడు మన శరీరంలో చిన్న చిన్న కదలికలు చేయడం ద్వారా మానసిక స్థితిని తిరిగి సంతోషంగా మారేలా చేయొచ్చంటున్నారు మానసిక నిపుణులు.

వండర్ ఉమన్‌లా...

వండర్ ఉమన్ సినిమా చూసే ఉంటారు కదా! నడుంకి కాస్త కింది భాగంలో రెండు చేతులు పెట్టి ఆత్మవిశ్వాసం తొణికిసలాడేలా చెరగని చిరునవ్వు, బెదరని కంటి చూపుతో ఒక మహిళ కనిపిస్తుంది. అదే భంగిమలో మీరూ కాసేపు నిలబడి చూడండి.. ఇదేమిటీ అనుకుంటున్నారా? వినడానికి కాస్త ఆశ్చర్యంగా ఉన్నా ఇది మన మూడ్‌ని మార్చేందుకు బాగా సహకరిస్తుందని పలు అధ్యయనాల్లో తేలింది. ఇలాంటి భంగిమలో రెండు నిమిషాల పాటు నిలబడడం వల్ల శరీరంలో టెస్టోస్టిరాన్ స్థాయిలు 20శాతం పెరుగుతాయి. అలాగే ఒత్తిడికి కారణమయ్యే కార్టిసాల్ స్థాయిలు 25శాతం తగ్గుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. అంటే ఆందోళన, బాధ.. వంటి భావాల నుంచి కాస్త బయటపడి సంతోషం వైపు దృష్టి సారించే అవకాశం ఉంటుంది. అలాగే ఆత్మవిశ్వాసం పెరిగిన భావన మనలో కలుగుతుంది. ఇలా చేయడం వల్ల ఎలాంటి సందర్భంలోనైనా మన మూడ్ ఇట్టే మారిపోతుందట.



నచ్చినట్లు డ్యాన్స్ చేయండి..

మానసిక స్థితి కాస్త మెరుగుపరుచుకునేందుకు సాధారణంగా సూచించే మార్గాల్లో డ్యాన్స్ చేయడం కూడా ఒకటి. అయితే ఇదేదో క్రమపద్ధతిలోనే చేయాలని అనుకోవద్దు. ఎందుకంటే నచ్చిన పాటకి మనకొచ్చినట్లు డ్యాన్స్ చేసినా అది మూడ్‌పై ప్రభావం చూపి తిరిగి మనం సంతోషంగా ఉండేలా చేస్తుంది. ఇది కూడా అధ్యయనంలో నిరూపితమైందే.. అందుకే ఈసారి కాస్త డల్‌గా ఉన్నట్లనిపిస్తే వెంటనే హుషారైన పాటకి నచ్చినట్లుగా చిందులు వేయండి. మనసు తిరిగి సంతోషంతో నిండిపోతుంది.

సరదాగా షాపింగ్ చేయండి

షాపింగ్ చేయడానికి, మూడ్ మారడానికి సంబంధం ఏంటి అని ఆలోచిస్తున్నారా? ఉంది.. కానీ ఇక్కడ షాపింగ్ చేయమన్నాం కదా అని వందలు, వేలు ఖర్చుపెట్టి ఖరీదైన వస్తువులు కొనేయాల్సిన అవసరం లేదు. మూడ్ బాలేదనిపించినప్పుడు నచ్చిన దుస్తులు, యాక్సెసరీలు కొనడం, నచ్చిన ఆహారం తీసుకోవడం... వంటి చిన్న చిన్న పనులు చేయడం ద్వారా కూడా మూడ్‌ని తిరిగి సాధారణ స్థితికి తీసుకురావచ్చు. అయితే ఇలా షాపింగ్ చేసి మనం కొనే వస్తువు తప్పకుండా మన సంతోషాన్ని పెంచేదై ఉండాలి. అప్పుడే అది మన మానసిక పరిస్థితిపై ప్రభావం చూపి తిరిగి మామూలు స్థితికి వచ్చేలా చేసే వీలు ఉంటుందని గుర్తుంచుకోవాలి.



సంతోషాన్ని ఇచ్చే ఫొటోలు

ఫొటోలు.. అనగానే అందరికీ ఠక్కున గుర్తుకొచ్చేది.. ఒకప్పుడైతే ఆల్బమ్.. ఇప్పుడు మాత్రం స్మార్ట్‌ఫోన్‌లోని గ్యాలరీ. అయితే అప్పటికప్పుడు మన మూడ్ మారేందుకు అది ఎలా ఉపయోగపడుతుందబ్బా అనుకుంటున్నారా? మన ఫోన్లో ఇప్పటికే మన కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపిన క్షణాలు, స్నేహితులతో టూర్‌కి వెళ్లిన మధుర జ్ఞాపకాలు.. ఇలా చాలా ఉండి ఉంటాయి. మనం చేయాల్సిందల్లా మూడ్ బాలేదనిపించినప్పుడు ఏకాంతంగా ఉండే ప్రదేశానికి వెళ్లి రెండు నిమిషాలు శ్వాస మీద ధ్యాస కేంద్రీకరించాలి. ఆ తర్వాత ప్రశాంతమైన మనసుతో మధురమైన జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకొంటూ ఫోన్లో ఉన్న ఫొటోలు చూడండి.. తప్పకుండా మానసిక స్థితి మారుతుంది.

మరెన్నో మార్గాలు

- మూడ్‌ని ప్రభావితం చేసే అంశాలు ఒక్కొక్కరిలో ఒక్కోలా ఉంటాయి. కొందరు పసిపిల్లలతో గడుపుతూ ప్రశాంతత పొందితే, ఇంకొందరు సంగీతం వినడం ద్వారా శాంతిస్తారు. మరికొందరు పాటలు పాడడం ద్వారా ఒత్తిడికి స్వస్తి పలుకుతారు. మరి మీ మూడ్ మారడానికి ఎలాంటి అంశం దోహదం చేస్తుందో ఒకసారి పరిశీలించుకోండి. తద్వారా క్షణాల్లో మీ మూడ్‌ని తిరిగి సాధారణ స్థితికి తీసుకొచ్చే వీలు ఉంటుంది.
- పెంపుడు జంతువులతో కాసేపు ఆడుకోవడం..
- మీరు ఒంటరిగా ఉన్నప్పుడు వాకింగ్ స్టైల్ కాస్త మార్చి కొత్తగా నడిచేందుకు ప్రయత్నించడం..
- కుర్చీలో నిటారుగా కూర్చొని చేతులు మోకాళ్లపై ఉంచి, నాలుక బయటపెట్టి ముక్కు ద్వారా శ్వాస తీసుకుంటూ నోటి ద్వారా వదిలిపెట్టడం..
- తలని అటుఇటూ వూపడం..
- లాఫింగ్ థెరపీ.. బయటకు గట్టిగా నవ్వడం ద్వారా ఆక్సిజన్ అధిక మొత్తంలో శరీరం లోపలికి ప్రవేశిస్తుంది. ఇది ఎండార్ఫిన్లు ఎక్కువగా విడుదలయ్యేలా చేసి ఒత్తిడిని తగ్గించడమే కాకుండా మనం సంతోషంగా ఉండేలా చేస్తుంది.

ఇలాంటి చిన్న చిన్న పనుల ద్వారా కూడా మన మూడ్‌ని వెంటనే మార్చుకునే వీలు ఉంటుంది. అయితే ఇందుకు ముందుగా మానసికంగా మనల్ని మనం సన్నద్ధం చేసుకున్నప్పుడే ఫలితం కనిపించే అవకాశం ఉంటుంది. మీరూ వీటిని ఓసారి ప్రయత్నించి చూడండి. ■

ఆరోగ్యంగా తిందాం...



పీచు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది కూడా రకరకాలు ఉండొచ్చు గానీ ప్రధానమైనవి నీటిలో కరిగేది, నీటిలో కరగనిది. ఫైబర్స్ గట్ మైక్రోబయోటాను మీడియేట్ చేస్తుంది, జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. రోజువారీ తగిన మోతాదులో ఫైబర్ తీసుకోవడం వల్ల దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఫైబర్ రిచ్ డైట్ బ్లడ్ షుగర్ లెవల్స్‌ను నియంత్రిస్తుంది. ఫైబర్ రిచ్ డైట్ గుండె పనితీరును మెరుగుపరుస్తుంది.

తృణధాన్యాలు తీసుకోండి..

అనారోగ్యకరమైన పాస్తా, వైట్ బ్రెడ్ వంటి ప్రాసెస్ చేసిన ధాన్యాలకు బదులుగా తృణధాన్యాలు తీసుకుంటే మన శరీరానికి కావలసినంత ఫైబర్ అందుతుంది. బ్రౌన్ రైస్, కినోవా, హెూల్ వీట్ పాస్తా, ఓట్ వంటి తృణధాన్యాల్లో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇవి మనకు ఎక్కువ సేపు ఆకలి కూడా వేయకుండా కడుపు నిండుగా ఉండటమే కాకుండా మీ జీర్ణక్రియ సున్నితంగా చేయడంలో సహాయపడతాయి. బరువు తగ్గడానికి కూడా తృణధాన్యాలు సహాయపడతాయి.

పండ్లు, కూరగాయలు..

తాజా పండ్లు, కూరగాయల్లో విటమిన్లు, మినరల్స్ వంటి ముఖ్యమైన పోషకాలతో పాటు.. ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. మీ డైట్‌లో రకరకాల పండ్లు చేర్చుకుండి. హెల్తీ సలాడ్స్, చాట్స్ తయారు చేసుకుని ఎంజాయ్ చేయండి. మీరు ప్రతిరోజూ కనీసం ఒక్కసారైనా పండ్లు, కూరగాయలతో కూడిన భోజనం చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలి. యాపిల్స్, నారింజ, బెర్రీలు, క్యారెట్లు, ఆకుకూరలు, బ్రకోలీలో ఫైబర్ అధికంగా ఉంటుంది.

నట్స్..

నట్స్, విత్తనాలు వంటి స్నాక్స్ తీసుకోవడానికి ప్రాముఖ్యత ఇవ్వండి. వీటిలో ఆరోగ్యకరమైన కొవ్వులు మాత్రమే కాకుండా ప్రొటీన్, ఫైబర్ కూడా అధికంగా ఉంటాయి. వాల్‌నట్, బాదం, చియా గింజలు, పిస్తాపప్పులు, అవిసె గింజలు, గుమ్మడి గింజల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. వీటిని రోజూ ఆహారంలో చేర్చుకోవడానికి ప్రయత్నించండి.

పప్పు ధాన్యాలు..

చిక్కుళ్లు, కాయధాన్యాలు, పప్పు వంటి ఆహారాల్లో ఫైబర్ అధికం. ఇవి మన పొట్టను తేలికగా ఉంచుతాయి. సూప్‌లు, సలాడ్‌లు, ఆకుకూర పప్పు తయారు చేసుకుని తీసుకోవచ్చు. ■

అగ్నికీలలల్లోనే లాస్ ఏంజిలిస్



(మొదటిపేజీ తరువాయి)

రూ. 3 లక్షల కోట్లకు పైగా ఉన్నది. 2024 సంవత్సరానికి రాజధాని ఢిల్లీ బడ్జెట్ దాదాపు రూ.76 వేల కోట్లు. ఈ రాష్ట్రాల బడ్జెట్‌లను కలిపితే, లాస్ ఏంజిలిస్ అగ్నిప్రమాదంలో అమెరికాకు ఇంత నష్టం వాటిల్లుతుందని అంచనా.

ఈ ప్రాంతంలో అగ్ని ప్రమాదం ఎందుకు జరిగింది?

ఇంత పెద్ద అగ్నిప్రమాదం ఎలా జరిగిందనే దానిపై దర్యాప్తు కొనసాగుతోంది. కానీ అమెరికా నుంచి వచ్చిన వివిధ నివేదికల ప్రకారం.. బలమైన గాలులు , పొడి వాతావరణం దీనికి కారణమని ధ్రువీకరిస్తున్నాయి. కొంతమంది నిపుణులు ఈ భయంకరమైన అగ్నిప్రమాదానికి వాతావరణ మార్పు కారణమని చెబుతున్నారు. ఈ ప్రాంతంలో పెరుగుతున్న వేడి, ఎక్కువ కాలం కరువు, పొడి వాతావరణం వంటి వాతావరణ మార్పులు అటవీ మంటల ప్రమాదానికి ప్రధాన కారణమని వారు వాదిస్తున్నారు.

కాలిఫోర్నియాలో వాతావరణ ప్రభావం

ఇటీవలి నెలల్లో అత్యంత వేడి వాతావరణం, వర్షపాతం లేకపోవడంతో కాలిఫోర్నియా ముఖ్యంగా దుర్బలంగా ఉంది. అమెరికాలో, దక్షిణ కాలిఫోర్నియాలో సాధారణంగా మే నుంచి అక్టోబర్ వరకు అగ్ని ప్రమాదాల కాలంగా పరిగణించబడుతుంది. కానీ రాష్ట్ర గవర్నర్ గవిన్ న్యూసమ్ ఇప్పటికే మంటలు ఏడాది పొడవునా సమస్యగా మారాయని అన్నారు.

ఒక అంచనా ప్రకారం.. 1990 నుంచి ప్రపంచంలో 42 లక్షల చదరపు కిలోమీటర్ల అటవీ భూమి నాశనమైంది. ఇందులో ఆఫ్రికా, దక్షిణ అమెరికా, ఆగ్నేయాసియాలోని చాలా ప్రాంతాలున్నాయి. అదేవిధంగా, కాలిఫోర్నియాలో కూడా చాలా అటవీ ప్రాంతాలను నరికివేసి, అక్కడ ప్రజలు స్థిరపడ్డారు. ఈ సమస్య కూడా మరింత జఠిలంగా మార్చేసింది.

శాంటా అనా గాలులే కారణమా?

శాంటా అనా గాలులు కూడా ఇంత పెద్ద ఎత్తున మంటలు చెలరేగడానికి కారణమని భావిస్తున్నారు. ఈ గాలులు భూమి నుంచి బీచ్ వైపు కదులుతాయి. గ్రేట్ బేసిన్ పై అధిక పీడనం ఏర్పడినప్పుడు, కాలిఫోర్నియా తీరంలో అల్ప పీడనం ఏర్పడినప్పుడు శాంటా అనా గాలులు సంభవిస్తాయి. సాధారణంగా వాటి వేగం గంటకు 95-135 కి.మీ ఉంటుంది. కానీ కొన్నిసార్లు అది గంటకు 165 కి.మీ వరకు పెరుగుతుంది. ఈ గాలులు సంవత్సరానికి అనేక సార్లు వీస్తాయి. ఈ గాలులు అడవి మంటలతో కలిసినప్పుడు, భారీ విధ్వంసం సంభవిస్తుంది.

చాలా కాలం అగ్ని ప్రభావం

ఈ మంటలను ఆర్పడానికి ప్రయత్నాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. గాలి వేగం తగ్గితే, రాబోయే రెండు, మూడు రోజుల్లో దానిని నియంత్రించవచ్చని నిపుణులు అంటున్నారు. కానీ గాలులు అధిక వేగంతో వీస్తూ ఉంటే, దానికి చాలా సమయం పట్టవచ్చు. వచ్చే వారం ఈ ప్రాంతంలో వర్షం పడే అవకాశం లేదు. అయితే, ఈ అగ్నిప్రమాదం లాస్ ఏంజిల్స్‌కు దీర్ఘకాలిక బాధను కలిగించిందనడంలో సందేహం లేదు.

ఈ భయంకరమైన అగ్నిప్రమాదం ఆ ప్రాంతంలో కాలుష్యాన్ని బాగా పెంచింది. ప్రజలు కుళాయి నుంచి నీరు తాగడం కూడా నిషేధించింది. బాటిల్ వాటర్ మాత్రమే తాగాలని సూచించింది. ఈ అగ్నిప్రమాదంతో పెద్ద ఎత్తున స్వచ్ఛమైన నీరు కలుషితమైందనే భయం ఉంది.

వృక్షజాలం, జంతుజాలానికి కూడా భారీ నష్టం వాటిల్లింది. అడవి జంతువులు తమ ప్రాణాలు కాపాడుకోవటానికి పరిగెడుతున్నట్టు కనిపించే అనేక చిత్రాలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. చాలా మంది తమ పెంపుడు జంతువులను కూడా అదే మంటల్లో నిస్సహాయంగా వదిలేశారు. అయితే, ఈ అగ్నిప్రమాదంలో ఎన్ని జంతువులు ప్రభావితమయ్యాయో అధికారిక గణాంకాలు అందుబాటులో లేవు. కానీ వేలాది మంది తమ పెంపుడు జంతువులను అక్కడ వదిలేశారని ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక యూజర్ పేర్కొన్నారు.

2018లో కాలిఫోర్నియాలోని వూల్సే ప్రాంతంలో మంటలు చెలరేగినప్పుడు.. అగ్నికీలలు 10 వేల ఎకరాలకు పైగా విస్తరించాయి. ప్రభావిత అటవీ ప్రాంత పర్యావరణ వ్యవస్థను ఇది దెబ్బతీసిందని నివేదికలు సూచిస్తున్నాయి. అనేక మొక్కలు నాశనమయ్యాయి. సింహాల జనాభా పెద్ద ఎత్తున ప్రభావితమైంది. చాలా జంతువులు ఈ ప్రాంతాన్ని శాశ్వతంగా విడిచిపెట్టాయి.

అమెరికా చరిత్రలో పెద్ద మంటలు ఎప్పుడు సంభవించాయి?

1910లో అమెరికాలోని మోంటానా ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. దీని ప్రభావం దాదాపు 30 లక్షల ఎకరాల భూమిపై కనిపించింది. ఇందులో 87 మంది ప్రాణాలు కోల్పోయారు. అంతకుముందు, 1898లో, నార్త్ కరోలినా మరియు సౌత్ కరోలినాలో మంటలు చెలరేగాయి. దీనితో మూడు లక్షల ఎకరాల భూమి దెబ్బతింది. 2004 ఏడాది అలాస్కాలో జరిగిన అగ్నిప్రమాదంలో దాదాపు 13 లక్షల ఎకరాల భూమి కాలిపోయింది. 1940లోనే అలాస్కాలో జరిగిన అగ్నిప్రమాదం 12 లక్షల ఎకరాల భూమిని నాశనం చేసింది. దీనిని రబీ అగ్ని అంటారు.



అగ్నిమాపక ఏర్పాట్లు సరిపోలేదా?

మే-అక్టోబర్ మధ్య దక్షిణ కాలిఫోర్నియాలో అడవి మంటలు సంభవిస్తూనే ఉంటాయి. కానీ ఈసారి ఇంత పెద్ద ఎత్తున చెలరేగిన అగ్నిప్రమాదం కూడా అనేక ప్రశ్నలను లేవనెత్తింది. లాస్ ఏంజిల్స్ ఇంత పెద్ద అగ్నిప్రమాదాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉందా లేదా అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. వాస్తవానికి, మంటలను ఆర్పడానికి అగ్నిమాపక సిబ్బందికి నీటి కొరత ఉందని అనేక నివేదికలు వెలువడ్డాయి. ఈ విషయంలో ట్రంప్ ప్రస్తుత ప్రభుత్వాన్ని కూడా లక్ష్యంగా చేసుకున్నారు.

ఎత్తైన ప్రాంతాలలో ప్రత్యేక సన్నాహాలు కనిపించలేదు. ప్రజలను సురక్షితంగా తరలించే సమయంలో కూడా అనేక లోపాలు కనబడ్డాయి. వీటిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. లాస్ ఏంజిల్స్ టైమ్స్ నివేదిక ప్రకారం.. ఈ ప్రాంతంలో ఎప్పుడైనా విపత్తు సంభవించవచ్చని చాలా మంది నిపుణులు ఇప్పటికే హెచ్చరించారు. కానీ దానిపై ఎటువంటి శ్రద్ధ చూపలేదు. ఈ ప్రాంతంలో నివసించే ప్రజలకు అగ్ని ప్రమాదాలను నివారించడానికి శిక్షణ కూడా అందించబడుతుంది. కానీ సమాచారం ప్రకారం అక్కడి ప్రజలు దానిని సీరియస్‌గా తీసుకోలేదు.



యోగి కమ్యూనిటీకి వీఐపీ సేవ

(మొదటిపేజీ తరువాయి)

గుడారాలు, దేశీ నెయ్యితో తయారు చేసిన ప్రత్యేక లాంగర్లు, వాహనాల పార్కింగ్ కోసం ఓపెన్ ఏరియా వంటివి ఇందులో ఉన్నాయి. భారీ పోలీసు మోహరింపు, ఎస్‌యూవీలు తిరుగుతూ అక్కడ హల్‌చల్ చేస్తున్నాయి. సీఎం యోగి స్వయంగా దీనిని పర్యవేక్షిస్తున్నారు. "ఈ పండల్ సీఎం బస చేసే ప్రదేశం. ఆయన కోసం అత్యాధునిక సౌకర్యాలతో కూడిన రెండు ప్రత్యేక కుటీరాలు సిద్ధమవుతున్నాయి" అని ప్రయాగ్‌రాజ్ మేళా అథారిటీ తెలిపింది. వీటితో పాటు, వివిధ మఠాల మహంతులు, ప్రధాన పూజారుల కోసం దాదాపు 72 ప్రత్యేకమైన, సహజమైన తెల్లటి కుటీరాల లాంటి పందిరిని ఏర్పాటు చేశారు. ఇవి బెడ్‌లు, హీటర్లు, వాష్‌రూమ్ సౌకర్యాలు, గీజర్లు, వాష్‌బేసిన్‌లతో ఉన్నాయి. గురువారం, సాధువుల కోసం చేసిన ఏర్పాట్లను పర్యవేక్షించడానికి ముఖ్యమంత్రి పండల్‌ను సందర్శించారు. "యోగి బాబా మమ్మల్ని ఇక్కడ చాలా ప్రత్యేకంగా భావించేలా చేశాడని మేము ఆయనపై పూల వర్షం కురిపించాం" అని ఇటీవల నాథ్ కమ్యూనిటీలో సభ్యుడిగా మారిన 18 ఏండ్ల వ్యక్తి అన్నారు. మహంతులు కాని వారి కోసం, దుప్పట్లు, దుప్పట్లతో చక్కగా కప్పబడిన ప్రత్యేక విశాలమైన గుడారం ఏర్పాటు చేశారు. సుమారు 10,000 మందికి వసతి కల్పించగల నాలుగు భారీ పండళ్లు ఉన్నాయని ప్రయాగ్‌రాజ్ మేళా అథారిటీ అధికారి ఒకరు తెలిపారు. గోరఖ్‌పూర్‌లోని గోరఖ్‌నాథ్ మఠం పీఠాధీశ్వర్(అధిపతి) అయినందున నాథ్ పండల్‌ను ప్రభుత్వం చూసుకోలేదనీ, వ్యక్తిగతంగా సీఎం చూసుకుంటున్నారని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

రైతులకు తీపికబురు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సంక్రాంతి పండుగకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు తీపికబురు అందించింది. రైతు భరోసా పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేసింది. ఈనెల 26 నుంచి రైతు భరోసా పథకాన్ని అమలు చేయనున్నట్టు ఈమేరకు ఆదివారం వ్యవసాయ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. రైతు భరోసా పథకం కింద పంట పెట్టుబడి సహాయాన్ని సంవత్సరానికి ఎకరాకు రూ.12వేలు ఇస్తున్నట్టు పేర్కొంది. భూభారతి (ధరణి) పోర్టల్‌లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమి విస్తీర్ణం ఆధారంగా పట్టాదారులకు రైతుభరోసా సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వ్యవసాయ యోగ్యం కాని భూములను రైతుభరోసా నుంచి తొలగించింది. ఆర్వోఎఫ్ఆర్ పట్టాదారులు కూడా రైతుభరోసాకు అర్హులు అని ప్రకటించింది. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నిర్వహించే డీబీటీ పద్ధతిలో రైతుభరోసా సహాయం రైతుల ఖాతాలో జమ చేయాలని నిర్ణయించింది. రైతుభరోసా పథకం వ్యవసాయశాఖ సంచాలకులు ద్వారా తెలంగాణ ప్రభుత్వం అమలు చేయనుంది. ఎన్ఐసీ, ఐటీ భాగస్వామిగా బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపింది. జిల్లా కలెక్టర్లకు పథకం అమలు, ఫిర్యాదులతోపాటు వాటిని పరిష్కరించే బాధ్యతను అప్పగించింది. వ్యవసాయశాఖ కమిషనర్ తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. రైతు భరోసా పథకం ఉత్తర్వులు తెలుగులో జారీ చేయడం విశేషం.

సంక్రాంతి శుభాకాంక్షలు : సీఎం

(మొదటిపేజీ తరువాయి)

సంక్రాంతి పండుగ నాంది పలుకుతుందని చెప్పారు. ప్రతి సంక్షేమ పథకం అర్హులైన వారందరికీ చేరాలనేదే తన సంకల్పమని అన్నారు. వ్యవసాయంతో పాటు ఉపాధి కల్పన, పారిశ్రామిక రంగాలన్నింటా తెలంగాణ రాష్ట్రం తిరుగులేని పురోగమనాన్ని సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పతంగులు ఎగరవేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

26న ట్రాక్టర్స్ పరేడ్

(మొదటిపేజీ తరువాయి)

తీవ్రంగా ప్రయత్నిస్తోంది. దుష్ట కార్పొరేట్ శక్తుల ముందు ప్రధాని మోడీ మొండి వైఖరి దీనికి ప్రధాన కారణం" అని పేర్కొన్నది. కార్పొరేట్ అనుకూల సంస్కరణలతో కార్పొరేట్ దాడి కారణంగా ప్రజల జీవనోపాధి ప్రమాదంలో ఉన్నదని వివరించింది. రాజ్యాంగం ప్రాథమిక సూత్రాలలో ఒకటైన సమాఖ్య నిర్మాణాన్ని సవాలు చేసే వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన ఫ్రేమ్‌వర్క్ తీసుకొచ్చిందని పేర్కొన్నది. అయితే, ప్రధాని తనను తాను చట్టం, దేశ రాజ్యాంగానికి అతీతంగా భావిస్తారని ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

బృందం యాంటీ నక్సలైట్ ఆపరేషన్ చేపడుతుండగా కాల్పులు జరిగాయని బస్తర్ ఐజీ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో జిల్లా భద్రతా బలగాలు (డీఆర్జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్), డిస్ట్రిక్ట్ ఫోర్స్‌కు చెందిన సిబ్బంది పాల్గొన్నారని వివరించారు. ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలతో పాటు పలు ఆయుధాలు, పేలుడుపదార్థాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ ప్రాంతంలో ఇంకా సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని వెల్లడించారు. గతేడాది వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 219 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఈ ఏడాది ప్రారంభంలో 12 రోజుల వ్యవధిలో 12 మంది మావోయిస్టులను ప్రభుత్వం మట్టుబెట్టింది. దండకారణ్యంలో రక్తమోడుతున్న తీరుతో అడవిపుత్రుల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

విలీనమా..ఎన్నికలా..?

(మొదటిపేజీ తరువాయి)

స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగుతుండగా, ఇటీవలే మున్సిపల్ కమిషనర్ల ఆధీనంలోకి ఆ గ్రామ పంచాయతీలు వెళ్లాయి. జీపీలను విలీనం చేసిన మున్సిపాల్టీల్లో పెద్ద అంబర్‌పేట, శంషాబాద్, నార్సింగి, తుక్కుగూడ, మేడ్చల్, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, గుండ్ల పోచంపల్లి, తూంకుంట, తెల్లాపూర్, అమీన్‌పూర్ ఉన్నాయి. ఈ గ్రామ పంచాయతీల అన్ని రికార్డులను ఇప్పటికే మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఈ నెలాఖరుతో ముగియనున్న గడువు

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాల్టీల పాలక మండలి గడువు ఈ నెలాఖరులో ముగియనున్నది. గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పూర్తయ్యాక మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం. సిటీ శివారు ప్రాంతంలో ఉన్న నిజాంపేట్, బడంగ్‌పేట్, మీర్‌పేట, బండ్లగూడ జాగీర్, బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్ తదితర పలు మున్సిపల్ కార్పొరేషన్లతోపాటు పెద్ద అంబర్‌పేట, తుర్క యంజాల్, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల, శంకర్‌పల్లి, తుక్కుగూడ, దమ్మాయిగూడ, నాగారం, తూంకుంట, కొంపల్లి, అమీన్‌పూర్, మేడ్చల్, పోచారం, ఘట్‌కేసర్, గుండ్ల పోచంపల్లి తదితర పలు మున్సిపాల్టీల ఎన్నికలపై చర్చ మొదలైంది. జీహెచ్ఎంసీ పరిధిని విస్తరిస్తే ఇవన్నీ అందులో భాగమవుతాయా..? లేక నగరానికి నాలుగు దిక్కులా వేర్వేరు మున్సిపల్ కార్పొరేషన్లు ఏర్పాటైతే అందులో విలీనం చేస్తారా..? అనే ఊహాగానాలు వెలువడుతున్నాయి. ఈ విషయంపై సంక్రాంతి తర్వాత ఓ క్లారిటీ వచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఒకవేళ ఈ మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీల గడువు తీరేలోపు ప్రభుత్వం జీహెచ్ఎంసీలో విలీనంపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుంటే వీటికి ఎన్నికలు నిర్వహించడమా..? లేక స్పెషల్ ఆఫీసర్ల పాలనలోకి తీసుకెళ్లడమా..? అనేది కూడా సందిగ్ధంగానే ఉంది.

విలీనం చేయకపోతే రిజర్వేషన్ల మార్పు

నగరానికి సమీపంలో ఉన్న మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో కలిపితే గ్రేటర్‌లో డివిజన్ల సంఖ్య పెరగడంతోపాటు మున్సిపాల్టీల సంఖ్య కూడా తగ్గుతుంది. తగ్గకపోతే ఈ మున్సిపాల్టీల్లో 52 గ్రామ పంచాయతీలు విలీనమైనందున కొత్తగా మున్సిపాల్టీ పరిధి, జనాభా పెరగడంతో చైర్మెన్, కౌన్సిలర్ల రిజర్వేషన్లు మారుతాయి. దీనికి సుమారు మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. దీనిపై స్పష్టత రావాల్సి ఉందని అధికార పార్టీ నేతలు తెలిపారు.

ఎంపిక వాయిదా!

చాంపియన్స్ ట్రోఫీ జట్టుపై రాజీవ్ శుక్లా



ముంబయి : 2025 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో పోటీపడే భారత జట్టును ఈ నెల 19న ప్రకటించనున్నారు. ఐసీసీ నిబంధనల ప్రకారం చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనే ఎనిమిది జట్లు జనవరి 12న ప్రాథమిక జట్ల జాబితాను సమర్పించాలి. భారత్ ఇటీవల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లటం, పలువురు కీలక ఆటగాళ్ల ఫిట్‌నెస్‌పై వైద్య నివేదికలు రావాల్సి ఉండటంతో జట్టు ఎంపిక ప్రక్రియను వాయిదా వేసినట్టు సమాచారం. చాంపియన్స్ ట్రోఫీ ఫిబ్రవరి 19న ఆరంభం కానుండగా.. నెల రోజుల ముంగిట జనవరి 19న జట్టును ప్రకటిస్తామని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తెలిపారు. ఆస్ట్రేలియాతో ఐదో టెస్టులో గాయపడిన జశ్‌ప్రీత్ బుమ్రా ప్రస్తుతం బెంగళూర్‌లోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నాడు. బుమ్రా గాయం తీవ్రత, ఫిట్‌నెస్‌పై స్పష్టత కోసమే జట్టు ఎంపికను వాయిదా వేసినట్టు తెలుస్తోంది. ఇందుకోసం ఐసీసీ నుంచి బీసీసీఐ అనుమతి తీసుకుందని తెలుస్తోంది. ఊహాగానాలు ఎలా ఉన్నా.. రోహిత్ శర్మ నాయకత్వంలోనే భారత్ చాంపియన్స్ ట్రోఫీలో పోటీపడుతుందని బోర్డు వర్గాలు వెల్లడించాయి. విరాట్ కోహ్లి, కెఎల్ రాహుల్ సైతం జట్టులో ఉంటారని, ఎటువంటి సందేహం అవసరం లేదని బోర్డులో ఓ అధికారి తెలిపారు.

మార్చి 21 నుంచి ఐపీఎల్

కోల్‌కతలో తొలి, ఫైనల్ మ్యాచ్



ముంబయి : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 సీజన్ మార్చి 21 నుంచి ఆరంభం కానుంది. ఆదివారం ముంబయిలో సమావేశమైన ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఈ మేరకు ఐపీఎల్ షెడ్యూల్‌పై చర్చించింది. డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కత నైట్‌రైడర్స్ సొంత మైదానం ఈడెన్‌గార్డెన్స్‌లో ఆరంభ, ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఆరంభ వేడుకలు, ముగింపు వేడుకలకు చేయాల్సిన ఖర్చు సహా ఇతర అంశాలపై గవర్నింగ్ కౌన్సిల్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఐపీఎల్ మెగా వేలం సమయంలో ఐపీఎల్ 2025 సీజన్ మార్చి 15న ఆరంభం అవుతుందని, మే 25న ఉంటుందని ప్రకటించారు. కానీ చాంపియన్స్ ట్రోఫీ ఫిబ్రవరి 19న షురు కానుండగా.. మార్చి 9న ముగియనుంది. దీంతో అంతర్జాతీయ మ్యాచులకు, ఐపీఎల్‌కు రెండు వారాల సమయం ఉండాలని మార్చి 21న ఐపీఎల్ తొలి మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. త్వరలోనే పూర్తి షెడ్యూల్ విడుదల చేయనున్నారు.

ఇదిలా ఉండగా, మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)ను విస్తరించేందుకు బీసీసీఐ ఆలోచన చేస్తోంది. అందులో భాగంగా డబ్ల్యూపీఎల్ వేదికలను పెంచేందుకు నిర్ణయించింది. ముంబయి, బెంగళూర్‌తో పాటు బరోడ, లక్నోలోనూ మహిళల ప్రీమియర్ లీగ్ మ్యాచులను నిర్వహించే అవకాశం ఉంది. పూర్తి షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటించనున్నారు.

ఖోఖో ప్రపంచకప్‌కు వేళాయె



భారత సంప్రదాయ క్రీడల్లో ఖోఖో ఒకటి. ఇటీవల కమర్షియల్ లీగ్‌తో మార్కెట్‌ను ఆకర్షించే ప్రయత్నం చేసిన ఖోఖో.. ఓ అడుగు ముందుకేసి తొలిసారి ప్రపంచకప్‌కు సిద్ధమైంది. పురుషులు, మహిళల విభాగంలో ఏకకాలంలో జరుగుతున్న వరల్డ్‌కప్ నేటి నుంచి ఆరంభం కానుంది. చారిత్రక ఖోఖో ప్రపంచకప్‌కు న్యూఢిల్లీలోని ఇంధిరాగాంధీ స్టేడియం వేదిక కానుంది.

- తొలి వరల్డ్‌కప్‌కు భారత్ ఆతిథ్యం
- నేడు న్యూఢిల్లీలో ఆరంభ మ్యాచ్



నవతెలంగాణ-న్యూఢిల్లీ

తొలి ఖోఖో ప్రపంచకప్‌కు రంగం సిద్ధమైంది. నేడు ఇంధిరాగాంధీ స్టేడియంలో భారత్, నేపాల్ మ్యాచ్‌తో ఖోఖో చరిత్రలో ప్రథమ ప్రపంచకప్‌కు నాంది పలుకనుంది. ప్రపంచవ్యాప్తంగా 39 జట్లు పోటీపడుతున్న ఖోఖో ప్రపంచకప్ అంతర్జాతీయ అభిమానులను ఆకర్షించేందుకు ఎదురుచూస్తోంది. నేడు ఆరంభ వేడుకలతో పాటు తొలి మ్యాచ్ జరుగనుండగా.. మంగళవారం నుంచి గ్రూప్ దశ మ్యాచులు నిర్వహిస్తారు. గ్రూప్ దశ మ్యాచులు 16న ముగియనుండగా.. 17 నుంచి నాకౌట్ మ్యాచులు షురూ కానున్నాయి. 19న పురుషుల, మహిళల విభాగంలో టైటిల్ పోరు జరుగుతుంది. ఖోఖో ప్రపంచకప్ మ్యాచులు స్టార్‌స్పోర్ట్స్, దూరదర్శన్‌లో ప్రసారం అవుతాయి.

గ్రూప్-ఏలో భారత్ : పురుషుల విభాగంలో 20 జట్లు పోటీపడుతున్నాయి. ఈ జట్లను నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. ఒక్కో గ్రూప్‌లో ఐదు జట్లు ఉంటాయి. ప్రతి జట్టు ఇతర నాలుగు జట్లలో రౌండ్ రాబిన్ పద్దతిలో పోటీపడతాయి. గ్రూప్‌లో టాప్-2లో నిలిచిన జట్లు క్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఆతిథ్య భారత్ గ్రూప్-ఏలో నిలిచింది. నేపాల్, పెరూ, బ్రెజిల్, భూటాన్‌లు సైతం గ్రూప్-ఏలో ఉన్నాయి. గ్రూప్-బిలో దక్షిణాఫ్రికా, ఘనా, అర్జెంటీనా, నెదర్లాండ్స్, ఇరాన్ నిలిచాయి. గ్రూప్-సిలో బంగ్లాదేశ్, శ్రీలంక, దక్షిణ కొరియా, యుఎస్ఏ, పొలాండ్ ఉన్నాయి. గ్రూప్-డిలో ఇంగ్లాండ్, జర్మనీ, మలేషియా, ఆస్ట్రేలియా, కెన్యాలు చోటు చేసుకున్నాయి.

మహిళల విభాగంలో 19 జట్లు : ఖోఖో తొలి ప్రపంచకప్ వేటలో మహిళల విభాగంలో 19 జట్లు పోటీపడుతున్నాయి. ఆతిథ్య భారత్ గ్రూప్-ఏలో నిలిచింది. ఇరాన్, మలేషియా, దక్షిణ కొరియాలతో గ్రూప్ దశలో ఢీకొంటుంది. గ్రూప్-బిలో ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, కెన్యా ఉగాండా, నెదర్లాండ్స్ ఉన్నాయి. గ్రూప్-సిలో నేపాల్, భూటాన్, శ్రీలంక, జర్మనీ, బంగ్లాదేశ్ ఉండగా.. గ్రూప్-డిలో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, పొలాండ్, పెరూ, ఇండోనేషియా పోటీపడనున్నాయి. మహిళల విభాగంలో తొలి మ్యాచ్‌లో ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా తలపడనున్నాయి.

దంచికొట్టారు

- జెమీమా రొడ్రిగస్ సెంచరీ
- మంధాన, హర్లీన్, ప్రతిక మెరుపుల్
- ఐర్లాండ్‌పై భారత్ ఘన విజయం



నవతెలంగాణ-రాజ్‌కోట్ :

భారత్, ఐర్లాండ్ మహిళల రెండో వన్డేలో టీమ్ ఇండియా అమ్మాయిలు దంచికొట్టారు. జెమీమా రొడ్రిగస్, స్మృతీ మంధాన, ప్రతిక రావల్, హర్లీన్ డియోల్‌లు ఐర్లాండ్ బౌలర్లను ఊచకోత కోశారు. టాప్-4 బ్యాటర్లు ధనాధన్ ఇన్నింగ్స్‌లు నమోదు చేయటంతో వన్డేల్లో భారత్ అత్యధిక స్కోరు సాధించింది. 50 ఓవర్లలో 7 వికెట్లకు 370 పరుగుల రికార్డు స్కోరు సాధించింది. జెమీమా రొడ్రిగస్ (102, 91 బంతుల్లో 12 ఫోర్లు) సెంచరీతో మెరువగా.. కెప్టెన్ స్మృతీ మంధాన (73, 54 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లు), హర్లీన్ డియోల్ (89, 84 బంతుల్లో 12 ఫోర్లు), ప్రతిక రావల్ (67, 61 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. ఓపెనర్లు స్మృతీ మంధాన, ప్రతిక రావల్ తొలి వికెట్‌కు 18.6 ఓవర్లలోనే 156 పరుగుల భాగస్వామ్యం నిర్మించి భారీ స్కోరుకు గట్టి పునాది వేశారు. హర్లీన్ డియోల్, జెమీమాలు మూడో వికెట్‌కు 183 పరుగులు జోడించారు. దీంతో భారత్ ఈ ఫార్మాట్‌లో అత్యధిక స్కోరు చేసింది. భారీ ఛేదనలో ఐర్లాండ్ 50 ఓవర్లలో 254/7 పరుగులే చేసింది. క్రిస్టినా (80), లారా (37), సారా (38) రాణించారు. 116 పరుగుల తేడాతో భారత్ రెండో వన్డేలో ఘన విజయం సాధించింది. జెమీమా రొడ్రిగస్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచింది. మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 2-0తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది. భారత్, ఐర్లాండ్ మహిళల చివరి వన్డే రాజ్‌కోట్‌లోనే బుధవారం జరుగనుంది.

బీసీసీఐ కార్యదర్శిగా సైకియా

కోశాధికారిగా ప్రభుతేజ్ సింగ్ ఎన్నిక



ముంబయి : బీసీసీఐ కార్యదర్శిగా దేవజిత్ సైకియా, కోశాధికారిగా ప్రభుతేజ్ సింగ్ భాటియా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ముంబయిలో జరిగిన బీసీసీఐ ప్రత్యేక సర్వ సభ్య సమావేశం (ఎస్‌జీఎం) అనంతరం రిటర్నింగ్ ఆఫీసర్ ఎన్నికను అధికారికంగా ప్రకటించారు. బీసీసీఐ కార్యదర్శిగా కొనసాగిన జై షా ఐసీసీ చైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టగా.. కోశాధికారిగా ఉన్న వ్యక్తి మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వ మంత్రివర్గంలో చేరారు. దీంతో ఈ రెండు పదవులకు ఖాళీ ఏర్పడగా.. ఎస్‌జీఎంలో నూతన ఆఫీస్ బేరర్లను ఎన్నుకున్నారు. దేవజిత్ సైకియకు తాత్కాలిక కార్యదర్శి బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఉంది. హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ప్రతినిధిగా ఎస్‌జీఎంకు హాజరైన అర్శనపల్లి జగన్‌మోహన్ రావు నూతన కార్యదర్శి, కోశాధికారులను అభినందించారు. తెలంగాణలో క్రికెట్ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు.

తెలంగాణ ఒలింపిక్ సంఘంలో చీలిక



హైదరాబాద్ : తెలంగాణ ఒలింపిక్ సంఘం (టీఓఏ)లో విభేధాలు తారాస్థాయికి చేరుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌లు ఒలింపిక్ సంఘంలో వర్గపోరుకు తెరతీశారు. న్యాయపరమైన చిక్కులను అధిగమించి నిర్వహించిన ఎన్నికల్లో ఏపీ జితేందర్ రెడ్డి తెలంగాణ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికవగా.. ఆ ఎన్నికలను ప్రత్యర్థి వర్గం గుర్తించలేదు. 21 క్రీడా సంఘాల తిరుగుబాటుతో ఆదివారం జరిగిన ఎన్నికల్లో తెలంగాణ ఒలింపిక్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. మహేశ్‌కుమార్ గౌడ్ అండతో ప్రేమ్‌రాజ్, సి బాబురావు అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. మల్లా కొమురయ్య సీనియర్ వైస్ ప్రెసిడెంట్, శంకర్ తుంకూర్ కోశాధికారిగా.. జగన్నాథ స్వామి, కల్పనా రెడ్డి, నాగమణి, జెజె శోభలు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైనట్టు ఓ ప్రకటనలో తెలిపారు.

38వ జాతీయ క్రీడలకు చెఫ్ డి మిషన్ ఎంపిక చేసే బాధ్యతను టీఓఏ నుంచి చేతుల్లోకి తీసుకున్న భారత ఒలింపిక్ సంఘం.. శాట్ వీసీ ఎండి సోనీ బాలదేవిని చెఫ్ డి మిషన్‌గా మరో ఇద్దరిని డిప్యూటీ చెఫ్ డి మిషన్‌గా ఎంపిక చేసింది. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వ క్రీడల ప్రిన్సిపల్ కార్యదర్శి జయేశ్ రంజన్‌కు లేఖ ద్వారా తెలియజేసింది. చెఫ్ డి మిషన్ ఎంపిక బాధ్యత టీఓఏకు ఇవ్వకపోటంతో పరోక్షంగా ఎన్నికైన ఏపీ జితేందర్ రెడ్డి ప్యానల్‌కు భారత ఒలింపిక్ సంఘం గుర్తింపు నిరాకరించింది. దీంతో, మహేశ్ కుమార్ గౌడ్ మద్దతుతో 21 క్రీడా సంఘాలు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నాయి. రానున్న జాతీయ క్రీడల నేపథ్యంలో తెలంగాణ ఒలింపిక్ సంఘం చీలిక ఎక్కడికి దారితీస్తుందో చూడాలి.

గుజరాత్, రాజస్థాన్ నిష్క్రమణ

సెమీస్‌లో హర్యానా, విదర్భ



వడోదర : విజయ్ హజారే ట్రోఫీ నుంచి మాజీ చాంపియన్లు గుజరాత్, రాజస్థాన్ ఇంటిముఖం పట్టాయి. ఆదివారం వడోదరలో జరిగిన క్వార్టర్‌ఫైనల్లో గుజరాత్‌పై హర్యానా 2 వికెట్ల తేడాతో గెలుపొందగా... రాజస్థాన్‌పై విదర్భ 9 వికెట్ల తేడాతో పైచేయి సాధించింది. గుజరాత్, హర్యానా మ్యాచ్‌లో తొలుత గుజరాత్ 45.2 ఓవర్లలో 196 పరుగులకు కుప్పకూలింది. హేమంగ్ పటేల్ (54), ఆర్య దేశాయ్ (23), ఊర్విల్ పటేల్ (23), చింతన్ గజా (32) రాణించారు. హర్యానా బౌలర్లు అనుజ్ (3/39), నిశాంత్ (3/40) చెరో మూడు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో హర్యానా తడబడినా.. 44.2 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 201 పరుగులు చేసింది. మరో 34 బంతులు ఉండగానే లాంఛనం ముగించింది. హిమాన్షు రానా (66), వాట్స్ (38), రంగా (25)లు హర్యానా విజయంలో కీలక భూమిక పోషించారు. విదర్భతో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ 50 ఓవర్లలో 291/8 పరుగులు చేసింది. శుభమ్ (59), కార్తిక్ శర్మ (62), దీపక్ హుడా (45) రాణించారు. 292 పరుగుల లక్ష్యాన్ని విదర్భ అలవోకగా ఛేదించింది. ఓపెనర్ ధ్రువ్ (118 నాటౌట్), కరుణ్ నాయర్ (122 నాటౌట్) అజేయ సెంచరీలతో చెలరేగారు. యశ్ రాథోడ్ (39) రాణించాడు. 43.3 ఓవర్లలో 292/1 పరుగులు చేసింది. బుధవారం జరిగే సెమీఫైనల్లో హర్యానాతో కర్నాటక, విదర్భతో మహారాష్ట్ర ఆడనున్నాయి.

ఆ మ్యాజిక్ ఏది మహారాజ్..?



బాలకృష్ణ

ఓ సినిమాని ఆసాంతం కూర్చుని చూసేలా అన్ని రకాల హంగులు ఉన్నప్పటికీ ఊహించినట్టే కథ సాగుతుంటే ప్రేక్షకుల సహనానికి పరీక్ష పెట్టినట్టే.. ఊహించినట్టు కాకపోయినా కనీసం అక్కడక్కడ సర్‌ప్రైజ్ చేసినా ప్రేక్షకుల ఆదరణ పొందొచ్చు.

ఈ మ్యాజిక్ 'డాకు మహారాజ్'లో మిస్ అయ్యింది.

స్టయిలీష్ మేకింగ్‌తో తెరకెక్కినప్పటికీ రొటీన్ స్టోరీ టెల్లింగ్‌తో సో..సో.. యాక్షన్ డ్రామా సినిమాగా నిలిచింది. ఈ సినిమా చూస్తున్నంత సేపూ కథలోను, సన్నివేశాల్లోనూ కొత్త దనం కనిపించదు. పైగా ఎన్నో సినిమాల్లోని సన్నివేశాలు గుర్తొస్తుంటాయి. అయితే బోర్ కొట్టకుండా సినిమాని ఆ మాత్రం చూడగలిగామంటే బ్యాక్‌డ్రాప్, నేపథ్య సంగీతమే కారణం. ఇక బాలకృష్ణ సినిమా అంటే, యాక్షన్‌తోపాటు ఆయన చెప్పే పవర్‌ఫుల్ డైలాగ్‌ల్ని కచ్చితంగా ఆశిస్తారు. ఇవి ఇందులోనూ పుష్కలంగా ఉన్నాయి. నటన పరంగా, యాక్షన్ పరంగా, డైలాగ్స్‌పరంగా బాలకృష్ణ తన పంథాలోనే వెళ్ళారు. అంతేకాదు డాకు మహారాజ్ గెటప్‌లో 'సర్దార్ పాపారాయుడు'లోని తన తండ్రి ఎన్టీఆర్‌ని తలపించారు కూడా. సీతారామ్‌గా, నానాజీగా, డాకుగా బాలయ్య నటన మనల్ని ఫిదా చేస్తుంది. ఇక బాలయ్య అభిమానులకైతే పండగే. అయితే సినిమా ప్రారంభం నుంచి చివరి వరకు సీరియస్ మోడ్‌లో వెళ్తూ ప్రేక్షకులకు రిలీఫ్‌నిచ్చే ఫన్ ఎలిమెంట్స్ లేకపోవడం ఈ సినిమాకి బిగ్గెస్ట్ మైనస్.

సన్నివేశాల్లో ఫ్రెష్ నెస్ చూపించడంలో దర్శకుడు బాబీ విఫలమయ్యారు. అయితే స్టయిలీష్ మేకింగ్‌లో మాత్రం సక్సెస్ అయ్యారు. బాలకృష్ణ, శ్రద్ధాశ్రీనాథ్, ప్రగ్యాజైశ్వాల్, బాబీ డియోల్ నటనతోపాటు విజయ్ కార్తీక్ కన్నన్ కెమెరా పనితనం, అవినాష్ కొల్లా ఆర్ట్ డైరెక్షన్, తమన్ మ్యూజిక్, నిరంజన్ దేవరమానే, రూబెన్‌ల ఎడిటింగ్, వావ్ అనే నిర్మాణ విలువలు ఈ సినిమాకి బలాన్నివ్వగా, ఊహకు తగ్గట్టు సాగే కథా కథనాలు బలహీనతలుగా నిలిచాయి. మొత్తమ్మీద సంక్రాంతి బరిలోకి దిగిన ఈ సినిమా అందరి అంచనాలను అందుకోలేకపోయింది.

- రెడ్డి హనుమంతరావు

నవచిత్రం

భారీ వసూళ్లు రావడం ఖాయం



'అన్ని వర్గాల నుంచి, అన్ని ప్రాంతాల నుంచి మా 'డాకు మహారాజ్' సినిమాకి పాజిటివ్ టాక్ వస్తోంది. సినిమా పట్ల బాలకృష్ణ అభిమానులు చాలా సంతోషంగా ఉన్నారు. సాధారణ ప్రేక్షకులు కూడా సినిమాని బాగా ఎంజాయ్ చేస్తున్నారు. పండగ సీజన్ కూడా కావడంతో ఈ సినిమా భారీ వసూళ్లు రాబడుతుందనే నమ్మకం ఉంది' అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ చెప్పారు.

బాలకృష్ణ, బాబీ కొల్లి కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'డాకు మహారాజ్'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. సంక్రాంతి కానుకగా ఈ సినిమా ఆదివారం ప్రపంచ వ్యాప్తంగా విడుదలైంది. ఈ చిత్రానికి మొదటి షో నుంచే ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సినిమాకి వస్తున్న స్పందన పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ చిత్ర బృందం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది.

నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ, 'తిరుమల ఘటన నేపథ్యంలో అనంతపురంలో తలపెట్టిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను రద్దు చేశాం. అందుకే ఈ వారంలో సక్సెస్ మీట్‌ను అనంతపురంలో నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నాం' అని తెలిపారు. 'బాలకృష్ణ కెరీర్‌లో గొప్ప సినిమాల్లో ఒకటిగా 'డాకు మహారాజ్' నిలుస్తుందని నాగవంశీ అన్నారు. ఆయన ఈ సినిమాని ఎంతో నమ్మారు. వంశీ నమ్మకం నిజమై, ఇప్పుడు ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. 2023 సంక్రాంతికి 'వాల్తేరు వీరయ్య'తో విజయాన్ని అందుకున్నాను. ఈ సంక్రాంతికి 'డాకు మహారాజ్'తో వచ్చాను. సినిమాకి వస్తున్న స్పందన పట్ల బాలకృష్ణ చాలా హ్యాపీగా ఉన్నారు' అని దర్శకుడు బాబీ కొల్లి చెప్పారు.



మీ అందర్నీ నవ్వించే సినిమా : వెంకటేష్

వెంకటేష్, మీనాక్షిచౌదరి, ఐశ్వర్య రాజేష్ నాయకానాయికలుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈనెల 14న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా 'సంక్రాంతికి వస్తున్నాం' బ్లాక్ బస్టర్ మ్యూజికల్ నైట్ ఈవెంట్‌ని మేకర్స్ గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ వేడుకలో హీరో వెంకటేష్ లైవ్‌లో 'బ్లాక్ బస్టర్ పొంగల్..' సాంగ్ పాడటంతోపాటు స్టెప్పులు వేయడం అందరినీ ఉర్రూతలూగించింది.

వెంకటేష్ మాట్లాడుతూ, 'ఇది నా 76వ సినిమా. అనిల్ వండర్ ఫుల్ స్క్రిప్ట్‌తో వచ్చారు. తప్పకుండా మీ అందరికీ బాగా నచ్చుతుంది. సినిమా ఎక్స్‌ట్రార్డినరీగా వచ్చింది. నిర్మాతలు చాలా హ్యాపీగా ఉన్నారు. నా అభిమానులు ఇలాంటి సినిమాలని చాలా ఇష్టపడతారు. వాళ్ళ ప్రేమ ఎప్పుడూ చూపిస్తూనే వున్నారు. మళ్ళీ మేము సంక్రాంతికి మంచి సినిమాతో వస్తున్నాం. మీరంతా ఫ్యామిలీతో రావాలి. చాలా ఎంటర్‌టైన్మెంట్, నవ్వులు ఉంటాయి' అని తెలిపారు.

'ది రైజ్ ఆఫ్ అశోక'



సతీష్ నీనాసం

అభినయ, చతుర, సతీష్ నీనాసం నటించిన చిత్రం 'ది రైజ్ ఆఫ్ అశోక'. కన్నడ, తమిళం, తెలుగు భాషలలో విడుదల కానున్న ఈ మూవీని వృద్ధి క్రియేషన్, సతీష్ పిక్చర్స్ హౌస్ పతాకలపై వర్ధన్ నరహరి, జైష్ణవి, సతీష్ నీనాసం నిర్మిస్తున్నారు. వినోద్ దొండలే దర్శకుడు. ఈ మూవీ షూటింగ్ 80 శాతం పూర్తయింది.

తాజాగా సినిమాకు సంబంధించిన మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. బ్యాక్ గ్రౌండ్‌లో వినిపించే పాట, బీజీఎం, హీరోని చూపించిన విధానం, ఆ రక్తపాతం చూస్తుంటే ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతోందని వేరేచెప్పక్కర్లేదు. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఫిబ్రవరి 15న తాజా షెడ్యూల్‌ని ఫిక్స్ చేశారు. ఈ మూవీ సతీష్ నీనాసం కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలవబోతోందని టీం ఎంతో నమ్మకంగా ఉంది. సతీష్ కెరీర్‌లో ఇదొక డిఫరెంట్ ప్రయోగం అని మేకర్స్ చెబుతున్నారు.

యూత్‌ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



సందీప్ కిషన్ నటిస్తున్న తన 30వ సినిమా 'మజాకా'. త్రినాథరావు నక్కిన దర్శకుడు. ఎకె ఎంటర్టైన్మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ బ్యానర్స్ పై రాజేష్ దండా, ఉమేష్ కెఆర్ బన్సాల్ నిర్మిస్తున్నారు. బాలాజీ గుత్తా సహ నిర్మాత. రీతూ వర్మ హీరోయిన్. ఆదివారం ఈచిత్ర టీజర్‌ను మేకర్స్ లాంచ్ చేశారు.

ఈ సందర్భంగా హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ, 'ఇది నా 30వ సినిమా. దీన్ని ఒక బాధ్యతగా భావిస్తున్నాను. నా గత సినిమాలు 'భైరవకోన, రాయన్' మంచి రిజల్ట్స్ ఇచ్చాయి. ప్రేక్షకులు నా నుంచి మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ని కోరుకుంటున్నారని వారితో మాట్లాడినప్పుడు తెలిసింది. వారు కోరుకున్న సినిమా చేయడం నా బాధ్యత. అలాంటి సమయంలో 'మజాకా' నా దగ్గరకి వచ్చింది. హాస్య మూవీస్ అంటే నా హోం బ్యానర్. రాజేష్‌కి, అనిల్‌కి ఈ సినిమా చాలా పెద్ద విజయాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాను. ఫ్యామిలీ అంతా కలిసి ఎంజాయ్ చేసే సినిమా ఇది' అని తెలిపారు.

'ఇది నాకు చాలా ఇష్టమైన కథ. సినిమా ఫుల్ ఫ్యామిలీ ఎంటర్టైనర్. 'మన్మధుడు' తర్వాత అన్షు ఈ సినిమాలో నటించడం ఆనందంగా ఉంది. తన పాత్ర చాలా బాగుంటుంది. చాలా అద్భుతంగా చేసింది. సినిమా రిలీజైన తర్వాత సీట్లు కాదు గేట్లు పగులుతాయనిపిస్తోంది. అంత కామెడీ ఉంటుంది సినిమాలో. ప్రతి సీన్ ప్రసన్న అద్భుతంగా రాశారు. ఎమోషన్ సీన్స్ కూడా ఉంటాయి. సందీప్ ఎక్స్‌లెంట్‌గా చేశారు. ఫిబ్రవరి 21న సినిమా మీ ముందుకు వస్తోంది. ఫ్యామిలీతో వెళ్లి ఎంజాయ్ చేయండి' అని డైరెక్టర్ త్రినాథ్ నక్కిన చెప్పారు.

నిర్మాత రాజేష్ దండా మాట్లాడుతూ, 'ఈ కథ వినప్పుడు నాన్ స్టాప్‌గా రెండు గంటలు నవ్వుకుంటూనే ఉన్నా. మంచి యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ తీశాం. నా బ్యానర్‌లో ఇప్పటివరకూ తీసిన సినిమాలన్నింటి కంటే బెస్ట్ మూవీ తీశానని గర్వంగా చెప్పుకోవచ్చు. 'ధమాకా' తర్వాత త్రినాథ్ ఈ కథ నచ్చి డైరెక్షన్ చేశారు. నా బ్యానర్‌కి వందకోట్ల సినిమా ఇస్తున్నారని బలంగా నమ్ముతున్నాను' అని తెలిపారు.

పాన్ ఇండియా స్థాయిలో...



వైష్ణవి చైతన్య

ఓ తెలుగు అమ్మాయికి సినిమాల్లో అవకాశాలు రావడం అంటే.. ఓ పెద్ద అద్భుతం జరిగినట్టే. అందం, అభినయం ఉన్నప్పటికీ తెలుగు అమ్మాయిలను మేకర్స్ పట్టించుకోకపోవడం బాధాకరం. అయితే అవకాశం ఇస్తే పరభాషా హీరోయిన్లకి దీటుగా సత్తా చాటుతామని నిరూపించిన తెలుగు హీరోయిన్లలో వైష్ణవి చైతన్య ఒకరు.

షార్ట్ ఫిల్మ్ ద్వారా కెరీర్ మొదలుపెట్టిన వైష్ణవి చైతన్యకు యూత్‌లో మంచి ఫాలోయింగ్ ఉంది. 'లవ్ ఇన్ 143 అవర్స్, ది సాఫ్ట్‌వేర్ డెవలపర్, అరెరె మానస, మిస్సమ్మ' వంటి తదితర షార్ట్ ఫిల్మ్ వైష్ణవి చైతన్యకు పాపులారిటీ తెచ్చిపెట్టాయి. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది.

ఆ గుర్తింపుని మరింత రెట్టింపు చేసేలా సాయిరాజేష్ దర్శకత్వంలో వచ్చిన 'బేబీ' చిత్రం వైష్ణవి కెరీర్‌ను మలుపు తిప్పింది. ఏమాత్రం అంచనాలు లేకుండా వచ్చిన ఈ సినిమా బాక్స్‌ఆఫీస్ వద్ద దాదాపు రూ.100 కోట్ల వసూళ్లను సాధించి చిత్ర పరిశ్రమను సర్‌ప్రైజ్ చేసింది. 'బేబీ' విజయంలో వైష్ణవిదే కీలకపాత్ర. అందుకే ఆమెకు ఉత్తమ నటిగా ఫిల్మ్ ఫేర్ అవార్డు దక్కింది. దీంతో వైష్ణవికి అవకాశాలు క్యూకట్టాయి.

ప్రస్తుతం ఆమె 'జాక్' సినిమాలో సిద్ధు జొన్నలగడ్డ సరసన హీరోయిన్‌గా నటిస్తోంది. ఇందులో ఆమె ముస్లిం అమ్మాయిగా కనిపించనుందని అని మేకర్స్ పోస్టర్ ద్వారా కన్ఫర్మ్ చేశారు. ఈ సినిమాలోనూ ఆమె పాత్ర చాలా కీలకంగా ఉండబోతుంది. 'బేబి'తో వైష్ణవి, 'టిల్లు స్క్వేర్' తో సిద్ధు జొన్నలగడ్డ రూ.100 కోట్ల క్లబ్‌లో చేరి, సూపర్ ఫామ్‌లో ఉన్నారు. దీంతో 'జాక్' పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి.

ఇక తెలుగుతో పాటు తమిళం, కన్నడ ఇండస్ట్రీల నుంచి కూడా వైష్ణవికి అవకాశాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రెండు తమిళ, కన్నడ సినిమాలకు ఆమె సైన్ చేశారు. అలాగే ఇతర భాషల నుంచి కూడా ఆఫర్లు వస్తున్నాయి. సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే ఈ అందాల తార పాన్ ఇండియా కథానాయికగా ఈ ఏడాదిలో మరిన్ని విజయాలను దక్కించుకుంటాననే నమ్మకంతో ఉంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

సీఐఏకి అందుబాటులో వాట్సాప్ సందేశాలు

● మెటా సీఈఓ జుకర్‌బర్గ్



వాషింగ్టన్ : సీఐఏతో సహా అమెరికా అధికారులు, వినియోగదారుల పరికరాల్లోకి రిమోట్‌గా లాగిన్ అవ్వడం ద్వారా వాట్సాప్ సందేశాలను చదవగలరనీ, ప్లాట్‌ఫారమ్ ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్(రక్షణ వ్యవస్థ)ను సమర్థవంతంగా దాటవేస్తారని మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ అంగీకరించారు. వాట్సాప్ ఎన్‌క్రిప్షన్ మెటా సందేశ కంటెంట్‌ను వీక్షించకుండా నిరోధించినప్పటికీ, అది వినియోగదారు ఫోన్‌కు భౌతిక యాక్సెస్ నుంచి రక్షించదని శుక్రవారం జో రోగన్ ఎక్స్ పీరియన్స్ పాడ్‌కాస్ట్ లో మాట్లాడుతూ జుకర్‌బర్గ్ వివరించారు.

రష్యన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఇంటర్వ్యూను ఏర్పాటు చేయాలనే టక్కర్ కార్ల్సన్ అన్వేషణ గురించి రోగన్ అడిగినప్పుడు ఆయన ఇలా వ్యాఖ్యానించారు. గతేడాది ఫిబ్రవరిలో, మూడు సంవత్సరాల విఫల ప్రయత్నాల తర్వాత పుతిన్‌తో మాట్లాడటంలో విజయం సాధించడం గురించి మాట్లాడుతూ, కార్ల్సన్ తన ప్రయత్నాలను నిలిపివేసినందుకు అమెరికా అధికారులను, అంటే నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ(ఎన్ఎస్ఏ), సీఐఏలను నిందించారు. కార్ల్సన్ ప్రకారం.. ఏజెన్సీలు అతని సందేశాలు, ఈమెయిల్‌లను ట్యాప్ చేయడం ద్వారా అతనిపై నిఘా పెట్టాయి. అతని ఉద్దేశాలను మీడియాకు లీక్ చేశాయి. ఇది మాస్కో అతనితో మాట్లాడకుండా "భయపెట్టింది". సందేశాలను రక్షించాల్సిన ఎన్‌క్రిప్షన్ రక్షణ చర్యలను పరిగణనలోకి తీసుకుంటే ఇది ఎలా జరిగిందో వివరించాలని రోగన్ జుకర్‌బర్గ్ ను అడిగారు. "ఎన్‌క్రిప్షన్ చేసే పని నిజంగా మంచిది. ఎందుకంటే సేవను నడుపుతున్న కంపెనీ దానిని చూడకుండా చేస్తుంది. కాబట్టి మీరు వాట్సాప్ ఉపయోగిస్తుంటే, మెటా సర్వర్‌లు ఆ సందేశంలోని విషయాలను చూసే అవకాశం లేదు" అని జుకర్‌బర్గ్ అన్నారు. ఎవరైనా మెటా డేటాబేస్‌లను హ్యాక్ చేసినప్పటికీ, వారు వినియోగదారుల ప్రయివేట్ టెక్స్ట్ లను యాక్సెస్ చేయలేరని చెప్పారు. కార్ల్సన్ ఉపయోగించిన సిగ్నల్ మెసేజింగ్ యాప్ అదే ఎన్‌క్రిప్షన్‌ను ఉపయోగిస్తుంది. కాబట్టి అదే నియమాలు వర్తిస్తాయి. అయితే, పరికరాల్లో నిల్వ చేయబడిన సందేశాలను వీక్షించకుండా చట్ట అమలు సంస్థలను ఎన్‌క్రిప్షన్ ఆపదని ఆయన గుర్తించారు. "వారు చేసేది ఏమిటంటే మీ ఫోన్‌కు యాక్సెస్ కలిగి ఉండటం. కాబట్టి, ఏదైనా ఎన్‌క్రిప్ట్ చేయబడిందా అనేది పట్టింపు లేదు. వారు దానిని సాధారణ దృష్టిలో చూడగలరు" అని ఆయన స్పష్టం చేశారు. ఇజ్రాయిల్ కంపెనీ ఎన్ఎస్ఓ గ్రూప్ అభివృద్ధి చేసిన స్పైవేర్ పెగాసస్ వంటి సాధనాలను జుకర్‌బర్గ్ ప్రస్తావించారు. వీటిని మొబైల్ ఫోన్‌లలో రహస్యంగా ఇన్‌స్టాల్ చేసి డేటాను యాక్సెస్ చేయవచ్చు.జుకర్‌బర్గ్ ప్రకారం.. వినియోగదారుల ప్రయివేట్ సందేశాలు నేరుగా వారి పరికరాల్లోకి చొరబడటం ద్వారా ప్రమాదంలో పడవచ్చు అనే వాస్తవం.. మెటా అదృశ్యమయ్యే సందేశాలను రూపొందించడానికి కారణం. ఇక్కడ ఒక నిర్దిష్ట కాలం తర్వాత ఒకరి సందేశ థ్రెడ్‌ను తొలగించవచ్చు. డిజిటల్ గోప్యత, ప్రభుత్వ నిఘా గురించి జరుగుతున్న చర్చల మధ్య జుకర్‌బర్గ్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. వినియోగదారు డేటాను రక్షించినందుకు ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ ప్రశంసలందుకున్నప్పటికీ.. సీఐఏ, ఎఫ్‌బీఐ వంటి ఏజెన్సీలు నేరాలు, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి చేసే ప్రయత్నాలను ఇది అడ్డుకోగలదని వాదించాయి. అదనంగా, ఎన్‌క్రిప్టెడ్ సందేశాలను ప్రసార సమయంలో అడ్డగించలేనప్పటికీ, క్లౌడ్ సేవల్లో నిల్వ చేయబడిన బ్యాకప్‌లు ఎన్‌క్రిప్షన్ కీని జతచేస్తే చట్ట అమలు సంస్థలు యాక్సెస్ చేయగలవని నివేదికలు సూచిస్తున్నాయి.

భారతీయ కంపెనీలే లక్ష్యంగా

మాస్కోపై అమెరికా తాజా ఆంక్షలు



వాషింగ్టన్ : రష్యా ఇంధన రంగానికి వ్యతిరేకంగా ప్రకటించిన తాజా చర్యలో భాగంగా అమెరికా, బ్రిటన్‌లు రెండు భారతీయ కంపెనీలను నిషేధించాయి. తాజా ఆంక్షలతో మరింత ఆజ్యం పోసినట్టయిందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్, బ్రిటీష్ ప్రభుత్వం చేపట్టిన ఈ భారీ చర్యలు రెండు ప్రధాన రష్యన్ పెట్రోలియం ఉత్పత్తిదారులైన గాజ్‌ప్రోమ్ నెఫ్ట్, సుర్గుట్‌నెఫ్టెగాజ్, వాటి అనుబంధ సంస్థలను లక్ష్యంగా చేసుకున్నాయి. రష్యన్ ముడి చమురును రవాణా చేసే 183 నౌకలపై ఆంక్షలు కూడా ఉన్నాయి.

జాబితాలో ఉన్న రెండు భారతీయ సంస్థలు స్కైహార్ట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్, అవిషన్ షిప్పింగ్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్. యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటన ప్రకారం.. ఈ కంపెనీలు రష్యా ఆర్కిటిక్ ఎల్ఎన్‌జీ 2 ప్రాజెక్టుకు మద్దతునిచ్చాయి. ఇది దేశంలోని అతిపెద్ద ధ్రువీకృత సహజ వాయువు ఉత్పత్తిదారు నోవాటెక్ యాజమాన్య అభివృద్ధిలో పాక్షికంగా ఉన్నది. ఈ ప్రాజెక్ట్ 2023 నుంచి అమెరికా ఆంక్షల కింద ఉంది. ఆర్కిటిక్ ఎల్ఎన్‌జీ 2 ప్రాజెక్ట్ కు భౌతికంగా సహాయం చేయడం లేదా మద్దతు అందించడం కోసం రెండు కంపెనీలను ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ 14024 కింద నియమించారు. అదనంగా, అవిజన్, ప్రవాసి.. ఒనిక్స్ నిర్వహించే రెండు నౌకలను కంపెనీకి సంబంధించిన ఆస్తిగా గుర్తించారు.

ప్రాజెక్ట్ నుంచి సరుకును లోడ్ చేసే ధ్రువీకృత సహజ వాయువు వాహకాలను భారత కంపెనీలు నిర్వహించాయి. ఆర్కిటిక్ ఎల్ఎన్‌జీ 2 ప్రాజెక్ట్‌ను "పునరుజ్జీవింపజేసే ప్రయత్నంలో" "థర్డ్ కంట్రీ షిప్ మేనేజ్‌మెంట్ సంస్థల ద్వారా ఎల్ఎన్‌జీ వాహకాల యాజమాన్యాన్ని అస్పష్టం చేసే ప్రయత్నాలలో రష్యా నిమగ్నమైందని" అమెరికా అధికారులు పేర్కొన్నారు. గతేడాది సెప్టెంబర్‌లో, ముంబయిలో నమోదు చేయబడిన రెండు భారతీయ ఆధారిత కంపెనీలు గోటిక్, ఫ్లియో ఎనర్జీపై వాషింగ్టన్ ఆంక్షలను విధించింది. ఇవి ప్రాజెక్ట్ తో అనుసంధానించబడి ఉన్నాయని పేర్కొన్నది. నోవాటెక్ ప్రాజెక్ట్ నుంచి ఎల్ఎన్‌జీని "ఎగుమతి చేసే ప్రయత్నాలకు" సంబంధం ఉందని ఆరోపిస్తూ ఈ కంపెనీల యాజమాన్యంలోని రెండు నౌకల పైన కూడా ఆంక్షలను విధించింది.

గతేడాది అమెరికా ఒక ప్రత్యేక చర్యలో, రష్యన్ సంస్థలకు ఎలక్ట్రానిక్స్, విమానయాన భాగాలను సరఫరా చేసినందుకు 19 భారతీయ కంపెనీలు, ఇద్దరు జాతీయులపై ఆంక్షలు విధించింది. దీనికి ప్రతిస్పందనగా, ఆ కంపెనీలు దేశీయ చట్టాలను ఉల్లంఘించలేదనీ, భారతదేశ చట్టాల పరిధిలోనే పనిచేస్తున్నాయని భారత్ పేర్కొన్నది.

సమస్యలను "స్పష్టం" చేయడానికి భారత్.. అమెరికాతో సంప్రదింపులు జరుపుతోందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొన్నది.గత రెండు సంవత్సరాలలో రష్యా భారత్‌కు కీలక ఇంధన భాగస్వామిగా అవతరించింది. ముడి చమురు సరఫరాలో అగ్రగామిగా అవతరించింది. గతేడాది సెప్టెంబరులో రష్యా నుంచి భారత్ చేసుకున్న ముడి చమురు దిగుమతులు ఆగస్టు నుంచి 11.7 శాతం పెరిగి, దాదాపు 1.9 మిలియన్ బ్యారెళ్లకు చేరుకున్నాయి. ఇది ఆ నెలలో భారత మొత్తం ముడి చమురు దిగుమతుల్లో దాదాపు 40 శాతం కావటం విశేషం. దేశ ఇంధన భద్రతను నిర్ధారించడంలో మాస్కో కీలక పాత్ర పోషిస్తున్నదని భారత్ తెలిపింది.



ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఎస్ జైశంకర్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా మరోమారు విజయం సాధించిన డోనాల్డ్ ట్రంప్ జనవరి 20న అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయనున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి భారత్ తరఫున కేంద్ర మంత్రి ఎస్ జైశంకర్ హాజరుకానున్నారు. భారత విదేశాంగ శాఖ ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ పర్యటన సందర్భంగా.. జైశంకర్ అమెరికా కొత్త పరిపాలనాధికారులతో పాటు వివిధ దేశాల అధినేతలతో చర్చల్లో పాల్గొనే అవకాశం ఉన్నట్టు వివరించింది.

గతేడాది నవంబర్‌లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్‌ను రిపబ్లికన్ పార్టీ నేత డోనాల్డ్ ట్రంప్ ఓడించి.. ఘన విజయం సాధించారు. జనవరి 20న అమెరికా 47వ నూతన అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి అమెరికా క్యాపిటల్ భవనంలోని వెస్ట్ ఫ్రంట్ ప్రాంతం వేదిక కానున్నది. ఈ కార్యక్రమానికి భారీఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రపంచ దేశాల అధినేతలు ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరుకానున్నట్టు సమాచారం.

గణతంత్ర దినోత్సవ ముఖ్య అతిథిగా

ఇండోనేషియా అధ్యక్షుడు




న్యూఢిల్లీ: ఈ ఏడాది గణతంత్ర దినోత్సవానికి ముఖ్య అతిథిగా ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాం టో హాజరయ్యే అవకాశము న్నట్టు పలు మీడియా వర్గాలు వెల్లడిస్తున్నాయి. 73 ఏండ్ల మాజీ ఆర్మీ జనరల్ సుబియాం టో 2024 అక్టోబర్‌లో ఇండోనేషియా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ పర్యటనలో ఆయన ఇరుదేశాల సంబంధాలపై ప్రధాని మోడీతో విస్తృత చర్చలు జరిపే అవకాశం ఉన్నట్టు సంబంధిత వర్గాలు వివరించాయి. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.గతేడాది ప్రబోవో.. భారత ప్రధాని మోడీకి ఫోన్‌కాల్ చేసి.. ఇరుదేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే మార్గాలపై చర్చించారు. నవంబర్‌లో బ్రెజిల్‌లోని రియో డి జనిరోలో జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సులో ప్రబోవో ప్రధాని మోడీ, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో వాణిజ్యం, ఆరోగ్యం, భద్రత వంటి రంగాలలో సహకారంపై చర్చలు జరిపారు.

1950 నుంచి భారత్ మిత్ర దేశాల నేతలను గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆహ్వానించడం సంప్రదాయంగా వస్తోంది. 1952, 53, 66ల్లో మాత్రమే విదేశీ అతిథులు లేకుండా రిపబ్లిక్‌డే వేడుకలు నిర్వహించారు. 2007లో పుతిన్(రష్యా), 2008లో నికోలస్ సర్కోజీ(ఫ్రాన్స్), 2015లో బరాక్ ఒబామా (అమెరికా), 2016లో ఫ్రాన్సోయిస్ హెూలన్ (ఫ్రాన్స్)లు అతిథులుగా హాజరయ్యారు. 2021లో నాటి బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్‌ను చీఫ్ గెస్ట్‌గా ఆహ్వానించారు. కానీ, కోవిడ్ కేసులు పెరగడంతో ఆయన పర్యటన రద్దైంది. 2018లో ఆసియాన్ దేశాల అధినేతలను గణతంత్ర దినోత్సవానికి ఆహ్వానించారు. 2023లో ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫతా అల్ సిసి ముఖ్య అతిథిగా హాజరవ్వగా.. 2024 గణతంత్ర వేడుకలకు భారత ప్రభుత్వం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానియేల్ మక్రాన్ ను ఆహ్వానించింది.

స్వల్పదూరంలో స్పేడెక్స్ ఉపగ్రహాలు

● ఇస్రో ప్రకటన



శ్రీహరికోట : నింగిలో డాకింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రయోగించిన స్పేడెక్స్ ఉపగ్రహాలు అత్యంత సమీపానికి చేరుకున్నాయని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ప్రకటించింది. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు పెట్టింది. తాజాగా వీటిని 15 మీటర్ల సమీపానికి తీసుకొచ్చి.. ఆపై 3 మీటర్లకు ఈ దూరాన్ని తగ్గించింది. ఈ ప్రక్రియ ముగిసిన అనంతరం తిరిగి రెండు ఉపగ్రహాలను సురక్షితమైన దూరానికి జరిపినట్టు పేర్కొన్నది. ఈ డేటాను విశ్లేషించిన తర్వాత డాకింగ్ ప్రక్రియ చేపడతామని ఇస్రో ప్రకటించింది. అంతకు ముందు స్పేడెక్స్ ఉపగ్రహాల చిత్రాలను కూడా ఎక్స్‌లో పోస్టు చేసింది. ఆదివారం తెల్లవారు జామున 3.10 సమయంలో తొలుత ఈ ఉపగ్రహాలను 105 మీటర్ల దగ్గరికి చేర్చారు. అనంతరం అవి చేతులు కలపడానికి సిద్ధంగా ఉన్నాయని ఇస్రో పేర్కొన్నది.

నింగిలో డాకింగ్ కోసం జంట స్పేడెక్స్ ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగించింది. అవి 'హెూల్డ్' దశలో ఉన్నాయి. ఎస్‌డీఎక్స్01 (ఛేజర్), ఎస్‌డీఎక్స్02 (టార్గెట్) అనే ఈ రెండు ఉపగ్రహాలను గతనెల 30న పీఎస్ఎల్వీ రాకెట్ ద్వారా 475 కిలోమీటర్ల వృత్తాకార కక్ష్యలోకి ప్రవేశపెట్టిన సంగతి విధితమే. 7, 9 తేదీల్లో వీటిని అనుసంధానం (డాకింగ్) చేసేందుకు నిర్ణయించినప్పటికీ.. వివిధ కారణాలతో అది వాయిదాపడింది. ఆ ప్రక్రియ ఇప్పుడు జోరుగా సాగుతున్నది.

హైనా దాడిలో 25 గొర్రెలు మృత్యువాత



నవతెలంగాణ-మద్దూరు

సిద్దిపేట జిల్లా మద్దూర్ మండలంలోని మర్మముల, ధర్మారం, గ్రామాలలో గొర్రెలపై హైనా దాడి చేసింది. ఈ దాడిలో 25 గొర్రెలు మృతి చెందాయి. మర్మములలోని చెట్కూరి ఇస్తారికి చెందిన 14 గొర్రెలు, ధర్మారం లోని గుడిసె కొమురయ్య కు చెందిన 11 గొర్రెలు మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు. హైనా దాడిలో గొర్రెలను కోల్పోయిన గొర్రెల కాపరులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

దొంగలున్నారు.. జాగ్రత్త

● అన్ని జిల్లాల ఎస్పీలను అప్రమత్తం చేసిన డీజీపీ

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పెద్ద ఎత్తున ప్రజలు తమ గ్రామాలకు తరలుతున్న నేపథ్యంలో స్థానిక పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. ఈ నేపథ్యంలో అన్ని జిల్లాల ఎస్పీలు, నగర పోలీసు కమిషనర్లకు డీజీపీ కార్యాలయం నుంచి సర్క్యులర్ జారీ అయింది. ప్రధానంగా కాలనీలు, బస్తీలు, దూరంగా విసిరివేయబడినట్టుగా ఉండే ఇండ్ల సముదాయాల వద్ద తాళాలు వేసి ఉన్న ఇండ్లను దొంగలు లక్ష్యంగా చేసుకొనే ప్రమాదమున్నదని ఆయన హెచ్చరించారు.

ఈ నేపథ్యంలో ఇలాంటి ప్రదేశాల్లో రాత్రివేళ గస్తీతో పాటు పగటివేళ కూడా పోలీసు యంత్రాంగం కన్నేసి ఉంచాలని ఆయన ఆదేశించారు. గ్రామాలకు వెళ్లినవారు తిరిగి వచ్చేంత వరకు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

● మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క), రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. రైతు రుణమాఫీ, సకాలంలో ధాన్యం కొనుగోళ్లు, సన్నాలకు 500 రూపాయల బోనస్, రైతు భరోసా, రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్లకు లబ్దిదారుల ఎంపిక తదితర కార్యక్రమాలతో వ్యవసాయ కుటుంబాలతో పాటు అన్ని వర్గాల ప్రజల్లో సంతోషం వెల్లివిరుస్తుందని పేర్కొన్నారు. భోగభాగ్యాలతో, సిరిసంపదలతో రాష్ట్రం సమృద్ధిగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పతంగులను ఎగరవేసే సమయంలో చైనా మాంజాను వాడి పశుపక్ష్యాదులకు హాని కలిగించవద్దని కోరారు.

మైనార్టీ డిక్లరేషన్ అమలెన్నడు..?

బడ్జెట్‌లో రూ.7 వేల కోట్లు కేటాయిస్తే.. హామీల అమలేది : ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ-కంఠేశ్వర్

'గద్దెనెక్కడం కోసం రేవంత్ సర్కారు అమలుకు నోచని హామీలను ఇచ్చింది. మైనార్టీల కోసమని బడ్జెట్‌లో రూ.7 వేల కోట్లు పెట్టామని చెబుతున్న రేవంత్ సర్కార్.. మైనార్టీలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదు' అని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మైనార్టీ యువతీలకు స్కూటీలతో పాటు షాదీ ముబారక్ పథకం కింద తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచిందని ఇప్పటికీ అమలుకు నోచుకోకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో వందల గురుకులాలను కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిందని అందులో మైనార్టీ విద్యార్థుల కోసం టిమ్రీస్ ను నెలకొల్పామని ఇప్పుడు అక్కడ నెలకొన్న పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నారు. నిజామాబాద్ అర్బన్ నుంచి ఎమ్మెల్యేగా షబ్బీర్‌అలీ పోటీ చేసి ఓడిపోయినప్పటికీ ఇంచార్జిగా కొనసాగుతున్నా ఇక్కడ ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేష్ గుప్త, బాజిరెడ్డి గోవర్ధన్, బోధన్ ఇంచార్జి అయేషాఫాతిమా, నగర మేయర్ నీతూ కిరణ్, మాజీ జడ్పీ చైర్మన్ విఠల్ రావు, నగర బీఆర్ఎస్ మైనార్టీ అధ్యక్షులు ఇమ్రాన్ షెహజాజ్, మాజీ జడ్పీటీసీ జగన్ తదితరులు పాల్గొన్నారు.



క్రౌడ్ ఫండింగ్ ప్రారంభించిన అతిశీ



ఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఖర్చు కోసం ఢిల్లీ ముఖ్యమంత్రి, సీనియర్ ఆప్ నాయకురాలు అతిశీ క్రౌడ్ ఫండింగ్ ప్రచారాన్ని ప్రారంభించారు. "ఈ రోజు నేను కల్కాజీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికల ప్రచారం కోసం క్రౌడ్ ఫండింగ్ ప్రచారాన్ని ప్రారంభిస్తున్నాను. ఎన్నికల్లో పోరాడటానికి నాకు అవసరమైన రూ.40 లక్షలు, ఢిల్లీ ప్రజలు, దేశవ్యాప్తంగా ఉన్న వారందరూ నాకు మద్దతు ఇవ్వాలని నేను అభ్యర్థిస్తున్నాను. మీ మద్దతుతో, నేను కల్కాజీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తాను" అని ఆమె విలేకరుల సమావేశంలో అన్నారు. తాము పెద్ద ప్రయివేట్ పాఠశాలల నుంచి డబ్బు తీసుకొని ఉంటే ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలలను అభివద్ధి చేయలేకపోయేవాళ్లమని, తాము ప్రయివేట్ కంపెనీల నుంచి డబ్బు తీసుకొని ఉంటే ఢిల్లీ ప్రభుత్వ ఆస్పత్రులను అభివద్ధి చేయలేకపోయేవాళ్లమని ఆమె అన్నారు.

అభిశంసనపై విచారణకు యూన్ డుమ్మా..?



సియోల్ : సైనిక పాలన విధించి అభిశంసనకు గురైన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ విచారణకు గైర్హాజరు కానున్నారు. భద్రతా కారణాల రీత్యా అభిశంసనపై సోమవారం జరగనున్న మొదటి విచారణకు యూన్ హాజరుకాలేరని ఆయన తరపు న్యాయవాది ఆదివారం తెలిపారు. భద్రతా మరియు ఆందోళనకర పరిస్థితులు తలెత్తుతాయని, దీంతో జనవరి 14న విచారణకు యూన్ హాజరుకాలేరని న్యాయవాది యూన్ కబ్ కీన్ ఓ ప్రకటనలో తెలిపారు. భద్రతా సమస్యలు తొలగితే యూన్ ఎప్పుడైనా విచారణకు హాజరుకావడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. యూన్ అభిశంసనను కొనసాగించాలా లేదా తిరిగి పదవిలోకి తీసుకోవాలా అనేది కోర్టు నిర్ణయిస్తుంది. జనవరి 14 నుంచి ఫిబ్రవరి 4 వరకు ఐదు సార్లు విచారణకు హాజరుకావాలని రాజ్యాంగ న్యాయసానం యూన్‌ను ఆదేశించింది. అభిశంసనకు గురైనప్పటి నుండి యూన్ అధ్యక్ష భవనంలోనేఉంటున్నారు.పోలీసులు, అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆయనను అరెస్ట్ చేయడంలో విఫలమయ్యారు. మరోవైపు యూన్‌ను అరెస్ట్ చేయాలంటూ సియోల్‌లో నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. ఆయనను అరెస్ట్ చేయాలంటూ శనివారం మధ్యాహ్నం వేలాది మంది కొరియన్లు గడ్డకట్టే చలిని కూడా లెక్క చేయకుండా సియోల్ సెంటర్‌లోని ప్రధాన రహదారులపైనిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆయనను అరెస్ట్ చేయాలంటూ ముక్తకంఠంతో నినదిస్తున్నారు.

ప్రధాని రేసు నుంచి తప్పుకుంటున్నా : అనితా ఆనంద్

ఒట్టావా : కెనడా ప్రధాని రేసు నుంచి తప్పుకుంటున్నట్టు అనితా ఆనంద్ ప్రకటించారు. తాను లిబరల్ పార్టీ ఆఫ్ కెనడా తదుపరి నాయకుడి రేసు నుంచి వైదొలుగుతున్నానని ఆదివారం ఆమె ఓ లేఖలో ప్రకటించారు. ఒక్విల్లే పార్లమెంటు ఎంపీగా తిరిగి ఎన్నికవ్వాలని కోరుకోవడం లేదని పేర్కొన్నారు. తదుపరి ఎన్నికల వరకు పబ్లిక్ ఆఫీస్ హోల్డర్‌గా తన బాధ్యతలను నిర్వర్తిస్తానని ఆ లేఖలో ప్రకటించారు.

దేశానికి, సమాజానికి అనేక రూపాల్లో సేవ చేయవచ్చు. తమ లిబరల్ పార్టీ కోసం, ఒక్విల్లే కోసం, అన్నిటికంటే కెనడా కోసం తాను ఇక్కడ ఉంటానని సోషల్ మీడియా ఎక్స్‌లో పేర్కొన్నారు. పార్లమెంట్ సభ్యురాలిగా లిబరల్ టీమ్‌లోకి తనను స్వాగతించినందుకు, కీలకమైన క్యాబినెట్ పోర్ట్‌ఫోలియోలను అప్పగించినందుకు ప్రధాని ట్రూడోకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు ప్రకటించారు. కెనడా హౌస్ ఆఫ్ కామన్స్‌లో, తమకు ప్రాతినిధ్యం వహించడానికి తనను ఎంపిక చేసినందుకు ఒక్విల్లే ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.



అధికార లిబరల్ పార్టీ కొత్త నేతను ఎన్నుకున్న తర్వాత కెనడా ప్రధాని పదవికి రాజీనామా చేస్తానని జస్టిన్ ట్రూడో ప్రకటించడంతో ప్రధాని రేసులో అనితా ఆనంద్ పేరు తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆమె కెనడా రవాణా శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

భూ కబ్జా చేసిన ఇద్దరు బీఆర్ఎస్ నేతల అరెస్టు

నవతెలంగాణ - సిరిసిల్ల

ప్రభుత్వ భూములు కబ్జా చేసిన ఇద్దరు బీఆర్ఎస్ నేతలను తంగళ్లపల్లి పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. అరెస్టు అయినవారిలో ఒకరు మాజీ జెడ్పీటీసీ కోడి అంతయ్య, మరొకరు సిరిసిల్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ బండి దేవదాస్ ఉన్నట్టు పోలీసులు తెలిపారు. సిరిసిల్లలో అసైన్డ్ భూముల కబ్జా వ్యవహారంలో రోజుకో పరిణామం వెలుగులోకి వస్తున్నది. ప్రభుత్వ భూముల ఆక్రమణ విషయంలో ఇప్పటికే ఐదుగురు బీఆర్ఎస్ అగ్ర నేతలపై కేసులు నమోదై రిమాండ్‌కు వెళ్లారు. శనివారం ఇద్దరు బీఆర్ఎస్ కీలక నేతలపై సిరిసిల్ల పోలీసులు భూ కబ్జా కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. ఓవైపు ఈ-కార్ రేసు కేసులో కేటీఆర్ మెడకు ఉచ్చు బిగుస్తోన్న నేపథ్యంలో సిరిసిల్లలో ఆయన అనుచరుల అరెస్టుల పర్వం కొనసాగడం ఇప్పుడు జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారుతోంది.

కవ్వాల్ అడవుల్లో పర్యటించిన హైకోర్టు జడ్జి



నవతెలంగాణ-జన్నారం

మంచిర్యాల జిల్లా జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని ఇందన్‌పెల్లి రేంజ్ అడవుల్లో ఆదివారం తెలంగాణ హైకోర్టు జడ్జి రాధారాణి కుటుంబ సభ్యులతో పర్యటించారు. ముందుగా వారికి పోలీసులు అటవీ శాఖ అధికారులు గౌరవ వందనం చేసి స్వాగతం పలికారు అనంతరం జంగల్ సఫారీ వాహనాల్లో అడవిలోకి వెళ్లి అందాలను తిలకించారు. ఏర్పాట్ల విషయంలో లోటుపాట్లు రాకుండా చేశామని ఇంధన్‌పల్లి ఎఫ్ఆర్ఓ కారం శ్రీనివాస్ తెలిపారు.

అధికారంలోకి వస్తే..

నిరుద్యోగ యువతకు రూ.8,500

● ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ



న్యూఢిల్లీ: ఢిల్లీలో తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఢిల్లీ ఎన్నికలు మరికొన్ని వారాల్లో జరగనుండటంతో హస్తం పార్టీ ప్రచారాన్ని ఉధృతం చేసింది. నిరుద్యోగులకు యువ ఉడాన్ యోజన కింద రూ.8,500 ఇస్తామని ప్రకటించింది. ఇది ఉచితంగా ఇచ్చే మొత్తం కాదని వెల్లడించింది. ఆ పార్టీ నేత సచిన్ పైలట్ మాట్లాడుతూ "ఏదైనా కంపెనీ లేదా ఫ్యాక్టరీలో తమకు ఉన్న నైపుణ్యాలను చూపించిన యువతకు ఆర్థిక సాయం చేస్తాం. వారు ఈ కంపెనీల నుంచి ఆ సొమ్మును పొందుతారు. ఇది ఇండ్లల్లో ఖాళీగా కూర్చొనే వారికి ఉచితంగా సొమ్ములు ఇచ్చే పథకం కాదు. ప్రజలు శిక్షణపొందిన రంగాల్లో స్థిరపడేలా సాయం చేయడానికే ఈ పథకం తెచ్చాం" అని వివరించారు.

ఇప్పటికే ఈనెల 6న ప్యారీ దీదీ యోజనను కాంగ్రెస్ ప్రకటించింది. కాంగ్రెస్ విజయం సాధిస్తే.. ఈ పథకం కింద మహిళలకు రూ.2,500 ఇస్తామని వివరించింది. 8న పార్టీ జీవన్ రక్షా యోజనను ప్రకటించింది. దీని కింద రూ.25 లక్షల వరకు ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5వ తేదీన పోలింగ్.. అదే నెల 8న ఓట్ల లెక్కింపు జరిగి తుది ఫలితాలు వెలువడనున్న విషయం విదితమే.

గాజాలో విద్యావ్యవస్థ నిర్వీర్యం

● యూనివర్సిటీలపై ఇజ్రాయిల్ బాంబుదాడులు : నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మలాలా



ఇస్లామాబాద్ : గాజాలో మొత్తం విద్యావ్యవస్థను ఇజ్రాయిల్ నిర్వీర్యం చేసిందని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మలాలా యూసఫ్‌జాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌లో 'ముస్లిం దేశాలలో బాలికల విద్య' పేరుతో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న అంతర్జాతీయ సమ్మిట్‌లో ఆదివారం ఆమె ప్రసంగించారు. ఈ సమ్మిట్‌కు పలు దేశాల ప్రతినిధులు హాజరయ్యారు.ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ.. గాజాలో అన్ని యూనివర్సిటీలపై ఇజ్రాయిల్ బాంబుదాడులు జరిపిందన్నారు. 90 శాతానికి పైగా పాఠశాలలను ధ్వంసం చేసిందనీ, పాఠశాల భవనాల్లో ఆశ్రయం పొందుతున్న పౌరులపై విచక్షణా రహితంగా దాడికి పాల్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ మానవహక్కుల, అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనలను తాను ప్రశ్నిస్తూనే ఉంటానని అన్నారు. పాలస్తీనాలో పిల్లలు తమ జీవితాలను, భవిష్యత్తును కోల్పోయారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఓ పాలస్తీనా బాలిక చదువుకునే పాఠశాలపై బాంబు దాడిచేసి, ఆమె కుటుంబాన్ని హత్య చేస్తే ఆమెకి భవిష్యత్తు లేకుండా చేసినట్టేనని అన్నారు.ఆఫ్ఘన్‌లో తాలిబన్ ప్రభుత్వానికి చట్టబద్ధత కల్పించవద్దనీ, మహిళలు, బాలికల విద్యను అడ్డుకుంటున్న వారి చర్యలను వ్యతిరేకించాలని ముస్లిం నేతలను ఆమె అభ్యర్థించారు. వాస్తవంగా చెప్పాలంటే మహిళలను తాలిబన్లు మనుషులుగా చూడరనీ, సాంప్రదాయం, మతం పేరుతో సమర్థించుకుంటూ, తమ నేరాలను కప్పిపుచ్చుకుంటారని అన్నారు. మీ గొంతుకను వినిపించాల్సిన సమయం వచ్చిందనీ, మీరు నిజమైన నాయకత్వాన్ని చూపాలని సూచించారు. అయితే, ఈ కార్యక్రమానికి ఆఫ్ఘనిస్తాన్ ప్రతినిధులు హాజరుకాలేదు. వారికి అధికారికంగా ఆహ్వానం పంపినప్పటికీ సదస్సుకు రాలేదని పాకిస్థాన్ విద్యాశాఖ మంత్రి ఖలీద్ మక్బూల్ సిద్దిఖీ వెల్లడించిన సంగతి తెలిసిందే.



పుస్తకాలే నిజమైన సంపద

- గజల్ శ్రీనివాస్
- ముగిసిన పుస్తక ప్రదర్శన

విజయవాడ : ప్రపంచంలో ఎన్ని సంపదలున్నా, మనిషికి నిజమైన విలువ మంచి పుస్తకం వల్లే వస్తుందని, పుస్తకం మనిషికి ఎప్పటికీ దూరం కాదని ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ అన్నారు. 35వ విజయవాడ పుస్తక మహోత్సవం ఆఖరి రోజు ఆదివారం రామోజీరావు సాహిత్య వేదికపై నిర్వహించిన ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మానవత్వాన్ని, సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించేందుకు సాహిత్యం దోహదం చేస్తుందన్నారు. తెలుగు దేశం నాలెడ్జ్ సెంటర్ ఇన్‌ఛార్జి, పుస్తక ప్రేమికులు జి.మాల్యాద్రి మాట్లాడుతూ వ్యక్తులుగా ప్రపంచ స్థాయిలో రాణిస్తున్న తెలుగువారు, ఒక సమూహంగా దేశంలోనే వెనుకబడి ఉండడం విషాద కరమన్నారు. మనకు ప్రపంచంలోనే అగ్రస్థాయి మేథాశక్తి ఉందని తాజా జన్యుశాస్త్ర పరిశోధనలలో రుజువైందని వివరించారు. కుల, మత, రాజకీయ భేదాలు లేకుండా అందరూ ఐకమత్యంగా రాష్ట్రాభి.వృద్ధికి కృషి చేయాలని కోరారు. పుస్తక మహోత్సవ సంఘం అధ్యక్షులు కె.లక్ష్మయ్య మాట్లాడుతూ సమాజం అభివృద్ధి చెందాలంటే పాఠశాల స్థాయిలో గ్రంథాలయాలను, విద్యార్థులలో పుస్తకాలు చదివే అలవాటును పెంచాలన్నారు. విశ్రాంత ఐఎఎస్ అధికారి ఎండి ఇంతియాజ్ మాట్లాడుతూ పుస్తకాలు మనుషులకు మంచి స్నేహితులని పేర్కొన్నారు. భా వాలను వ్యక్తీకరణకు, మంచి భావాలను అందిపుచ్చుకునేందుకు పుస్తకాలకు మించిన సాధనం లేదన్నారు. పుస్తక మహోత్సవ సంఘం కార్యదర్శి మనోహర్‌నాయుడు, గౌరవాధ్యక్షులు బెల్లపు బాబ్జీ, సభ్యులు జెసి పబ్లికేషన్స్ అధినేత ప్రసాద్, నవ సాహితీ సంస్థ అధినేత రవి, ఎమెస్కో ప్రతినిధి లక్ష్మి, బుక్ ఫెస్టివల్ సొసైటీ సభ్యులు జి.శ్రీనివాస్, గోళ్ల నారాయణరావు, బాలాంత్రపు ప్రసూన తదితరులు పాల్గొన్నారు. రతన్ టాటా ప్రతిభా వేదికపై బాలలకు నిర్వహించిన పోటీలలో విజేతలకు అతిథులు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు.

జీవితంలో హాస్యమనే వెలుతురుండాలి : కృష్ణకుమారి

జీవితంలో హాస్యం అనే కాంతి ఉన్నప్పుడు విసుగు, విషాదాలు అనే మబ్బులు ముసురుకునే అవకాశం ఉండదని ఆకాశవాణి విజయవాడ పూర్వ సంచాలకులు, రచయిత్రి ముంజులూరి కృష్ణకుమారి అన్నారు. 35వ విజయవాడ పుస్తక మహోత్సవం ఆఖరిరోజు ఆదివారం రామోజీరావు సాహిత్య వేదికపై మొదటి కార్యక్రమంగా జీఆర్‌కె-పోలవరపు సాంస్కృతిక సమితి వారు హాస్య రచయితల తాజా రచనల పఠనంతో హాస్యరథం సభకు ఆమె ప్రయోక్తగా వ్యవహరించారు. ఈ సభలో ఇంగ్లీషు మాట్లాడాలనే మోజుతో సమాజంలో జరుగుతున్న విచిత్రాలపై హాస్యంగా 'ఇంగ్లీషుతోనే ఎంత పనైనా?' అంటూ సశ్రీ తన కథనంలో వినిపించారు. సన్మానాల పేరుతో జరిగే సంఘటనలను 'సన్మాన వైరాగ్యం'తో రావెళ్ల శ్రీనివాసరావు హాస్యంగా వర్ణించారు. జీవితంలో పైకి రావాలంటే ఎలాంటి నిచ్చెనలు, ఎలా ఎక్కాలో తన 'పైకి ఎక్కాలేగానీ.. అన్నీ నిచ్చెనలే' అంటూ మన్నం సింధు మాధురి హాస్యంగా వివరించారు. అందరి భాషలో తప్పులు పట్టే తెలుగు మాస్టారికి బస్సు ప్రయాణంలో ఎదురైన సంఘటనలను మొలుగు కమలాకాంత్ 'సన్యాసిరావు బస్సు ప్రయాణం'లో పేరుతో వివరించారు. తాజాగా పదవీ విరమణ చేసినవారి మనోభావాలు ఎలా ఉంటాయో గోవిందరాజు మాధురి 'ఉద్యోగం విరమిస్తే అందరికీ లోకువే' అంటూ నవ్వుపుట్టేలా విశదీకరించారు. కొచ్చెర్లకోట వెంకట సుబ్బారావు తన హాస్య కథనంలో హాస్యం చేయడంలో, ఆస్వాదించడంలో ఉన్న ప్రమాదాలను నవ్వు పుట్టేలా వివరించారు.

రూ. 70 వేల కోట్లు మిగుల్చుకున్న కేంద్రం

- బడ్జెట్ కేటాయింపులు ఖర్చు చేయకుండా..



న్యూఢిల్లీ : గత ఏడాది జూలైలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వివిధ పథకాలకు కేటాయించిన నిధులను కేంద్ర ప్రభుత్వం ఇంకా ఖర్చు చేయలేదు. దీంతో రూ 70 వేల కోట్లకు పైగా మూలధనం, రెవిన్యూ ఆదాయాన్ని కేంద్ర ప్రభుత్వం ఆదా చేసుకోనుంది. వీటిని ఈ ఏడాది ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ప్రకటించే కొత్త పథకాలకు కేటాయించనున్నారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ఆయా పథకాలకు మంజూరు చేయకుండా ప్రభుత్వం ఆదా చేసుకోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. మోడీ ప్రభుత్వంలో పేరుకే పథకాలు ప్రకటిస్తారని, వాటికి నిధులు ఇచ్చి ప్రారంభించడం, అమలు చేయడం చేయరని విమర్శిస్తున్నారు. ఉదాహరణకు గత ఏడాది బడ్జెట్‌లో మోడీ ప్రభుత్వం ఉపాధి సంబంధిత మూడు ప్రోత్సాహక (ఇఎల్ఐ) పథకాలను ప్రకటించింది. వీటికి ప్రతీఏటా రూ. 10 వేల కోట్లు కేటాయిస్తామని గొప్పగా చెప్పింది. అలాగే రూ. వేయి కోట్ల వ్యయంతో వేయి ఐటీఐలను ఆధునీకరించే ప్రణాళికను అమలు చేసే ప్రాజెక్టును నైపుణ్య మంత్రిత్వ శాఖకు అప్పగించారు. అయితే ఈ పథకాలను ఇంతవరకు ప్రారంభించలేదు. అలాగే మరోవైపు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నూతన పథకాలకు ఉద్దేశించిన రూ 62 వేల కోట్లు మంజూరుకు మొండిగా తిరస్కరించింది. ఆ విధంగా ద్రవ్యలోటును 4.9 శాతానికి కట్టడి చేయాలని చూస్తోంది.

24 నుంచి స్ప్రింగ్ ఫెస్ట్

కోల్‌కతా : భారతీయ సాంకేతిక సంస్థ ఖరగ్‌పూర్ వారి వార్షిక సాంస్కృతిక, సామాజిక ఉత్సవం స్ప్రింగ్ ఫెస్ట్ ఈ నెల 24 నుంచి 26 వరకూ నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆన్‌లైన్‌లో 20 లక్షలకుపైగా సభ్యుల చేరికతో ఈ స్ప్రింగ్ ఫెస్ట్ ఆసియాలో అత్యంత భారీ సాంస్కృతిక ఉత్సవాలలో ఒకటిగా విద్యార్థులతో నిర్వహించబడుతోందని కోర్ ఆర్గనైజింగ్ టీమ్ సభ్యులు ఆర్యన్ శ్రీవాస్తవ తెలిపారు. దేశంలోని 800కు పైగా ప్రధాన కాలేజీల నుండి ఉత్సాహవంతులైన విద్యార్థులు ఈ మూడురోజుల కార్యక్రమం కోసం ఖరగ్‌పూర్‌కు తరలివస్తారు. స్ప్రింగ్ ఫెస్ట్ 66వ ఎడిషన్ ఇప్పటికే హిచ్ హైక్' అనే దేశవ్యాప్త ప్రిలిమినరీ రౌండ్‌ను విజయవంతంగా నిర్వహించింది. ఇది నృత్యం, నాటకం, సంగీతం, ఫ్యాషన్ మొదలైన అనేక కళాత్మక కార్యక్రమాలను కలిగి ఉంది. ఈ ఉత్సాహభరిత ఈవెంట్ దేశంలోని 10 ప్రముఖ నగరాలు ఢిల్లీ, ముంబై, పూణె, బెంగళూరు, హైదరాబాద్, అహ్మదాబాద్, విశాఖపట్నం, లక్నో, జైపూర్, చండీగఢ్‌లో జరిగింది. ఈ ప్రిలిమ్స్‌కు తమ సమయాన్ని కేటాయించిన న్యాయమూర్తులకు స్ప్రింగ్ ఫెస్ట్ కతజ్ఞతలు తెలియజేసింది. ప్రిలిమ్స్ అనంతరం నృత్యం, నాటకం, సంగీతం, ఫ్యాషన్, సాహిత్య పోటీలు తదితర అంశాలకు కోల్‌కతా, భువనేశ్వర్, పట్నా, రాంచీ, గౌహతి, రాయ్‌పూర్ నగరాల్లో ఎలిమినేషన్ రౌండ్లు నిర్వహించబడతాయి. ఈ పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి కలిగిన విద్యార్థులు లేదా సాంస్కృతిక అకాడమీలు eliminations.springfest.in వెబ్‌సైట్‌ను సందర్శించి, ముందుగానే ఇష్టమైన ఈవెంట్లకు నమోదు చేసుకోవచ్చునని శ్రీవాస్తవ పేర్కొన్నారు.

ఇందులో ప్రత్యేకంగా, దేశవ్యాప్త రాక్ బ్యాండ్ పోటీ 'బ్యాటిల్ ఆఫ్ బ్యాండ్స్- వైల్డ్‌ఫైర్' గురించి తెలియజేశారు. ఇది ముంబయి, బెంగళూరు, ఢిల్లీ, కోల్‌కతా, షిల్లాంగ్ నగరాల్లో జరగనుంది. విజేతలకు రూ.1.5 లక్షలు బహుమతి ఇవ్వనుంది. తమ ప్రతిభను ప్రదర్శించి, స్ప్రింగ్ ఫెస్ట్ చరిత్రలో గుర్తింపు పొందాలనుకునే బ్యాండ్లు ఋఋశ్రీ.ంటఱఅవ.ంజూతీఱఅస్త్రటవర్.ఱఅ ద్వారా నమోదు చేసుకోవచ్చు. స్ప్రింగ్ ఫెస్ట్‌లో మొత్తం 13 విభాగాలకు చెందిన 130కిపైగా పోటీలు జరుగుతాయి. ఇందులో దేశంలోని అత్యుత్తమ ప్రతిభావంతులు పాల్గొంటారు. ఈ పోటీల మొత్తం బహుమతి విలువ రూ.35 లక్షలు.

కొత్త రేషన్‌కార్డులకు రికమండేషన్‌లు ఉండవు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి

నవతెలంగాణ- వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి



కొత్త రేషన్‌కార్డులకు ఎలాంటి రికమండేషన్‌లు ఉండబోవని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వరంగల్‌లో ఉమ్మడి జిల్లా మంత్రులు సీతక్క, కొండా సురేఖ, అధికారులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం ఒకటి రెండు కార్డులు ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. తమ ప్రభుత్వం అర్హులైన అందరికీ రేషన్ కార్డులు ఇస్తుందన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలతో పాటు అభివద్ధిని సంక్షేమాన్ని సమ ప్రాధాన్యతనిస్తున్నట్టు పేర్కొన్నారు. పేదోడి కలను నెరవేర్చాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో అభివద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. జనవరి 26న గణతంత్ర దినోత్సవ సందర్భంగా పేదవాడి ప్రతి ఇంటికి ఇందిరమ్మ ప్రభుత్వ ఫలాలను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా కాకుండా ఎన్నో ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతును రాజు చేయాలని ఉద్దేశంతో 12 వేల రూపాయలను రైతు భరోసా కింద అందించనున్నట్టు తెలిపారు. అర్హులైన ప్రతి రైతుకు రైతు భరోసాను అందిస్తామన్నారు. ప్రతి గ్రామంలో అధికారులు గ్రామ సభ పెట్టి నాలుగు పథకాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తారన్నారు. 12 వేల రూపాయలను వ్యవసాయ రైతు కూలీలకు అందిస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, రేషన్ కార్డులు అందించడం అనేది నిరంతరం ప్రక్రియ అని అన్నారు. వీటి విషయంలో ఎలాంటి అపోహలు అవసరం లేదన్నారు.

భూ వివాదాల పరిష్కారానికి కృషి



రెవెన్యూ, అటవీ భూముల హద్దు వివాదాల పరిష్కారానికి చర్యలు

- ప్రభుత్వ భూములలో మైనింగ్‌పై నివేదిక అందించాలి : రెవెన్యూ అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రెవెన్యూ అటవీ భూ వివాదాల పరిష్కారానికి కార్యాచరణ చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఖమ్మం శ్రీ శ్రీ సర్కిల్‌లోని రాఘవ నిలయంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి.శ్రీజ, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులతో భూ వివాదాలపై ఆదివారం సమీక్షించారు. ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్మెంట్ భూములను 40 సంవత్సరాలుగా క్షేత్రస్థాయిలో రైతులు సాగు చేస్తున్నారని, రైతులకు ఉన్న భూ సమస్యలు రెవెన్యూ, అటవీ అధికారులు సమన్వయంతో పని చేసి పరిష్కరించాలని తెలిపారు. భూముల సర్వే కోసం అవసరమైతే అధునాతన సామగ్రిని సైతం అందుబాటులోకి తెస్తామని అన్నారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఒక గ్రామాన్ని ముందస్తుగా పైలెట్ కింద ఎంపిక చేసుకుని అక్కడ రెవెన్యూ అటవీ భూ వివాదాల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అటవీ భూముల సరిహద్దు వద్ద అధునాతన పరికరాలతో సర్వే చేపట్టి పక్కాగా నమోదు చేయాలని అన్నారు. ఖమ్మం జిల్లాలో 15 సర్వే నెంబర్లలో 1500 ఎకరాల రెవెన్యూ అటవీ భూముల బౌండరీ సమస్య ఉందని, సర్వే ద్వారా దీని పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. విదేశాలలో ఉండేవారు కూడా తమకు భూమి ఉందని చెబుతున్నారని, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి భూములు ఎవరి దగ్గర ఉన్నాయో వివరాలను పక్కాగా సేకరించాలని అన్నారు.

ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూముల ఆక్రమణలపై నివేదిక అందించాలని కోరారు. జిల్లాలో మైనింగ్ క్వారీల కోసం రెవెన్యూ భూములు ఎక్కడ కేటాయించారు, ప్రభుత్వానికి వస్తున్న ఆదాయంపై నివేదిక పరిశీలించాలని మంత్రి జిల్లా కలెక్టర్‌కు సూచించారు. అధికారికంగా ఇచ్చిన మైనింగ్ అనుమతుల కంటే క్షేత్ర స్థాయిలో అదనంగా అక్రమంగా నడుస్తున్నాయని, వీటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని అన్నారు. క్వారీల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం నష్టాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఖమ్మం రూరల్ మండలంలో లీజు గడువు ముగిసిన ప్రభుత్వ భూములలో మైనింగ్ క్వారీలు మూసివేసి పనికి వచ్చే భూముల వివరాలతో కలెక్టర్‌కు నివేదిక అందించాలన్నారు. అక్కడ పేదలకు ఇండ్ల నిర్మాణం లేదా ఆ భూములను ప్రభుత్వానికి ఆదాయం వచ్చే విధంగా ప్రణాళికలను రూపొందిస్తామని మంత్రి తెలిపారు. సమీక్షలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ.. జిల్లాలో దాదాపు లక్షన్నర ఎకరాల అటవీ భూమి ఉందని, వీటిలో కొన్ని సర్వేల్లో సమస్యలు ఉన్నాయని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, ఆర్డీవోలు నరసింహారావు, రాజేందర్, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, అర్బన్, రూరల్ తహసీల్దార్లు రవికుమార్, రాంప్రసాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా పడవ పోటీలు

- సెమీస్‌కు ఆరు జట్ల అర్హత

ఆత్రేయపురం : డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయ పురంలోని గోదావరి మధ్య డెల్టా ప్రధాన కాలువలో కేరళ తరహా పడవ పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. సంక్రాంతి సంబరాల నేపథ్యంలో 'సర్ ఆర్థర్ కాటన్ ట్రోఫీ' పేరుతో స్థానిక ఎంఎల్ఏ బండా రు సత్యానందరావు, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈత, రంగవల్లులు, పడవ పోటీలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాలకు చెందిన 11 జట్లు ఈ పోటీల్లో తలపడుతున్నాయి. డ్రాగన్ పడవ పోటీలు, కయా కింగ్, కెనాయింగ్ విభాగాల్లో పోటీలు జరిగాయి. ఆరు జట్లు సెమీ ఫైనల్‌కు అర్హత సాధిం చాయి. సెమీ ఫైనల్స్ పోటీలు సోమవారం జరగనున్నాయి. ఈ పోటీలను తిలకించేందుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచీ పెద్ద సంఖ్యలో సందర్శకులు వచ్చారు.



కత్తి కట్టిన కోడి

- యథేచ్ఛగా పందేలు.. పోలీసుల ప్రేక్షక పాత్ర

చెరుకుపల్లి: సంక్రాంతి నేపథ్యంలో కోడికి కత్తి కట్టారు. బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గం చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో ఆదివారం యథేచ్ఛగా కోడిపందేలు నిర్వహించారు. పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు. కోడి పందేలను నిర్వహించరాదని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు భేఖాతయ్యాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన బరుల్లో జోరుగా పందేలు జరిగాయి. వరుసగా ఐదు పోటీల్లో గెలిచిన పందెం కోడి విజేతకు బైక్‌ను బహుమతిగా ఇచ్చారు. ఈ జిల్లాతోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సోమవారం నుంచి కోడి పందేల నిర్వహణకు పందెంరాయుళ్లు భారీ ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారుల పక్కన, పోలీస్ స్టేషన్లకు సమీపంలో కూడా ఇవి ఉన్నాయి. బాపట్ల నియోజకవర్గం మంతెనవారిపాలెం వద్ద బరులు సిద్ధం చేశారు. ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేసి రాత్రి సమయంలో కూడా పందేలు నిర్వహించడానికి విస్తృత ఏర్పాట్లు చేశారు. జూదరులు ఒప్పందాలు కూడా చేసుకుంటున్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఐ.పోలవరం, ముమ్మిడివరం, రాజోలు, సఖినేటిపల్లి, అమలాపురం రూరల్, పి.గన్నవరం, కొత్తపేట, రాయవరం, రామచంద్రపురం మండలాల్లో వందకుపైగా బరులను ఏర్పాటు చేశారు.

వీటిలో కొన్ని భారీ బరులు ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు, కొవ్వూరు, దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల, సీతానగరం, రాజానగరం, కడియం మండలాల్లో బరులు సిద్ధమయ్యాయి. కోడి పందేల కోసం ఏలూరు జిల్లాలో దెందులూరు, కైకలూరు, ఉంగుటూరు తదితర నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో భూమి చదును చేసి టెంట్లు ఏర్పాటు చేశారు. బహిరంగంగా ఏర్పాట్లు జరుగుతున్నా పోలీసులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. పశ్చిమగోదావరి జిల్లాలో టిడిపి కూటమి పార్టీలలోని కొందరు కోడి పందేల బరుల కోసం పోటీ పడుతున్నారు. ఈ బరుల వల్ల భారీ ఆదాయం రానుండడంతో నాయకులను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ముదినేపల్లి మండలంలోని పెదపాలపర్రు హైస్కూలు ఎదురుగా టిడిపి కూటమిలోని మూడు పార్టీల రంగులతో బరిని తీర్చిదిద్దారు. పామర్రు-దిగమర్రు ప్రధాన రహదారిలో బరిని ఏర్పాటు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు శివార్లలో పూలపల్లి బైపాస్‌లో పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఓ ప్రముఖ విద్యా సంస్థ పక్కన పందెంరాయుళ్లు భారీ బరులు సిద్ధం చేశారు. ఆచంట నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో సుమారు 20 చోట్ల కోడిపందేలను ఏర్పాటు చేశారు. ఉండి, భీమవరం, తణుకు, నరసాపురం ప్రాంతాల్లో పెద్ద ఎత్తున కోడి పందాలకు సిద్ధం చేశారు.

డిప్యూటీ సిఎం నియోజకవర్గంలోనూ ఏర్పాట్లు

డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ప్రాతినిథ్యం వహిస్తున్న కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో 35 వరకు బరులను సిద్ధం చేశారు. వీటిలో 16 బరులు పిఠాపురం పట్టణ పరిధిలో ఉన్నాయి. పిఠాపురంలోని వైఎస్ఆర్ గార్డెన్స్‌లో వేదికపై మట్టిని వేసి బరిని ఏర్పాటు చేశారు.

పోలండ్‌లో మంచుతుపాను

- 32 వేల గృహాలకు విద్యుత్ బంద్

వార్సా : పోలండ్‌ను మంచు తుఫాను చుట్టుముట్టింది. దీంతో దాదాపు 32 వేల గృహాలకు విద్యుత్ సరఫరాకు అడ్డంకులు ఏర్పడ్డాయి. ప్రధానంగా ఉత్తర ప్రావిన్సుల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని ప్రభుత్వ రేడియో ఆదివారం తెలిపింది. కూలిపోయిన చెట్లు, విరిగిన కొమ్మలు, పడిపోయిన విద్యుత్ లైన్ల కారణంగా సరఫరా నిలిచిపోయిందని ఒక అధికారి తెలిపారు. విద్యుత్‌ను పునరుద్ధరించడానికి అత్యవసర సిబ్బంది చురుకుగా పని చేస్తున్నారని చెప్పారు. మరోవైపు పోలండ్ అంతటా మంచు భారీగా కురిసింది. బలమైన గాలులు కూడా వీస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం హెచ్చరించింది.

హెచ్ఎంపివి తగ్గుముఖం : చైనా



బీజింగ్ : హ్యూమన్ మెటానిమోవైరస్ (హెచ్ఎంపివి) పాజిటివ్ రేటు తగ్గుముఖం పట్టిందని చైనా తాజాగా ప్రకటించింది. చైనాలో ఇటీవల హెచ్ఎంపివితో సహా పలు శ్వాసకోశ వ్యాధులు ఎక్కువగా నమోదవుతున్నట్లు వార్తలు వచ్చాయి. ముఖ్యంగా ఉత్తర చైనా ప్రాంతంలో హెచ్ఎంపివి ప్రభావం ఎక్కువగా కనిపిస్తోందనే కథనాలు వెలువడ్డాయి. అయితే, ఉత్తర ప్రాంతంలో హెచ్ఎంపివి ఇన్ఫెక్షన్ రేటు ప్రస్తుతం తగ్గుముఖం పడుతోందని చైనా ఆరోగ్యశాఖ అధికారులు తాజాగా వెల్లడించారు.

పేదరికంలోనే ఏపీ ప్రజలు

దారిద్ర్య నిర్మూలనకే పి4 విధానం - సలహాలు, సూచనలు, అనుభవాల స్వీకరణ : సిఎం చంద్రబాబు

అమరావతి : ఉమ్మడి రాష్ట్రంలో 1995లో సంస్కరణలు అమలు చేసినా, రాష్ట్రంలో ఇప్పటికీ లక్షల కుటుంబాలు పేదరికంలోనే ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం నేటికీ రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎంతోమంది కటిక పేదరికంలోనే ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పబ్లిక్- ప్రైవేట్- పీపుల్- పార్టనర్‌షిప్ (పి4)పై ఆదివారం విధాన ప్రకటన విడుదల చేశారు. ఆర్థిక సంస్కరణల్లో భాగంగా గతంలో తీసుకొచ్చిన పి3 (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) విధానంతో ఉపాధి, సంపద సృష్టి జరిగిందన్నారు. నాటి సంస్కరణ ఫలాలు అన్ని వర్గాలకు చేర్చాల్సిన బాధ్యత ఉందన్న ఆయన విద్య, వైద్యం, పౌష్టికాహారం, తాగునీరు వంటి కనీస అవసరాలు కూడా తీరని పరిస్థితిలో ఉన్నారని వివరించారు. ఇలాంటి పరిస్థితిని మార్చేందుకు, సమాజాన్ని శక్తిమంతంగా చేసేందుకు పి4 విధానాన్ని ప్రతిపాదించి నేడు విధాన పత్రాన్ని ఆవిష్కరిస్తున్నామని చెప్పారు. పది సూత్రాలతో స్వర్ణాంధ్ర-2047 విజన్‌ను ఆవిష్కరించామని గుర్తు చేశారు. ఇందులోని 10 సూత్రాలు ప్రకటించామని, వీటిల్లో ప్రథమ సూత్రమే జీరో పావర్టీ అని వివరించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఉద్దేశించిందే పి4 విధానమని వెల్లడించారు. తమ శక్తియుక్తులతో, ప్రభుత్వ పాలసీతో సమాజంలో అత్యున్నత స్థానాలకు చేరుకున్న 10 శాతం మంది ప్రజలు అట్టడుగున ఉన్న 20 శాతం మంది ప్రజలకు చేయూతనిచ్చి పైకి తేవాలని కోరారు. పేద వర్గాల చదువులకు, ఉపాధి అవకాశాలకు, నైపుణ్యం పెంచేందుకు ఒక పద్ధతి ప్రకారం చేయూతనిస్తే వారి కుటుంబాలు నిలబడతాయని తెలిపారు. వెనుకబడిన వర్గాలకు అవసరమైన నాలెడ్జ్, సాంకేతికతను అందించి మార్గ నిర్దేశనం చేసి వారి జీవితాల్లో వెలుగులు తేవచ్చన్నారు. ఎవరు ఎక్కడ స్థిరపడినా వారి మాతృభూమిలో ఒక వ్యక్తికో, ఒక కుటుంబానికో, ఒక సమూహానికో, ఒక గ్రామానికో, ఒక ప్రాంతానికో చేయూతను అందించి వారి జీవన ప్రమాణాలు పెంచవచ్చని తెలిపారు.

గతంలో జన్మభూమి స్ఫూర్తితో చేపట్టిన కార్యక్రమాలు గ్రామాల్లో అద్భుత ఫలితాలను ఇచ్చాయని, ఈ పిలుపుతో ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు పెద్దయెత్తున ముందుకొచ్చి అనేక గ్రామాల రూపురేఖలు మార్చారని వెల్లడించారు. నేడు అదే స్ఫూర్తితో అట్టడుగున ఉన్న పేదలకు అవకాశాలు కల్పించి వారిని పైకి తెచ్చేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పేదరికం లేని సమాజం తమ నినాదం, విధానమని తెలిపారు. ప్రభుత్వం చేసే కార్యక్రమాలతోపాటు ప్రజలు కూడా భాగస్వామ్యులైతే ఈ లక్ష్యాన్ని చేరుకోవచ్చని వెల్లడించారు. రాష్ట్ర ప్రజలతోపాటు సంక్రాంతికి సొంత ఊళ్లకు వచ్చిన ప్రతి ఒక్కరూ దీనిపై చర్చించాలని కోరారు. పి4 విధానంపై ప్రతి ఒక్కరి సలహాలు, అనుభవాలు, ఆలోచనలు, సూచనలు తీసుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. దీనికోసం ప్రత్యేకంగా ఒక పోర్టల్ తీసుకొచ్చి 30 రోజులపాటు ప్రతి ఒక్కరి ఆలోచనలు స్వీకరిస్తామని ప్రకటించారు. తెలుగుజాతిని నెంబర్ 1 చేసే క్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై కలిసి రావాలని కోరారు. 'నేను సైతం' అని ప్రతి ఒక్కరూ భాగస్వాములయ్యేలా సంక్రాంతి రోజు సంకల్పం తీసుకోవాలని కోరారు. తద్వారా ఆరోగ్య, ఆనంద, అభివృద్ధి ఆంధ్రప్రదేశ్ సాధిద్దామని వివరించారు.

